ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

ఏడంకముల నాటకము.

భవభూతి విరచితంబగు

సంస్కృతమునుండి,

రాజా ఎం. శ్రీ ప్రగడ భుజంగరావు బహదూర్

జమీందారుగారిచేఁ

తెనిఁగింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

వెల రూ. ౧.

ఇందువచ్చు పాత్రలు.

పురుషులు, స్త్రీలు.

1. సూత్రధారుఁడు.
2. నటుఁడు.
3. రామభద్రుఁడు.
4. కంచుకి.
5. అష్టావక్రుఁడు.
6. లక్ష్మణుఁడు.
7. ప్రతీహారి.
8. దుర్ముఖుఁడు.
9. దివ్యపురుషుఁడు.
10. శంబూకుఁడు.
11. సౌధాతకి.
12. భాండాయనుఁడు.
13. జనకుఁడు.
14. లవుఁడు.
15. బ్రహ్మచారులు.
16. వటులు.
17. పురుషుఁడు.
18. చంద్రకేతుఁడు.
19. సుమంత్రుఁడు.
20. విద్యాధరుఁడు.
21. కుశుఁడు.
22. వాల్మీకి.
23. సృష్టి.

1. సీత.
2. తాపసి.
3. వనదేవత.
4. ఆత్రేయి.
5. వాసంతి.
6. తమస.
7. మురల.
8. అరుంధతి.
9. కౌసల్య.
10. విద్యాధరి.
11. ధరణి.
12. భాగీరథి.

రామా ముద్రాక్షరశాల, ఏలూరు.

విజ్ఞాపనము.

:o:

రసజ్ఞులారా! భవభూతిమహాకవి పదవాక్య ప్రమాణజ్ఞుండనియు, బహుశబ్దవేదియనియు లోకంబున సుప్రసిద్ధమగు బిరుదంబుల నందియుండెను. కావుననే యుత్తరరామచరిత్రయం దేశ్లోకమును బట్టి చూచినను తేనెపట్టు నందలి గదులవలె శబ్దజాలను సాంద్రతరంబుగ నిమిడియుండును. ఇట్లనుటచే వాక్యాడంబరమే కాని భావగాంభీర్యోపమాది సౌష్ఠవంబులు లేవని తలంపఁజనదు. అవియు గ్రంథమునం దెల్లెడఁ బూర్తిగ నిండియున్నవి. కరుణరసము ప్రధానముగఁ గైకొనియు శృంగార రౌద్రాదిక రసంబుల నుచితస్థానంబులఁ బొందుపరచియుండె. ఇందు హృదయమును గరంచు భావము లనేకములు గలవు. ఉపమా సౌష్ఠవము నపూర్వము. ఇట్టి రసవత్తరంబులగు భావములను సహజ నిపుణతగలవాఁడగుటచే పదగుంఫనంబునం బొందుపఱచె.

మహాకవి కాళిదాసునకును భవభూతి మహాకవికినిగల భేదమిచ్చట నే దెలిసికొనఁదగియున్నది. కాళిదాసు భావ గాంభీర్యంబునను, ఉపమా చమత్కృతియందును, మిన్నయని యెన్నఁబడుచుండియుఁ దత్తద్భావాదులఁ బ్రస్ఫుటముగా వెల్లడించుటయే ప్రధానముగా గమనించెను గాని పాండిత్య ప్రకర్షను వెల్లడిచేయుటకై శబ్దాడంబరమును దన నాటకములయందుఁ గనుపరచియుండలేదు. పాఠకులందఱికి నీ విషయము స్వానుభవమే.

ఉత్తరరామచరిత్రము నాంధ్రీకరించుటలో నీ విషయము నే గమనింపవలసి వచ్చినది. సౌష్ఠవపదభూయిష్ఠంబయిన భవభూతిశ్లోకసంతతి నాంగ్లంబునఁ గూడనట్లే పదగాంభీర్యమున నెలకొల్పిననే గాని భవభూతి యొక్క గౌరవాతిశయములను వెల్లడించుటకు వీలుండదు. తేలికపదములతో నాకూర్పు నాంధ్రీకరించుట కేవలమసంభవము. అట్లు చేయఁదలంచిన వ్యాఖ్యానతుల్యముగ గద్యరూపముననే యుండవలయుం గాని ఛందోబద్ధము చేయవలనుపడదు. కావుననే నా యాంధ్రీకరణమునందీ ఫక్కి నవలంబించితిని. ఈయది కొందఱికిఁ గఠినముగా నున్నదని తోఁచవచ్చును. కాని భవభూతి రచనారహస్యము నెఱింగినవారు నెవ్వరు నట్లు తలంపరు.

ఈకవిద్వయమునందలి పూర్వోదాహృత తారతమ్యమును లోకమునకు వెల్లడించు తలంపు నాకుఁ గలుగుటచేత నీయుత్తరరామ చరిత్రాంధ్రీకరణము ముగిసిన వెనుక శాకుంతలమునుగూడ నిదివఱకే పెక్కండ్రు మహామహు లాంధ్రీకరించియుండినను దానినే మరల స్పృశించి నావాక్కును బవిత్రపరచుకొని యీ కవిద్వయగ్రంథ రచనా చాకచక్యము నేకముఖమున వెల్లడింప నిశ్చయించితిని. శాకుంతలాంధ్రీకరణమును గొంతవఱకు సాగుచున్నది. మాసద్వయంబున గ్రంథము ముద్రింపఁబడి వెలువడఁగలదు. అందలి పద్యములు బహుమార్దవములై యెల్లరకు నుపయోగంబులుగ నుండును. దీనిని జదివినవారలందఱును దానినిఁగూడఁ జదివి చూచిన నా మనోరథము ఫలించును.

పెక్కండ్రు మహాకవులిదివఱకే జయప్రదముగ నాంధ్రీకరించిన శాకుంతలమును దిరిగి నే నాంధ్రీకరించుట వ్యర్థప్రయత్నమని తలంపఁజనదు. ఏలయన:—కాళి

దానునంతటి మహాకవిచే రచియింపఁబడిన శాకుంతలమువంటి యుద్గ్రంథము, ఆంధ్రీకరణమునకు మఱియొకటి లభింపదుగదా! రామకథాసుధారసమును బెక్కండ్రు తనివి తీరఁగ్రోలినను యింకనెందఱికైనఁ దృప్తినీయఁగలదియై యుండునుగాని కొఱవడదు గదా! కావున నో రసజ్ఞులారా! ఇదివఱకుఁ బెద్దలచేఁ జేయఁబడిన యాంధ్రీకరణములఁ జూచి యుంటిమిగాన దీనినిగూడ నేలచదువవలెయునని విసుగుఁజెందక దయచేసి నా గ్రంథమునుగూడఁ గొంచెము శ్రద్ధతోఁ దిలకించి యితరాంధ్రీకరణములతోఁ బోల్చిచూచి యేకొంచెమునందయిన నించుకరసము గాన్పించిన మీరానందించి తన్మూలమున నన్నానంద పరుపఁగోరుచున్నాఁడను.

ఈయుత్తరరామచరిత్రమునందు నాయకుఁడగు శ్రీరాముని చర్య భవభూతిచే సరిగాసమర్థింపఁబడలేదని కొందఱాక్షేపించుచున్నారు. శ్రీరాముండు, అగ్నిపరిశుద్ధిం గావించియే సీతాపరిగ్రహణమును జేసియుండియు జారునిచేఁ దేఁబడిన కింవదంతిని పురస్కరించుకొని తనమనంబున సీతాపాతివ్రత్య విషయమున నించుకంతయు సంశయములేనివాఁడయ్యు సీతాపరిత్యాగమునుజేయుట సత్పురుషలక్షణము కాదనియు, కింవదంతిని బ్రబలమగు హేతువుగ గ్రహించుటయు నసమంజసమనియు, శాకుంతలమున దుష్యంతుఁడు శకుంతలాపరిత్యాగమును జేసినను గాళిదాసు దుర్వాసశాపమను ప్రబలకారణము ననుసంధించి దుష్యంతుని సౌభాగ్యమునకు భంగము కలుగకుండఁ గాపాడెననియు నిందు భవభూతియట్టికారణమును గల్పింప నేరకుండుటయొకలోపమనియుఁ జెప్పెదరు.

ఉత్తరరామచరిత్రమున నట్టియుక్తియుక్తమగు హేతుకల్పనము లేకపోలేదు. నాటకమంతయుఁ జక్కఁగాఁ జదివిన యుక్తమగు హేతువుకలదని పాఠకులకే విశదము. ఈనాటకమునకంతకును సీతాపరిత్యాగమే ప్రధానాంగమైయున్నది. రామునియందిట్టినిందను మాపుటయు, అందులకు యుక్తియుక్తములగు సమాధానములను జెప్పి జయప్రదముగ రాముని యోగ్యతను నిలువఁబెట్టుటకై సప్తమాంకమున, "గీ. అనఘ రాక్షసమధ్యవర్తనమొకండు" అను నాల్గవపద్యము మొదలుకొని 7 వ పద్యాంతము వఱకును చక్కఁగ వ్రాయఁబడియున్నది. లోకారాధనవ్రతమే రామునకవిస్మయమునఁ బట్టుకొమ్మయైయున్నది. వసిష్ఠుఁడుగూడ నట్లే రామున కాజ్ఞాపనముం జెప్పియుండెను. ప్రథమాంకమందు "గీ. మను నిరోధించ" అను పద్యముం జూడుఁడు. అట్టియాలోచనము కర్తవ్యమని రాముఁడప్పుడే స్థిరపఱచుకొని యుండెను. (1 అం 13 ప) అందు "జనకసుతనైన" అనియుంగూడఁ జెప్పియుండెను. ఈ విషయమునే (1 అం. 42 ప.) "శిష్టులకు నెట్టికష్టమ్ములైన, జనుల యిష్టానుసరణంబు సద్వ్రతంబు" అను పద్యమున స్పష్టపఱచుకొనియెను. ఆక్రిందిపద్యమునఁ దనవలన "కళ్ళెలంబొవడంత" పలకలుగవలయునని విశదీకరించు

(1 అం. 43 ప.) అగ్నిశుద్ధియందుఁ బ్రజలు నమ్మకముంచకపోవుట వారి

ర భావమును (1 అం. 45 పద్యమున) రాముఁడే సూచించియున్నాఁడు.

ఉన మహాత్ములుగా నెన్నఁబడు మహర్షులెవ్వరు నీసందర్భమున రాము

నిరంకుశ దోషారోపణ చేసియుండలేదు. అట్టి భావమును మనస్సునందిడికొనియే భవభూతి మహాకవి నాటకమునందెల్లెడల రాముని బోషించెను. ఇందు రాముఁడవలంబించిన నైతికాధిక్యతను జనసామాన్యము గ్రహింపకుండుట యొక యాశ్చర్యములోనిదికాదు. వనదేవతయగు వాసంతికగూడ మహాత్ముల చిత్తంబులఁ దెలియనశంబుగాదెని (2 అం. 6 ప.) చెప్పియున్నది. వాసంతిక నీవు సీతనేలవిడిచితివని రాముని ప్రశ్నింప "లోకము సహింపని" దని రాముఁడు ప్రత్యుత్తరమొసంగె. ఈవిషయము నే పౌరజానపదులనుగూర్చి రాముఁడు (3 అం. 32 పద్యమున) జెప్పియుండెను. సీతకు జననీజనకులగు పృథ్వీజనకులకంటె రాముని నిందింపఁదగినవారు తదితరులుగారు. జనకుఁడు పుత్త్రీవియోగ జనితమగు దుఃఖమున్ముఖమగుటచే నిషద్విషాదమును వెల్లడించియుఁ బర్యాలోచనమున రాముఁడు తనకు విధివిహితమగు కర్మనే యాచరించెనని తెలిసికొని ప్రశాంతతనందెను. (4 అం. 24-25 ప.) పృథ్వియునట్టే ప్రశాంతయయ్యె. (7 అం. 7 ప.) ఏడవయంకమున నరుంధతీదేవి యంతర్నాటికయందు సమావేశమయిన చరాచరభూతకోటికి సీతాదేవి యొక్క శౌశీల్యత వెల్లడించి వారియామోదమును వడయునంతనుకఁ గౌసల్యజనకుఁడు మున్నగు స్వజనముగాని, వసిష్ఠాదిమహర్షులుగాని, సీతను తిరిగి స్వీకరించవలసినదని రామునకుఁ బ్రబోధింపఁజాలరైరి. (108 పేజీ మొదలు 19 వ పద్యము చివరవఱకు) "శ్లో॥ ఏతేనన్వద్ధిరే వీరాః బ్రహ్మక్షేమాయదీక్షితాః । లోకానంద ముకుందస్య చత్వార ఇవ బాహవః॥ " అని భోజనంపువునఁగూడ వ్రాయఁబడియున్నది. లోకమున మూఁడువిధములగు ధర్మములు గలవు.

1. నరుఁడు నరునివిషయమున గమనింపవలసిన ధర్మములు.
2. పరిపాలకుఁడు పరిపాల్యుల విషయమున గమనింపవలసిన ధర్మములు.
3. సృష్టికర్త సృష్టివిషయమున గమనింపవలసిన ధర్మములు.

ఇందు రాముఁడు తనయవతార జ్ఞానమును రామావతారమున గుర్తింపకున్నను నాతనిచర్యలు షయివూఁడవ విధానమునఁగల ధర్మములై పరిణమించెను. కావున సీతాపరిత్యాగమున రాముఁడకార్యకరణ మొనర్చెనని గాని భవభూతికాళిదాసు వలెఁ దగు నుపపత్తిని గలిగింప లేకపోయెనని గాని తలంచుట యసమంజసమని విన్నవించుచున్నాఁడను. శకుంతలా పరిత్యాగమునకు దుర్వాసశాపమెట్టిబలవత్తర మయిన యుపపత్తియో, సీతాపరిత్యాగమున లోకారాధనయునట్టి యుపపత్తియేయనిగూడ విన్నవింప సాహసించుచుంటిని.

ఈయాంధ్రీకరణమును జేయుచుండిన కాలముననే మనదక్షిణదేశమునందెల్లెడల నుత్కృష్టపండిత శిఖామణులుగా భావింపఁబడుచున్న సుప్రసిద్ధానేకోద్గ్రంథ రచనాధురీణులగు బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రులు వారినీవిషయమునఁ బృచ్ఛసేయఁగా వారును నేను పయినవ్రాసినట్లే చెప్పియుండుటచే నీవిషయము నిజ మిద్ధమని నేనును నిశ్చయించుకొని తదభిప్రాయమును వెల్లడింప సాహసించితిని.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

రాజా. యం. భుజంగరావు.

instructed to win her affections for him either by threats or persuasions. Rama in the meantime searched for Sita & rescued her from Ravana after killing him and his people. Thus the very purpose of Rama's incornation was accomplished. He then went to his kingdom & became king in his father's place.

Sometime afterwards Rama exiled his wife while she was pregnant on account of the serious doubts entertained by his subjects as to her chastity. The subject of the present work begins at this point. Sita gave birth to two male children, Kusa & Lava in the waters of the river Ganges into which she fell in order to put an end to her miserable existence as a discarded wife. She was taken care of by her mother Goddess Earth and her two children were placed under the tutorship of sage Valmiki, where they learnt all the sciences. Rama in the meantime with a view to perform the horse sacrifice left the sacrificial horse on the wide world by way of challenge that he who arrests its progress will be conquered by him. A big army commanded by Chendraketu, Lakshmana's son, followed the horse to guard it. Lava the second son of Sita, stopped the horse and defeated Rama's army and was having a single combat with Chendraketu, when Rama who happened to pass by that way compromised the matter between them. Rama & Lava began to love each other. At this stage Valmiki with other sages and Goddesses gathered a big meeting of Rama's subjects and declared before them that Sita was both innocent and chaste. They then united Sita with Rama and the people greeted them at their re-union. Thus ends the drama.

The play consists of 7 acts. The poet in the first act, briefly recalls the incidents in the previous life of the hero by a reference to the scenes from the sylvan life led by him with the heroine, exhibited in a picture gallery attached to the palace. He then sends Sita who is pregnant into exile under the pretext of ministering to her desire, to enjoy life in the hermitages once more.

The poet then shifts the scene to the Dandaka forest, where our hero spent nearly 12 years of his exile in Act 2. He had to go there to punish Sambuka, a Sudra by birth, performing penance, which a Brahmin alone is entitled to do.

The hero gives went to his pent up sorrow at the injustice done to his wife when he saw the old familiar places, where he enjoyed unbridled happiness with her. The sentiments here expressed are very beautiful and sacred. This forms the subject matter of the 3rd Act.

The scene then shifts to the hermitage of the Sage Valmiki in Acts 4, 5, 6 & 7 where Rama's mother and his father-in-law meet the boys Kusa and Lava. Then follows the fight between Lava & Chendraketu where the poet beautifully describes battles as they used to be then conducted.

The poet very skilfully introduces a drama within the drama, where the several phases in the life of Sita after her exile, are exhibited for the edification of Rama & others. This is a device adopted by Valmiki to bring about the re-union between Rama and Sita and the other bereaved parties.

Rajah M. Bhujunga Row.



రాజా యం. భుజంగరావు బహద్దరు జమీందారు.

ఉపోద్ఘాతము.

:o:

శా. ఈసా యంచు మహమ్మదీయులును, సర్వేశా యటంచార్యులున్
యేసంచుం గ్రైస్తవుల్, గొలుతురో యేస్వామి నత్యంతమున్
దాసోహమ్మని వానికే నెరగెదం ద్రైగుణ్యపూర్ణ న్నిధి
ధ్యాసం దచ్చరణారవిందములపైఁ దథ్యంబుగా నిల్పుచున్.

సీ. లలిత నాటక రసాలంకార సాహితీగ్రంథపాఠకు లయ్యగారివారు
నిత్యనైజికకృత్య నిష్ఠాగరిష్ఠతా ఖ్యాతవర్తను లయ్యగారివారు
సకలలౌకికకార్య సంధానచాతురీ కలితకోవిదు లయ్యగారివారు
జగపతిరాజ సంస్థానార్జితాఖండ ధారుణీవిభు లయ్యగారివారు

గీ. అనఘలక్షణ లక్షితు లైనయట్టి
వారి వంశంబు నందుసర్వప్రకార
ములను గూటస్థపురుషుల పోల్కిఁ గనుచు
సలలితుఁడుమామహేశ్వర శాస్త్రి వెలయు.

ఉ. ఆతనికిం బ్రియాత్మజుఁ డనంతగుణాంచితుఁ డాంధ్రహూణభా
షాతతసాహితీ పటురసజ్ఞుఁడు నాకునుదోడియల్లుఁడుం
బ్రీతిమెయిన్మనంబొసఁగు మిత్రుఁడు నైతగు వీరభద్రరా
వేతదుదార బంధుజన వీక్షణ తత్పర మానసంబునన్.

ఉ. మాపురికేగుదెంచి యొకమాసము మద్గృహమందు వేడుకల్
దోపవసించి మత్కృతకృతుల్ దిలకించుచు నొక్కనాడు వి
ద్యాపటిమంగురించి హృదయంబు కుతూహల వార్ధిఁదేలఁగాం
త్వాపరతంత్రతం బ్రియవచస్సరణి న్వచియించె నీగతిన్.

సీ. చారుమతీ, హరిశ్చంద్ర, కృష్ణా, జ్ఞాతవాసాది సరసరూపక చయంబు
శివపురాణము, సుశీల, వసంతకుసుమంబు, వారకాంతాది ప్రబంధములును
రాజహంసయు, మనోరమ, విజయాంకసాహస, నైషధాది గద్యాత్మకములు
మధుపవిహార, సర్వమంగళా, గోఖలేచరిత, మార్కండేయశతకములును.

గీ. ప్రహసనంబులు, స్తోత్రతారావళులును । చిత్రయుక్తులఁదెల్పు చరిత్రములును
అతుల గీతప్రబంధంబు లాదిగల్గు । కృతులు రచియించితీవు పండితులు వొగడ.

సీ. ఇలశుద్ధమా బెతిల్ హేము పట్టణమునఁ గన్యయౌ మరియాంబ గర్భమందు
జననంబునొంది పావనసువార్తలశిష్యవరులచే జగమునఁ బ్రబలఁజేసి
స్పర్శమాత్రమున సర్వవ్యాధు లణఁగించి జనులకారోగ్యంబు సంఘటించి
ఖలజనుల్ఘోరవించు కడగండ్లను సహించి మదిలోన వారి క్షేమంబుఁ గోరి

గీ. ప్రజల దురితంబు లణఁగింప నిజశరీర । మును సిలువకర్పణముజేసి ఘనతతోడ
ఛాత్రులకు దివ్యరూప దర్శనమొసంగి । నట్టిదేవుని చారిత్ర మభిలషించి.

చ. సురుచిర గద్యపద్యమయ శోభిత సూక్తుల తోడఁ బండితో
త్కరములు జూచి మెచ్చ సముదార తరంబగు సత్యవేదముం
బరువడి నాంధ్రభాషను బ్రబంధముగా రచియించి తన్మతా
దరులకు శ్రోత్రపర్వము సదా ఘటియించితి వోసుధీమణీ !

చ. వివిధము లౌ ప్రబంధములు విస్తరిలం బొనరింప నయ్యెఁ బా
ర్థివవర ! సంస్కృతంబగుకృతిం దెనుఁగింపఁగ లేదొకండు నీ
కవితకు వన్నియల్ గలుగు కైవడి నుత్తరరామనాటకం
బవిరళ మాధురీ మహిమ నాంధ్రి మొనర్చి కొంతఁ దీర్చుమా !

చ. పురహరుఁగొల్చి సంపదలఁబొందుటచే భవభూతినాఁగ ను
ర్వర బిరుదంబుఁ జెంది కవిమస్తకశిఖామణి కాళిదాసుచే
స్థిరతర కీర్తి వైభవము చేకుర సన్నుతిఁగాంచు నమ్మహా
త్తర వరనీలకంఠ కవితల్లజుఁ డాకృతికన్యకంగనెన్.

చ. అని ప్రియమిత్రుఁడై పలుకు నాతనివాక్యము లాలకించి మ
న్మనమున నట్టి సాహస మొనర్పఁగ సంశయ మొంది యైన నా
తని యభిలాషఁ దీర్పఁ బ్రమదంబున దీనికిఁబూనినాడ, నం
దనిఫలమున్ గ్రహింపఁగ గణంగుచు నట్టులు సాచుపోలికన్.

సీ. పదగుంభనం బన్న పరిస్ఫురద్రత్నంబు లేర్చి మాలిక నొనగూర్చినట్లు
అమితార్థ సారస్య మన్న మల్లెలు మొల్ల లెల్లఁదావుల వెదజల్లినట్లు
అలభావగాంభీర్య మన సుధారసధార లంచితాబ్దములు వర్షించినట్లు
అతుల రసౌచిత్య మన హఠాద్ఘటిత విద్యుచ్ఛటాస్ఫుటదీప్తు లాలవినట్లు

గీ. మానితానూనవైభవోత్తాన మైన । యట్టి భవభూతి కృతిరత్న మాంధ్రశైలి
ననుగమింపఁగఁ గల్గుదునా యటంచు । సంశయం బయ్యె భార మీశ్వరుని దింక.

చ. చదువరులార! నాకుఁ గల శక్తికొలంది రచించినాఁడ ని
య్యది భవదీయ మానసములందు రుచించునొ? లేదొ? నాదు నె
మ్మది నెఱుఁగంగఁజాల ననుమానము లున్న నణంచి, యున్నదొ
వ్విదములె గొప్పగాఁ దలఁచి ప్రీతి వహింపుఁ డనుగ్రహంబునన్.

ఇట్లు

కవిపండితవిధేయుఁడు,
రాజా మంత్రిప్రెగడ భుజంగరావు.

ఏలూరు.
1—5—1918.

శ్రీరస్తు.

జగదీశ్వరసహాయోస్తు.

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

ప్రథమాంకము.

నాంది—ప్రస్తావన.

క. మొదలిటి కవిరాజులకై
యిదియె నమోవాక మిచ్చ నెంచెద, నల శా
రద దివ్యామృతరూపన్
విదితాత్మ కలం దలంచి వినతి యొనర్తున్. 1.

(నాంద్యంతమున.)

సూత్రి—అతివిస్తరమేల? ఇపుడు భగవంతుఁ డగు కాళప్రియానాథుని మహోత్సవం బునందలి యార్యమిశ్రులం గూర్చి విన్నవించు చుంటిని. పూజ్యులగు మీరిట్లెఱుంగుదురుగాక! కలఁడుగదా కశ్యపగోత్ర సంభవుండును, శ్రీకంఠనామలాంఛితుండును, బద వాక్య ప్రమాణ సారజ్ఞుండును, జాతూకర్ణీ పుత్త్రుండు నగు భవభూతి యను మహాత్ముండు!

గీ. భారతీదేవి తనుదాన వశ్యయగుచు
మించి యేబ్రహ్మ ముఖ మాశ్రయించె నట్టి
ఘనుని కృతిరత్నమును బ్రదర్శన మొనర్తుఁ.
బ్రీతి నుత్తరరామ చరిత్ర మిపుడు. 2.

[ఆకసమువంకఁ జెవి యొగ్గి వినుట నభినయించి]

ఇకాలంబున గీర్వాణభాషాప్రచార మత్యల్పం బగుటచేఁ బ్రేక్షకుల కగ్రాహ్యం బని పలుకుచుంటివా?

నమోవాకము = నమస్కారవాక్యము. విదితాత్మ = పరమాత్మాంశ భూతమగు బ్రహ్మదేవుఁడు, బ్రాహ్మణుఁడు.

మ. వర మంత్రిప్రెగడాన్వయోద్భవుఁడు విద్వద్బృంద సంసేవనా
చరణాయత్తమనస్కుఁడున్, భుజగరాజఖ్యాతనామాంకుఁడుం
గరి ధాత్రీ నిధి చంద్ర సంఖ్యఁ (1918) దగు రంగత్క్రీస్తవాబ్దంబున
న్నిరతిన్ దీని రచించె నాంధ్రమున వర్ణింపంగ నేలూరునన్. 3.

ఏతదాంధ్రీకరణము నే ప్రదర్శింపఁ బూనితిని. నేను కార్యవశంబున నయోధ్యా నగరస్థుండను రామసమకాలికుఁడను నైయుంటిని. (అంతటఁగలయఁజూచి) ఓహో! పౌలస్త్య కుల ధూమకేతుండును, మహాత్ముండునగు శ్రీరామసార్వభౌముని పట్టాభిషేక సమయం బహర్నిశంబవిచ్ఛిన్న గీత వాదిత్రంబై ప్రవర్తిల్లుచుండ నిప్పు డేలొకో చత్వరసీమ లెల్లఁ గుశీలవ వ్యాపారములు లేక నిశ్శబ్దంబులై యున్నయవి!

నటుఁడు—(ప్రవేశించి) బావా! మహారాజు లంకాసంగ్రామ మిత్రులగు మహాత్ములఁ బ్లవంగ రాక్షసులను, నానాదిగంత సంశోధకులైన పూజార్హుల బ్రహ్మర్షి రాజర్షులను స్వగృహంబులం జేరఁ బనిచె. వారి నారాధించుటకుఁ గదా యిన్నిదినంబులు వేడుకయైనది! ఇప్పుడో?

గీ. అల వసిష్ఠుని యాజమాన్యంబునం ద
రుంధతీ పురస్కృత లౌచు బంధుర మగు
సవనమును జూడ శ్రీరామజనను లల్లు
నాశ్రమస్థానమున కిప్పు డరిగినారు. 4.

సూత్ర—విదేశీయుండఁ గాన నడుగుచుంటిని. అల్లుఁ డెవ్వరు?

నటు— క. శాంతయను కన్యకను భూ
కాంతుం డగు దశరథుండు గని యాబాలన్
సంతానంబుగ నొసఁగెను
సంతసమున రోమపాద జననాథునకున్. 5.

విభండకపుత్రుఁడైన ఋశ్యశృంగమౌని యాకన్నియం బరిణయంబయ్యె. ఆతఁడు ద్వాదశవర్షావసానంబైన సవనంబు నారంభింపఁ దత్కారణంబునం బరిపూర్ణగర్భ యగు కోడలిం జానకిని విడిచి గురుజనం బచ్చటికిఁ జనియె.

కరి=అష్టదిగ్గజములు 8. ధాత్రి=భూమి 1. నిధి=నవనిధులు, 9. చంద్రుడు=1 సింహావలోకనమున 1918, అగును. వర్ణింపంగ=స్తోత్రపాత్రముగ.

సూత్ర—మనకిదియేల ? స్వజాతిధర్మమున రాజద్వారమునే సేవింతమురమ్ము.

నటు—అట్లయిన బావా ! నిరవద్యంబైన రాజసేవాస్తవ క్రమంబు నిరూపింపుము.

సూత్ర—మారిషా !

గీ. ఎల్లతెఱఁగుల వచియింపఁ జెల్లుఁ గాని
దోషరాహిత్య మనఁగ నెందులకు వలయు ?
కలుకులం దెట్టులో పలుకులనన్లై
దుర్జనుఁడె యగు జనుఁడు సాధుత్వమందు. 6.

నటు—అతిదుర్జనుఁ డని చెప్ప నొప్పు.

గీ. జానకీదేవియెడలనే జనులు నింద
మోపిరింతకుఁ బరికింప మూల మొక్కొ
దైత్యమందిరవాసంబు దానికగ్ని
శుద్ధి యైనను నిశ్చయ స్ఫూర్తి లేదు. 7.

సూత్ర—ఈ కింవదంతి మహారాజు వీనులం బడెనేని దానఁ దప్పక ముప్పు వాటిల్లు.

నటు—సర్వవిధంబులం దపోధనులును బృందారకులును శ్రేయం బొసంగఁ గలరు.
(పరిక్రమించి) ఓహో ! మహారా జిప్పు డెక్కడ? (విని) లోకు లిట్లనుచుండిరి.

ఉ. నెనరునఁ గాంచి మోదము జనింపఁగఁ జేయఁగ నేగుదెంచి యా
జనకనరేంద్రుఁ డిన్ని దివసంబులు వేడుకఁ బుచ్చి యిత్తఱిం
జనియె విదేహదేశ మని జానకి చింతిల నంతఁ దీర్ప వా
సనిలయగామియయ్యె నృపచంద్రుఁడు గద్దియడిగ్గి దిగ్గనన్. 8.

(నిష్క్రమించిరి.)

ఇది,

ప్రస్తావన.

వాసనిలయగామి=అంతఃపురమునుగూర్చి వెళ్ళినవాఁడు.

ఆంధ్రీకృతోత్తరరామచరిత్రము.

ప్రథమాంకము.

(రామభద్రుఁడు, సీతయు నుపవిష్టులై ప్రవేశింతురు)

రామ—దేవి ! వైదేహీ ! ఊరడిల్లుము. ఆ గురువులు మనల విడువఁ జాలరు. ఐనను

గీ. నిత్యకర్మాద్యనుష్ఠాన నియతి స్వైర
పరత నపకర్షణ మొనర్చు ప్రత్యవాయ
ముల కతంబున నాహితాగ్నులకుఁ దలఁప
నధికకష్టంబుగాదె గార్హస్థ్య మనఁగ. 9.

సీత—ఎఱుంగుదును. ఆర్యపుత్త్ర! యెఱుంగుదును. అయినను, గురుబంధు వియోగంబులు సంతాప జనకంబులై యుండును.

రామ—ఔను. ఈ సంసార భావములు హృదయ మర్మముల భేదించుచుండునుగదా! వీని రోసి యెల్ల కోరికల నెడబాసి మనీషు లరణ్యమున విశ్రమించుచుందురు.

కంచుకి—(ప్రవేశించి) జయము రామభద్ర ! (అర్ధోక్తిలో సంశయించి) మహారాజ !

రామ—(చిఱునగవుతో) ఆర్యా ! జనకపరిజనము నన్ను "రామభద్రా" ! యని పిలుచుటయె శోభాస్పదము. కాన నీ యభ్యాసానుసారమునఁ బిలువుము.

కంచు—ఋష్యశృంగాశ్రమమునుండి యష్టావక్రముని విచ్చేసియుండె.

సీత—ఆర్యా ! యింకఁ దడవేల ?

రామ—త్వరితముగఁ బ్రవేశపెట్టుము. (కంచుకి నిష్క్రమించెను.)

అష్టా—(ప్రవేశించి) మీకు శుభ మగుఁ గాక !

రామ—అభివాదనము. ఇట గూర్చుండుఁడు.

సీత—నీకువందనము. మదీయసర్వగురుజనంబునకు నార్య యగు శాంతకుఁ గుశలమా ?

రామ—మద్భావుకుండును మహాత్ముఁడునగు ఋశ్యశృంగమౌని యార్యయగు శాంత తో నిర్విఘ్నముగ సోమపానముఁ గావించెనా !

సీత—మమ్ముఁ దలపోయుచుండెనా ?

అష్టా—(కూర్చుండి) ఔను దేవీ ! భగవానుఁ డగు వసిష్ఠుండు నిన్నుఁ గూర్చి యిట్లు పలికెను.

> మ. "చతురాస్య ప్రతిరూపుఁడౌ జనకరాజన్యుండు నీతండ్రి, యా
> సతి విశ్వంభర నీదుతల్లి, యలభాస్వంతుండును న్మేము ను
> న్నతి నే రాజకుటుంబకంబున గురుత్వంబూని యున్నార మా
> క్షితిరాట్పుందుహిల కీవు కోడలవు చర్చింపంగ నోనందనీ ! 10
>
> కాన నింకేమి కోరుదుము ? తప్పక వీరజనని వి కమ్ము"

రామ—అనుగ్రహింపఁ బడితిమి.

> గీ. లోక సంబంధు లైన సుశ్లోకజనుల
> భాషితం బర్థమై ఖరిఁ బట్టినడుచు
> నాది మౌనుల వచనంబు నర్థ శైలి
> యనుసరించుచు నుండు నుదారభంగి. 11.

అష్టా—భగవతి యరుంధతియు, దేవులు, శాంతయుఁ, బదింబది నిదియే సందేశించిరి. "ఈమె కెద్దియైన దౌహృదవాంఛ జనించెనేని దానిఁ జెచ్చెర నెఱవేర్ప వలయు" నని.

రామ—నెఱవేర్చెద నీమె తెల్పెనేని.

అష్టా—ననాంద్రుభర్త యగు ఋశ్యశృంగమౌని దేవికి సందేశించె. "వత్సా ! పరిపూర్ణగర్భ వని తోడితేలేదు బాలుఁ డగు రామభద్రుండును భవన్వినోదంబు

ననాండ=ఆఁడుబిడ్డ. అభివాదనము=గోత్రనామములు చెప్పి పాదములుసోఁకి మ్రొక్కుట.

కొఱకె నిల్పఁబడియె. కాన నందనాలంకృతాంక వగు నాయుష్మతిం జూడఁ గలము.'' అని.

రామ— (హర్ష లజ్జాస్మితములతో) అట్లగుఁగాక ! భగవంతుఁ డగు వసిష్ఠమానిచే నేమియు సందేశింపఁ బడ నైతినా ?

అష్టా—వినుము.

గీ. మము నిరోధించె నిచట జామాతృయజ్ఞ
మర్భకుండవు నీవు రాజ్యంబు కొత్త,
ప్రజల రంజింపఁ గడఁగు మేర్పడ, యశంబు
స్వాత్మకన్నను నీకు దివ్యార్థముగద !'' 12.

రామ—భగవానుఁ డగు మైత్రావరుణి యాజ్ఞ చొప్పననే—

క. కరుణన్ మైత్రిని సౌఖ్యము
సరగున జనకసుతనైన జనరంజనమున్
నెఱపఁగ విడిచెదు నాకుం
దొరకొన దొక్కింతయైన దుఃఖము మదిలోన్. 13.

సీత—కావుననే, ఆర్యపుత్త్రుండు రఘురాజధురంధరుండు.

రామ—ఎవఁడురా అచ్చట ? అష్టావక్రమాని విశ్రమింపఁ జేయఁబడుఁగాక !

అష్టా— (లేచిపరిక్రమించి) ఓయీ ! లక్ష్మణకుమారుఁ డరుదెంచె. (నిష్క్రాన్తి)

లక్ష్మ— (ప్రవేశించి) ఆర్యా ! జయమగుఁగాక ! ఆ చిత్రకారునిచే నస్మ న్నిర్దేశంబున నీ వీథికయం దార్యచరిత్రము విలిఖింపఁబడియె. కావునఁ గనుంగొనుము.

రామ—వత్సా ! యెఱుంగుదువా ? వికలాత్మయైన జనకనందని నానందింపఁజేయు నిమిత్తము. ఇందెంతదనుక వ్రాయఁబడినది ?

లక్ష్మ—ఆర్యారాలి పావకశుద్ధివఱకు.

రామ—పావము శాంతించుఁగాక !

క. జనన పరిపూత యగు భూ
తనయ కితర పావనములఁ దలఁపఁగ నేలా ?
ఘన తీర్థోదక మగ్నియు
ననువుగ వేఱొకట శుద్ధి కర్హములగునే ? 14.

జామాత=అల్లుఁడు. మైత్రావరుణి=వసిష్ఠుఁడు.

దేవీ ! పవనమహీనందని ! ప్రసన్నవు గమ్ము. ఈ యంజలి యావజ్జీవమైనది.

చ. అలలితమై చరించుజన మాత్మజనంబులచేత సాంత్వవా
క్కులు ననురంజనీయ మగుఁ, గోమలి ! నిన్ను నమంగళోక్తులం
దలఁకఁగఁ జేయ మా కనుచితంబు, సుగంధిల పుష్పరాజముం
దలనిడఁ జెల్లుఁ గాని చరణంబులఁ దన్న నిసర్గశైలియే ? 15.

సీత—పోఁగాక ! ఆర్యపుత్రా ! రమ్ము నీ చరితంబు నభిలక్షింతము.
(లేచి పరిక్రమింతురు.)

లక్ష్మ—ఇదే ! తదాలేఖ్యము.

సీత—(చూచి) వీరెవ్వరు ? ఊర్ధ్వభాగమున నిరంతరస్థితులై యార్యపుత్రుని నుతియించుచున్నట్లున్నవారు.

లక్ష్మ—సరహస్యంబు లగు నాజృంభకాస్త్రంబు లివియే. ఇవి భగవంతుం డగు భృశాశ్వుని వలనఁ గుశికనందనుండును విశ్వామిత్రుండు నగు విశ్వామిత్రముని యందుపసంక్రమించి వారిచేఁ దాటకావధంబున నార్యునికిఁ బ్రసాదింపఁ బడినవి.

రామ—దేవీ ! దివ్యాస్త్రములకుఁ బ్రణమిల్లుము.

గీ. నలువ మున్నగు తొంటి పెద్దలు జగద్ధి
తంబు కొఱకు సహస్రాధికంబు లబ్ద
ములు దపముఁ జేసి నిజతపోమూర్తతేజ
ములుగ విలసిల్లు నీయస్త్రములను గనిరి. 16.

సీత—నమస్కార మిదె దివ్యాస్త్రములకు.

రామ—ఇయ్యవి సర్వవిధంబుల నీసంతతి నొందఁ గలవు.

సీత—అనుగృహీత నైతిని.

లక్ష్మ—ఇది మిథిలావృత్తాంతము.

సీత—ఓహో ! నవవికచేందీవరశ్యామలంబై స్నిగ్ధాపీనకోమలంబైన దేహసౌభాగ్యంబున కక్కజంబునందు జనకభూపాలునిచే నిశ్చలంబుగాఁ జూడఁబడు రమ్యసౌందర్యలక్ష్మితోడను, కాకపక్షావతంసితం బగు ముఖమండలంబుతోడను లీలాసమాక్రాంత పరమేశకార్ముకుం డగు నార్యపుత్రుండు లిఖియింపఁబడెను.

అభిలక్షింతము = చూతము, మూర్త = శరీరమును ధరించిన, ఆలేఖ్యము = చిత్తరువు=వ్యాపము.

లక్ష్మ—ఆర్యారాలా ! చూడుము చూడుము.

క. బందుగులకు నీ జనకుఁడు
నందముగ వసిష్ఠముఖ్యు లంపఁతికి శతా
నందుఁడు గౌతముఁ డను జన
కేంద్రపురోహితుఁడు బూజ లిడుచుండిరొగిన్. 17.

రామ—దర్శనీయ మిది—

క. జనక రఘురాజ కులముల
యనుబంధం బెవని కిష్టమై యుండదు ? దీ
నిని సమకూర్పఁగఁ గౌశికుఁ
డొనరఁగఁ దాతయు గ్రహీతయును దా నయ్యెన్. 18.

సీత—సద్యఃకృత గోదాన మంగళులై వివాహదీక్షితులైన మీ నల్వురు సోదరులును వీరేకదా ! ఓహో ! ఆదేశ్రపదేశమున నదేసమయమున నుంటి నని తలంచుచుంటిని.

రామ— గీ. గౌతముఁడు నాకొసఁగ రమ్యకంకణమున
నొనరఁబట్టిన నీ కేల్; మహోత్సవంబు
మూర్తిఁదాల్చిన యట్లు న న్ముదితుఁ జేయు
నాఁటితటి నేటివలెనుండె నళినవదన ! 19.

లక్ష్మ—ఈమె యార్య, ఈమెయు నార్యమాండవి; ఇయ్యది వధువు శ్రుతకీర్తి.

సీత—'నవ్వుచు' వత్సా ! యింకొకతె యిదియెవ్వతె ?

లక్ష్మ—(లజ్జాస్మితములతోఁ దనలో) ఓహో ! ఆర్యయూర్మిళ నడుగుచున్నది. కాఁగాక ! ముందుజరిపెదను. (ప్రకాశముగా) ఆర్యా ! చూడుము. దర్శనీయ మిది. ఇదే ! భగవానుఁ డగు భార్గవుండు—

సీత—చకితురాల నైతిని.

రామ—ఋషీంద్రా ! నీకునమస్కారము.

లక్ష్మ—ఆర్యారాలా ! చూడుము. ఈతఁ డార్యుని చే—

రామ—'సాక్షేపముగా' ఓయీ ! దర్శనీయము పెక్కుగలదు. వేఱొకటిఁ జూపుము.

సద్యః=అప్పుడే, కృత=చేయఁబడిన, గోదాన= క్షౌరము చేత, చకితురాల= భయపడినదానను.

సీత—(సమ్మానముతోఁ జూచి) ఆర్యపుత్త్రుఁ డీ వినయ మహిమచే లెస్సగా దీపించుచుండె.

లక్ష్మ—ఇదే మన మయోధ్యం జేరితిమి.

రామ—(కన్నీళ్ళతో) స్మరించుచుంటిని అన్నా! స్మరించుచుంటిని.

క. జనకుఁడు జీవింపఁగ నా
తనదారపరిగ్రహంబు దనరిన వేళం
జననీ పోష్యుల మగు మన
ఘనదివసము లవి గతించెగాదే? తలఁపన్. 20

అప్పడీ జానకియు—

చ. పసి యొడమా కెలంకులను బట్టి జనించెడి పల్లుమొగ్గలం,
బెడఁగగు దంతపుష్పముల, బిత్తరి చూపుల, నొవ్వ మోముతో
వెడలెడు కౌముదీ సహజ విభ్రమ రమ్య విలాస రేఖలం
దొడరిన యంగకంబులఁ గుతూహల మిచ్చె మదంగరాజికిన్. 21

లక్ష్మ—ఇది మంథర.

రామ—(నిరుత్తరముగా వేఱొకటఁ జేరి) దేవీ! విదేహరాజనందని!

ఆ. మున్ను శృంగిబేర పురమున సౌహార్ద
వంతుఁడో నిషాద భర్తతోడ
మనకు మోదమున సమావేశ దేశమై
యొసఁగు నింగుదీమహీజ మిదియొ. 22

లక్ష్మ—(నవ్వితనలో) ఓహో! ఆర్యుండు మధ్యమాంబికా వృత్తాంతంబు నంతరింపఁ జేసె.

సీత—ఓహో! యిది జటాబంధ వృత్తాంతము.

లక్ష్మ— గీ. వార్ధకంబున రాజ్యసంపదల నెల్లఁ
బుత్త్రులం దుంచి యిక్ష్వాకు భూమిపతులు
గాంచు పుణ్యంపు టారణ్యక వ్రతంబు
నార్యుఁ డిష్టులఁ దాల్చె బాల్యంబునందె. 23

సీత—ఇదే! నిర్మలపుణ్యోదక యగు భగవతి భాగీరథి.

రామ—దేవీ! రఘువంశదేవతా! నీకు నమస్కారము.

కౌముది=వెన్నెల, ఇంగుదీమహీజము=గారచెట్టు.

చ. అల సగరాధ్వరంబునఁ దదాత్మజు లశ్వము రోయ ధారుణిం
దొలుచుచు రోషవత్కపిల దుస్సహ తేజమునం బ్రదగ్ధులై
పొలియ భగీరథుండు దనువు న్వెతఁ గూర్చి తపం బొనర్చి నీ
జలములఁ దృప్తిమై దడిపి సాధ్వి! తరింపఁగఁ జేసెఁ దాతలన్. 24.

జననీ! అట్టి నీవు కోడలగు జానకియుం దరుంధతియుం బోలె మంగళాశాసనంబు గావించు చుండుము.

లక్ష్మ—ఇది చిత్రకూట మార్గమందలి కాళిందీతటంబున భరద్వాజ ప్రదర్శితంబైన శ్యామమను వటవృక్షము.

సీత—ఆర్యపుత్త్రుఁ డీప్రదేశముం దలంచుచుండెడిని.

రామ—ఓహో! యెట్లు మఱపువచ్చును?

మ. గమనాయాసముచేత దుర్బలములై క్లాంతాతి తాంతంబులై
ప్రమదాలింగన దత్త సర్వతను సంవాహంబులై, పీడనా
ర్తమృణాళీమృదులంబులై, తగుభవద్గాత్రంబులన్ నాదు వ
త్సమునం జేరిచి నిద్రవోయితివి గాదా! యీ ప్రదేశంబునన్? 25.

లక్ష్మ—ఇది వింధ్యారణ్య పురోభాగమున విరాధ నిరోధము.

సీత—ఇది చాలును. ఆర్యపుత్త్రుండు దాళవృంతంబు నాతపత్రంబుగాఁ గేలధరియించి ప్రారంభించు దక్షిణారణ్య ప్రవేశముం జూచెదను.

లక్ష్మ-ఉ. మానిత శాంతులై యతిథి మానసులై నిజముష్టి సమ్మితం
బౌ నివరుల్ పచించెడి గృహస్థుల నొప్పు గృహాళితోడ, వై
ఖానస వాసయోగ్య తరుకాండముతోఁ దగి శైలవాహినీ
స్థాన తటంబులం జెలఁగు తాపస వాటిక లివ్వియేకదా! 26.

ఇది క్రిక్కిరిసిన వృక్షసంఘములచే నెడము లేక నున్నదై కాలుకొన్న ప్రాంతారణ్యంబుచేఁ జుట్టుముట్టఁ బడిన గోదావరి వలన మొరయు కందరంబుల నందగించి, తెఱపిలేక కురియు మొగిళ్ళచేఁ గుప్పకుప్పలైన కప్పున నొప్పు జనస్థాన మధ్య మందలి ప్రస్రవణ శైలము.

వత్సము=వక్షము. క్లాంతము-తాంతము=బడలినది. సంవాహనము=పట్టుట, పిసుకుట. మొగిళ్ళు=మేఘములు, తాళవృంతంబు=తాటియాకు విసనకఱ్ఱ, ఆతపత్రంబు = గొడుగు, వైఖానసుఁడు=వానప్రస్థుఁడు.

రామ-ఉ. భావమునం దలంతువె శుభాంగిరో ! లక్ష్మణుఁ డా ధరంబునన్
సేవ యొనర్పు చుండ సుఖజీవనతం జను నా దినంబులన్ ?
భావనఁ జేయుదే సరస పావన నీరములం దనర్పు గో
దావరి ? నచ్చటన్ మన యుదార విహారములన్ స్మరింతువే ? 27.

మఱియు—

ఉ. మక్కువ పిక్కటిల్లఁగ సమంబుగఁ జెక్కులు సేర్చి తారుమా
రెక్కఁగ మెల్లమెల్ల మన మెట్టిటొ యక్రమభాష లాడుచో
నొక్కొక భుజంబుతోడి యొడమోర్వని కౌఁగిళులన్ సుఖింప నా
చక్కని రాత్రియే చనిన జాము లెఱుంగక యుండ బిట్టయెన్. 28.

లక్ష్మ—ఇది పంచవటియందు శూర్పణఖ—
సీత—హా ! ఆర్యపుత్రా ! ఇంతవఱకే నీదర్శనము.
రామ—ఓ వియోగభీరురాలా ! చిత్తరు విది.
సీత—ఎట్లయిన నగుఁ గాక ! దుర్జనుఁడు దుఃఖంబు నుత్పాదించు.
రామ—అన్నా ! జనస్థాన వృత్తాంతము జరుగుచున్నట్లే తోఁచుచున్నది.

లక్ష్మ-మ. కనకాకార మృగంబు మాయవలనం గల్పించి పాపాత్మకా
దనుజుల్ కీడొనరించి రట్లు లయ మొందం జేసినన్ దేశముం
జన దా వైరము, శూన్యమై తగు జనస్థానంబునం దార్తి జెం
దిన యార్యుంగని శైల మేడ్చు, హృదయోచ్ఛిన్నం బగున్ వజ్రమున్. 29.

సీత—(కన్నీళ్ళతో. స్వ) ఓ దేవా ! రఘుకులనందనా ! నానిమిత్తమై యిట్లు వంతఁ జెందితివిగదా !
లక్ష్మ—(రాముని జూచి సాభిప్రాయముగా) ఆర్యా ! ఏమిది !

చ. తునిఁగిన ముత్తెపున్సరము తోయమునన్ భవదశ్రుబిందువుల్
కనులను ధారలై విడి యిలం బడి పొర్లె నిదే ! యొడంద బొం
గి నిగుడు దుఃఖవేగ మడఁగింప నడంగక నాసికాధరం
బును గదలించి యన్యజనబోధము దా నొనరించె నద్దిరా ! 30.

రామ—వత్సా !

గీ. నాడు ప్రియజన విరహ జన్య మగు దుఃఖ
వహ్ని ఖరమయ్యుఁ బ్రతిక్రియా వాంఛ నోర్వఁ

ధరంబునన్=పర్వతమున. తోయమునన్=రీతిని. ఖరము=తీక్ష్ణము.

బడి మనంబున, మరల విపక్వ మయిన
హృదయ మర్మవ్రణంబునా నెరిఁగఁ జేసె. 31.

సీత—నేనును మితిమీఱిన విరహభావనచే న న్నార్యపుత్త్రి శూన్యురాలిఁగాఁ దలంచుచుంటిని.

లక్ష్మ—(తనలో) హౌనట్లే ! వేఱొకటి చూపెదను. (చిత్రమును జూచి ప్రకాశముగా) ఇదిగో ! యిదిమన్వంతర వృద్ధుఁ డగు గృధ్రరాజైన తాత జటాయుని విక్రమ చరిత్రన్యాసము.

సీత—హా ! తండ్రీ ! నీపుత్త్రివాత్సల్యము నిర్వహింపఁ బడినది.

రామ—తీర్థభూతుఁ డగు నంతటి సజ్జనుం డెచ్చట లభించును ?

లక్ష్మ—ఇదిగో ! యిది జనస్థానమునకుం బశ్చిమ తటంబున దను వను కబంధుండు నివసించు చిత్రకుంజ మను దండకారణ్యభాగము—ఋశ్యమూక మందలి యీ మతంగాశ్రమ మిది—ఇది శ్రమణ యను సిద్ధశబరి—ఇదే ! పద్మపంపాసరంబు.

సీత—రోషగాంభీర్యములు విడిచి యార్యపుత్త్రుఁ డిచ్చటనేగదా పెద్ద యెలుంగుతో రోదన మొనర్చె.

రామ—దేవీ ! ఈపద్మసరస్సు రమణీయ మైనది.

చ. మదకలహంస పక్షముల మాటికిఁ గంపిలుచున్న దీర్ఘనా
ళ దళిత వారిజవ్రజములం దగి కైరవపఙ్క్తి నొప్పు త
త్సదమల నీరభాగములఁ జయ్యన బాష్పము రాలి వెండియుం
బొదిలెడు నంతరాళమునఁ బొందుగఁ జూచితి నా సరస్సునన్. 32.

లక్ష్మ—ఇతఁ డార్యుఁ డగు హనుమంతుఁడు.

సీత—ఇతఁడు చిరనిర్వేదమును బొందు జీవలోకము నుద్ధరించిన మహోపకారకుండును మహాభాగుండు నగు మరున్నందనుండు.

రామ— గీ. అంజనానంద వర్ధనుం డైన యట్టి
ఘనభుజుఁ డితండు కళ్యాణ కారణుండు
మనకు జగముల కీ మ్మహామహుని శౌర్య
సంపదలచేత ధన్యత సంభవిల్లె. 33.

దళిత=వికసించిన. వారిజము=పద్మము, కైరవము=కలువ. అంతరాళమున=మధ్యకాలమున.

సీత—వత్సా! కుసుమిత కదంబ వ్యత్యన్మయూరం బైన యి మ్మహీధరంబు పేరేమి? ఇచ్చటఁ బరిభావ సౌందర్యమాత్ర పరిశేషమైన ధూసరిత లావణ్యముతో క్షణమాత్ర మూర్ఛితుం డగు నార్యపుత్త్రుండు దుఃఖాయమానుండ వగు నీచే ధరింపఁబడిన వాఁడై వృక్షమూలమున లిఖింపఁబడియె.

లక్ష్మ—శా. శ్యామ స్నిగ్ధ నవాంబుదాశ్రిత శిరస్థానంబు, సాలద్రుమ

వ్యామిళిత స్సుమ సౌరభం బిదియె నుమ్మా మాల్యవ చ్ఛైల మా

రామ— సౌమిత్రీ! యిఁకఁ జాలు చాలును వినం జాలం బరార్ధంబు, నీ

తామాంగళ్యవతీ వియోగ మిదె! సిద్ధం బయ్యెడిన్ వెండియున్. 34.

లక్ష్మ—పిదప నార్యునియొక్కయుఁ బూజ్యులగు కపిదానవులయొక్కయు నగణ్యంబులగు నుత్తరోత్తర చిత్రకృత్యంబులు కలవు. ఈయార్యయుఁ బరిశ్రాంతయైనది కాన విశ్రమింపఁ జేయుఁడని విన్నవించుచుంటిని.

సీత—ఆర్యపుత్త్రా! యీ చిత్రదర్శనంబుచే సాభిలాషనగు నే నొకటి విన్నవించెదను.

రామ—ఆజ్ఞాపింపుము.

సీత—ప్రసన్న గంభీరంబు లగు గహన వీథులఁ జరింప వలయు ననియుఁ బావన విమల శీతలావగాహయు భగవతియు నగు భాగీరథియందు విహరింప వలయు ననియుం గోరుచుంటిని.

రామ—వత్స! లక్ష్మణ! "అభిలాష చెచ్చెర నెఱవేర్పవలయు" నని యిప్పుడే గురుజనాజ్ఞ యైనది. కాన నస్ఖలిత సుఖ సంప్రసారమైన శతాంగంబు దెప్పింపుము.

సీత—ఆర్యపుత్త్రా! మీరు నచ్చటికి రావలయును.

రామ—కఠినహృదయా! యిదియుం జెప్పవలయునా?

సీత—అట్లయిన నాకిష్టమే.—

అవగాహము=స్నానము. అస్ఖలిత=చలించని, సంప్రసారమైన=గమనముగల, శతాంగము=రథము. శ్యామ= నల్లనయిన, స్నిగ్ధ= నునుపగు, నవాంబుద=క్రొత్త మేఘముచే, ఆశ్రిత=ఆశ్రయింపఁబడిన, శిరస్థానంబు= శిఖరములుగలది, సాలద్రుమ=మద్దిచెట్లయొక్క, వ్యామిళత్=వికసించిన, సుమసౌరభము = పుష్పపరిమళము గలదియు.

లక్ష్మ—ఆర్యాజ్ఞ నిర్వర్తింతును. (నిష్క్రమించును.)

రామ—ప్రేయసీ ! యీ గవాక్షమండలము నాశ్రయించి కొంత తడవు శయనింతము.

సీత—ఔంగాక ! ప్రయాస జనిత మగు నిద్రచే నపహరింపఁబడుచుంటిని.

రామ—ఇచట శయనింప నన్ను దృఢముగా నవలంబింపుము.

గీ. ఖేద సాధ్వస నిస్సృత స్వేదబిందు
సాంద్రమై చంద్రకరమిళ త్స్యంద్రకాంత
సరమునం బోని భుజము గంధరమునందుఁ
జేర్పఁదవుగాక ! జీవంబుఁ గూర్పఁ జోక. 35.

(అట్లు చేయించి సానందముగా) ప్రియా ! యేమిది ?

మ. అరయన్ సౌఖ్యమొ ? దుఃఖమో ? తెలియ శక్యం బింతయుంగాదు, దు
ర్భర సమ్మోహమొ ? నిద్రయో ? విషవిసర్పంబో ? మదంబో ? భవ
త్సరస స్పర్శములన్ మదిందియతతిన్ సమ్మూర్ఛ నొందించు బం
ధుర భావం బిది జీవము న్మరలిచి యమ్మూర్ఛలంబు గావించెడున్. 36.

సీత—మీరు నిశ్చల ప్రసాదులు. ఇప్పుడింతకన్నఁ గావలసిన దేమి ?

రామ—గీ. క్లాంత జీవన కుసుమ వికాసనమ్ము,
లిందియ విమోహనములు, సంతృప్తిదములు,
పంకజాతాక్షి ! భవదీయ భాషణములు,
స్వాంత సురసాయనములు, గర్ణామృతములు. 37.

సీత—ప్రియంవదా ! శయనింతును.(శయ్యకై యంతటం బరికించును)

రామ—ఓహో ! యేమి వెదకెదవు ?

గీ. పరిణయం బాది గృహమందు, వనమునందు,
బాల్యమందును, బిదప యౌవనమునందు,
శయన హేతు వనన్య సంశ్రయము నైన
రాముని భుజంబు సదుపబర్హంబు నీకు. 38.

సీత—(నిద్రనభినయించుచు) ఔను కలదిది, ఆర్యపుత్రా ! కలదిది. (నిద్రించును)

రామ—ఏమి? ప్రియభాషిణి వక్షమున నిద్రించె నే ? (చూచి స్నేహముతో)

సాధ్వసనిస్సృత = భయముచే బయలువెడలిన. సమ్మోహము = మూర్ఛ, విష విసర్పంబో = విషవ్యాప్తియో, క్లాంత = వాడిన రసాయనము = ఔషధము. ఉపబర్హము = దిండు,

చ. ఇది గృహలక్ష్మి; నేత్రముల కిద్ది సుధారసవర్తి; యీ సుఖ
ప్రద మగు దీని స్పర్శ మెయి సోఁకిన చందనసారపూరము; నీ
మృదుభుజ మీ గళంబున రహించెడు ముక్తావళి ప్రకాశము;
బెడద సెకి యేతదీయము రహింపదు దుస్సహమౌ వియోగమే. 39.

ప్రతీహారి—(ప్రవేశించి) దేవా! వచ్చెను.

రామ—ఓసీ! ఎవ్వరు?

ప్రతీ—దేవర సన్నిధాన సేవకుఁడగు దుర్ముఖుఁడు.

రామ—(తనలో) అంతఃపుర సంచారి దుర్ముఖుఁడా? పౌర జానపదుల భావసంవేదనమునకై పనిచియుంటిని. (ప్రకాశము) వచ్చుఁగాక!

ప్రతీ—(నిష్క్రమించును)

దుర్ము—(ప్రవేశించితనలో) హాహా! సీతాదేవిపై నసంభావ్యమైన యిట్టి జనాపవాదమును దేవర కెట్లు తెల్పుదును? మందభాగ్యమగు నాని యోగమిట్టిదే కదా!

సీత—(కలవరించుచు) హా! ఆర్యపుత్త్ర! సౌమ్యా! యెచ్చటనుంటివి?

రామ—ఓహో! చిత్రదర్శనంబున సంక్షోభకారియైన విరహభావన దేవికి స్వప్నోద్వేగమును గల్గించుచున్నది. (అనురాగముతో మేను నిమురుచు)

ఉ. ఎయ్యది ఖేదమోదముల నేకము; సర్వదశానుబద్ధమై;
యెయ్యెడ విశ్రమించు మన; మెండలిరక్తి జరానపాయమై;
* నెయ్యది యోలి లజ్జనశియింప ఘనప్రియమంబుఁ గాంచు; నా
నెయ్యపు జంటకున్ శుభము నిత్యము గోరఁబడుం గడంకతోన్. 40.

---

* "నెయ్యది ప్రేమ సారమయి యింపగు నావరణాత్యయంబున" నయిపద్యము నందలి మూఁడవచరణమునకు మారుదీనినిగూడఁ జదువుకొనవచ్చును. మూలమునందుఁ గల "ఆవరణాత్యయాత్" అను పదమునకు రెండర్థములుగలవు. ఆవరణము=అడ్డు. దీనిచేలజ్జస్ఫురించును. ఆవరణము యొక్క=అనఁగాలజ్జ యొక్క, అత్యయాత్=నాశము వలన, ప్రేమహెచ్చునని యొకయర్థము. రెండవది:—వరణమనఁగా వివాహము, ఆవరణమన వివాహము మొదలుకొని, అత్యయాత్=అంతమువఱకు, అనఁగామరణపర్యంతమా విడువని ప్రేమగలదియని. ఈరెండిటియందును మొదటియర్థమే యొక్కువ రసవంతమైనదని పెద్దలమతము. కావునదానినేపద్యమునందు వ్యక్తీకరించితిమి. పద్యాంతరమున శ్లేషకనువగు ఆవరణాత్యయము అనుమూలపాద భాగమునే ప్రయోగించితిమి.

దుర్ము—(సమీపించి) జయము దేవా !
రామ—తెల్పుము నీ వెఱింగినది.
దుర్ము—"రామభద్రునిచే మహారాజ దశరథుని మరచితి" మని పౌరజానపదులు దేవరం గొనియాడుచుండిరి.
రామ—అర్థవాదమిది. దోషమేమైనఁ దెల్పుము. దాని నివర్తించెదను.
దుర్ము—(కన్నీరుతో) దేవా ! వినుము. (కర్ణమున నిట్టిటు)
రామ—అహహా ! వాగ్వజ్రము తీవ్రాఘాతము. (మూర్ఛిల్లును.)
దుర్ము—దేవా ! ఊరడిల్లుము.
రామ—(ఊరడిలి)

గీ. అకట జానకి కన్య గేహప్రవాస
దోష మణఁగింపఁ బడియె నద్భుతపు విధుల
నదియె వెండియు దుర్విధిప్రాప్తి వలన
విరిసె నెల్లెడ నాలర్క విషము వోలె. 41.

కాన నిందు మందభాగ్యుండ నగు నేనేమి సేయుదును ? (విమర్శించి దైన్యముతో) ఇంకేమిగలదు ?

గీ శిష్టులకు నెట్టి కృత్యంబు చేత నైన
జనుల యిష్టానుసరణంబు సద్వ్రతంబు
నన్నుఁ బ్రాణంబులను వీఁడు నాదుజనకు
చేత నీ సద్వ్రతంబె పూజింపఁబడియె. 42

భగవంతుఁ డగు వసిష్ఠమౌనియు నిట్లే వార్తనంపె మఱియు.

గీ. భువనవరు లైన రవివంశ భూమిపతుల
సచ్చరిత్రంబు మిగుల నుజ్జ్వలిత మయ్యె
నందు వనుఁబట్టి కళ్మల్గంబౌ వదంతి
దొరలె నేని ! వ్యర్థుఁడ వినింద్యుండ నకట ! 4

హా ! దేవి ! పవన ధాత్రీతనూజా ! హా ! స్వజన్మానుగ్రహ పావనీకృత విశ్వంభరా ! హా ! నిమిజనకకులానందదాయిని ! హా ! పావక వసిష్ఠారుంధతీ స్తూయమానసద్వృత్త శాలినీ ! హా ! రామైకజీవితా ! హా ! దుర్గమారణ్య వాసప్రియసఖి హా ! హిత మిత భాషిణీ ! యిట్టిసికా యీ దశాపరిణామము.

ఆలర్కి=వెఱ్ఱికుక్కయొక్క, ఉజ్జ్వలితము=ప్రకాశమానము,

గీ. నీవలన విష్టపములెల్లఁ బావనములు
ప్రజల వాక్కులు నీయందపావనములు
నీవలన నాథవంతముల్ నిఖిలజగము
లీవనాథురాలవయి వాపోవుదింక. 44.

దుర్ముఖ! లక్ష్మణునితో నీ నవీన రాజు రాముఁ డాజ్ఞాపించుచున్నాఁడని తెల్పుము. (కర్ణముననిట్టిలు)

దుర్ము—పావక పరిపూతయు గర్భస్థిత పవిత్ర రఘుకుల సంతతియు నగు దేవియెడల దుర్జన వాక్యమున దేవరచే నీచందమున నేల నిర్ణయింపఁబడినది?

రామ—చాలు! పౌరజానపదు లెట్లు దుర్జనులు? చూడుము.

గీ. ప్రజల కభిమత మైన దిక్ష్వాకుకులము
విధివశంబున నపవాద బీజ మొదవె
నద్భుతపు శోధఁ జేసితి మంటి మేని
నమ్మ నెవ్వఁడు దూర వృత్తమ్ము మదిని? 45.

కావునఁ బోమ్ము—

దుర్ము—హా! దేవి! (నిష్క్రమించును)

రామ—హా! కష్టము! అతిఘోర మొనర్చు ఘాతుకుండ నైతిని. నేను—

ఉ. పిన్నటనాటఁగోలెఁ గడుఁ బ్రీతినిఁ బెంపుడు జెంది కూర్మిచే
భిన్నముగాని భావమునఁ జేర్మి వహించెడి దీనిఁ బన్నికం
బన్ని గృహంబునం బెనుచు పక్షిఁ బుళిందునకట్లు సౌహృదం
బెన్నక మృత్యువక్త్రమున కింక సమర్పణ మాచరించితిన్. 46.

కాన ముట్టరాని పాతకినైన నేను దేవి నపవిత్రపఱతునా యేమి?

(సీతశిరంబు నించుక యెత్తి బాహువుం దివిచి)

ఆ. చను మపూర్వ కర్మ చండాలుఁడను నన్ను
ముట్టకింక విడుము ముద్దురాల!
సంశ్రయించి తీవు చందన భ్రాంతిచే
విలయ హేతు వైన విషకుజంబు. 47.

విష్టపములు=జగములు, పుళిందుఁడు=కిరాతుఁడు, సౌహృదంబు=స్నేహము వక్త్రము=ముఖము, సంశ్రయించితి=ఆశ్రయించితివి. విలయ=ప్రాణాపాయమువలన.

అన్నా ! జీవలోక మిపుడు వ్యత్యస్త మయినది. రాముని జీవితఫలం బవసన్న మైనది. ఇప్పుడు జగంబు శూన్యంబై జీర్ణారణ్య మైనది. సంసారము నిస్సారము. కాయము కాష్ఠప్రాయము. అశరణుండ నైతిని. ఏమి చేయుదును ! ఏదిగతి ?

గీ. ఉమ్మలికము నెఱుంగఁ జేయుటకె రాము
నందుఁ జైతన్య మాగతం బయ్యె మరలఁ
బ్రాణములు మేన నిల్చి మర్మములఁ గలఁచి
వజ్రకీలంబు లటుల దుర్వహము లయ్యె. 48.

హా ! జననీ ! అరుంధతీ ! హా ! భగవంతులారా ! వసిష్ఠ విశ్వామిత్రులారా ! హా ! మహాత్మా ! పావక ! హా ! దేవీ ! భూతధాత్రి ! హా ! తండ్రీ ! జనక ! హా ! తండ్రీ ! హా ! మాతలారా ! హా ! మహాప్రకృతి ! లంకాపతీ ! విభీషణ ! హా ! ప్రియ మిత్ర ! సుగ్రీవ ! హా ! సౌమ్య ! మరున్నందన ! హా ! సఖీ ! త్రిజటా ! హతప్రాయుఁడగు రామునిచే మీరెల్లరుఁ దిరస్కరింపఁ బడితిరి; ఇపుడు వారిఁజీర నే నెవ్వండను ?

క. ఘను లమ్మహామహులు దు
ర్జనుఁడఁ గృతఘ్నుండ ననఁగఁ జను నాచే ని
య్యనువునఁ జీరంబడి యె
య్యనఁ గలుషీభూతు లౌదు రనుచుఁడలంతున్. 49.

చ. నను మదినమ్మి హృత్తటమునం బడి నిద్రిలుచున్న గేహల
క్ష్మిని, భయభావనాస్ఫురిత మేదుర గర్భ భరాలసం, బ్రియాం
గన, నిటులం ద్యజించి యనుకంప యొకింతయు లేక మానవా
శనులకు నేబలింబ లెనొసంగుచు నుంటిని క్రూరవృత్తితోన్. 50.

(సీత పాదముల శిరమును జేర్చి) దేవీ ! రాముని శిరంబు నీపాదపద్మముల ముట్టుట కిదియే కడసారి (ఏడ్చును-తెఱలో) అబ్రహ్మణ్య మబ్రహ్మణ్యము.

రామ—ఓహో ! తెల్పు మేమిది ? (మరలఁ దెఱలో

ఉమ్మలికము=దుఃఖము, కీలంబులు=మేకులు, చీరంబడి=పిలువంబడి, స్ఫురిత=చలించుచున్న, మేదుర=అతిశయమైన, అనుకంప=దయ, అబ్రహ్మణ్యము=అవధ్యుండను,

క. యమునా తీర నివాసులు
సమితోగ్ర తపఃప్రభావు లగు మౌనులు దు
ర్దమ లవణ త్రాసితులై
శ్రమమునఁ జనుదెంచి రీనె శరణం బనుచున్. 51.

రామ—ఆహా! యిప్పటికిని రాక్షస త్రాసమా? అట్లఁగాక! కుంభీనసీపుత్త్రుఁ డయిన యి దురాత్ముని సున్మూలింప శత్రుఘ్ను నంపెదను. (కొన్ని పదము లరిగి మరలఁ దిరిగి) హా! దేవీ! ఇట్లు పోయి యెట్లుగాఁగలవు? భగవతీ! విశ్వంభరా!

క. జనక రఘువంశ సంభవ
మనుజేంద్రుల యఖిలగోత్ర మంగళ మగు పా
వనశీల యైన యే సా
ధ్విని బుణ్యాధ్వరమునందు వెలయించితివో? 52.

అట్టి పవిత్రపుత్త్రికయైన జానకినవేక్షింపుము.

(నిష్క్రమించును.)

సీత—హా! సౌమ్య! ఆర్యపుత్త్ర! యెచ్చటనుంటివి? (వేగమున లేచి) కటకటా! దుస్స్వప్న వంచితనై యార్యపుత్త్ర శూన్యురాలినిగాఁ దలంచుచుంటిని. (పరికించి) అయ్యయో? నిద్రించుచున్న నన్నార్యపుత్త్రుఁ డొంటి విడిచి చనిగెను. ఇప్పు డికేమి? పోఁగాక! అతనిఁ గాంచుచు నాయంతనేను సమర్థకాదునేని యూతనిపై నాగ్రహింతును. సేవకుం డెవ్వఁ డిచ్చట?

దుర్ము—(ప్రవేశించి) దేవీ! "అరథంబు సిద్ధమైనది. దేవి యధిరోహించుఁగాక!" యని లక్ష్మణకుమారుండు విన్నవించుచున్నాఁడు.

సీత—ఇదిగో! అధిష్టించుచుంటిని, గర్భభారము స్ఫురింప నట్లున్నది. కాన మెల్లనఁ బోవుదము.

దుర్ము—దేవీ! యిట్టిటు.

సీత—రఘువంశదేవతలకు నమస్కారము, తపోధనులకు వందనము.

(అందఱు నిష్క్రమింతురు.)

చిత్రదర్శన మను ప్రథమాంకము.

సంపూర్ణము.

లవణత్రాసితులై=లవణాసురునిచే భయపెట్టఁబడినవారై, అవేక్షింపుము=కనిపెట్టుము. అధ్వరమునందు=యజ్ఞ (భూమియందు.)

ఆంధ్రీకృతోత్తరరామచరిత్రము.

:o:

ద్వితీయాంకము.

(తెఱలో) స్వాగతమా తపస్వినికి?

తాపసి—(పథికవేషముతోఁ బ్రవేశించి) ఓహో! ఈ వనదేవత ఫల కుసుమ పల్లవార్ఘ్యంబులతో నన్నుఁ జేరవచ్చుచున్నది.

వనదేవత—(ప్రవేశించి అర్ఘ్య మొసంగి).

ఉ. ఈవిపినంబు భోగ్యము యథేచ్ఛగ మీకు, శుభాహ మిద్ది, నా
కీవిధి సాధు సంగమన మెంతయుఁ బుణ్యమునన్ లభించు, వృ
క్షావళి నీడయైన, జలమైన, దశోవరభోజ్యమౌ ఫలం
బే? వనమూలమేని? వశమేగద సర్వము మీకు నియ్యెడన్. 1.

తాప—ఇందేమి తెల్పవలయును?

మ. ప్రియవాక్కాయికవృత్తియున్, వినయ దీప్తిం బొల్చు వాచాప్రవృ
త్తియు, భద్రపరిష్కృతిం దనర్చు మతియుం, దివ్యంపు సాంగత్య ర
క్తియుఁ, బ్రత్యక్ష పరోక్ష కాలముల నేకీభూత సారస్యముం
జయవెట్టన్ విలసిల్లు సజ్జన రహస్యం బచ్చు నిర్వ్యాజమై. 2.

(కూర్చుందురు)

వన—పూజ్యురాలి నామధేయమేమని తెలిసికొందును!

తాప—ఆర్యురాలా! ఆత్రేయిని!

వన—ఆర్యా! ఆత్రేయి! యిచ్చటి కెచ్చటినుండి వచ్చుచుంటివి? ఈ దండకారణ్యప్రచార మెందులకు?

అహము = దినము. ఏకీభూతము = ఒకటిగాఁజేయఁబడిన, నిర్వ్యాజమై = మిషలేనిదై.

ఆత్రే— గీ. వరలుదురు కుంభసంభవ ప్రముఖు లైన
పెక్కు రుద్గీథ వేత్త లీ చక్కటులను
వీరి సన్నిధి నిగమాంత విద్య నేర్వఁ
దిరుగు చుంటిని వాల్మీకి సరసనుండి. 3.

వన—అన్యమునులు సైతముఁ బురాణ బ్రహ్మవాదు లగు నా ప్రాచేతస స్వామిని నిగమాంతాధ్యయనంబున కై యుపాసించు చుండ నార్యురాలి కీ దీర్ఘ ప్రవాస క్లేశ మెందులకు ?

ఆత్రే—అచ్చట విశేష మగు నధ్యయనాంతరాయ మని దీర్ఘప్రవాస మంగీకరించితిని.

వన—అది యెద్ది ?

ఆత్రే—అమ్మహాత్మున కెద్దియో యొక దేవతా విశేషము సర్వవిధంబుల నద్భుతావహంబై స్తన్యత్యాగ వయస్సునం గలుగు నర్భక యుగ్మంబు నర్పించె. ఆయుగళ మొక్కఁ మునులకే కాదు తిర్యగ్భూతములకు సైత మంతరంగంబుల ద్రవింపఁ జేయుచుండె.

వన—వారి యభిధానంబు తెలియుదువా ?

ఆత్రే—"కుశ లవు" లని వారి యాహ్వయంబులును, తత్ప్రభావంబునుంగూడ, నా దేవతయే ప్రకాశించె.

వన—ప్రభావ మెట్టిది ?

ఆత్రే—వారికి సరహస్యంబు లయిన జృంభకాస్త్రంబు లాజన్మ సిద్ధము లఁట.

వన—ఓహో ! ఆశ్చర్యమిది.

ఆత్రే—భగవానుఁ డగు వాల్మీకిమౌనియు, వారి నుపమాతృ తుల్యముగాఁ బోషించుచు సంరక్షించుచుఁ జూడాకర్మ నాచరించి నిగమములు దక్కఁ దక్కిన విద్యల సావధానముగా నేర్పి పిమ్మట గర్భైకాదశ వత్సరంబున క్షాత్రకల్పముతో నుపనయనం బొనర్చి గురువులు త్రయీ విద్యం గఱపిరి. జాజ్వల్యమాన ప్రజ్ఞా మేధా విశేషులగు నా బాలకులతో సహాధ్యయనం బొనర్ప నస్మదాదులకు యోగము లేదు. ఏమన ?

ఉద్గీథవేత్తలు=సామవేదము తెలిసినవారు, అర్భకయుగ్మము = ఇరువురుబిడ్డలు, ఉపమాతృ=పెంపుడు తల్లి. త్రయీ = వేదము.

చ. మొనసి గురుండు ప్రాజ్ఞునకు మూర్ఖునకున్ సరివిద్య నేర్పు చో
క్కనికిని జ్ఞానశక్తి గలుగన్, నశియింపను గాని చేయఁ డా
జనులకుఁ బాండితీ కలనఁ జాల విభేదము గల్గు, బింబముం
గొనునెడ నచ్ఛ రత్నమునకుం దులఁ దూఁగునొకో మృదాదులున్. 4.

వన.—ఇదే! అధ్యయనాంతరాయము.

ఆత్రే.—ఇంకొకటిగూడఁ గలదు.

వన.—అదేది?

ఆత్రే.—పిదప నొకప్పు డా బ్రహ్మర్షి మధ్యాహ్న కాలమున దమసా తరంగిణిం జేరి యచ్చటం గవగూడి చరించు క్రౌంచంబులలో నొకటి కిరాతునిచే వధింపఁబడ నిరీక్షించి యాకస్మికావభాసరై యసంకీర్ణానుష్టుబ్రూప యగు వాగ్దేవిం బ్రకటించె.
* శ్లో॥ "మానిషాద! ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునా దేక మవధీః కామమోహితం" అని.

వన.—చిత్రము. ఆమ్నాయంబు గాక నూతనంబుగా ఛందస్సు లవతరించినవి.

ఆత్రే.—అయ్యెడ శబ్దబ్రహ్మావభాసకుం డగు భగవంతుని వల్మీకభవుని జేరి భగవంతుఁడగు భూతభావనుండు బద్మభవుం డిట్లనియె. "ఋషీంద్రా! వాగ్బ్రహ్మంబునం బ్రబుద్ధుండ వైతివి. కాన రామచరిత్రంబు నభివర్ణింపుము, నీ ప్రతిభాదృష్టియే యనుపహతంబైన దివ్యజ్యోతి యగును. ఆదికవి వైతివి." అని యంతర్హితుం డయ్యె. పిమ్మట భగవానుఁ డగు వల్మీకభవుఁడు మనుష్యలోకమున శబ్దబ్రహ్మమునకుఁ బ్రథమ పరిణామ మగు నట్టి రామాయణ మను నితిహాసమును రచించెను.

వన.—ఆహా! బ్రహ్మాండ మలంకరింపఁబడినది.

ఆత్రే.—కావుననే మహాంత మగు నధ్యయనాంతరాయ మని వచించితిని.

వన.—అది యుక్తము.

ఆత్రే.—విశ్రమించితిని. కల్యాణీ! యిప్పు డగస్త్యాశ్రమంబునకు మార్గంబుఁ దెల్పుము.

వన.—ఇటు పంచవటి ననుసరించి యీగోదావరీ తీరమున నరుగుడు పుగాక!

అవభాసరై = ప్రకాశముకలదిరై, అసంకీర్ణ = వాక్యదోషరహితమైన,
* గీ. కామమోహితమైనట్టి క్రౌంచమిథున । మందునొక దాని జంపితి వట్టిలోట । నోనిషాద! పెక్కేండ్లు నీవుర్వియందుఁ । బ్రాణములతోడ నుండఁగా వలదు సుమ్ము,
అనుపహతము = అడ్డులేని.

ఆత్రే—(కన్నీళ్ళతో) ఇది తపోవనమా ? ఇది పంచవటియా ? ఇది ప్రస్రవణాద్రియా ? జనస్థాన వనదేవతవు వాసంతివా నీవు ?

వాసం—అట్లే.

ఆత్రే—వత్సా ! జానకి:—

ఆ. ఇచటఁ గల్గు నీదు హితశాఖి వర్గంబు
లలిఁ గథాప్రసంగములఁ బ్రదృష్ట
మగుచు నామశేష వగు నిన్నుఁ బ్రత్యక్ష
పరణిఁ గాంచి నట్లె సలిపె మాకు. 5

వాసం—(భయమునఁ దనలో) నామశేష యని పల్కెనేమి? (ప్రకాశముగా) ఆర్యా జానకీదేవి కేమి యుపద్రవము ?

ఆత్రే—ఉపద్రవమే కాదు. అపవాదము సైతము. (కర్ణమున నిట్టిటు)

వాసం—అహహా ! దురదృష్ట నిర్ఘాత మతిదారుణము. (మూర్ఛిల్లును)

ఆత్రే—కల్యాణీ ! ఊరడిల్లు మూరడిల్లుము.

వాసం—హా ! ప్రియసఖీ ! మహాభాగ్యవతీ ! నీసృష్టిసౌభాగ్య మిట్లయ్యెనా ? రామభద్రా ! రామభద్ర ! నీతోనేమి ? ఆర్యా ! ఆత్రేయి ! పిదప నయ్యరణ్యమున విడిచి లక్ష్మణుఁడు మరలి పోవ జానకీ వృత్తాంతముం గూర్చి పరివృత్తి యేమైనఁ గల్గెనా ?

ఆత్రే—లేదు లేదు.

వాసం—హా ! కష్టము ! రఘురాజమందిరం బరుంధతీ వసిష్ఠులచేఁ బరిపాలింపఁ బడుచుండ వృద్ధరాజ్ఞీజనంబు జీవించియుండ నిది యెట్లు జరిగెను ?

ఆత్రే—అప్పుడు గురుజనము ఋశ్యశృంగాశ్రమంబున నుండెను. ఇప్పుడా ద్వాదశాబ్ద పరిమితంబైన యాగంబు సమాప్త మయ్యె. ఋశ్యశృంగమౌని పూజ గావించి గురుజనంబును సాగనంపె. పిదప భగవతి యరుంధతి "నేను వధూరహితమగు నయోధ్యకుం బోఁ జాల." నని చెప్పె. కౌసల్యాదు లదియే సమ్మతించిరి. దానం జేసి భగవంతుఁ డగు వసిష్ఠమౌని "వాల్మీకి తపోవనంబుఁ జేరి యచ్చట నివసింత" మని నిశ్చయించి పకాణించె.

వాసం—పిదప నిప్పు డాన్నృపుఁ డే మొనర్చుచుండెను ?

ప్రదృష్టము=అగపడినది, నిర్ఘాతము=పిడుగు.

ఆత్రే—అన్నృపుఁ డశ్వమేధ మారంభించెను.
వాసం—ఇస్సీ! వివాహము గూడనా?
ఆత్రే—లేదు లేదు. పాపము శాంతించుఁగాక!
వాసం—అట్లయిన యాగమున ధర్మపత్ని యేది?
ఆత్రే—హేమమయం బగు సీతాప్రతికృతి.
వాసం—అన్నా!

క. కులిశమునకన్నఁ దీక్ష్ణం
బులు, సుమమునకన్న మృదులములు, నగుచు నిలన్
వెలయు మహాత్ముల చిత్తం
బుల నెవ్వనికైనఁ దెలియఁ బోలునె తలఁపన్. 6.

ఆత్రే—వామదేవాభిమంత్రితం బైన యజ్ఞాశ్వంబు విసర్జింపఁ బడియె. దానికి విధి విహిత క్రమంబున రక్షక వర్గ మేర్పఱుపఁ బడియె. దాని కధీశుఁడై లక్ష్మణ కుమారుఁ డగు చంద్రకేతుఁడు దివ్యాస్త్ర సంప్రదాయము తోడను చతురంగ సేనతోడను బంపఁబడియె.

వాసం—(స్నేహానంద బాష్పములతో) కుమార లక్ష్మణునకుం గూడఁ బుత్త్రుఁడా? ఆహా! తల్లీ! బ్రదికితిని.

ఆత్రే—ఇంతలో నొక మహీసురుండు మృతుఁడైన పుత్త్రు నెత్తుకొని రాజద్వారమున గుండెలు మోదుకొనుచు "నబ్రహ్మణ్య" మని మొఱవెట్టెను. పిదప "రాజాపచారము లేక లోకుల కిట్టి యకాలమృత్యు వావేశింప" దని దయామయుం డగు రామభద్రుఁ డూహించుచుండ నశరీరవాణి గొబ్బున నిట్లావిర్భవించె

గీ. "భూతలంబున నిపుడు శంబూకుఁ డనఁగ
వృషలుఁ డొకఁడు తప మాచరించుచుండె
శిరము ఖండింప నర్హుఁ డన్నరుఁడు నీకు
రామ! వానిని ద్రుంచి విప్రసుతు మనుపు." 7.

ఇయ్యుపశ్రుతి నాలించి ఖడ్గహస్తుఁడై పుష్పక విమాన మధిష్ఠించి శూద్రతాపసాన్వేషణార్థమై జగద్విభుం డష్టదిక్కులం దిరుగఁ జొచ్చె.

కులిశము=వజ్రాయుధము, వృషలుఁడు=శూద్రుఁడు.

వాసం—శంబూకుఁ డనువాఁ డధోముఖుఁడై ధూమపాన మొనర్చుచు నీజనస్థానమున నే తపము సేయుచుండె. కాన మనరామభద్రుఁ డీకాననం బలంకరించుఁ గాఁ బోలు !

ఆత్రే—కల్యాణీ ! యింకఁ బోయెదను.

వాసం—పోఁగాక ! ఈదినము కఠోరముగా నున్నది. అల్లదే;—

మ. పులుఁగుల్ పట్టులఁ గాలఁ గీలుచును బుర్వుల్ ముక్కుల న్మెక్కఁ గ్రొ
క్కలఁ బారావత కుక్కుటంబులు తృషం గాసిల్లి ఘోషింప, నా
ఢుల నీడద్రుమముల్ తపోష్మమునఁ బట్టుల్ దప్పి మత్తద్విపం
బులు చెంచెక్కుల రాయ రాలు పువులం బూజించె గోదావరిన్. 8.

(నిష్క్రమించిరి.)

ఇది విష్కంభము.

(కరుణోద్యత ఖడ్గముతో రాముఁడు ప్రవేశించును.)

రామ—

చ. మగుడకుదక్షిణోద్ధకరమా! మృతభూసుర నందనుండు హా
చ్చుగఁ దెలివొంది నిల్చుటకు శూద్రముని న్గడతేర్పు మక్కటా !
వగ పొక యింత లేక కులభామిని గర్భవతిన్ వనావళిం
దిగిచిన రాము గాత్రమవు నీకు దయారస మేల కల్గునో ? 9.

(అతికష్టమున విసరి) రామునకుఁ దగిన కృత్య మాచరింపఁ బడినది. జీవించునా విప్రకుమారుఁడు ?

దివ్యపురుషుఁడు—(ప్రవేశించి) దేవా ! జయము జయము !—

చ. యముని వశంబునుండి యభయంబు నొసంగిన నీవు శాసక
త్వము వహియించుటన్ మనియె బ్రాహ్మణ నందనుఁ, డిట్టి వైభవం
బమరెను నాకు, శంబుకుఁడ నొఁదల మ్రొక్కెద నీ పదాంబుజ
న్మములకు, సజ్జనాప్త నిధనంబులు గూడఁ దరింపఁ జేయవే ? 10

కఠోరము=తీక్ష్ణము. తృష=దప్పి, నీడ= గూళ్లతోనున్న, ద్రుమముల్= వృక్షములు, తపోష్మమున=ఎండవేఁడిమిచే, ద్విపములు =ఏనుఁగులు. దక్షిణోద్ధకరా=ప్రసిద్ధమైన యొకుడిచేయీ ! గాత్రమవు= అవయవరూపమైనదానవు. పదాంబుజన్మములు=పాదపద్మములు. నిధనంబులు=చావులు.

రామ—రెండును మాకు హితములే, కాన నుగ్రతపంబునకుఁ దగిన ఫలం బనుభవింపుము.

గీ. ఎచట సుకృతంబుచే జనియించి నట్టి
విపుల మోద ప్రమోదముల్ వెలయుచుండు
నట్టి వైరాజలోకంబు లతుల దీప్తి
భరితములు గల్గు నీకు శాశ్వతము లగుచు. 11

శంబు—ఈ వైభవము దేవర పాదానుగ్రహ ఫలంబుగాని నా తపఃఫలంబుగాదు. అయినను తపంబు మహోపకారమే కావించెను.

చ. పొరి జగ మారయం దగిన భూతవిభుండవు నీవు శూద్రు న
న్నరయుచు నూరు యోజనము లాస్తమెయిం జనుదెంచు టెల్ల న
క్కజ మగు మత్తపః ఫలము గాదె? శ్రితావన! కాకయున్న ని
క్కరణి నయోధ్యనుండి నను గాంచుట యెక్కడ దండకాటవిన్? 12.

రామ—దండకారణ్యమా యిది? (కలయఁ గాంచి) ఔను—

ఉ. ఒక్కెడ నీల కోమలము, లొక్కెడ భీషణ జాంగలంబు లిం
కొక్కెడ నిర్ఝ రారవ మహోజ్జ్వల సర్వ దిశాముఖంబు, లీ
ప్రక్కలఁ దీర్థముల్, గిరులు, వాహిను, లాశ్రమ గర్భితాటవుల్,
నెక్కొనఁ బూర్వదృష్ట సరణిం గనుపట్టెడి దండకాస్థలుల్. 13.

శంబు—దండకారణ్యమే యిది. తొల్లి యిట నివసించు దేవరచే—

గీ. దారు ణాచారు లగు చతుర్దశ సహస్ర
దితిజాలును, ఖరదూషణ త్రిశిరు లనెడి
రాక్షస త్రయమును మహారణమునందుఁ
జంపఁ బడలేదె విక్రమోచ్ఛ్రయము మెఱయ? 14.

కావుననే సిద్ధక్షేత్ర మగు నీ జనస్థానమున మముబోటి భీరువులకుఁ గూడ నిర్భయ సంచారము లభించినది.

వైరాజలోకంబులు=ప్రకాశవంతములైనలోకములు. జాంగలంబులు=ఎడారులు, నిర్ఝరారవ= ప్రవాహధ్వనులు, పూర్వదృష్టసరణిన్=వెనుకఁజూచినరీతిని. చతుర్దశసహస్రదితిజాలు=పదునాలుగువేలరక్కసులు. విక్రమోచ్ఛ్రయము=పరాక్రమాతిశయము. భీరువులకు=పిరికివారికి.

రామ—దండకారణ్యమే కాక జనస్థానముఁ గూడనా?

శంబు—ఔను. సర్వభూత భయకరంబులు, నున్మత్త చండ శార్దూల కరాళ శైల కందరంబులు, నగు నీ జనస్థాన ప్రాంత గంభీర కాంతారంబులు దక్షిణ దిగంతంబు నావరించి యున్నవి. అల్లదే !

మ. ఒకచో నీరవ నిశ్చలంబు, లొకచో నుద్ఘుష్ట సత్త్వంబు, లిం
కొకచో స్వైర సుషుప్త ధీర రవ నాగోచ్ఛ్వాస దీప్తాగ్ను, లిం
కొకచోటం బ్రదరాంతర ప్రసర దల్పోదంబు లౌ సీమలం
గృకలాసంబులు తృష్ణవాహస నిదాఘేరమ్ములం గ్రోలెడున్. 15.

రామ— గీ. తొల్లి ఖరదైత్య నిలయమై తురగలించు
నీ జనస్థాన వనసీమ లెల్లఁ గనుచుఁ
దొంటి వృత్తాంతముల మహాద్భుత మెసంగ
ననుభవించుచు నుంటిఁ బ్రత్యక్ష సరణి. 16.

(అంతటఁగలయంజూచి) సర్వవిధంబులను జానకి యుపవనామోదిని ; అవియే కదా యీ కాంతారంబులు! ఇంతకన్న భయంకర మెయ్యది ? (కన్నీళ్లతో)

క. నిను గూడి మధుసుగంధిల
వనముల నివసింతు ననుచుఁ బర మామోదం
బున విహరించె సతీమణి
యను వగు దత్ప్రియమహిమ మట్టిది గాదే ? 17.

క. ఇంచుకయుఁ జేయకున్నను
ద్రుంచున్ సౌఖ్యములచేత దుఃఖము లెల్లం
బ్రాంచత్ప్రియజన మనఁగా
నెంచఁగ రా నట్టి ద్రవ్యమిల మనుజునకున్. 18.

కరాళ=భయంకరమైన, నీరవ=నిశ్శబ్దముగుటచే, ఉద్ఘుష్ట=ప్రచండమైన, సత్త్వంబులు = జంతువులు, స్వైరసుషుప్త = స్వేచ్ఛగా నిద్రించుచున్న, ధీరరవ = గంభీరధ్వనిగల, నాగ = పాములయొక్క, ఉచ్ఛ్వాసముచేత, దీప్తాగ్నులు=మండెడు అగ్నిహోత్రములు. ప్రదరాంతర = గుహలనుండి, ప్రసరత్ = పాఱుచున్న, అల్పోదంబులౌ = కొద్దినీరుగల, సీమలన్=ప్రదేశములందు, కృకలాసంబులు=తొండలు, తృష్ణన్=దాహముచే, వాహస=కొండచిలువలయొక్క, నిదాఘేరమ్ములన్ = చెమటనీటిని, గ్రోలెడున్, మధుసుగంధిల=పూఁదేనెచేఁబరిమళించు, ప్రణయ=ప్రేమయొక్క,

శంబు — కావున దురవగాహంబు లగు నీ గహనంబులం జూడ వలదు. మఱియు, సదమల నీలకంఠ కంఠ మంజుల ప్రభా భాసురంబు లగు భూధరంబులచే వ్యాప్తంబులై, నిరంత రాసిల విస్తృత చ్ఛాయా బాలతరు బృంద సుందరంబులై, నిర్భయానేక మృగ సంకులంబులై ప్రశాంతామిత పరిణాహంబు లగు నీ మధ్య మారణ్యముల మహాత్మా! కనుంగొనుము.

గీ. సమద విహగ నిలయ వేతస ప్రసూన
గంధి శీతల విమలోదకముల నలరి,
మంజు ఫల నీల జంబూ నికుంజ రుద్ధ
రయ రవంబులఁ బాఱు నిర్ఝరిణు లిచట. 19.

మఱియు —

గీ. గుహల నంబూకృతము సేయు కూనయెలుఁగు
ల నినదంబు ప్రతిధ్వనుల మితిమీఱె,
గజ దళిత కీర్ణ సల్లకీ గ్రంధి సార
సౌరభము రేగె శిశిర కషాయ కటుత. 20.

రామ — (కన్నీళ్ల నరికట్టి) భద్రా! నీమార్గములు శుభప్రదము లౌఁ గాక! పుణ్యలోక ప్రాప్తికై విమానంబు నధిరోహింపుము.

శంబు — పురాతన బ్రహ్మ వాది యగు నగస్త్య మౌని కభివందించి శాశ్వత స్థానముం జేరెదను. (నిష్క్రమించెను.)

దురవగాహంబులు = ప్రవేశింపశక్యము గానివి, గహనంబులు = వనములు, విస్తృత = విరివియైన, నీలకంఠ = నెమళ్ల యొక్క, పరిణాహంబులు = గంభీరములు.

సమద = మదించిన, విహగ = పక్షుల యొక్క, నిలయ = గూళ్ళుకల, వేతస = ప్రబ్బచెట్ల యొక్క, ప్రసూన = పూవులచేతను, గంధి = పరిమళించు, శీతల = చల్లనైన, విమల = స్వచ్ఛమయిన, మంజు = మృదువైన, ఫల = పండ్లచేత, నీల = నల్లనయిన, జంబూనికుంజ = నేరేడుపొదల చేత, రుద్ధ = అరికట్టఁబడిన, రయ = వేగము వలనఁగలుగు, రవంబుల = ధ్వనులతో, పాఱు = ప్రవహించు, నిర్ఝరిణులు = ప్రవాహములు.

అంబూకృతము = ఉమ్మి వేయుటవలనఁగలుగు ధ్వని. గజ = యేనుఁగుల చేత, దళిత = విరువఁబడిన, కీర్ణ = దట్టమయిన, సల్లకీ = అందుగుచెట్ల యొక్క, గ్రంధి = గణుపులనుండి వెడలిన, సార = రసము యొక్క, సౌరభము = పరిమళము, శిశిర = చల్లనిదియు, కషాయ = చేదయినదియు, కటుత = కారముగలదియునై, రేగెన్.

రామ— గీ. మున్ను జిరకాల మెందు గాపుర మొనర్చి
వన్య గృహమేధులము ధర్మపరుల మగుచు
నేము సంసార సుఖరసం బెఱింగినార
మట్టి వన మిప్డు వీక్షింప నయ్యె మరల. 21.

గీ. మొరయు నెమిళుల నొప్పు భూధరము లవియె!
పమద హరిణంబు లగు వనస్థలము లవియె!
మంజు వంజుల లతికా సమంచితములు
తరుణ నీప నిచుళ సరిత్తటము లవియె! 22.

క. జలధర మాలికవలె ద
వ్వులకుం బ్రస్రవణ దివ్య భూధర మదియే
తెలియంబడు; గోదావరి
యెలమిం బ్రవహించు నచటనే నిర్మలయై. 23.

చ. ఉరు వగు దీని శృంగమున నుండెడి జటాయువు; దాని క్రింద ను
స్థిరముగఁ బర్ణశాలల వసించితి మేమును; గౌతమీ పయ
స్స్ఫురిత వినీల రుగ్వితత భూరుహ శోభఁ దనర్చి పక్షవ
ద్విరుతములన్ ధ్వనించు వనవీథుల బంధురమైన సీమలన్. 24.

ఇచ్చటనే పంచవటి. ఇందుఁ జిరకాల ముండుటం బట్టి యీ ప్రదేశంబు లన్నియు వివిధ విస్రంభ విహారములకు సాక్షులై యున్నయవి. ప్రియురాలి ప్రాణసఖి వాసంతియు నిచ్చటఁ గలదు. కాన నిప్పుడీ రామహతకున కేమి కానున్నదో? ఇప్పుడు—

గృహమేధులము = గృహస్థులము.

మంజు = మృదువైన, వంజుల లతికా = ప్రబ్బలితీగలచే, సమంచితము = ఒప్పినవియు, తరుణ = లేతవగు, నీప = కడిమిచెట్లును, నిచుళ = ఎఱ్ఱగన్నేరుచెట్లునుగలిగిన సరిత్తటములు = ప్రవాహపుటొడ్లు. అవియే.

జలధరము = మేఘము. గౌతమి = గోదావరియొక్క, పయః = నీటిచేత, స్ఫురిత = కవల్పఁబడిన, వినీల = మిక్కిలినల్లనగు, రుక్ = కాంతిగలిగిన, వితత = విశాలమగు, భూరుహ = వృక్షములయొక్క, శోభఁదనర్చి, పక్షవత్ = పక్షులయొక్క, విరుతములన్ = కూజితములచే, విస్రంభ = ప్రణయసంబంధమగు.

మ. ఘన కాలంబునకుఁ ెమియి న్వారిసి తీక్ష్ణంబా విషం బట్లు, నూ
తన సంఘాతమునం జలించు వికటోద్య చ్ఛల్య ఖండంబు నా
గను, హృన్మర్మమునం బ్రభిన్న మగు నా గ్రంథివ్రణం బట్లు, ప్రా
క్తన శోకంబు నవీనమై మరల న న్గారించునుద్వేలతన్. 25.

అట్లయినను బూర్వ పరిచితంబు లగు ఈ భూభాగంబులం గనుంగొందును.
(పరికించి) ఓహో ! ధరణీసంస్థాన మెంత విపర్యస్తమైనది.

మ. తొలుతన్ వెల్లువయేడనో పులిన మందుం దోఁచె నివ్వాగులం,
దలవృక్షంబుల సాంద్రతా విరళతల్ వ్యత్యాసముం జెందె, నిం
దలి కానం జిరకాలమై కనుట నన్యం బట్లు గాన్పించె, ని
శ్చల శైలంబులచే నదే యిదని సాక్షా న్నిశ్చయం బయ్యెడిన్. 26.

అహో ! పరిత్యజించు చున్నను న న్నీ పంచవటీ స్నేహము బలవంతముగా నాకర్షించు నట్లున్నది. (దైన్యముతో)

చ. అల సతిఁ గూడి యే నెచట నాదినముల్ సుఖియించినాఁడ, మ
న్నిలయమునం దజస్రము యదీయకథల్ వితతంబు లయ్యెఁ, దో
య్యాలి నెడఁబాసి యొంటియగు నా దురితాత్ముఁడు రాముఁ డిప్పు డ
గ్గల మగు నట్టి పంచవటిఁ గాంచు నెటుల్ ? గనకేగు నెట్టులన్. 27.

శంబు—(ప్రవేశించి) దేవర జయించుఁగాక ! దేవా ! భగవానుఁ డగు నగస్త్య మౌని నావలనఁ దమ సన్నిధానమును విని, "వత్సల యగు లోపాముద్రయు నగస్త్యశ్రీమ వాను లందఱును విమానావతరణ మంగళం బాయత్త పఱచి నీకై నిరీక్షించియుండిరి. కాన విచ్చేసి మమ్ము మన్నింపుము. పిమ్మట జవనపుష్పకంబున స్వదేశమున కరిగి యశ్వమేధమునకు సన్నద్ధుండ వగుదువు" అని మాకాన తిచ్చె.

రామ—భగవదాజ్ఞ నిర్వర్తింతును.

శంబు—అట్లయిన దేవర పుష్పకము నిట్లు మరలించుఁగాక !

సంఘాతమునన్=దెబ్బచేత, చలించు=కదలు, వికట=వ్యత్యస్తమయిన, ఉద్యత్=అతిశయమయిన, శల్యఖండంబు=బాణముయొక్క తునుక. ప్రాక్తన=పురాతనమైన, ఉద్వేలతన్=అగ్గలమయి. గ్రంథివ్రణము=కంతివలెకఠినమైనవ్రణము.

వెల్లువ=ప్రవాహము, పులినము=ఇసుకతిన్నె. సాంద్రతావిరళతల్=దట్టము పలుచన. అజస్రము=ఎల్లప్పుడు, యదీయ=దేనిసంబంధమైన, వితతంబులు=వ్యాప్తములు

రామ—భగవతీ ! పంచవటీ ! శిష్టజనానుసరణంబున నిన్ను రాముఁడు క్షణమాత్ర మతిక్రమించుచుండె. సైరింపుము!

శంబు—దేవా ! చూడుము చూడుము !

మ. అల కుంజంబుల ఘూక ఘూత్కృతులు మెండౌ కీచకస్వానముల్
వోలయం గిమ్మనకుండు వాయసములం బొల్పారెఁ గ్రౌంచావతం;
బెలమిం గేరు నెమిళ్ల కేకలకు నెంతే జంకి వ్యాళంబు ల
గ్గలికం జుట్టెఁ బురాణ చందన తరు స్కంధంబులం దిగ్గిరిన్. 28

మ. అలవే ! దక్షిణ భూధరంబు లధిరూఢాంభోధరోద్యత్ప్రభా
కులశృంగంబులు; గందరోద్ధత నద ద్గోదావరీ తోయముల్,
కలితాన్యోన్య విఘాత సంకుల చల త్కల్లోల కోలాహలం
బు లివే ! భీమ గభీర వారి ఝరముల్; పుణ్యాపగా సంగముల్. 29

(అందఱు నిష్క్రమింతురు)

పంచవటీప్రవేశమను
ద్వితీయాంకము,
సంపూర్ణము.

కుంజంబులు = పొదరిండ్లు, ఘూక = గుడ్లగూబలయొక్క, ఘూత్కృతులు = ధ్వనులు, కీచకస్వానముల్ = బొంగు వెదుళ్ళధ్వనులు. వాయసములు = కాకులు, కేరు = సంతోషించు, వ్యాళములు = పాములు, స్కంధము = మ్రాను.

అధిరూఢ = అధిష్టించిన, అంభోధర = మేఘములయొక్క, ఉద్యత్ = అతిశయమాన, ప్రభా = కాంతిచేతను, ఆకుల = కూడుకొనిన, శృంగంబులు = శిఖరములు. కందర = గుహలనుండి, ఉద్ధత = బయలువెడలిన, నదత్ = ధ్వనిచేయుచున్న, గోదావరియొక్క, తోయముల్ = ఉదకములు కలిత = కూడుకొనిన, అన్యోన్య = పరస్పరమగు, విఘాత = తాకుడులచేత, సంకుల = వ్యాప్తమై, చలత్ = కదలుచున్న, కల్లోల = తరంగములయొక్క, కోలాహలంబులు = కలకలధ్వనులు, భీమ = భయంకరమైన, గభీర = లోతయిన, వారి = ఉదకముయొక్క, ఝరముల్ = ప్రవాహములు; పుణ్యా = పవిత్రమయిన, ఆపగా = నదులయొక్క, సంగముల్ = కలయికలు.

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

తృతీయాంకము.

(తమస, మురళ, అను నదీద్వయము ప్రవేశించును.)

తమ—సఖీ! మురళా! తొందర గలదానివలె నుంటివేమి?

ముర—భగవతీ! తమసా! తరంగిణీమణి యగు గోదావరి కెఱింగింప నగస్త్యభగవానుని సధర్మిణియగు లోపాముద్రచే నంపఁబడితిని. "ఎఱుఁగుదువుగదా! సతీపరిత్యాగము మొదలు."

క. వెలువడ నట్టి గభీరత
వలనన్ మది డాగియున్న బహుళ వ్యథచేఁ
గలఁగి పుటపాకగతి రా
జిలు రాముని కరుణ రసము జృంభిత మగుచున్. 1.

అట్టి యిష్టజనముం గష్టముల పాలుజేయుటం బట్టి ఘనీభవించిన దీర్ఘ శోకమున నిపుడు రామభద్రుండు మిగులఁ బరిక్షీణుఁ డయ్యె. వానిఁ గాంచి నా నెమ్మనంబు రియాడు చున్నట్లున్నది. ఇప్పుడు మరలి పోవు రామభద్రుండు పంచవటీ వనంబునఁ బ్రియా సహ విహార సాక్షులగు రమ్యప్రదేశములం దెప్పక చూడఁ గలఁడు. అందు స్వభావ ధీరుం డైనను రామభద్రున కిట్టి యవస్థ యం దతి విపుల శోకావేగ సంక్షోభంబున నడుగడుగున మహాప్రమాదంబు లూహింపఁ దగి యుండును. కావున భగవతీ! గోదావరీ! నీవు జాగరూకురాలవై యుండ వలయు.

జృంభితము=విస్తారము,

గీ. జలజ కేసర సురభులై జల లవముల
మలపు శీతల వీచికా మారుతములఁ
గొల్లలుగఁ జల్లి పెల్లు మూర్ఛిల్లు వేళ
రామభద్రుని జీవంబు నోము'' మనుచు. 2

తమ— యుక్తమే స్నేహమునకుఁ బ్రియజనాను వర్తనము. జీవనోపాయ మొమాత్రము ముఖ్యమయినదే యిపుడు తారసిల్లినది.

ముర— ఏమది ?

తమ— వినుము. తొల్లి వాల్మీకి తపోవన ప్రాంతమునఁ బరిత్యజించి లక్ష్మణుం డరుగ జానకీదేవి ప్రసవ వేదనాక్రాంత మగు దేహమును బ్రబల దుఃఖోద్వేగమున గంగాప్రవాహంబునం దర్పించె. అం దప్పుడే డింభక యుగ్మంబునుం గని భగవతు లగు ధరణీ భాగీరథులచే ననుగృహీతయై రసాతలంబునం జేర్పఁబడియె. పిదప జాహ్నవీదేవి స్తన్యత్యాగ ప్రాయమున నా డింభక ద్వయమును వాల్మీకిమౌనికిఁ దనయంత నర్పించినది.

ముర— (ఆశ్చర్యముతో)

క. ఏయెడ నీదృశ జనము స
హాయం బొనరించు నట్టి యనఘాత్ముల కా
నాయత దుర్దశయైనం
జేయుం బరమాద్భుతంబు జింతింపంగన్. 3.

తమ— ఇప్పు డీ శంబూకవృత్తాంతంబున జనస్థాన సమాగతుం డగు రామభద్రుని సరయూముఖంబున విని భగవతి యగు భాగీరథియుఁ బ్రేమమున లోపాముద్ర తెలంగుననే యూహించి సీతాసమేతయై యెద్దియో గృహాచార మిషంబున గోదావరిం జూడ నరుగుదెంచె.

ముర— ''రాజధానియం దుండి జగదభ్యుదయ బీజంబు లగు దత్త ప్రయోజనంబులం బ్రవర్తించు రామభద్రునకు వినోదంబు లేర్పడి యుండును. నిర్వ్యాపారుఁడై శోకమాత్ర సహాయుఁడైన వీనికిఁ బంచవటీ ప్రవేశము మహానర్థ'' మని భగవతి

జలజ=పద్మములయందలి, కేసర=కింజల్కములచే, సురభులై=పరిమళించునవియై. జలలవముల=నీటితుంపురులను, మలపు=మరలించు. డింభకయుగ్మము=ఇద్దఱు పిల్లలు. రసాతలమున=పాతాళమున, సమాగతుండగు=వచ్చిన.

తెన్నగా యోజించినది. కాని యిపుడు జానకీదేవిచే రామభద్రుఁ డెట్లాదరింపఁ బడును ?

తమ—ఇట్లు భగవతి భాగీరథి పల్కినది. "వత్సా ! యజ్ఞభూనందినీ ! సీతా ! ఇప్పు డాయుష్మంతు లగు కుశ లవులకు ద్వాదశ వర్ష సంఖ్యా బోధకం బగు మంగళ గ్రంధిని బంధింపఁబడును గాన నీపురాతన శ్వశురుండు, నిందనుకం గల మానవ రాజర్షి వంశమున కుత్పాదకుండును, గలుష సంహారకుండు నగు దేవుని భానుమంతుని స్వహస్తాపచితంబు లగు ప్రసూనంబుల నారాధింపుము. ధరణీతల చారిణి వగు నిన్ను మా ప్రభావంబున వనదేవతలు సయితముఁ గనుంగొనఁ జాలరు. మర్త్యులం బల్కనేల" ? అని మఱియు, "తమసా ! వధు వగు వత్స జానకి నీయెడలఁ బరమ ప్రేమ గలది. కాన నీవే దానికి సహచారిణివి గ" మ్మని నాకాన తిచ్చె. ఇప్పుడామె యాజ్ఞ ననుసరింతును.

ముర—నేనీ వృత్తాంతమును లోపాముద్రతో నివేదింతును. రామభద్రుండు నేతెంచె నని యే తలంతును.

తమ—ఇదే ! గోదావరీ హ్రదంబునం బయలుదేరి—

గీ. ఎల్లెడల వెల్లనై చిక్కి గల్లములును,
జెదరు కురులను బొదలాడు వదన మొదవఁ,
గరుణ మూర్తియొ ? మెయిదాల్చు విరహభరమొ ?
నాగ జనకేంద్ర పుత్త్రి కాననముఁ జేరె. 4.

ముర—ఇదిగో !

చ. హృదయ సుమంబు వాడునటు లేచెడు దారుణ దీర్ఘ శోక మిం
పొదవెడు వృంతముం దొలఁగి యున్న ప్రవాళముఁ బోలె నెండి వె
ల్లదనము నొందు దీని మెయి గ్లాని వహింపఁగఁ జేయుచుండె, భం
గద మగు శారదోష్మమిల కైతక గర్భ దళంబు పోలికన్. 5.

(పరిక్రమించి నిష్క్రమించిరి.)

విష్కంభము.

పురాతనశ్వశురుండు=వృద్ధుఁడగుమామ, ఉత్పాదకుఁడు=కారణభూతుఁడు. భానుమంతుని= సూర్యుని, అపచితంబులగు= కోయఁబడిన, వధువు=కోడలు, నివేదింతును=చెప్పెదను, గల్లములు=చెక్కిళ్లు, గ్లాని=కృశత్వము, శారదోష్మము= శరత్కాలపు వేఁడిమి, కైతకగర్భదళము=మొగలిపొత్తిలోనిరేకు. ప్రవాళము=చిగురు

(తెఱలో) "ప్రమాదము ప్రమాదము.

పుష్పములఁ గోయుచుఁ గరు ణౌత్సుక్యములతో వినుచు సీత ప్రవేశించును.

సీత—ఓహో ! యెఱుంగుదును. నాప్రియసఖి వాసంతి పలుకుచున్నది.

(మరలఁ దెఱలో)

వ. "అవనిజ సల్లకీ కిసలయంబులఁ గేల నొసంగ లోలతం
జవిగొని ప్రోల నే ద్విరద శాబము మున్ను ప్రవృద్ధిఁ జెందెనో"?

సీత—దానికేమి?—

(మరలఁ దెఱలో)

"కవగొని కాంతతోడ జలకంబు లొనర్చుచు నుండ దాని బల్
జవమున నొక్కఁ కుంజర లలామ మెదుర్కొనెఁ జెంత నుద్ధతిన్. 6

సీత—(తొందరతోఁ గొన్ని యడుగులు నడిచి) ఆర్యపుత్రా ! నాపుత్రకునిరక్షింపు రక్షింపు. (స్మృతినభినయించి దైన్యముతో) కటకటా ! చిరపరిచితంబు లగు నయ్యక్షరంబులే పంచవటీ దర్శనంబుచే మరల మందభాగ్యురాల నగు నన్ననుసరించు చున్నవి.—హా ! ఆర్యపుత్రా ! —(మూర్ఛిల్లును.)

తమస—(ప్రవేశించి) వత్సా ! ఊరడిల్లు మూరడిల్లుము.

(తెఱలో) "విమాన రాజమా ! యిచ్చటనే నిల్వుము."

సీత—(ఊరడిల్లి భయోల్లాసములతో) ఓహో! జలభర వలాహక రణిత గంభీర పీవరం బైన యీ భారతీ నినాద మెచ్చటిది ! (శ్రవణ వివరంబులం జొచ్చి) మందభాగ్యురాల నగు నన్ను గూడ గొబ్బున నూరడించు చున్నది.

తమ—(స్నేహ బాష్పములతో) ఓవత్సా !

క. ఎచ్చటి నుండియొ కలరూ
పచ్చుపడక వచ్చు నినద మందున నిట్లే
వెచ్చగు గర్జకు నెమ్మిలి
మచ్చున నౌత్సుక్య భీతి మరగెద వేమే ?

ఔత్సుక్యము = సంతోషము, సల్లకీకిసలయంబుల = అందుగుచిగుళ్ళను, లోలతన్ = ఆసచే, ద్విరదశాబము = పిల్లయేనుఁగు, కుంజరలలామము = శ్రేష్ఠమైనయేనుఁగు, జలభర = నీటితోనిండిన, వలాహక = మేఘమువలె, రణిత = ధ్వనిచేయుచున్న గంభీరమైన—పీవరంబైన = బలిసిన్న, భారతీనినాదము = వాగ్ధ్వని, గర్జకునెమ్మిలి మచ్చున = ఉఱుము వినిన నెమలివలె,

సీత—భగవతీ ! అస్ఫుటం బనెద వేమి ? ఈ స్వరశైలి నే నెఱుంగుదును. ఆర్యపుత్తుఁడె పలుకుచున్నాఁడు.

తమ—"తపస్వి యగు శూద్రుని దండింప నైక్ష్వాకభూపతి జనస్థానమున కేతెంచె" నని వింటిని.

సీత—సంతోషము ! ఆరాజు రాజధర్మముం బరిత్యజింప లేదుగదా !

(తెఱలో)

ఉ. "ఏ వలనన్ మృగద్రుమము లెల్లను నాహిత బంధు వర్గమా ?
నే వలనం బ్రియం గలిసి యేండ్లకొలంది వసించినాఁడ ? నా
నావిధ నిర్ఝరంబులఁ గనంబడి, కందర రాజి నొప్పి, గో
దావరిపొంత నున్న వసుధాధర రమ్య తటంబు లివ్వియే ! 3

సీత—హా ! యెట్లు ప్రత్యూషేందు మండ లాపాండురంబై పరిక్షీణ దుర్బలం బగు నాకారంబు గల్గి గంభీర ప్రభావ మాత్రంబుచేఁ బ్రత్యభిజ్ఞాతుఁ డగు నార్యపుత్త్రుఁడే; కాన నన్నాదుకొనుము. (తమసం గౌఁగిలించి మూర్ఛిల్లును)

తమ—(పట్టుకొనుచు) వత్సా ! ఊరడిల్లు మూరడిల్లుము.

(తెఱలో) "ఈ పంచవటీ దర్శనంబున—

గీ. హృత్తలంబున లీనమై యిప్పుడు పరిబల
మగుచు జ్వలియింపఁ బోవు దుఃఖాగ్ని నొదుపు
ధూమ విసరంబు వోలె నుద్దామభంగి
నావరించుచు నుండె మోహంబు నన్ను. 9

హా ! ప్రేయసీ ! జానకీ !

తమ—(తనలో) ఇదియే గురుజనం బూహించినది.

సీత—(ఊరడిల్లి) హా ! యెట్లిది

(తెఱలో) "హా ! దేవి ! దండకారణ్య వాస ప్రియసఖి ! విదేహరాజపుత్త్రి !"

(మూర్ఛిల్లును.)

ఏవలనన్ = ఎచ్చట, మృగద్రుమములు = మృగములు, చెట్లు, ఆహితబంధువర్గమా = బంధుసముదాయముగాఁ జేయఁబడెనో ? నిర్ఝరంబులన్ = ప్రవాహములను, కందరరాజిన్ = గుహాసముదాయముచే, ప్రత్యూష = ప్రాతఃకాలమందయిన, ఇందుమండలము = చంద్రబింబము, ఆపాండురంబయి = తెల్లబడి, ఒదుపు = కప్పు.

సీత—ఇస్సీ! మందభాగ్య నగు నన్నుచ్చరించి నిమీలిత నేత్రోత్పలుండై యార్య పుత్త్రుండు మూర్ఛిల్లె. హా! యెట్లు! భూతలంబున నుత్సాహంబు దక్కి దుస్సహంబుగా నొరగి పడియె. భగవతీ! తమసా! రక్షింపు రక్షింపు. ఆర్యపుత్త్రుని బ్రదికింపుము.

(పాదముల నొరఁగును.)

తమ— క. బ్రతికింపుము నీవె జగ
త్పతి నో కల్యాణి! నీదుపాణితలంబే
హితసంస్పర్శం బగు; జీ
విత లాభము గల్గు దాన వినియత భంగిన్. 10

సీత—ఏమయిన నగుఁ గాక! భగవతి పల్కినట్లే చేయుదును.

(తొందరతో నిష్క్రమించును.)

(పిదప భూపతితుఁడై సబాష్పయగు సీతచే స్పృశింపఁబడి సంతోషధైర్యములతో, రాముఁడు ప్రవేశించును)

సీత—(సంతోషముతోఁ దనలో) త్రైలోక్య నాథుని జీవితము మరల వచ్చినది.

రామ—ఓహో! యేమిది?

చ. వర హరిచందనాభినవ పల్లవ జాత రస ప్రలేపమో?
సురుచిర పీడితేందుకర సుందర కందల సారసేకమో?
ఖరతర తప్త జీవిత నగంబునకుం బరితృప్తి గల్గ భా
స్వర పరజీవ నౌషధి రసంబు మదాత్మ నిషిక్త మయ్యెనో? 11

గీ. సత్య మా పూర్వపరిచిత స్పర్శ మిదియె,
చిత్త పరిమోహణంబు, సంజీవనంబు,
ప్రబల సంతాప జనిత మూర్ఛ నిపుడడఁచి,
మరల నానంద వివశత్వ ముదుపడించె. 12.

సీత—భయ దైన్యములతో నించుక వెనుక తగ్గి ఇప్పుడు నా కింత మాత్రమే మహాతరము.

నిమీలిత=మూసికొనిన, పీడిత=పిండఁబడిన, కందల=మొలక, సేకము=చల్లుట, ఖరతర=మిక్కిలి తీవ్రముగా, నగంబు=చెట్టు, నిషిక్తమయ్యెనో=చల్లఁబడెనో.

రామ—(కూర్చుండి) వత్సల యగు జానకీదేవిచే ననుగ్రహింపఁ బడుదునుగదా?

సీత—కటకటా! ఆర్యపుత్త్రుఁ డున న్నెల వెదకుచుండెను?

రామ—ఔఁగాక! పరికింతును.

సీత—భగవతీ! తమసా! మరలిపోవుదము. నన్ను జూచునేని యసమ్మతి—సాన్ని

ధ్యంబున మహారాజు నాయందు మిగుల నాగ్రహింపఁ గలఁడు.

తమ—ఓవత్సా! భాగీరథీప్రభావంబున వనదేవతలకు (సైతము) నదృశ్యురాల వైతివి.

సీత—ఔను, కలదిది.

రామ—ప్రియసీ! జానకీ!

సీత—(దైన్య గద్గదస్వరములతో) ఆర్యపుత్త్రా! యీ వృత్తాంతమున కీ వచన మసమంజసము గదా! (కన్నీళ్లతో) మందభాగ్యురాల నగు నన్నిట్లు వాత్సల్యముతోఁ బిలుచు జన్మాంతర సంభావిత దుర్లభ దర్శనుం డగు నార్యపుత్త్రునియందు దయలేక వజ్రమయురాల నెట్లగుదును? నా హృదయ మింతంత నిత్తని హృదయ మేను నెఱుంగుదును.

రామ—(కలయఁ జూచి నిర్వేదముతో) హా! యిట్లు? ఇచ్చట నెవ్వరును లేరు.

సీత—భగవతీ! తమసా! అట్లు నిర్హేతుకంబుగాఁ బరిత్యజించినను భీనియిట్టి సందర్శనంబున నాహృదయ మెంతనుబంధ మెట్టిదో నే నెఱుఁగఁ జాలనుంటిని.

తమ—ఎఱుంగుదును వత్సా! యెఱుంగుదును.

శా. ఆలాపా కాసేలటస్థమై, యుపక్రీతి హారిప్తిక రుహా బద్ధమై,
గ్లానిన్ దీర్ఘవియోగ మొందియు, హా! తాదృశైక్య సంతుష్టమై,
ధీసౌమ్యత్వమునం బ్రసన్న మయి, భర్త్రుక్లాంతి విక్లాంతమై,
వాసిం బ్రేమ గరంగిన ట్లెసఁగె నీ స్వాంతంబు దా నింతలోన్. 13.

రామ—దేవి!

గీ. స్నేహ రస శీతలం బగు నీదు స్పర్శ
తనువు దాల్చిన సుప్రసాదంబు వోలె
మించి నన్నిప్పటికిని జొక్కించు చుండె
ముదితరో యెందు నీవు కన్పొరగినావు? 14.

రుషా=రోషము. భర్తృకాంతివిక్లాంతమై = భర్తయొక్క విచారమువలన ఖేదము నందుచున్నదై.

సీత—సాకల్యసందర్శిత ప్రేమానుబంధంబులై యానందంబుఁ జిందు నీ యార్యపుత్త్ర సల్లాపములు వినుచుంటిని. ఇందలి విశ్వాసంబున నిర్హేతుక పరిత్యాగ పీడితంబై నను నా జననంబు బహూకృతం బైనది.

రామ—ఎక్కడి ప్రేయసి? ఇది నిక్కముగ రామభద్రునకు వృత్తిపరంపరా సంపాదితం బగు కేవల భ్రాంతి.

(తెఱలో) "ప్రమాదము. ప్రమాదము."

చ. అవనిజ పల్లకీ కిసలయంబుల—(పూర్వార్ధము వినఁబడును.)

రామ—(కరుణౌత్సుక్యములతో) ఆ శాబమున కేమి ?

(మరలఁదెఱలో) "కవగొని కాంతతోడ—(ఉత్తరార్ధము వినఁబడును)

సీత—దాని నెవ్వ రెదుర్కొందురు ?

రామ—ఏడ నా దుష్టమృగము ? వధూ సహచారి యగు ప్రియాపుత్త్రికుని బరాభవించు న దెయ్యది? (లేచును)

వాసం—(తొందరతోఁ బ్రవేశించి) ఏమీ ? రఘుస్వామియా ?

సీత—ఏమీ ? నా ప్రియ సఖి వాసంతియా ?

వాసం—దేవా ! జయము.

రామ—(నిరూపించి) ఏమీ ? దేవీ ప్రియసఖి వాసంతియా ?

వాసం—దేవా ! త్వరపడుము త్వరపడుము. ఇటు జటాయు శిఖరంబునకు దక్షిణంబగు సీతాతీర్థంబున గోదావరి నవతరించి దేవీపుత్త్రికుని బరిరక్షింపుము.

సీత—హా ! తండ్రీ ! జటాయూ ! ఇప్పుడు నీవు లేమి జనస్థాన మెల్ల శూన్యమయినది.

రామ—అహహా ! ఈ కథా ప్రసంగములు హృదయ మర్మముల భేదించుచున్నవి గదా ! .

వాసం—దేవా ! యిట్టిటు.

సీత—భగవతీ ! నిక్కముగ వనదేవతలు సైతము నన్ను గాంచుట లేదు.

తమ—ఓవత్సా ! జాహ్నవీదేవి ప్రభావము సర్వ దేవతల కన్న నుత్కృష్ట మైనది. నీ కీ సందియం బేల ?

వృత్తిపరంపర=సంకల్పపరంపర, వధూసహచారి=ఆఁడు ఏనుఁగుతోఁ గూడియుండు, ప్రియాపుత్త్రికుని = సీతకు సంతానతుల్యమగు నేనుఁగును.

సీత—అట్లయిన ననుసరింతము. (పరిక్రమింతురు.)

రామ—(పరిక్రమించి) భగవతీ! గోదావరీ! నీకు నమస్కారము.

వాసం—(చూచి) దేవా! విజయశాలియు వధూసహాయుడు నగు దేవీ పుత్రకుని గాంచి యానందింపుము.

రామ—ఆయుష్మంతుఁడు జయించుఁ గాక!

సీత—ఓహో! యిది యింతటి దైనది.

రామ—దేవీ! వర్ధిల్లుచుంటివి. సంతోషము!

చ. లలిత మృణాళి పల్లవ విలాస రదాంకురుఁ డౌచు నీదు వీ
నుల లవలీ ప్రవాళము వినోదమునం గొను నీ సుతుండు బల్
చెలువున మత్తవారణ విజేతయు యౌవన రాజ్య పూజ్య మం
గళ విధికిన్ శుభాంగిరో! ఘనంబుగ భాజనమయ్యె నేటికిన్. 15.

సీత—ప్రసన్న దర్శన యగు నిక్కాంతతో నిప్పుడీ దీర్ఘాయువు వేఱ బాయకుండుఁ గాత!

రామ—సఖీ! వాసంతీ! చూడుము. చూడుము. ఈ వత్సచేఁ గాంతానుసరణ నైపుణ్య మభ్యసింపఁ బడిన ట్లున్నది.

చ. లలిత మృణాళి నాళ కబళంబులఁ గైకొన విచ్చు పుష్కరం
బుల గల గంధతోయములఁ బుక్కిళులం గొని మేనఁ దుంపురుల్
జిలుకుచుఁ జల్లులాడి, కడుఁ జెల్మి దలిర్ప నవక్ర దండ ని
శ్చల మగు నబ్జినీదళము ఛత్రము బట్టె విరామ వేళలన్. 16.

సీత—భగవతీ! తమసా! యిది యింతటి దైనది. ఇంతలో నా కుశలవు లెట్లుండిరో యెఱుంగను?

తమ—ఇది యెంతటిదో వారు నంతటివారే.

సీత—నేను మిగుల మందభాగ్యురాలను. ఆర్యపుత్ర విరహమే కాక పుత్ర విరహము గూడ నాకు సంభవమైనది.

తమ—భవితవ్య మిట్టిది.

రదాంకురుఁడౌచు = మొలకదంతములు కలవాఁడై, లవలీప్రవాళము=లవలీలత యొక్క పల్లవము, పుష్కరంబులు = తెల్లతామరయునియు, గజతుండాగ్రమనియు, రెండర్థములుంగూడనగును. తోయములు = ఉదకములు, అవక్రదండ = తిన్ననికాడగల, అబ్జినీదళము=తామరాకు, విరామవేళలన్ = విశ్రాంతియందు,

సీత—నాకుసంతానము కలిగిన పర్యాప్తజనన్మెల్మి? ఈషద్విరళకోమలంబులగు దశనంబుల వెలుంగు కపోలంబులను, నిరంతర మధుర కలహాసంబులను, నిబద్ధ కాకపక్షంబులను, రాజిల్లు నాకుమారకుల నిర్మల ముఖాబ్జముల (నార్యపుత్త్రుం) డు ముద్దుఁ గొనఁడయ్యె.

తమ—కానుఁగాక ! దేవతానుగ్రహంబున.

సీత—భగవతీ ! తమసా ! యీ పుత్త్ర స్మరణంబున నుబ్బన్నుత్తస్తనినైతి పిత్రు సాన్నిధ్యమున క్షణమాత్ర గేహినినైయుంటిని.

తమ—ఇందేమి పల్కవలయు? సంతానము స్నేహంబునకుఁ బరమసీమయు, జననీజనకులకు విశ్లేషమ్ముగ నిత్తరేతర సంధాయకంబునుంగదా !

గీ. సతుచ్ఛవన్తు ర్వాగ సన్మేళనంబువలన
దంపతుల యంతరంగ తత్వంబునందు
గల్గు నొండొకరి ప్రేమ్మ ద్రిగ్రంథి గాఁగ
దవిలి నిర్మింపఁ బడియె సంతతి యనంగ. 17.

వాసంతి—దేవా ! యిట్లు చూడుఁడు జనాధ్యము.

గీ. అభిన వోజ్జ్వల లోల బర్హంబులతోడ్తో
దా త్తమదతాండవ ప్రోత్సవాంతంబునందు
మణికిరీటంబువలె వృథదంభమునకుఁ దరుశాఖ
గూడి యాలకించెడి యెమ్మెలు నెమ్మిపిల్లలతోడఁ బొలుపారె. 18.

సీత—(ఆనంద బాష్పములతో) అదియిదియె.

రామ—ఆనందింపుము వత్సా ! ఆనందింపుము.

సీత—ఔఁగాక !

రామ—

చటుల భ్రమణంబులం బుట్టుకాంతర తృవి వృత్తిత్వప్రాప్తికిఁ దూగాడుచు కంచెఁ
బొమల మనోజ్ఞ నృత్యముల భూషణమున్ ఘటియించుచు తాండవించేఁ.

దశనంబులు=దంతములు, కపోలములు=చెక్కిళ్లు, కాకపక్షములు=జునపాలు, నిబంధము=వ్యాప్తిఁ బొందింపఁబడు, పద్మగంధి=తనరించిమనుముడి, ఉచ్ఛృంఖల=చలించుచున్న చక్రాకార భ్రమణములనే=మండలాకారనాట్యములయందు, పుటపాకతర=ఉప్పలలావల, ఆవర్తిత=త్రిప్పఁబడుచున్న.

దమి మృదు హస్తతాళములఁ దాండవితంబు బన్నినన్ను వత్సల
త్వమునఁ గుమారునిం బలె నెదం దలపోయుచు నుంటి నెంతయున్. 19.

ఆహా! తిర్యగ్జంతువులు సైతము పరిచయంబును స్మరించుచున్నవి.

గీ. పరిమిత సుమోద్గమంబునఁ బరిఢవిల్లి
యే కదంబంబు దయితచే వృద్ధిఁ గనెనొ?

సీత—(కన్నీటితో) ఆర్యపుత్రుఁ డెట్లు గుర్తించె.

రామ— దాని స్వజనంబుఁ బోలె మోదమునఁ గనుచు
జానకిఁ దలంచుచున్న దీ శైలబరి. 20.

వాసం—దేవా! యిటఁ గూర్చుండుము.

గీ. కదళికా వనాంతరమునఁ గాంతతోడ
లంగు నీదగు శయ్యా శిలాతల మిదె!
భూమి సుత యిందు నివసించి గపూర్తి నిడుటఁ
బాసి పోవయ్యె హరిణ శాబములగములు. 21.

రామ—దీనిని మాత్రము గనుఁగొనఁ జాలను. వేడ్కచు మఱియొక చోటఁ గూర్చుం
డుదును.

సీత—సఖీ! వాసంతీ! ఆర్యపుత్రునకు నాకు నీ ప్రదేశముఁ జూపి యేమి గావించితి
వి! కటకటా! అతఁడే యార్యపుత్రుఁడు; అదే పంచవటీవనము; అదే ప్రియ
సఖి వాసంతి; అవియే వివిధ విస్రంభ సాక్షులగు గోదావరీ వన ప్రాంతములు;
అవియే పుత్త్ర ప్రాయములగు మృగ పక్షి పాదపములు; దురదృష్టవతినగు
నాకు మాత్ర మీ సమస్తము దృశ్యమగుచున్నను లేనివే. కావున జీవలోక ప్రకృ
తివ్యత్యయ మిట్టిదే గదా!

వాసం—సఖీ! జానకీ! రాముని దురవస్థ గనుంగొన వేమి?

చ. కువలయ పత్ర రాజి మెఱుఁగులఁ గల గాత్రములన్ విలోచనో
త్సవము సతంబొసంగియు లసన్నవ మాధురి గొల్పుచుండు నీ

తాండవితంబవు=నృత్యము చేయింపఁబడిన దానవగు, ఉద్గమము=పుట్టుక, కొత్త
లేన, దయిత=ప్రియురాలు (సీత), శైలబరి=కొండనెమలి, శయ్యాశిలాతలము=
పడకరాయి, పూర్తి=గడ్డి, శాబములు=పిల్లలు, పాదపములు=వృక్షములు, (ప్రకృతి)
వ్యత్యయము=స్వభావవైపరీత్యము.

ధవుఁడు వెతం గృశించి, యవదాత రుచిం గని, విక్లబాంగుఁడై,
యవియుట నెట్టకేనిఁ దెలియంబడియున్ నయ నాభిరాముఁడౌ. 22.

సీత—చూచుచుంటిని సఖీ! చూచుచుంటిని.

తమ—దయితుని సదా కాంచు చుందువుగాక!

సీత—హా! దైవమా! ఇతఁడు నన్నును నే నితనిని విడుతు మని యెవ్వ రెఱుంగుదురు? కానజన్మాంతరంబునుండియుం బోలె సందర్శించుచున్న నేనువత్సలుండగు నార్యపుత్త్రుని బాష్పాంతరకాలముల ముహూర్త మాత్ర మైనం బరికింతును. (అత్యాదరముతోఁ జూచుచుండును)

తమ—(స్నేహబాష్పములతోఁ గౌఁగిలించి)

గీ. మోద ఖేదంబులను వెల్లి బూను బాష్ప
ధారఁ గొల్పుచు ప్రేమ నుత్తాన దీర్ఘ
మైన నీచూడ్కి ప్రాణేశు నర్థిఁ దడిపె
బహుళ సిత ముగ్ధ దుగ్ధస్రవంతి వోలె. 23.

వాసం—

చ. ఫల కుసుమార్ఘ్యమున్ విటపి వర్గ మొసంగెడుగాత! వికస్వర
జ్జలజ మరంద గంధములఁ జల్లి మరుత్తతి వీచుఁగాత! బ
త్త్రులు సతతోత్సుకత్వ మొనగూడఁ గలధ్వను లిచ్చుఁగాత! ఇం
పలరఁగ రాముఁ డివ్వనిఁ దనంతనె చేరఁగ వచ్చెఁ గమ్మఱన్. 24.

రామ—సఖీ! వాసంతీ! యిటఁ గూర్చుండుము.

వాసం—(కూర్చుండి కన్నీళ్లతో) మహారాజా! లక్ష్మణ కుమారునకుఁ గుశలమా?

రామ—(వినమి నభినయించి)

గీ. పాణితల దత్త నీర నీవార కుశలఁ
దరుణి పెంచిన తరు పక్షి హరిణకములఁ
గాంచఁ బ్రస్తరోద్భేదయోగ్యరసము వలె
హృదయము గరంచు వికృతి యొండొదవె నాకు. 25.

అవదాతరుచి=తెలుపుకాంతి, విక్లబాంగుఁడై=చిక్కినయవయవములు కలవాఁడై, ఉత్తానదీర్ఘము=దీర్ఘముగాఁ బ్రసరింపఁజేయఁబడిన, దుగ్ధస్రవంతి=పాలకాలువ, విటపివర్గము=వృక్షసమూహము, మరుత్తతి=గాలియొక్క సముదాయము, ప్రస్తరోద్భేదయోగ్యరసము=ఱాళ్లనుబగులఁగొట్టుట కర్హమగు రసమనియు, ఱాళ్లయొక్కయుత్పత్తి కర్హమగురసమనియుఁ జెప్పఁదగినదొప్పను, వికృతి=వికారము.

వాసం—మహారాజా ! అడుగుచుంటిని, లక్ష్మణ కుమారునకుఁ గుశలమా?

రామ—(తనలో) అన్నా ! "మహారాజా!" యని ప్రేమ లేని సంబోధనము; సౌమిత్రి యెడలనే బాష్ప గద్గదంబులతోఁ గుశలప్రశ్నము;—కాన నీమె సీతావృత్తాంతంబు నెఱింగిన దని తలంతును. (ప్రకాశముగా) ఆఁ ! సేమమే కుమారునకు ! (ఏడ్చును)

వాసం—ఓ దేవా ! మఱేమి కలదు? దారుణుండ వైతివి గదా !

సీత—సఖీ ! వాసంతీ ! యిట్లు పలుక నేవేమైతివి ? ఆర్యపుత్రుఁ డెల్లరకుం బూజార్హుండు గదా !—మఱియు నా ప్రియసఖికి;

వాసం—

ఉ. ఈవె మదీయ జీవితము; వీవె ద్వితీయ మనోంబుజంబవౌ;
దివె మదక్షి చంద్రికవు; నీవె శరీర సుధారసంబ; వం
చీవిధిఁ బెక్కుతియ్యముల నింతిని గూడి మెలంగి దాని నే—(నిట్టూర్చి)
ఆవలివార్త యేల యిఁక నక్కట ! పాపము శాంతిఁబొందుతన్. 26.

(మూర్ఛిల్లును.)

రామ—యుక్తము గదా ! వాఙ్నివృత్తియు మోహంబును ! సఖీ ! ఊఱడిల్లుము.

వాసం—(ఊఱడిల్లి) దేవా ! యిట్టి యకార్య మాచరించితి వేమి?

సీత—సఖీ ! వాసంతీ ! చాలింపుము చాలింపుము.

రామ—లోకము సహింపనిది.

వాసం—అది యేల ?.

రామ—ఏదో లోకమే యెఱుంగును.

తమ—ఉచితమే లోకదూషణము.

వాసం—

ఉ. ఓ కఠినాత్మ ! నీకు రహి నొప్పు యశంబె కదా ! మనఃప్రియం !
బీ క్రియ కన్న ఘోర మగునే యపకీర్తి మహిం జెలంగు ? నా
భీకర కాననంబున విభీత మృగేక్షణ కేమి యయ్యో ? ని
స్సీ ! కుతలాధినాథ ! మఱి నేమి తలంచుచు నుంటి ? చెప్పుమా ! 27.

చంద్రిక=వెన్నెల, తియ్యము=ప్రియము, వాఙ్నివృత్తి=మాటను నిలిపివేయుట, మోహము=మూర్ఛ, విభీతమృగేక్షణ=మిక్కిలి భయపడిన లేడివంటి చూపులుగలది, కుతలాధినాథ=భూభర్త.

సీత—సఖీ! వాసంతీ! నీవే దారుణురాలవు. కఠినురాలవు. ఇటు ప్రజ్వలించు నార్యపుత్త్రునే ప్రజ్వలింపఁ జేయుచుంటివి.

తమ—ప్రణయ శోకము లిటు పలుకుచున్నవి.

రామ—సఖీ! యిందేమి యూహింప నగును?

గీ. ప్రస్ఫురిత గర్భభార విహ్వలయు, బిభ్య
దేకహాయన మృగ దృగాలోక యైన
చాన, మృదు బాహ్య, బిసకల్ప, చంద్రికాభ
యగు తనూవల్లి సత్త్వంబు లణఁప నోపు. 28.

సీత—ఆర్యపుత్త్రా! ఇదిగో! జీవించి యుంటిని.

రామ—హా! ప్రియసఖీ! జానకీ! యెచ్చట నుంటివి?

సీత—(కటకటా!) ఆర్యపుత్త్రుఁడు సయితము ఎలుఁగెత్తి యేడ్చుచుండెను.

తమ—వత్సా! యిప్పటి కిదియే యుక్తము. దుఃఖితాత్ములకు దుఃఖ నిర్వాపణ మొనర్ప వలయుఁగదా!

గీ. వఱద పైకెక్కి తటముల నొరయు వేళఁ
జెఱువునకు గండి వెట్టుటే నెఱ తెఱంగు:
హృదయమున శోక సంక్షోభ మొదవు వేళఁ
దార రవమున నేడ్చుటే తగిన వెరవు. 29.

మఱియును రామభద్రుని సంసార మెల్ల విఘ్నమ్ములచే గ్రస్తతర మైనది.

వ. నయసరణిన్ సమాహిత మనంబున నీ జగ మేలఁగా వలెం,
బ్రియసతిఁ బాసి జీవితము గ్రీష్మమునన్ విరివోలె వాడె, ని
ర్దయతన దహనీత పీడ యలఁతన్ దలపించుట కాని యుమ్మగా,
ధ్వయిన శవిజ్ఞంచేఁ జిత్త మిపుడ్ దైవను రోదన మల్పలాభ మౌ? 30.

ప్రస్ఫురిత=కదలుచున్న, విహ్వల=భయముచే స్వస్థత స్వాధీనము లేనిది. బిభ్యత్ = భయపడుచున్న, ఏకహాయన=ఒక సంవత్సరము వయస్సుగల, మృగ=లేడి చాన, ఉలికి=చలించుచున్న, ఆలోక=చూపులుగలది. బిసకల్ప=తామరతూఁడువంటి శరీరము, సత్త్వములు=జంతువులు, పిశాచములు. తారరవమున=ఎలుఁగెత్తి, సమాహిత= లెస్సఁగా నొప్పిన.

రామ—హా! కష్టము కష్టము!

మ. స్సున సంవేగమునన్ మనం బగలు, బ్రకటిల్ రెండుగాఁ గాదు; మఱిం
దని పీడం జెడి మేను మూర్ఛఁగను, జైతన్యంబు వీడ్కోదు; వె
ల్లున నంతర్జ్వలనంబు దేహము రగుల్చున్, భస్మముం జేయ; దె
చ్చున మర్మంబులఁ జెండి దైవము గలంచుం, ద్రెంప దీ జీవమున్. 31.

సీత—ఇట్లే యిది—

రామ—తేజస్వ్విలారా! పౌర జానపదులారా!—

చ. సతి భవనంబున న్నిలువ సైపక పోతిరిగాదె మీర, ల
క్కటితనఁ దృణంబుఁ బోలె నడుకానఁ దొరంగితిఁ; గుంద నైన మా
నితిఁ; జిరమైత్రి వాటిలు వనీవిషయంబులు నన్ గరంచె; నే
గతియును లేక యేడ్చెదను; గాన ననున్ క్షమియింపుఁ డి త్తఱిన్. 32

తమ—శోకవారాశి నాక్రమింప నతి దుష్కరము.

వాసం—దేవా! కడచినదానికై ధైర్య మవలంబింపుము.

రామ—సఖీ! ధైర్య మవలంబింపు మందు వేల?

గీ. భూమిజా శూన్య మయిన యీ భువనమునకు
వర్తమానంబు ద్వాదశ వత్సరంబు,
సీతయను పేరుఁ గూడ నశించెఁ గాని
రాము జీవితమున కింక లేమి లేదు. 33.

సీత—ఈ యార్యపుత్త్రి వచనంబులచే మూర్ఛితురాల నైతిని.

తమ—వత్సా! అవును.

గీ. పూరిత స్నేహములు శోకదారుణములు
నగుటనివి ప్రీతి నింపు వాక్యములు గావు,
గరళ మిళితంబు లగుచు నిక్కము మరంద
ధార లియ్యవి నీమీఁదఁ బాఱుచుండె. 34.

రామ—వాసంతీ! నేను—

అంతర్జ్వలనంబు=లోపలి యుడుకు.

గీ. లోన నాటి తిరశ్చీనమౌ నలాత
శల్యమట్లు, విషాగ్రదంశంబు వోలె,
వాడి యగు శోకకీలంబు స్వాంతమర్మ
తతిని ఖండించు చున్న నోర్చితిని గాదె! 35

సీత—మందభాగ్య నగు నే నిట్లు లార్యపుత్త్రునకు మరల నాయాస కారిణి నైతిని.

రామ—ఇట్టు లతి నిశ్చల స్తంభి తాంతరంగుండ నైనను నా క్షిప్త డీ యావేగ మా యా పరిచిత ప్రియ వస్తు సందర్శనంబున—

మ. అమిత క్షోభ విజృంభి తేంద్రియ గణవ్యామోహమున్ మాన్ప, నేఁ
దమి నే యే యతనం బొనర్చినను ద త్తద్యత్నముం బల్ రయం
బు మెయిం బాఱు ఝురంబు సైకత తటంబుం బోలె లో భిన్నభి
న్నము గావించి వికార మెద్దియొ యెడందం బర్వె నొకుక్కుమ్మడిన్. 36.

సీత—దుర్నివార భీషణారంభ మగు నీ యార్యపుత్త్రుని దుఃఖ సంరంభంబున నా హృదయంబు నిజశోకోద్భేదంబునం బోలెఁ గంపించు చున్నది.

వాసం— (తనలో) కష్టము! విభుఁ డాపన్నుఁడై యుండెఁ గాన వినోదింపఁ జేసెదను. (ప్రకాశము) దేవా! చిరపరిచితంబు లగు నీ జనస్థాన భూభాగంబుల నవలోకింపుము.

రామ—ఔఁగాక! (లేచిపరీక్షించును.)

సీత—దుఃఖోద్దీపకంబులనే ప్రియసఖి వినోదోపాయ మని తలంచు చున్నది.

వాసం— (కరుణతో) దేవా! దేవా!

మ. తన జాడం గనుగొంచు నీవు తమి నేత కుంజమం దుండ, నో
య్యన గోదావరి సైకతస్థలిని హంసాలోక కౌతూహలం
బున జాగై యరుదెంచుచుం దహతహం బొల్పారు ని న్గాంచి, జ
వ్వని గీలింపదె భీతిఁ బద్మముకుళ ప్రాంచ త్ప్రణామాంజలిన్. 37

తిరశ్చీనమౌ = అడ్డముగాఁదిరిగిన, అలాత = కొఱవివంటి, శల్యమట్లు = బాణాగ్రమువలె, దంశంబు = కోర, శోకకీలము = దుఃఖాగ్ని, అమిత = మిక్కుటమగు, క్షోభ = దుఃఖము చేత, విజృంభిత = వృద్ధిపఱుపఁబడిన, ఇంద్రియగణ = ఇంద్రియ సమూహముయొక్క, సమ్మోహమున్ = మూర్ఛను, ఝురంబు = ప్రవాహము, సైకత తటంబు = ఇసుకగట్టు, ఉద్భేదము = పగులఁగొట్టుట. కుంజము = పొద, ప్రాంచత్ = ప్రకాశించుచున్న.

సీత—దారుణురాల వైతివి. వాసంతీ! దారుణురాల వైతివి. హృదయ మర్మంబులం గల గూఢ శల్యంబులం బెకలించు నీ కథోద్ఘాతములచే మందభాగ్యురాల నగు నన్ను నార్యపుత్త్రునిం గూడ మరల మరలఁ బరితపింపఁ జేయు చుంటివి.

రామ—చండీ! జానకీ! యిటు నటుఁ గనఁబడు నట్లుండియు ననుగ్రహింప కుంటివి.

శా. హా! దేవీ! హృదయంబు పెల్లగిలెఁ, దూగాడెం దనూబంధముల్,
శేదంచుం దలఁతున్ జగంబు, దరికొల్పెన్ లోని కీలల్ ననున్,
ఖేదోద్విగ్నత నంతరాత్మయుఁ దమోంధీభూతమూ నట్లు పై
పైఁ గోరంబుగఁ బర్వె మోహ మిఁక నిర్భాగ్యుండ నెట్లాగెదన్. 38.

(మూర్ఛిల్లును.)

సీత—కటకటా! ఆర్యపుత్త్రుండు మరల మూర్ఛిల్లె. హా! ఆర్యపుత్త్రా! మందభాగ్యనగు నన్ను గూర్చి సకల జీవలోక మంగళాధారుండ వగు నీకు మాటిమాటికి జీవిత సంశయంబుఁ గొలుపు దారుణం బగు దశాపరిణామము తటస్థించుచున్నది. హా! హతురాల నైతిని—(మూర్ఛిల్లును)

తమ—వత్సా! ఊరడిల్లు మూరడిల్లుము. మరల నీహస్త స్పర్శమే రామభద్రునకు జీవనోపాయము.

వాసం—ఏమి? ఇప్పటికిని మేల్కొనలేదు. హా! ప్రియసఖి! సీతా! నీప్రాణనాథుని మన్నింపుము.

సీత—(తొందరతోఁ జేరి హృదయమునను లలాటమునను స్పృశించుచున్నది.)

వాసం—సంతోసము! రామభద్రుఁడు తెల్విఁ జెందెను.

రామ—.

చ. అమరఁగ దేహధాతు బహిరంతర సీమల నక్కజంబుగా
నమృతమయ ప్రలేపముల యట్టు లలందుచు నొక్కస్పర్శ జీ
వమునకు నొక్కపెట్టఁ బ్రతిభం గలిగించుచు నెండియుం బ్రమో
దము విరియించి యొండొక విధంబగు మోహము బర్వఁ జేసెడిన్. 39.

(ఆనందమునఁ గన్నులు మూసియే) సఖీ! వాసంతీ! మోదమున వర్ధిల్లుచుంటివి.

వాసం—ఎట్లు?—

కథోద్ఘాతములచే=కథలనుజ్ఞప్తికిఁ దెచ్చుటచే, ఉద్విగ్నతన్=అతిశయముచే.
ప్రలేపములు=పూతలు.

రామ—సఖీ! మ రేమి? జానకి మరల వచ్చినది.

వాసం—ఓదేవా! రామభద్రా! అది యెచ్చట?

రామ—(స్పర్శసుఖము నభినయించి) ఇదిగో! యెదుటనే!

వాసం—ఓయీ! మర్మములఁ జెండు నీ దారుణ ప్రలాపములచేఁ బ్రియసఖీ దుఃఖదగ్ధ నగు మందభాగ్యురాల నన్ను మరల దహించుచుంటి వేమి?

సీత—తొలఁగి పోఁగోరుచుంటిని. కాని చిర సౌహార్ద ప్రసన్న శీతలంబై, దీర్ఘదారుణం బగు సంతాపంబు సైతము దోడ్తోడఁ దొలంగించు నార్యపుత్త్రి సంస్పర్శంబున వజ్రలేప లిప్త మైనట్లు చెమర్చుచు నిస్సహ విపర్యస్తమై నా హస్తము పరవశంబైనట్లు కంపించుచున్నది.

రామ—(హస్తము గ్రహించి) సఖీ! ప్రలాపము లెట్లు?

ఉ. ఎయ్యది పెండ్లివేళ గ్రహియింపఁబడెన్ శుభకంకణంబుతో?
నెయ్యది దీర్ఘమైత్రి వహియించె నొ స్వైర సుధార్ద్రసంగతిన్?

సీత—ఆర్యపుత్త్రా! నీవిప్పుడా పురుషుఁడవే యైతివి.

రామ—ఒయ్యన నత్తుషార కరకోపమ సుందరమైన తత్కరం
బియ్యెడ నాకుఁ బట్టువడియెన్ లవలీ మృదు కందళాకృతిన్. 40.

సీత—అయ్యయో! ఆర్యపుత్త్రి స్పర్శ మోహితురాల నగు నాకుఁ భ్రమాద మయ్యెను.

రామ—సఖీ! వాసంతీ! ఆనంద మందీకృతేంద్రియుండనై సాధ్వసంబునఁ బరవశుఁడనై యుంటిని. దీని నీవుఁగూడఁ బట్టుకొనుము.

వాసం—కష్టము! ఉన్మాదమే.

సీత—(తొందరతో విడిపించుకొని తొలఁగి పోవును.)

రామ—హా! హా! ప్రమాదము,

గీ. జడము స్వేదాంచితంబుఁ జంచలము నైన
దాని కరపల్లవంబు సత్వరత మీ॥

సౌహార్దము=స్నేహము, వజ్రలేప=సరేసులాను పూఁతవస్తువుచే, లిప్త=పూయఁబడిన, విపర్యస్తము=వ్యత్యాసము, స్వైర=స్వేచ్ఛగలట్టియు, సుధా=అమృతమువలె, ఆర్ద్ర=చల్లనైనట్టియు, సంగతిన్=స్పర్శచేత, తుషారము=మంచు, కరకము=వడగల్లు, లవలీ=లవలీలతయొక్క, మృదువైన, కందళము=మొలక, సాధ్వసము=భయము, జడము=చల్లనిది.

జడము స్వేదాంచితంబుఁ జంచలము నైన
మత్కరంబున నుండి సంభ్రష్ట మయ్యె. 41.

సీత—అయ్యయో ! స్వభావమును బొందక నిశ్చలములై విషయగ్రహణమునం దస మర్థములై తత్ప్రయత్నంబున బలాత్కారముగ భ్రమించు నేత్రములతో నార్యపుత్త్రుం డిప్పటికిని దన్నుఁ దాఁ దెలిసికొన నేరఁ డయ్యెను.

తమ—(స్నేహ హాస కౌతుకములతోఁ జూచి)

గీ. వల్లభస్పర్శ సౌఖ్యంబు వలన సీత
స్వేద రోమాంచ కంపనాన్విత యగుచు
గాలిఁ గదలి, నవీనోదకములఁ దడిసి
కలికల నెసంగు నీపశాఖ యనఁ దనరె. 42.

సీత—(తనలో) ఓహో ! పరవశురాల నై భగవతియగు తమసచే లజ్జింపఁ జేయఁ బడితిని. "ఇట్టిది పరిత్యాగము, ఇట్టిది హృదయాసంగ" మనియీమె యేమను కొనునో గదా !

రామ—(కలయఁ జూచి) హా ! యేమిలేనే లేదా? ఓనిర్దయా ! వైదేహీ !

సీత—నిక్కముగ నిర్దయురాలను. ఇట్టి నిన్ను జూచుచుఁ బ్రాణములఁ దాల్చియుంటిని.

రామ—ఎచ్చటనుంటివి ? అనుగ్రహింపుము. ఇట్టి నన్ను డఁబాయ నర్హంబుగాదు.

సీత—ఆర్యపుత్త్ర ! యిదివిపరీతము.

వాసం—దేవా ! ప్రసన్నుఁడవు గమ్ము. ప్రసన్నుఁడవు గమ్ము. అతిశయిత విరహంబగు నాత్మను నీ లోకోత్తర ధైర్యమున నరికట్టుము. నాప్రియసఖి యిచ్చట నెట్లుండును ?

రామ—లేదు. నిశ్చయము. ఉన్నచో దాని వాసంతి గూడ నెట్లు చూడకుండును ? స్వప్నమా యిది !—నేను నిద్రింపలేదు.—కాక రామునకు స్వప్నమెట్లు ? సర్వవిధంబుల మహామహిమ గల బహువార కల్పనా నిర్మితం బగు నావిప్రలంభమే నన్ను మాటిమాటికి వేంబడించుచున్నది.

సంభ్రష్టమయ్యె = జారిపోయెను, రోమాంచము = గగుర్పాటు, అన్విత = కూడుకొనినది, కలికలు = మొగ్గలు, నీపశాఖ = కడిమికొమ్మ, బహువార = అనేకపర్యాయములు, కల్పనా = సంకల్పించుకొనుటచేత, నిర్మితంబగు = కలిగించుకొనిన, విప్రలంభము = వియోగము,

సీత—ఆర్యపుత్త్రుండు దారుణురాల నగు నాచేత నే వంచింపఁ బడియె.

వాసం—దేవా ! చూడుము చూడుము.—

మ. అల పౌలస్త్యు జటాయు నిర్దళిత కృష్ణాయోరథం బిద్ది, ముం
గల నాభీల పిశాచ వక్త్రియుత కంకాళాత్మలౌ రాసభం
బులివే ! హేతి జటాయు పక్షతుల నిర్మూలించి నీశత్రుఁ డు
జ్జ్వల సీతం గొని మింటి కేగెఁ జలితాంతర్విద్యుదబ్దంబనన్. 43.

సీత—(భయముతో) ఆర్యపుత్త్రా ! తండ్రి హతుఁ డగుచుండె, నేనపహరింపఁ బడుచుంటిని, రక్షింపు రక్షింపు.

రామ—ఆ ! పాపిష్ఠ ! తాత ప్రాణ సీతాపహారీ ! ఎందుబోయెదవు ?

వాసం—ఓదేవా ! రాక్షసాన్వయ ప్రళయ ధూమకేతూ ! నీక్రోధ విషయ మిప్పటికినా ?

సీత—ఓహో ! ఉన్మత్తురాల నైతిని.

రామ—ఇప్పుడీ ప్రలాపము సార్థకమే యైయున్నది.

చ. సతత వినోదముం గొలుపఁ జాలు నుపాయములం దనర్చి యు
ద్ధత రిపు వీర సంహృతుల ఖ్యాతి మహాద్భుతమున్ ఘటించు నా
సతి తొలి విప్రలంభ మది శత్రువధావధి యయ్యెఁ గాని ప్ర
స్తుత విరహం బనంత గతిఁ జొప్పడె నూరక యెట్టులోర్చెదన్? 44.

సీత—అనంతమైన దనియా హా ! హతురాలనైతి మందభాగ్యురాలను. (ఏడ్చును)

అల=ఆ, పౌలస్త్య=రావణునియొక్క, జటాయు=జటాయువుచే, నిర్దళిత=విఱుగఁగొట్టఁబడిన, కృష్ణ=నల్లనగు, అయోరథంబు=ఇనుముచేఁజేయఁబడిన రథము, ఆభీల=భయంకరమగు, పిశాచములయొక్క, వక్త్రియుత=ముఖములతోఁ గూడుకొనిన, కంకాళాత్మకౌ=అస్థిపంజరాకృతములయిన, రాసభంబులు=గాడిదలు, హేతి=ఖడ్గముచే, జటాయువుయొక్క, పక్షతులన్=ఱెక్కలమూలములను, నిర్మూలించి=తెగనఱికి, నీశత్రుఁడు, చలిత=చలించుచున్న, అంతః=లోన, విద్యుత్=మెఱుపుగలిగిన, అబ్దంబనన్=మేఘమాయనునట్లు, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, సీతంగొని—మింటికి=ఆకాశమునకు, ఏగె. ధూమకేతువు=తోఁకచుక్కయొక్క, సంహృతుల=చంపుటచే.

రామ—హా ! కష్టము !—

చ. అల కపిరాజు చెల్మి, కపులండఱి బీరము, భల్లుకేంద్రు ధీ
బలమును, నెందు నిష్ఫలము ? పావని యెందుఁ జొరంగ నేరఁ? డా
నలుఁ డను విశ్వకర్మ హిత నందనుఁ డెందుఁ బథం బొనర్పలే ?
డలుగుల కెందు లక్ష్మణున కందదొ ? యాయెడ నుంటివో ? ప్రియా ? 45.

సీత—పూర్వ విరహమును గూర్చి మన్నింపఁ బడితిని.

రామ—సఖీ ! వాసంతీ ! సఖులకు దుఃఖముకొఱకే రామ సందర్శనము. ఎంతవఱకు నిన్నేడ్పింతును ? కానఁ బ్రయాణంబునకై నాకు సెల వొసఁగుము.

సీత— (భయ మోహములతోఁ దమసం బట్టుకొని) భగవతీ! తమసా! ఆర్యపుత్త్రుం డరుగుచుండె నేమిగతి?

తమ—వత్సా! ఊరడిల్లు మూరడిల్లుము. ఆయుష్మంతులగు కుశ లవులకు వర్షగ్రంథి మంగళము సాపాదింప భాగీరథీ పదసన్నిధికి మనమునుం బోవుదము.

సీత—భగవతీ! అనుగ్రహింపుము. దుర్లభ జనుని క్షణమాత్ర మవలోకింతును.

రామ—కల దిప్పు డశ్వమేధమునకై నాకు సహధర్మ చారిణి.

సీత— (కంపముతో) ఆర్యపుత్త్రా! అది యెవతె ?

రామ—హేమమయం బగు సీతాప్రతిమ.

సీత— (ఊరడిల్లి కన్నీళ్ళతో) ఇప్పుడు నీ వార్యపుత్త్రుండ వైతివి. ఓహో! ఇప్పు డార్యపుత్త్రుండు నా పరిత్యాగ శల్యంబు నున్మూలించె.

రామ—దానియందైనను బాష్పపూర్ణమగు దృష్టికి సంతుష్టిఁ గల్గించెదను.

సీత—ఆర్యపుత్త్రునిచే మన్నింపఁ బడుచు నాతని నానంద పఱచుచు జీవలోకమున కాశానిబంధనం బయ్యెఁ గాన నది ధన్యురాలు.

తమ— (స్మిత స్నేహబాష్పములతోఁ గౌఁగిలించి) ఓవత్సా! ఆత్మస్తవముం జేసి కొనుచుంటివి.

విప్రలంభము = వియోగము, శత్రు = విరోధులయొక్క వధ=చంపుటయే అవధి=హద్దు, కపిరాజు=సుగ్రీవుఁడు, కపులు=కోఁతులు, భల్లుకేంద్రుఁడు = జాంబవంతుఁడు, పావని = ఆంజనేయుఁడు, పథము = మార్గము, ఉన్మూలించె=ఊడఁబెరికె.

సీత— (లజ్జతోఁ దలవంచి తనలో) భగవతి పరిహసించు చున్నది.

వాసం— ఈ సమావేశము మాకు మహానుగ్రహము. ప్రయాణ విషయమున నెట్లు కార్యభంగము గల్గదో. అట్లు కావింపఁ దగును.

సీత—ఇప్పుడు వాసంతి నాకుఁ బ్రతికూల యైనది.

తమ—రమ్ము పోవుదము.

సీత— (కష్టముతో) అట్లే చేయుదను.

తమ—ఎట్లు రాఁ గలవు?

గీ. వల్లభునియందు నెఱి నాటఁ బడిన యట్టి
వేడ్కచే సోఁగబారు నీ వీక్షణంబు
మర్మములఁ దుంచు యత్న సంపదలనైనఁ
దివియఁ బడఁ జాల దయ్యె నుదీర్ణభంగి. 46

సీత—అపూర్వ సుకృత జనిత దర్శనంబు లగు నార్యపుత్త్రి పాదపద్మములకు నమస్కారము. (మూర్ఛిల్లును)

తమ—వత్సా! ఊఁరడిల్లు మూరడిల్లుము.

సీత— (ఊఁరడిల్లి) మేఘాంతరాళమునఁ బూర్ణిమా చంద్రు నెంతకాల మవలోకింపఁ గలము?

తమ—ఓహో! ఘటనా విశేషము.

చ. కరుణరసంబు పన్నుగ నొకం డయి యుండి నిమిత్తభేదత
త్పరత విభిన్నమై వివిధవైఖరులం బలె మార్పులొందు, వి
స్ఫురిత తరంగ సంభ్రమణ బుద్బుద రూప వికార సంతతిం
బొరసియుఁ గన్గొనం జలము బొందుగ సర్వము దానయౌ గతిన్. 47.

రామ—విమానరాజమా! యిట్టిటు. (అందఱు లేచుచున్నారు.)

ఉదీర్ణభంగి=విశేషముగా, విస్ఫురిత=చలించుచున్న, తరంగ=అలలయొక్కయు, సంభ్రమణ=సుడులయొక్కయు, బుద్బుద=బుడగలయొక్కయు, రూప=ఆకృతులచే, వికార=మార్పుయొక్క, సంతతిన్=పరంపరను, పొరసియు=పొందియు.

తమ—వాసం— (సీతారాములం గూర్చి)

గీ. పుడమి మిన్నేలుఁగూడ మా బోంట్లతోడఁ
దొలుత ఛందఃపరియోక్తయౌ కులవిభుండు
ననుగతారుంధతీకుఁడౌ ముని వసిష్ఠుఁ
డొసఁగు భద్రంబు బహుభవ్య మెసఁగ మీకు. 48

(అందఱు నిష్క్రమింతురు.)

ఛాయ యను తృతీయాంకము,

సంపూర్ణము.

ఛందః=వేదములను, పరియోక్తయౌ = చెప్పినవాఁడగు, కులవిభుండు=సూర్య వంశ స్థాపకుఁడగుసూర్యుండు, అనుగతారుంధతీకుఁడు=అనుసరింపఁబడిన అరుంధతిగల వాఁడు, భవ్యమెసఁగ=మంగళ మగునట్లు.

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

చతుర్థాంకము.

(ఇర్వురు తాపసులు ప్రవేశింతురు)

ఒకఁడు—సౌధాతకీ ! యిపుడు విశిష్టాతిథి జనాలంకృతం బగు వాల్మీకిభగవాను నాశ్రమ స్థానమందలి విపులకార్యోపక్రమరమణీయకంబుం గనుంగొనుము.

మ. నవసూతప్రియ గ్రోల నున్న మధురోష్ణం బైన నీవార భ
క్త వరస్రావము దృప్తి నాశ్రమ కురంగం బానుచుండెన్, ఘృతా
ప్లవ రుచ్యాన్న లసత్సుగంధ లవ సంప న్మిశ్రమై చాల నిం
పు కర్కంధుఫలాఢ్య శాక పచనోత్థామోద మేపారెడిన్. 1.

సౌధాతకి—ఇప్పుడీ నెఱసిన పెద్ద గడ్డముల వారికి మహత్తర మయిన యనధ్యయన కారణము సంభవించినది.

ప్రథముఁడు—(నవ్వి) సౌధాతకీ ! గురువులయందు బహుమాన కారణ మపూర్వ ముగా నున్నదే ?

సౌధా—ఓభాండాయనా ! యిప్పుడీ మిక్కుటమగు వృద్ధసంఘమునకు మొనగాఁడై నారలు గట్టి వచ్చినయీయతిథి పేరేమి?

నవసూత=క్రొత్తగాఁనీనిన, నీవార=నివ్వరి, భక్త=అన్నసంబంధమయిన, స్రావము=గంజి, ఘృత=నేతితో, ఆప్లవ=లెస్సగాఁదడుపఁబడిన, రుచ్యాన్నము=రుచిగలయన్నము నుండిబయలువెడలిన, లసత్సుగంధలవ=సువాసనయొక్క లేశము యొక్క, సంపన్మిశ్రమై=సంపత్తుతోఁగూడినదై, కర్కంధుఫల=రేఁగుపండ్లతో, ఆఢ్య=ఎక్కువగాఁజేయఁబడిన, శాక=కూరయొక్క, పచన=వండుటయందు, ఉత్థ=బయలువెడలిన, ఆమోదము=పరిమళము.

భాండా—ఛీ ! పరిహసించెదవు ? ఋశ్యశృంగాశ్రమము నుండి యరుంధతిని మును కొనిన దశరథేంద్రుని భార్యలకు నియామకుఁడై వసిష్ఠమౌని విచ్చేసె. ఇట్లు ప్రేలెద వేల ?

సౌధా—ఆఁ ? వసిష్ఠుఁడా ! నేను తోఁడేలో ? బెబ్బులియో ? యనుకొంటిని.

భాండా—ఆఁ ! యేమనుచుంటివి ?

సౌధా—అతఁ డరుదెంచినంతనే దిక్కులేని యాఁబెయ్య డమ్మని చంపఁబడినది.

భాండా—"సమాంసో మధుపర్కః" యను నామ్నాయమును మన్నించుచు గృహస్థులు శ్రోత్రియాతిథి కొఱకు వత్సతరిని గాని మహోక్షమును గాని మహాచ్ఛాగమును గాని యిచ్చుచుందు రని ధర్మసూత్రకారులు పలుకుచున్నారు.

సౌధా—ఓహో ! ఓడిపోయితివి.

భాండా—ఎట్లు ?

సౌధా—వసిష్ఠమిశ్రు లరుదేర వత్సతరిని హింసించె. సద్య స్సమాగతుఁ డగు జనక రాజర్షికి వాల్మీకి భగవానులు దధి మధువుల చేతనే మధుపర్కమును నెఱవేర్చె. వత్సతరిని విడిచె.

భాండా—ఋషులు మాంసాహారము నుమానని వారికీ కల్పము ననుమతించుచున్నారు. పూజ్యుఁ డగు జనకుఁడో మాంస పరిత్యాగి.

సౌధా—ఏల ?

భాండా—ఆతఁ డప్పుడే సీతాదేవి కిట్టి దైవప్రాతికూల్యమును విని వానప్రస్థుఁ డయ్యె. ఆట్లు చంద్రద్వీప తపోవనంబునఁ దపం బొనర్చుచుండు నితనికిఁ గొన్ని వత్సరంబులు గతించె.

సౌధా—పిదప నిచ్చటికేల వచ్చె ?

భాండా—పురాతన హిత మిత్రుఁ డగు వాల్మీకిమౌనిని సందర్శింప.

సౌధా—ఇప్పు డితనికి బంధు సందర్శనం బయ్యెనా ?

భాండా—ఇప్పుడే వసిష్ఠ భగవానులు కౌసల్యాదేవి చెంతకు భగవతి నరుంధతిం బంపి విదేహనాథుని స్వయముగా నరిగి చూడ నియమించె.

ఆమ్నాయము=వేదము, వత్సతరి=ఆఁబెయ్య, మహోక్షము=పెద్దయెద్దు, ఛాగము=మేక, సద్యస్సమాగతుఁడగు=అప్పుడేవచ్చిన, దధి=పెరుగు, మధువు=తేనె

సౌధా— ఈవృద్ధులందఱు! నొండొరులు గలిసికొనినట్లు; బ్రహ్మచారులం గూడి మన మును అనధ్యాయ మహోత్సవంబు నాటలతో బహూకరింతము.

భాండా—బ్రహ్మవేత్తయుఁ బురాతన రాజర్షియు నగు నీజనకుండు వసిష్ఠ వాల్మీకుల సేవించి యిప్పఁడాశ్రమ ప్రాంత వృక్ష మూలమున నున్నవాఁడు.

క. ఈతఁడు మది నిత్యోజ్జ్వల
సీతాశోకంబు వలనఁ జేట్పడి యంత
స్స్యూతానల మగు జరఠీ
భూత వనస్పతియుఁ బోలెఁ బొగులుచు నుండెన్. 2.

(నిష్క్రమించిరి.)

విష్కంభము.

పిమ్మట జనకుఁడు ప్రవేశించుచున్నాఁడు.

జన—

ఉ. నందనియందుఁ దాదృశ ఘనవ్యతిరేకము గల్గి తీవ్రమై
డెందము వచ్చి వేదన గడిందిగఁ జేసి పురాతనత్వముం
జెందియుఁ గొత్తవోలె నెడసేయక యేచు దురంత శోకముం
గ్రందుగఁ గూర్చి మర్మముల రంపమునం బలెఁ గోసి దానిచేన్. 3.

కష్టము! ఇట్లు వార్ధకంబునను, దుస్సహం బగు దుఃఖంబునను, మఱియుఁ బరాక సాంతపనాది తపంబులను, రసధాతువులు శుష్కింప దుర్బలం బైన నా దగ్ధదేహ మిప్పటికిం గూల దయ్యె.— "ఆత్మఘాతుకుల కంధతమసావృతంబు లగు ననుర్య లోకంబులు విధింపఁబడు" నని మహర్షులు తలంచుచున్నారు. పెక్కేండ్లు గడచి నను బ్రతిక్షణోద్భేదంబుచే స్పష్ట నిర్భాసమై నూత్నమైనదియుం బోలె దారుణం బైన నాదుఃఖోద్వేగ ముపశమింప దయ్యె. ఓ తల్లీ! దేవయజన సంభవా! సీతా! నీని

ఉజ్జ్వల = మండుచున్న, అంత స్స్యూతానలము = లోపలలో నిప్పుగల, జరఠీభూత = ముదిసిన, వనస్పతి = వృక్షము, తాదృశ = అట్టి, ఉద్భేదము = బాధించునది, నిర్భాసమై = ప్రకాశించునదియై.

ర్మాణభాగ మిట్లు పరిణమించెనా ? ఈ లజ్జచే, నిచ్చకొలంది విలపింపనైన వలను లేదుగదా ! హా ! హా ! కుమారి ! —

గీ. అనియత స్మిత రుదితంబు, నమల విరళ
మంజుతర దంత కలికాగ్ర రంజితంబు,
స్ఖల దసంబద్ధ ముగ్ధ వాక్యంబు నగుచుఁ
దనరు నీ చిన్ని మోము దమ్మిని దలంతు. 4.

భగవతీ ! సర్వంసహా ! నీవు నిక్కముగ మిక్కిలి కఠినురాలవు. —

చ. అనలుఁడు, నీ, వరుంధతి, మహర్షులు, గంగయు, రాఘువాన్వయం
బెనయు గురుండు దేవ్రఁ డినుఁ, డేసతిశీల మెఱుంగువారు ? వి
ద్యను త్రయివోలె నేయమ నుదారతఁ గాంచితి ? వట్టి దైవతం
బనఁ దగు నట్టి నీ తనయకా విషమం బెటు లోర్తు నిష్కృపా ! 5.

(తెలిలో) భగవతి ! మహాదేవీ ! యిట్టిటు.

జనకుఁడు —(చూచి) ఓహో ! గృష్టి ప్రదర్శిత మార్గ యగు భగవతి యరుంధతి. (లేచి) మహాదేవి ! యానె నేమెను ? (నిరూపించి) హా ! యెట్లు ! మహారాజ దశరథుని ధర్మపత్ని నాప్రియసోదరీమణి కౌసల్యయా ? ఆమెయే యీమె యని యెవ్వఁడు గుర్తింప నేర్చును ? —

గీ. ఈమె సిరివోలె దశరథు నింటఁ దనరె;
నట్టి యుపమానపద మేల ? యతివ సిరియె;
అకట ! సాకార శోకమ ట్లాకవినంబుఁ
బడసె విధిచేత నీమె ; విపాక మహహ ! 6.

అనియత = కారణము లేని, స్మిత = నవ్వును, రుదితంబు = దుఃఖమునుగలదియు, అమల = స్వచ్ఛమగునట్టియు, విరళ = విశాలమగునట్టియు, మంజుతర = మిక్కిలి మృదువైనట్టియు, దంత = దంతములను, కలిక = మొలకలయొక్క, అగ్ర = కొనలచే, రంజితంబు = మనోహరమయినట్టియు, స్ఖలత్ = తొట్రుపడునట్టియు, అసంబద్ధ = సందర్భ శూన్యమైనట్టియు, ముగ్ధ = సుందరమైనట్టియు, వాక్యంబు = పలుకులు గలిగినట్టియు, త్రయి = వేదము, విద్యను = తత్వజ్ఞానమునువలె, గృష్టి = కంచుకి పేరు. సాకార = రూపముఁదాల్చిన.

ఇది ఘోర మగు వేళాంక దశాపరిణామము;

క. మును నా కేజనము మెయిం
గనిన మహోత్సవము భంగిఁ గనఁబడెఁ దద్ద
ర్శన మిపుడు మండు గాయం
బున లవణముగతి *ననిష్టముగఁ దోఁచెఁ గడున్. 7

(పిదప నరుంధతి, కౌసల్య, కంచుకి ప్రవేశింతురు)

అరుంధతి—చెప్పుచుంటిని, "తనంతఁదాఁజని విదేహనాథునిం జూడఁ దగు" నని మీ కులగురుం డానతిచ్చె. అందులకే నన్ను బంపె. కాన నడుగడుగున నీ యెడ తెగని సంకోచ మేటికి?

కంచు—దేవీ! హృదయంబు నెలకొల్పుము. వసిష్ఠ భగవాను నానతి ననుసరింపు మని విన్నవించు చుంటిని.

కౌస—ఇట్టి కాలమున మిథిలేశ్వరుని జూడ వలసి వచ్చె నని సర్వదుఃఖము లొక్క పెట్టున నావిర్భవించు చున్నవి. సమూలంబుగా నున్మూలింపఁ బడు హృదయము నిలువరింప నసమర్థురాల నై యుంటిని.

అరుం—ఇందేమి సందియము?

గీ. ప్రజల కుత్తమ బాంధవాపాయ దుఃఖ
భారములు నిత్యసంతాన వాహులయ్యుఁ
స్వజనుల సమాగమమున దుస్సహములగుచు
సాఁగబాఱు ఝురీ సహస్రములఁ బోలె. 8.

కౌస—వత్సయగు జానకి కిట్లు సంభవించియుండ, నా రాజర్షి నెుగ మెట్లు చూడఁ గలను?

అరుం—గీ. యాజ్ఞ్యవల్క్య మునీంద్రుని యంతికమున
బ్రహ్మ పారాయణ మొనర్చి పరిఢవిల్లి
జనకవంశ్యుల కెల్ల భూషణ మనంగ
వరలు మీ శ్లాఘనీయ సంబంధి యితఁడె. 9.

విపాకము = విరుద్ధపరిణామము. పాఠాంతరము:—*ననహ్యముగ: అంతికమున=సన్నిధి, బ్రహ్మపారాయణము = వేదాధ్యయనము.

కౌస—ఇతఁడు మహారాజునకు హృదయానందుండును వత్సయగు జానకికిఁ దండ్రియు నగు రాజర్షి ; హా యిట్టి కష్టకాలమున మన్నింపఁ బడితిని. హా ! దేవా ! ఆ సర్వ మిప్పుడు శూన్యము.

జన—(సమీపించి) భగవతీ ! అరుంధతీ ! వైదేహుఁ డగు సీరధ్వజుఁడు నమస్కరించు చున్నాఁడు.

చ. గురుతుగఁ బూర్వపుం గురులకుం గురువర్యుఁడు, శుద్ధ సన్మహో
భరుఁడును, నీదు భర్త నిను బట్టి తనున్ శుచిగాఁ దలంచె ; నా
గరితవు లోకవంద్యవు, జగచ్ఛుభమూర్తివి, నీకు భూతల
స్థిరశిర మొప్ప నో భగవతీ ! తొలిసంజకుఁ బోలె మ్రొక్కెదన్. 10.

అరుం—పరంజ్యోతి నీకావిర్భవించుఁగాక ! జాజ్వల్యమానుఁడై రజోగుణాతీతుఁ డగు దేవుండు నిన్ను బవిత్రీకరించుఁగాక !

జన—ఆర్య ! గృష్టి ! క్షేమమా యీనరపాలజననికి ?

కంచు—(తనలో) అతినైష్ఠుర్యమున నిశ్శేషముగా గర్హింపఁ బడితిమి. (ప్రకాశముగా) రాజర్షిచంద్రా ! ఈకోపమున నే చిరకాలమునుండి రామభద్ర వదనేందు దర్శనంబు నీడి మిగుల దుఃఖించు దేవిని నీయాగ్రహముచే దుఃఖింపఁ జేయఁ జనదు. రామభద్రుఁ డైనను దుస్సహం బగు కింవదంతి నెల్లెడల ఘూర్ణిల్లఁ జేయు నత్యల్పు లగు పౌరజానపదులు పావకశుద్ధిని విశ్వసింప లేదని యిట్టి దారుణం బాచరించె.

జన—అఁ ! మా యపత్యంబు శోధింపఁ బావకుం డన నెవ్వఁడు ? కష్టము ! ఇట్లు పలుకు మానవునిచే మేము రామతిరస్కృతుల మయ్యును మరలఁ దిరస్కరింపఁ బడుచుంటిమి.

అరుం—(నిట్టూర్చి) ఇదియిట్లే; వత్సయెడల నగ్నియను నక్షరంబు లతిలఘువులు, సీత యనియే చాలును. హా ! వత్సా !

చ. ఒనరఁగ శిష్యవో ? తనయవో ? యగు దయ్యది యుంచు మట్లు; నీ
ఘనతర శుద్ధి నీయెడల గొప్పు భక్తి జనింపఁ జేసె; నం
గనవును బాల వయ్యును జగత్త్రియ వంద్యవు గావె ? పూజనం
బెనయ గుణాఢ్యులందు గుణమే తగు; లింగముఁ బ్రాయమున్ వృథా. 11.

సీరధ్వజుఁడు=నాగలిజెండాగాఁగలవాఁడు, మహోభరుఁడు = తేజశ్శాలి.

కౌస — అకటా! వేదన లుప్పొంగుచున్నవి. (మూర్ఛిల్లును)

జన — హా! కష్టము! ఏమిది?—

అరుం — రాజర్షీ! వేఱేమి?—

చ. అల ధరణీశుఁ, డా సుఖము, నా శిశువర్గము, నా దినంబులుం,
జెలి వగు నిన్ గనం దలఁపు జెందె సమస్తము; గాన నిమ్మహో
జ్జ్వల మగు దారుణంబున భవత్సఖి మూర్ఛిత యయ్యె; నారిజా
క్షుల హృదయం బనం గుసుమ కోమల భంగిఁ జెలంగుఁ గాదొకో? 12.

జన — అన్నన్నా! అన్ని విఘ్నంబుల ఘాతకుండ నయితి. చిరకాలమునకు దర్శించిన ప్రియమిత్త్రుని ప్రియకాంతం జెల్మితోఁ జూడ నయితి.

చ. అతఁ డతి సఖ్యుఁడున్, ఘనత నందిన బంధుగుఁడున్, మనంబు, నా
కృతిగను సమ్మదంబు, నిచయీకృత జీవిత సత్ఫలంబు, నిం
డు తనువో? జీవుఁడో? యధికుఁడో? ప్రియమిత్త్రుఁడు, శ్రీకళాసమ
న్వితుఁడు, మహాత్ముఁడా దశరథేశ్వరుఁ డెయ్యది నాకుఁగాఁడొకో? 13.

కష్టము! ఆకౌసల్య యీమెయే గదా!—

మ. సతికైనం బతికైన వైరము రహస్యంబందుఁ బెంపైన, దం
పతు లన్యోన్య మొనర్చు నిందలకు నేఁ బాత్రుండ నైయుంటి, నా
హిత కోపంబుననే? ననుగ్రహమునందే? కార్యభారంబు మ
ద్గత మయ్యెం, దలపోయ నేల? మది నంతన్ ముట్టి బిట్టేర్చెడిన్. 14.

అరుం — హా! కష్టము! ఈమె హృదయము చిర నిశ్వాస నిరోధంబుచే దుస్సహంబై యున్నది.

జన — హా! ప్రియసోదరీ! (కమండలు జలముఁ జల్లుచున్నాఁడు)

కంచు — గీ. వర సఖుఁడు పోలెఁ దొల్త నేక రసమైన
యానుకూల్యంబు సుఖదమై యలవరించి
పున రకాండ దారుణ వివర్తనముఁ జెంది
దైవ మకట! మనోవ్యాధి దవులఁజేసె. 15.

నిచయీకృత = పోగుగాఁజేయఁబడిన, ఆహిత = పొందఁబడిన, పునః = తిరిగి, అకాండ = నిష్కారణముగా, దారుణ = భయంకరమైన, వివర్తనమున్ = మార్పును, ఏకరసము = ఇతరముచే భిన్నముగాని రసము.

కౌస—(తెల్వినొంది) హా! వత్సా! జానకీ! యెచ్చట నుంటివి? వివాహ లక్ష్మీ పరిగ్రహాలంకృతంబై సముజ్జ్వల ధవళ మధురహాసం బయిన నీ సుందర ముఖారవిందంబుఁ దలఁపోయుచుంటిని. విస్ఫుర చ్చంద్ర చంద్రికాభిరామంబు లగు నీ యంగములచే మరల నో పుత్రీ! నా యంకతలంబు నలంకరింపుము. ఇత్యాది 'రఘుకుల కూటస్థులకుం గోడ లయ్యును జనకానుబంధంబున మనకు మాత్రము బుత్రికయే' యని నిరంతరంబు మహారాజు పలుకుచుండును.

కంచు—దేవి పల్కినట్లే.—

గీ. బిడ్డ లయిదుగు రయిన భూవిభున కరయ
బహుళ సమ్మోదకారి సుబాహువైరి
నలువు రైనను గోడండ్రు వెలయ నతని
కాంత యగు సీత హితురాలు శాంతవోలె. 16.

జన—హా! ప్రియసఖ! మహారాజ దశరథ! సర్వవిధంబుల మనోరముఁడ వగు నిన్నెట్లు మరతును?

మ. ధరణిం గన్నియ తండ్రు లల్లుని నిజాప్తశ్రేణి నర్చింతు రా
సరణిల్ మారె మనందు; నీవె నను వాంఛ ల్మీఱఁ బూజించి తా
స్థిరశీలుండవు పోతి కాలమున, మా సెన్ బంధుతా బీజ మున్,
నరకాభీల జగంబునం దఘునిధిన్ నాజీవితం బేటికిన్. 17.

కౌస—పుత్రీ! జానకీ! దృఢ వజ్రలేపంబుచే నుప నిబద్ధ మైనట్లు సుస్థిరంబగు నా దుష్టజీవితంబు నిర్భాగ్యురాల నగు నన్ను విడిచి పోవుట లేదు.

అరుం—ఊరడిల్లుము రాజపుత్రీ! ఎడనెడ నశ్రు విశ్రామంబు నాచరింపనగు. మఱియు బుశ్యశృంగాశ్రమంబున మీ కులగురుండు "తగని దుఃఖము సంభవించినను శుభోదర్కంబు గాఁగల" దని పల్కిన వాక్య మేల స్మరింపవు?

కౌస—భగవతీ! అడియాస మించినది.

అరుం—రాజపుత్రీ! దాని మృషావాక్యమని యే తలంచెదవా? సుక్షత్రియా! అన్యథా తలంపరాదు. నిక్కముగా జరిగి తీరఁ గలదు.

చంద్రిక = వెన్నెల. అశ్రువిశ్రామంబు = కన్నీళ్ళనరికట్టుట, శుభోదర్కము = శుభము రాబోయెడు రాఁగలకాలము, మృష = అబద్ధము.

గీ. విస్ఫుర ద్బ్రహ్మతత్త్వులౌ విప్రవర్యు
లాడు సూక్తుల సందియ మంద వలదు ;
భద్రయగు లక్ష్మి వీరల వాణి నిల్చు ;
వ్యర్థవాక్యంబు వీరలు బల్క రెపుడు. 18.

తెఱలోఁ గలకలము—అందఱు నాకర్ణింతురు.

జన—ఈనాఁడు శిష్టానధ్యాయ మని మిక్కుటముగాఁ గ్రీడించు బ్రహ్మచారుల కలకల మిది.

కౌస—బాల్యంబు మాత్రము సులభ సౌఖ్యమైనది. (నిరూపించి) వీరిలో రామభద్ర కౌమార లక్ష్మీ పరిశోభితంబులై మంజులోదార సుందరంబు లగు నంగములచే మన నేత్రములఁ జల్లఁజేయు నీ బాలకుం డెవ్వఁడు ?

అరుం—(స్వగతము ఆనంద బాష్పములతో) ఇదే!! భాగీరథీ నివేదిత రహస్య కర్ణామృతము. కాని యాయుష్మంతు లగు కుశ లవులలో వీఁ డెవ్వఁడో యెఱుంగను.

జన—

మ. అసితేందీవర పత్ర కాంతుఁడు, శిఖండాలంకృతుండు, న్విభూ
తి సమగ్రుండు, దనూరుచిన్ వటుసభన్ దీపింపఁగాఁ జేయుచుం
బసమై వత్స రఘూద్వహుండు మరలం బాలత్వముం దాల్చెనా
వెసఁ గానంబడు వీఁ డెవండొ? కనులన్ వే వే సుధం బూసెడిన్. 19.

కంచు—ఈ డింభకుఁడు క్షత్రియ బ్రహ్మచారి యని తలంచెదను.

జన—ఇట్లే యిది. కాననే—

మ. వెనుకం జుంచు దగుల్ గఱుల్ వెలయ నిల్పెం దూణముల్ క్రేవలం,
బ్రణుతోరస్స్థలిఁ దాల్చె భస్మ రురు చర్మంబుల్ బవిత్రంబు, బా

నివేదిత = చెప్పఁబడిన, అసితేందీవరపత్రము = నల్లకలువరేకు, శిఖండము = జుట్టు, చుంచు = జుట్టు, గఱుల్ = బాణముయొక్క ఱెక్క, తూణములు = బాణములు, క్రేవలన్ = ప్రక్కలను, ప్రణుత = స్తోత్రపాత్రమగు, ఉరస్స్థలిన్ = వక్షస్స్థలమందు, భస్మ = విభూతియు, రురుచర్మంబు = లేఁడితోలు, పవిత్రంబు = యజ్ఞోపవీతమును, దాల్చెను.

వన మాంజిష్ఠ మయాంతరీయమును మూర్వా మేఖలం గట్టెఁ, గే
లను గోదండముఁ బ్లక్షదండ జపమాలా కంకణంబుల్ గొనెన్. 20.

భగవతీ! అరుంధతీ! వీఁ డెచ్చటివాఁడో యూహింతువా?

అరుం—మే మిప్పుడే గదా వచ్చితిమి!

జన—ఆర్య! గృష్టి! నాకు మిగుల వేడుక పొడముచున్నది. కాన వాల్మీకి భగవానునే చేరి యడుగుము. "ఎవ్వరో వృద్ధులు నిన్నుఁ జూడఁ గోరుచుండి" రని యీ బాలకున కెఱింగింపుము.

కంచు—మీ రాన తిచ్చినట్లే. (నిష్క్రమించును.)

కౌస—ఇట్లాహూతుఁడై యరుదెంచు నందువా?

అరుం—ఇట్టి నిర్మాణంబునకు సౌశీల్యంబు భేదించునా?

కౌస—ఎట్లు? వినయాకర్ణిత గృష్టి వచనుండై మునికుమారుల విడిచి యా డింభకుం డిట్లెదురు వచ్చుచుండెనే?

జన—(చాలతడవు పరికించి) ఓహో! యేమిది?

చ. వినయ శిశుత్వ మౌగ్ధ్య పరివేష్టిత పేశల మైన వీని యా
సున మహిమంబు నేర్పరులు గాని యెఱుంగరు మూర్ఖులేని, నా
మనము ప్రమూఢ మైన బలమండితుఁడై హరియించె వీఁడు, హె
చ్చున నినుమున్ గ్రహించు లఘుచుంబక ఖండము పోల్కి నెంతయున్. 21.

లవుఁడు—(ప్రవేశించి తనలో) పూజ్యులైనను నామ క్రమాన్వయంబులం దెలియక నాయంత నెట్లు నమస్కరింపఁ గలను? (యోజించి) ఇదిమాత్ర మవిరుద్ధ పద్ధతి యని వృద్ధుల వలన వినంబడెడి. (వినయముతోఁ జేరి ప్రకాశముగా) ఇదే! మీకు లవుని శిరఃప్రణామశైలి.

అరుం—జన—కల్యాణనిధీ! ఆయుష్మంతుఁడవు గమ్ము.

కౌస—వత్సా! దీర్ఘాయువవు గమ్ము.

మాంజిష్ఠమయ=పసుపు రంగుతోఁ గూడిన, అంతరీయమును=ఉత్తరీయమును, మూర్వా మేఖల = మూర్వ యను గడ్డితోఁ జేయఁబడిన మొలనూలు, ప్లక్షదండము = రావిపుల్ల, ఆహూతుఁడై = పిలువఁబడినవాఁడై, పరివేష్టిత = ఆవరింపఁబడుటచేత, పేశల=మృదువయిన. ప్రమూఢమైనన్=ఎక్కువ మూర్ఛలో నున్నను, లఘుచుంబక ఖండము = తేలికయగు సూదంటురాయి.

అరుం—తనయా ! రమ్ము. (లవుని దొడపై నిడుకొని స్వగతము) సంతోషము ! చిర కాలమునకు నా యుత్సంగమే కాదు మనోరథంబుఁ గూడ సంపూర్ణమైనది.

కౌస—పుత్రా! యిటుగూడరమ్ము. (కౌఁగిలించుకొని స్వగతము) ఓహో! దరవికస్వరేందీవర మాలికా శ్యామలోజ్జ్వలంబైన దేహబంధంబునసే కాక, కబళిత కమల కింజల్క కాదంబ మధుర గళ రవోదార దీర్ఘస్వరంబునను రామభద్రు ననుకరించి యుండె. వికచారవింద గర్భ మంజులం బైన యీ కుమారుని తనుస్పర్శంబు నట్టిదియే. (ప్రకాశము) వత్సా ! ఆయుష్మంతుఁడా ! నీ ముఖచంద్రు నాలోకింతును. (చుబుకము నెత్తి కన్నీళ్ళతో సాభిప్రాయముగానవధరించి) రాజర్షీ ! చూడవేమి ? నిపుణముగఁ బరికింప నితని ముఖము వత్స యగు జానకి ముఖచంద్రునితో సరిపోలు చున్నదే ?

జన—చూచుచుంటి నమ్మా చూచుచుంటిని.

కౌస—ఓహో ! నా చిత్త మున్మత్త మైనదియుం బోలె నెద్దియో చింతించుచు మిగులఁ జంచలించుచున్నది.

జన—(స్వగతం)

చ. ధరణిజ రూపమున్ రఘువతంసుని కాంతియు నికుమారు నన్
విరివిగఁ బూర్ణభంగిఁ బ్రతిబింబిత మైనటులం దరర్చె, వా
క్సౌరతి, నిసర్గ నమ్రతయు, నిర్మల సత్త్వము సైత మల్లదే !
యరిమురి నాదు చిత్త మడియాసలఁ బాఱుచు నుండె హా ! విధీ! 22

కౌస—వత్సా ! కలదా నీకుఁ దల్లి ? తలఁపోయుదువా తండ్రిని ?

లవు—లేదు.—

కౌస—అట్లయిన నీ వెవ్వరివాఁడవు ?

లవు—భగవానుఁడగు వాల్మీకి సంబంధుఁడను.

కౌస—ఓవత్సా ! వక్తవ్యముఁ జెప్పుము.

లవు—ఇంతవఱకే యెఱుంగుదును.

(తెఱలో) ఓహో ! సైనికులారా ! "ఆశ్రమప్రాంత భూమి నెవ్వండు నాక్రమింపరా" దని యీ కుమార చంద్రకేతుఁ డానతిచ్చుచున్నాఁడు.

దర=యించుక, వికస్వర=వికసించిన, ఇందీవర=నల్లకలువవలె, శ్యామల=నలుపుచేత, ఉజ్జ్వలంబై=ప్రకాశించునదియై, కబళిత=తినఁబడిన, పద్మకేసరములు గల, కాదంబ=కలహంసలయొక్క, మధురమైన-చుబుకము=గడ్డము.

అరుం—జన—ఓహో ! యజ్ఞాశ్వరక్షణార్థమై యరుదెంచిన చంద్రకేతు కుమారుఁ డిపుడు చూడఁదగినవాఁడు. ఆహా ! సుదినము.

కౌస—వత్సయగు లక్ష్మణుని పుత్త్రుఁ డాజ్ఞాపించు చుండె నని సుధాబిందు సుందరంబు లగు నక్షరంబులు వినవచ్చుచున్నవి.

లవు—ఆర్యా ! ఈ చంద్రకేతుఁ డన నెవ్వరు ?

జన—దశరథ పుత్త్రు లగు రామ లక్ష్మణుల నెఱుంగుదువా ?

లవు—వారే రామాయణ కథానాయకులు.

జన—అట్లయిన నెట్లెఱుంగవు ? ఆలక్ష్మణుని కుమారుఁడే యీ చంద్రకేతుఁడు.

లవు—ఊర్మిలానందనుఁడా ! అట్లయిన జనకరాజర్షి దౌహిత్రుఁడు.

అరుం—'నవ్వి' కుమారుండు కథా ప్రపంచంబు వెల్లడించె.

జన—నీ విట్టి కథా కోవిదుండ వేనిఁ జెప్ప మడుగుచుంటిమి. ఆదశరథాత్మజుల కే పేరిటి నందను లేభార్యలందు జన్మించిరి ?

లవు—ఈ కథా విభాగము మేముగాని యొరులుగాని వినియుండ లేదు.

జన—ఏమి ? కవి రచింపలేదా ?

లవు—రచించె. వెల్లడించలేదు. అందలిదే యేకదేశము సందర్భాంతరమున సరస రూపకంబుగా నిర్మించి స్వహస్త లిఖిత మగు నాగ్రంథమును వాల్మీకిభగవానుఁడు తౌర్యత్రిక సూత్రి కర్త యగు భరతమునికిఁ బంపె.

జన—ఎందులకు ?

లవు—ఆ మ్మహాత్ముఁడు దాని నచ్చరలచే నభినయింపఁ జేయు నని.

జన—ఇది యెల్ల మాకు సాకూతముగాఁ గానఁబడుచున్నది.

లవు—వాల్మీకి భగవానునకు దీనియందు మిగుల నాదరము. కొందఱి శిష్యులచే నీ పొత్తమును భరతాశ్రమంబున కనిపె. వారికి సహాయుఁడై ప్రమాద నివారణార్థముగా ధనుర్ధారి యగు మా సోదరుం డంపఁ బడియె.

కౌస—నీకు సోదరుఁడుఁ గూడఁ గలఁడా ?

లవు—కలఁడు, ఆర్యుఁడగు కుశుఁడు.

కౌస—పెద్దవాఁడనుచుంటివే ?

తౌర్యత్రికము = నృత్తము, వాద్యము, గీతము, సాకూతము = అభిప్రాయగర్భితమయిన.

లవు—ఔను ప్రసవ క్రమంబున నతఁడు జ్యేష్ఠుఁడు.

జన—కవలా దీర్ఘాయువులు ?

లవు—ఔను.

జన—చెప్పుము. ప్రబంధ కథా నిర్మాణమున కవసాన మేది ?

లవు—అనృత పౌరాపవాద విత్రస్తుఁ డగు భూపాలుని చేఁ బరిహరింపఁబడి సన్నిహిత ప్రసవ వేదన యగు యజ్ఞభూనందనియగు సీతాదేవిని లక్ష్మణుఁ డొంటిగా నరణ్యమున విడిచి మరలి చనె. ఇది.

కౌస—హా ! వత్సా ! సుందరేందుముఖి ! ఏకాకిని వగు నీ తనూ కుసుమమున కిప్పు డెక్కడి దైవ దుర్విపాక పరిణామ మాపతిల్లెను ?

జన—హా ! వత్సా ! —

గీ. అభినవాభీల పరిభవం బంది నాఁటి
ప్రసవ కాలిక వేదన బడలి నీవు
ఘాతుక మృగంబు లెల్లెడఁ గవియ నడలి
పలుమరును నన్ను శరణని తలఁతు నిజము. 23.

లవు—(అరుంధతితో) ఆర్యురాలా ! వీ రెవ్వరు ?

అరుం—ఈమె కౌసల్య, ఇతఁడు జనకుఁడు.

లవు—(బహుమాన ఖేద కౌతుకములతోఁ జూచుచున్నాఁడు.)

జన—ఓహో ! పురజనుల దౌరాత్మ్యము ! ఓహో ! రామభూపతి సాహస కృత్యము?

ఉ. ఏపున వజ్రఘోర మగు నీవ్యసనంబును సారె జూచు నా.
కోపము చాప శాపముల గుప్పున మండఁగఁ గాల మిద్దియే !

కౌస—భగవతీ ! రక్షింపు రక్షింపు. కుపితుఁ డగు రాజర్షి నుపశమింపఁ జేయుము.

అరుం— గీ. మహిఁ బరాభవ మందిన మానధనుల
హృదయ మెల్లవిధంబుల నిట్టు లుండు
భూపతీ ! పుత్త్రపముఁడు రాముండు నీకుఁ
బాలనీయులు దీనులౌ ప్రజలు తలఁప. 24.

విత్రస్తుఁడు = మిక్కిలి భయపడినవాఁడు, దౌరాత్మ్యము = దుర్మార్గము,

జన— చాపము శాప మేల సుతసన్నిభుఁడౌ రఘురామునం, దయో
ధ్యాపురి బాల వృద్ధ వికలావనిదేవ సతీ మయంబగున్. 25.

బ్రహ్మచారులు— (త్వరతోఁ బ్రవేశించి) కుమారా! అశ్వ మశ్వమని యేదో యొక భూతము దేశంబుల విన వచ్చుచున్నది. అది మా కిపుడు ప్రత్యక్ష మైనది.

లవు—అశ్వ మని పశు శాస్త్రమందును, సమర విద్యయందును బఠింపఁబడును. ఇది యెట్టిదియో చెప్పుఁడు.

బ్రహ్మ—వినుము—

మ. అలరుం దుంటికి జల్లితోఁక ; యది యల్లల్లార్చు నెల్లప్పుడుం ;
గలుగుం దానికి దీర్ఘకంధరము ; డెక్కల్ నాలుగే నుమ్మ ; చా
యలఁ బోచల్ దిను ; మావికాయలకు నీడౌ లద్దులల్ వెల్చు ; వ్యా
ఖ్యలి వేలా ? కడు వేఁగ బోవుదను రమ్మా ! రమ్మ దత్వేగడిన్. 26.

(సమీపించి అజినమును హస్తములను లాగుచున్నారు.)

లవు— (కౌతుక కోపరోధ వినయములతో) ఆర్యులారా! చూడుఁడు, చూడుఁడు. వీరిచే నాకర్షింపఁబడుచుంటిని. (త్వరతోఁ బరిక్రమించుచున్నాఁడు.)

అరుం—జన—వత్సా ! వేడుకనిండింపుము.

కౌస—భగవతీ ! వీనినవలోకింపక జీవింప నని తలంతును. కాన నింకొక మేర కరిగి మరలి పోవు నాయుష్మంతునిం జూతము.

అరుం—దన్ని చనిన చంచలుం డెట్లు కానవచ్చును ?

కంచుకి— (ప్రవేశించి) " దీని మీరు సమయమున నెఱుంగఁ దగు " నని వాల్మీకి భగవానుఁ డానతిచ్చె.

జన—ఇది యేదో మహాగంభీరముగానున్నది. భగవతీ ! అరుంధతీ ! సఖీ ! కౌసల్యా! ఆర్య ! గృష్టి ! మనయంత నరిగి వాల్మీకి భగవానునిం గనుంగొందము.

(వృద్ధవర్గము నిష్క్రమించెను.)

బ్రహ్మ—కుమారా ! ఆవిచిత్రముం జూడుము.

లవు—చూచితిని. తెలిసినది. నిక్కముగా నీ యశ్వ మశ్వమేధీయము.

వికల=అంగవైకల్యము కలవారు, అవనిదేవ=బ్రాహ్మణులు. కంధరము=కంఠము. అశ్వమేధీయము = అశ్వమేధసంబంధమయినది.

బ్రహ్మ—ఎట్లైతింగితివి?

లవు—ఓమూర్ఖులారా! శ్రౌతాశ్వమేధ కాండమునఁ బఠింపఁబడినదే! చూడరేమి! వేర్వేఱుగా శతసంఖ్య గల్గుకవచవంతులు, దండహస్తులు, తూణధారులు, రక్షింపఁ గలరు. ఈసైన్యంబు నట్లనే కానవచ్చుచున్నది. ఇందు నమ్మకము లేదేనిఁ బోయి యడుగుఁడు.

బ్రహ్మ—ఓహో! ఈ యశ్వము సేనాపరివృతంబై యెందులకై తిరుగుచున్నది?

లవు—(అపేక్షతోఁ దనలో) ఆహా! అశ్వమేధ మని విశ్వవిజేతలగు క్షత్రియులకు బలవత్తరంబును, సర్వభూపాల పరిభావకంబును, నగు మహామహిమ. నిశ్చయము.

(తెఱలో) క. "తురగ మిది సప్తలోకో
త్తర వీరుం డైన పరవదన కుల మాలో
ద్ధరణుని పతాక యొ? భయం
కర మై తగు వీరఘోషణంబో యననా." 27.

లవు—(వ్యథతో) ఓహో! అక్షరంబు లుద్దీపనంబులుగా నున్నవి.

బ్రహ్మ—ఏమందుము? ప్రాజ్ఞుఁడుగదా కుమారుఁడు!

లవు—ఏ మట్లు పల్కుచుంటివి? క్షత్రియ శూన్యమా పృథివి?

(తెరలో) "అరే! మహారాజుముందు క్షత్రియు లెక్కడ?"

లవు—ఛీ! మూర్ఖులారా!

గీ. ఉండిరే నటు వారల నుండనీయుఁ
డీ విభీషిక జూపుట యెందుకొఱకుఁ?
బలు పలుకులేల? దగ్గరి బలిమిఁబట్టి
కడఁగి హరియింతు మీ పతాక నిదె! నేను. 28.

ఓహో! వటువులారా! లోష్టములఁ గొట్టి యీ తురంగమును మరలింపుఁడు. ఇది[illegible]కుక్క లేక రోహిత మృగంబులతోఁ జరించుఁగాత!

పురుషుఁడు—(క్రోధ దర్పములతోఁ బ్రవేశించి) ఏమీ చపలత్వము?—ఏమి చెప్పితివి? తీవ్ర నిర్దయంబు లగు నాయుధీయ పఙ్క్తులు డింభకుఁడు పల్కునట్టి దృప్త వాక్యమును సైరింపవు. ప్రసన్నాపూర్వారణ్యావీక్షణానంద పరాయత్త చిత్తుఁడై యుండు వైరిమర్దనుం డగు రాజపుత్త్రుండు చంద్రకేతుఁడు చనుదెంచు నంతలో వేవేగ నీ నిబిడారణ్యమునఁ దొలఁగిపొండు.

విభీషిక = బెదరింపు, దృప్త = గర్వముతోఁగూడుకొనిన.

బ్రహ్మ—కుమారా ! చాలు నీ తురగముతో; సముజ్జ్వల శస్త్రంబు లగు నాయుధీయ పరంపరలు కుమారుని దర్శించు చున్నవి. ఇప్పటి కాశ్రమస్థానము దూరము కాన రమ్ము లేడిగంతులతోఁ బరుగెత్తుకొని పోవుదము.

లవు— (నవ్వి) శస్త్రము లేమి ప్రజ్వలించుచున్నవి ? (ధనువెక్కిడి)

మ. స్థిర దంష్ట్రోత్కట కోటి మధ్య విచల జ్జిహ్వోజ్జ్వల చ్ఛింజినీ
స్ఫురి తోద్గారి ఘనాళి ఘర్ఘర రవ స్తోమాస్పదంబై, చరా
చర భూత గ్రసనోద్య దంతక హాస చ్చండాస్య యంత్రప్రభా
స్వర జృంభా విపులోదరం బగుచు నీ చాపంబు దీపించుతన్. 29.

(వికటముగాఁ బరిక్రమించి అందఱు నిష్క్రమింతురు.)

కౌసల్యా జనక యోగ మను
చతుర్థాంకము,
సంపూర్ణము.

స్థిర=దృఢమైన, దంష్ట్ర=కోరలవలె, ఉత్కట=భయంకరమగు, కోటి = చాపాగ్రముల యొక్క, మధ్య=మధ్యమందు, విచలత్ =చలించుచున్న, జిహ్వా = నాలుకవలె, ఉజ్జ్వలత్ =ప్రకాశించుచున్న, శింజినీ=నారివలన, స్ఫురిత =వెడలుచున్న, ఉద్గారి = తేనుపువంటి, ఘనాళి=మేఘసముదాయము యొక్క, ఘర్ఘరరవ=ఘర్ఘర ధ్వనుల యొక్క, స్తోమ = సముదాయమునకు, ఆస్పదంబై = స్థానమై, చరాచరభూత గ్రసన = ప్రపంచభక్షణమందు, ఉద్యత్ = ప్రయత్నించుచున్న, అంతక = యముని యొక్క, హాసత్ = అట్టహాసము చేయు, చండ = భీకరమగు, ఆస్యయంత్ర = యంత్రమువంటి ముఖము యొక్క, ప్రభాస్వర =మిక్కిలి వికసించిన, జృంభా=ఆవులింతవలె, విపుల = విశాలమయిన, ఉదరంబగుచు = మధ్యభాగము గలదై, ఈ చాపంబు—దీపించుతన్ =ప్రకాశించుఁగాక !

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

పంచమాంకము.

(తెరలో) ఓహో ! సైనికులారా ! కల్గినది మన కాధారము గల్గినది.

గీ. సరభస సుమంత్రి చోదనో త్తరళ జవన
హయ రథముతోడ మన కయ్య మాలకించి
చంద్రకేతుండు విషమ భూచలిత కోవి
దార తరు కేతుఁడై యిదే ! తరలి వచ్చె. 1.

(అద్భుత హర్ష సంభ్రమములతో ధనుర్ధరుండగు చంద్రకేతుండు సుమంత్రి సారధికం బగు రథంబునం బ్రవేశించును.)

చంద్ర—ఆర్య ! సుమంత్రా ! చూడు చూడు ! —

మ. సముదంచ న్మృదు పంచచూడుఁ డగు నోజశ్శాలి యీ బాలుఁ, డీ
సమరక్షోణి నుపాత్త రోష లవ రజ్య ద్వక్త్ర లక్ష్మీకుఁడై,
నమితోద్దామ శరాసనాగ్రములు సాంతత్యంబునం మోయ సై
న్యముపై బాణ తుషారముం బరపె నుద్య త్ప్రౌఢి వీఁ డెవ్వఁడో ? 2.

చోదన = తోలుటవలన, ఉత్తరళ=పరుగెత్తుచున్న, జవన = బలిష్ఠమయిన, విషమభూచలిత=ఎచ్చుతగ్గు భూములయందు చలించుచున్న, సముదంచత్ = ఒప్పుచున్న, పంచచూడుఁడు = పంచశిఖలుకలవాఁడు, ఓజశ్శాలి = తేజోవంతుఁడు, ఉపాత్త = పొందఁబడిన రోషముయొక్క, లవ=లేశమువలన -ఎఱ్ఱఁబారిన- ముఖ- శోభగలవాఁడై, నమిత=వంచఁబడిన.. విల్లుయొక్క - కొనలు - ఎడతెగక - ధ్వనిచేయఁగా, తుషారము = మంచు.

చ. ముని జన బాలుఁ డొక్కఁడు చమూ తనుభాగము లెల్ల నుల్లస
ద్ఘన గజ గండ పిండ గురు ఘాతజ టంకృతి భీకరార్భటిన్
మునుకొని బాణసంఘముల ముంచుచు మున్ విదితంబుగాని నూ
తన రఘురాట్కులాంకుర విధంబున నాకు ముదంబు గూర్చెడున్. 3.

సుమం—ఆయుష్మంతుఁడా! —

గీ. క్షితి సురాసుర మహిమల నతిశయించి
నీకు సమరూపుఁ డైన వీని దిలకించి
కౌశి కాధ్వర వైరి సంగ్రామ మందు
ధనువుఁ దాల్చిన రఘునందనుని స్మరింతు. 4.

చంద్రి—వీని నొక్కని గూర్చి పలువురికిఁ గార్యారంభ మని డెందము లజ్జించుచున్నది.

చ. సమర విధాన నిర్వహణ శక్త కరాంచల దీప్త శస్త్రసం
ఘములును, నిక్వణ ద్బహుళ కాంచన కింకిణికా ఝణంఝణ
త్తుముల రథంబు, లిద్ధ మద దుర్దిన కుంజర వారిదంబు లౌ,
సమిత బలంబులం బిహితుఁ డయ్యెడి నీ సుకుమారుఁ డెక్కటిన్. 5.

సుమం—కుమారా! వీర లంద ఱేకీభవించిన వీని కేమి? —విచ్చిరేని మనుపే లేదు.

చంద్రి—ఆర్యా! త్వరపడుము త్వరపడుము. ఇతఁడు మన సైనికుల హింసింపఁ జొచ్చె. అల్లదే!

చమూతను భాగములు=సేనాంగములు, ఉల్లసత్=ప్రకాశమానమగు, గొప్పవయిన - ఏనుఁగులయొక్క - చెక్కిళ్ళయందలి- ఉండలయొక్క - గొప్పదగు - దెబ్బవలన - పుట్టిన - టంకారధ్వనియొక్క - భయంకరమగు - చప్పుడులతో, ఎదిరించి.

కరాంచల = చేతికొనలయందు, నిక్వణత్ = ధ్వనిచేయుచున్న, కింకిణికా = చిఱుగంటలయొక్క, తుముల=విస్తారములగు, ఇద్ధ=ప్రశస్తమైన, మద =మదముచేత, దుర్దిన=మునురుగాఁజేయఁబడిన, కుంజర = ఏనుఁగులనెడు, వారిదంబులౌ = మేఘములుగల, పిహితుఁడు = ఆవరింపఁబడినవాఁడు, ఎక్కటిన్ = అసహాయుఁడై.

చ. గురుతర దుందుభి ధ్వని విఘూర్ణితమై, గిరికుంజ గుంజ దు
ద్ధుర మద కుంజర శ్రవణ దుస్సహమా గుణఘోష మెల్లెడం
జెలఁగుచు, లోల భీషణ కబంధ శిరంబులఁ దృప్త కాల భీ
కర ముఖ భుక్తశేషముల కైవడి నింపె నితండు భూములన్. 6.

సుమం—(తనలో) ఇట్టి వానితో నర్భకుం డగు చంద్రకేతునకు ద్వంద్వయుద్ధ మె ట్లుసమ్మతింతును? (యోజించి) లేదా? ఇక్ష్వాకు గృహవృద్ధులముగదా మేము! సంభవించి నప్పు డేది గతి?

చంద్ర—(విస్మయ లజ్జా సంభ్రమములతో) ఛీ! నాసైన్యంబు లెల్ల మరలి పోయినవి.

సుమం—(రథవేగము నభినయించుచు) ఆయుష్మంతుఁడా! ఇదే! ఆ వీరుండు నీకు వాగ్గోచరుఁడయ్యె.

చంద్ర—(విస్మృతి నభినయించి) ఆర్యా! ఆఖ్యాయకులు వీనినామధేయము నేమని తెల్పిరి?

సుమం—లవుఁ డని.

చంద్ర—గీ. అద్దిరా! లవ! శూర! మహాభుజాంక!
నీకు ఫలమేమి యిట్టి సైనికులతోడ?
ఇదిగో! నే వచ్చినాఁడ న న్నెదురు మిపుడు
తేజము శమించుఁగాక! మా తేజమందు. 7.

సుమం—కుమారా! చూడు చూడు.

గురుతర=మిక్కుటమగు, దుందుభిధ్వనిచేత, ఘూర్ణితమై=ప్రతిధ్వని చేయుచున్నదై, గిరి=పర్వతములయందలి, కుంజ=పొదలయందు, గుంజత్=ధ్వనిచేయుచున్న, ఉద్ధుర=విశేషమైన, మదకుంజర=మదపుటేనుఁగులయొక్క, శ్రవణ=చెవులకు, దుస్సహమా=సహింప శక్యముగాని, గుణఘోషము=నారియొక్క ధ్వని ఎల్లెడంబులఁగుచు, లోల=చలించుచున్న, భీషణ=భయంకరమగు, కబంధ=మొండెములచేతను, శిరంబులన్=తలలచేతను, తృప్త=సంతృప్తిజెందిన, కాల=యముని యొక్క, భీకర=భయంకరమగు, ముఖ=నోటిచే, భుక్తశేషములకైవడిన్=తినిపెట్టఁబడినవానివలె, వాగ్గోచరుఁడు=కేకకందునట్టి దూరమున నున్నవాఁడు, ఆఖ్యాయకులు=చెప్పువారు.

గీ. నీవు జీరిన తోడ సైనిక వనంబు
మాని యీ బాలవీరుండు మరలి వచ్చె;
ఘన నినాదంబు విని గజాఘాత మడిగి
వడి నెదురు దృప్త సింహ శాబకము వోలె. 8.

(పిదప వేగోద్ధత క్రముండై లవుండు ప్రవేశించును.)

లవు—మంచిది కుమారా! మంచిది. నిక్కముగా నైక్ష్వాకుండ వైతివి. కాన నిదిగో! యెదుర వచ్చితిని. (తెఱలో గొప్ప కలకలము) (రోషముతో వెనుక మరలి) ఆఁ! ఇపుడు పరాజితు లయ్యును సమర వర్తు లగు సేనాధినాథు లందఱును మరలి వచ్చి చుట్టువారి చెండుచుండిరేమి? ఛీ! మూర్ఖులారా!

చ. ప్రళయ మరుద్విభగ్న జలరాశి ఘురంబును బోలె నెల్లెడం
గొలగొలఁ జుట్టుముట్టుకొని ఘూర్ణిలు సైనిక ఘోష మున్నతా
చల పరిఘాత సంక్షుభిత సంకుల బాడబ వక్త్ర పావకో
జ్జ్వలిత మదీయ రోష సముదార శిఖాహుతి నొందు గావుతన్. 9.

(పరిక్రమించును.)

చంద్ర—ఓహో! కుమారా!

చ. అతివిపులాద్భుతంబు నిడునట్టి గుణాతిశయంబుఁబట్టి స
మ్మతుఁడవు గాన మిత్రుఁడవు మాయది నీయది గాదె! కాన నీ
గతి నిజభృత్యులందు రణకాంక్ష లివేటికి? నీపరాక్రమా
యతి కిదె చంద్రకేతుఁ డరయన్ నికషంబుగ వచ్చె నేడ్తెరన్. 10

చీరిన=పిలిచిన, ఘననినాదంబు=మేఘధ్వని, గజాఘాతము=ఏనుగునుచంపుట, దృప్త=గర్వించిన, శాబకము=పిల్ల, ప్రళయకాలమందగు వాయువుచేఁదునుఁగఁగొట్టఁబడిన సముద్రప్రవాహమువలె, అంతటనావరించి ధ్వనిచేయు సేనాధ్వని, ఉన్నత=ఎత్తయిన, అచల=కొండయొక్క, పరిఘాత=తాకుడువలన, సంక్షుభిత=కలఁతపెట్టఁబడుటచేత, సంకుల=వ్యాపించిన, బాడబవక్త్రపావక=బడబాగ్నివలె, ఉజ్జ్వలిత=మిక్కిలిమండుచున్న, మదీయ=నాయొక్క, రోష=కోపమనెడు, సముదార=విశేషమయిన. శిఖా=జ్వాలకు.

ఈపద్యమున, లవకుమారుని బర్వతముగాను, చంద్రకేతు సైన్యమును సముద్రముగాను, వీరి సంఘర్షణమువలన వెలువడు లవుని రోషాగ్నిని బడబానలముగాఁ బోల్చి సైన్యజలములను హరించుచుండెనని వర్ణింపఁబడినది, ఆయతికి=అతిశయమునకు, నికషము=ఒరపిడిరాయి.

లవు— (హర్ష సంభ్రమములతో మరలి) ఓహో! మహానుభావుఁ డగు భాస్కర కుల కుమారుని సౌమ్య నిష్ఠురం బగు వీరవాక్ప్రయోగము! కాన వీరితో నేమి? వీని నే బహూకరించెదను. (మరలఁ దెఱలోఁ గలకలము) (క్రోధనిర్వేదములతో) ఆరే! వీరసంవాదమున కంతరాయము గల్గించు నీ పాపాత్ములచే నిరర్థకుండ నయితిని. (సేనవైపునకుఁ బరిక్రమించుచున్నాఁడు)

చంద్ర—ఆర్యా! యీ దర్శనీయముం గనుంగొనుము.

చ. మును ఘనమోద దర్పములు బొందఁగ నాయెడ బద్ధలక్ష్యుఁడై,
వెనుక మదీయ సైన్య పరివేష్టితుఁడై విలునెక్కువెట్టు ని
య్యనఘుఁడు, మారుతద్వయ సమాహతమై యురియాడు గోత్రభి
ద్ధను రభిదీప్తమైనజలదంపు సిరిన్ ధరియించె మించుగన్. 11.

సుమం—కుమారుఁడే వీనిఁ దేరి చూచుటకైనఁ బరిజ్ఞాత; మేమో కేవల విస్మయ పరవశులము.

చంద్రి—ఓహో! రాజులారా!

చ. అగణిత వాహ కుంజర శతాంగ నివిష్టులు, వర్మితాంగులుం
బ్రగుణ వయోతిరిక్తు లగు వారలు మీ, రితఁ డొక్కరుండు, బా
దగుఁడుఁ బవిత్రచర్మ పటధారి, కిశోర తనుండు, వీనితో
మొగకొనఁజేయు సన్నహనముం గన మీకును మాకు సిగ్గగున్. 12.

లవు— (కష్టముతో) ఇయఁ దలఁచెనా యేమి? (చింతించి) ఔఁగాక! కాలహరణ నివారణార్థమై జృంభకాస్త్రంబుచే నిపుడు సైన్యముల మూర్ఛిల్లఁ జేసెదను. (ధ్యానము నటించును.)

మారుతద్వయ = రెండుగాలులచే, గోత్రభిద్ధనుః = ఇంద్రధనుస్సుచేత, అభిదీప్తమైన = ప్రకాశించుచున్న, జలదంపు సిరిన్ = మేఘముయొక్క శోభను.

అగణిత = లెక్కలేని, వాహ = గుఱ్ఱములను, కుంజర = ఏనుఁగులను, శతాంగ = రథములను, నివిష్టులు = ఎక్కినవారు, వర్మితాంగులు = కవచములు ధరించినవారు, ప్రగుణ = మంచిగుణములచేతను, వయః = వయస్సుచేతను, అతిరిక్తులు = మించినవారు. చర్మపటధారి = చర్మమే వస్త్రముగాఁ గలవాఁడు, కిశోరతనుఁడు = పిన్న వయసువాఁడు.

సుమం—అదేమి ? సైన్యఘోష మాకస్మికముగాఁ జల్లారినది ?

లవు—ఈ దర్పనాతు నిపుడు చూచెదను.

సుమం—వత్సా ! యీ కుమారకుఁడు జృంభకాస్త్ర మామంత్రించె నని తలంతును.

చంద్ర—ఇందు సందియం బేమి ?

గీ. ఇరులు మెఱపులు వెఱపార బెరసినట్లు
గాంచు కను మిరుంగి విడిచిన గతిఁ గలంచెఁ
జిత్తరువు పోల్కి బలముల చేష్ట లుడిపె
నౌ ! మహాతేజ మగు జృంభకాస్త్ర మొలసె. 13.

సుమం—ఆశ్చర్య మాశ్చర్యము ?

మ. బలి సద్మాంతర కుంజ పుంజిత తమః పరిస్ఫారముల్, తప్త పి
త్తల పింగద్యుతి దీపితంబు లగు నుద్యజ్జృంభకాస్త్రంబులం
బ్రళ యాభీల మహా మరు చ్చలములౌ వార్వాహ విద్యుత్పిశం
గ లసత్కందర వింధ్యకూటముల జోకన్ మిన్ను గప్పంబడెన్. 14.

వీనికీ జృంభకాస్త్రంబు లెందుండి వచ్చినవి ?

చంద్ర—భగవంతుఁ డగు ప్రాచేతసుని నుండి యని యూహింతును.

సుమం—వత్సా ! ఈతని కస్త్రవ్యవహారము లేదు. జృంభక సాంప్రదాయము మును పే లేదు. ఏమన ?

గీ. ఇవి భృశాశ్వ నపత్యంబు లీభృశాశ్వు
నుండి కుశికతనూభవు నొద్దఁ జేరె

ఇరులు=చీఁకట్లు, ఒలసె=ప్రకాశించెను, బలిసద్మాంతర=పాతాళమునందలి, కుంజ=పొదరిండ్లయందు, పుంజిత=కూడుకొనిన, తమః=చీఁకట్లయొక్క, పరిస్ఫారముల్=ఎక్కువలు, తప్త=కరిగిన, పిత్తల=ఇత్తడియొక్క, పింగ=పసిమివర్ణముయొక్క, ద్యుతి=కాంతిచేత, దీపితంబులు=ప్రకాశించునవియునగు, ఉద్యత్=ప్రకాశమానములయిన, జృంభకాస్త్రంబులచేతను, ప్రళయ=ప్రళయకాలమందయిన, ఆభీల=భయంకరమగు, మహా=గొప్పవయిన, మరుత్=వాయువులచేత, చలములౌ=చలించుచున్నట్టివగు, వార్వాహ=మేఘములయొక్క, విద్యుత్=మెఱుపులచేత, పిశంగ=పచ్చనైన, లసత్=ఒప్పుచున్న, కందర=గుహలుగల, వింధ్య=వింధ్యపర్వతముయొక్క, కూటము=శిఖరములయొక్క, జోకన్=రీతిని, మిన్ను=ఆకాశము, కప్పంబడెన్=ఆవరింపఁబడెను. అపత్యంబులు=సంతానములు.

నంతటఁ దదీయ సంప్రదాయంబు వలన
రామభద్రుని యందుఁ దిరంబులయ్యె. 15.

చంద్ర—నిరతిశయోజ్జ్వల సత్త్వ ప్రకాశు లగు మఱికొందఱు మాత్ర దర్శనులుఁ గూడఁ దము దామ చూచుచుందురు.

సుమం—వత్సా ! జాగరూకుఁడవు గమ్ము. వీరశేఖరుండు మరలివచ్చె.

లవు—చంద్ర—(పరస్పరము దమలో) ఓహో ! సౌమ్యదర్శనుం డీ కుమారుఁడు !

(స్నేహానురాగములతోఁ జూచి)

మ. ఇది యాదృచ్ఛికమో ? గుణాతిశయ సాహిత్యంబో ? జన్మాంతరా
భ్యుదిత ప్రాక్తన సాంద్ర సౌహృద రసంబో ? దైవతంత్రంబునన్
మదిలో వేద్యముగాక యున్న నిజబాంధవ్యానుబంధంబో ? నా
హృదయం బీతని గాంచి నంతనె సమాకృష్టం బగున్ బ్రేల్మిడిన్. 16.

సుమం—ఒకొక్కని కొక్కొక్కనియెడల సరసానురక్తి గల్గుట తఱచుగాఁ బ్రాణిధర్మము. దీనినే తారామైత్ర మనియుఁ జక్షూరాగ మనియు లౌకికులు వ్యవహరింతురు. అట్టి ప్రేమ నవిజ్ఞేయమనియు నిర్హేతుకం బనియుఁ బలుకుచున్నారు.

గీ. వీతహేతుక మగు పక్షపాతమునకుఁ
దగు ప్రతిక్రియ యెందును దారసిల్ల
దదియె స్నేహాత్మకపు సూత్ర మగుచు జనుల
హృదయ మర్మప్రదేశంబు లెల్లఁ గూర్చు. 17.

చంద్ర—లవు—(అన్యోన్యము స్వగతము.)

గీ. ఉల్లిఖిత రాజపట్ట విద్యుత్తులు గమ్ము
నితని నెమ్మిన బాణంబు లెట్లువిడుతు ?

యాదృచ్ఛికమో=స్వేచ్ఛాసంభవమో, సాహిత్యంబో=తృప్తియో, జన్మాంతరమునుండి, అభ్యుదిత=పుట్టిన, ప్రాక్తన=పురాతనమైన, సాంద్ర=దట్టమైన, సౌహృదరసంబో=ప్రేమసారమో, వేద్యముకాక యున్న=తెలియని, సమాకృష్టంబు=ఆకర్షింపఁబడినది, ప్రేల్మిడి=చిటికెలో, వీతహేతుకము=కారణరహితము, రాజపట్టము=ఆభరణవిశేషము.

దీని డాసిన పరిరంభ తృష్ణవలన
నాదు తనువెల్లఁ బులక సంతతులఁ బెరసె. 18.

చ. అనుగత ఘోర వీర్యమెడ నస్త్రముగాక మఱేది దిక్కు? పెం
పెనసిన యస్త్రమేటికి కిఁక నిట్టి శరవ్యము నాటదేని? యే
మను నితఁడే శరంబుఁగొన నాజి దొరంగిన నన్ను? స్నేహ వ
ర్తనము దొలంచు దారుణతరం బగు వీర విహార మెన్నఁడున్. 19.

సుమం—(లవునిఁ జూచి కన్నీళ్ళతోఁ దనలో) హృదయమా! వేఱు తలంతువేమి?

క. తొలుత మనోరథ బీజము
పొలిసెన్ విధివశము వలనఁ; బూర్వంబె విని
ర్దళితం బగు లతకూనకుఁ
గలుగునె కుసుమోదయంబు కడుఁ జింతింపన్. 20.

చంద్ర—ఆర్య! సుమంత్రా! రథమునుండి దిగుచుంటిని.
సుమం—కారణంబేమి?

చంద్ర—ఈ వీరపురుషుండు పూజితుండగును. మఱియు నార్యా! క్షాత్రధర్మ మనుగ్రహింపఁ బడిన దగును. "పాదచారునితో రథికు లాయోధనం బొనర్ప" రని శాస్త్రవేత్తలు పలుకుచున్నారు.

సుమం—(తనలో) కట్టా! కష్టదశను బొందినవాఁడ నైతి.

క. నినుబోటి పురుషుఁ డేగతిఁ
బనివడి ధర్మక్రమంబు వలదని మాన్పున్;
ఘన సాహసైక రస మనఁ
జను కృత్య మొనర్ప నెట్లు సమ్మతిఁ గాంచున్. 21.

చంద్ర—తాతమిత్రులు సయితమ్ముఁ దండ్రికిఁ బ్రియసఖుండ వగు నార్యునే ధర్మసంశయంబులం దడుగుచుందురు. అట్టి యార్యుఁడే విమర్శింపకుచుండ నేమి?

దీని = ఈశరీరమును, బెరసె = వ్యాపించెను, శరవ్యము = బాణమునాటుట కర్హమైనస్థానము, వినిర్దళితంబగు = తుంపఁబడిన, ఆయోధనము = యుద్ధము.

సుమం—ఆయుష్మంతుఁడా ! ధర్మ్యమే తలంచితివి.

క. ఇదియే సమరన్యాయం
బిదియె సనాతన మనంగ నెసఁగిన ధర్మం
బిదియే రఘుసింహంబుల
సదమల శౌర్యాపదాన సరణియు సుమ్మా. 22.

చంద్ర—ఆర్యవచన మనురూప మైనది.

క. ఇతిహాసములుఁ బురాణ
ప్రతతియు విఖ్యాత ధర్మవచనంబులు వి
శ్రుత రఘురాజ కుటుంబ
స్థితియును మీ హృదయమునకు తెలియునుగాదే ? 23.

సుమం—(స్నేహ బాష్పములతోఁ గౌఁగిలించుకొని)

ఉ. నందన ! యింద్రజిజ్జయసనాథుఁడు బాలుఁడు నీదు తండ్రి పెం
పొందఁగ జన్మమంది యిపు డొయ్యన నెన్ని దినంబు లయ్యెఁ ? ద
న్నందనుఁడుం బ్రవీర చరితంబు గ్రహల్చుచు నుండెనా ! దశ
స్యందను నన్వయంబు మునుమారఁ బ్రతిష్ఠ వహించె నయ్యరో ! 24.

చంద్ర—(కష్టముతో)

గీ. క్షితి రఘుజ్యేష్ఠుఁ డప్రతిష్ఠత వహింప
మొనయునె ప్రతిష్ఠ మాకులంబున కటంచుఁ
దక్కు మువ్వురు మాతండ్రు లొక్క భంగి
నుల్లమునఁ బెల్లు దురపిల్లుచుందు రెపుడు. 25.

సుమం—ఆహాహా ! ఈ చంద్రకేతు వచనంబులు హృదయ మర్మముల భేదించు చున్నవి.

లవు—ఆహా ! రసవర్తనము సంకీర్ణముగా నున్నది.

చ. అలరు సుధాంశునందు ముదమందు కుముద్వతి వోలె వీనియం
దలరె మదీయ తృప్తి, కలహప్రియఘోరకఠోరధాటి ను

అపదానము=చారిత్రము, అప్రతిష్ఠత=సంతానము లేకపోవుట, సంకీర్ణము=కలగలుపు, సుధాంశుఁడు = చంద్రుఁడు, కుముద్వతి=కలువ, కలహప్రియ = యుద్ధము నిష్టపడెడు, ఘోర = భయంకరమగు, కఠోర=తీక్ష్ణమైన, ధాటిన్=శౌర్యముచేత.

చ్చలిత ఝుణంఝుణ క్వణిత దారుణ సార గుణోరుచాపమై
జ్వలిత విభీషణోల్బణ రసంబగు నా భుజ మాజిఁ గోరెడిన్. 26.

చంద్ర—(దిగుచు) ఆర్యా! సవితృవంశ్యుఁడగు చంద్రకేతుఁడు నమస్కరించుచున్నాఁడు.

సుమం—గీ. గమన శాశ్వత దివ్య వరాహమూర్తి
దుర్జయంబుఁ బవిత్రంబు నూర్జితంబు
నైన తేజంబు నీకు శ్రేయంబు కొఱకుఁ
గొడరఁ జేయుత నల కకుత్స్థునకుఁబోలె. 27.

మఱియు—

న. పరముఁడు గోత్రకర్త యగు భానుఁడనిన్ నిను హెచ్చరించు, నీ
గురువులకుం గురుండు సనఘుండు వసిష్ఠుఁడు నిన్ను మెచ్చు, శ్రీ
హరి సురపాగ్ని మారుత ఖగాధిప తేజముఁ బెందు నిన్ను, బం
ధురతర రామ లక్ష్మణ ధనూరవ మంత్రము జిష్ణుఁ జేయుతన్. 28.

లవు—కుమారా! తేరుననుండియే మిగుల శోభిల్లుచుంటివి. చాలు చాలు సత్యాదరము.

చంద్ర—అట్లయిన మహాత్ముండు గూడ వేఱొక రథంబు నలంకరించుఁగాక!

లవు—ఆర్యా! రథముపై రాజపుత్త్రి నధిష్ఠింపఁ జేయుము.

సుమం—చంద్రకేతు వచనమును నీవుఁ గూడ ననుసరింపుము.

లవు—నా యుపకరణంబుల యెడల నభ్యంతరం బేమి? మఱేమన? మే మరణ్యవాసులము గాన రథచర్య నెఱుంగము.

సుమం—వత్సా! దర్ప సౌజన్యముల యథోచితంబుగా నిర్వహింప నభిజ్ఞుండవు; ఇట్టి నిన్ను నైక్ష్వాక నృపాలుండగు రామభద్రుండు విలోకించెనేని వాని హృదయంబు సౌహార్దంబుచేఁ గరఁగి యుండెడిది.

ఉచ్చలిత = మిక్కిలి కదలుచున్న, ఝుణంఝుణక్వణిత=ఝుణఝుణయనిధ్వని చేయుచున్న, దారుణ=భీకరమగు, సార=సత్త్వముగల, గుణ = నారిగల, ఉరు = గొప్పదియగు, చాపమై = ధనుస్సుగలదై, జ్వలిత = ప్రజ్వలించుచున్న, విభీషణ = మిక్కిలి భయంకరముయొక్క, ఉల్బణ = అతిశయముతోఁ గూడిన, ఊర్జితంబు = బలవత్తరమైనది.

(శ్రీ)హరి = వైష్ణవాస్త్రము, సురప = ఐంద్రాస్త్రము, అగ్ని = ఆగ్నేయాస్త్రము, మారుత = వాయువ్యాస్త్రము, ఖగాధిప = గారుడాస్త్రము.

లవు—ఆర్యా ! ఆరాజర్షి సుజనుం డని వినవచ్చెడి (లజ్జతో)

వ. అరయఁగ మేము నిట్టి క్రతుహంతల మేనియుఁ గాము ; ధాత్రి న
న్నరపతి నే నరుఁడు సుగుణంబుల మన్నన సేయకుండు ? నా
నరుసఁ దురంగ రక్షకుల వాక్య మశేష నృపావళీ తిర
స్కరణ కఠోరమై నను వికారము నొందఁగఁ జేసె నేఁడిఁకన్. 29.

చంద్ర— చిఱునవ్వుతో ఏమీ నీకుఁ బిత్రృ విక్రమోత్కర్షంబునం గూడ నమర్షమా?

లవు—ఇం దాగ్రహం బుండనీ, లేకపోనీ, ఇది ని న్నడుగుచుంటిని. రఘుకులేశ్వరుండు దాంతుఁడని విందుము. అతఁడు దను దాన గర్వింపఁడు. వాని ప్రజలయందును దర్పంబు సంభవింపదు. అట్లుండఁ దత్సేవకులు రాక్షస వచన మేల పల్కిరి?

గీ. తపసు లున్మత్త దృప్తుల దారుణంపు
భాషితము రాక్షస మటంచుఁ బలుకుచుంద్రు,
సర్వ విద్వేషములకు బీజ మగు నదియె,
యెల్ల భువనంబునకు నదియే యలక్ష్మి. 30.

ఇట్లు వీనిని నిందించుచుఁ దదితరముల స్తోత్రము చేసిరి.

గీ. కోరిక లొసంగు, నవలక్ష్మిఁ బాఱఁద్రోలు,
యశముఁ గను, దుష్కృతంబు రూపఱఁగఁ జేయు
నట్టికల్యాణజనని, సత్యంపు వాణి
ధీరులు వచించెదరు కామధేనువనుచు. 31.

సుమం—పావన స్వభావుండును, బాలిచేత నాంతేవాసియు నగు నీ కుమారకుండార్ష సంస్కారంబునం బరిపూర్ణంబుగాఁ బలుకుచున్నాఁడు.

లవు—చంద్రకేతూ ! "నీకుఁ బిత్రృ విక్రమోత్కర్షంబునం గూడ నమర్షమా" యని పలికినదానిం గూర్చి ప్రశ్నించుచుంటిని. క్షత్రధర్మములు నియమిత విషయంబులా యేమి ?

సుమం—ఐక్ష్వాక సార్వభౌము నించుకేని యెఱుంగవు గాన జాలింపు మతిప్రసంగము జాలింపుము.

దాంతుఁడు = అంతరింద్రియనిగ్రహముగలవాఁడు, ఉన్మత్తులు = పిచ్చివారు, దృప్తులు = గర్వితులు, అలక్ష్మి = పెద్దమ్మ, అంతేవాసి = శిష్యుఁడు.

క. నిక్కము సైనిక వీరుల
నుక్కణఁచి పరాక్రమంబు నొలయించితి వీ
వక్కట ! భార్గవ దమనుని
చక్కటి మితిమీఱి పల్కసరళంబగునే ? 32.

లవు— (నవ్వుచు) ఆర్యా ! ఆభూపాలుఁడు భార్గవ దమనుఁడని యీశ్లాఘనం బేటికి ?

చ. ద్విజులకు భాషణంబునసె వీర్యము గల్గు నిసర్గశైలి; భూ
భుజుల కుదార బాహువులఁ బొల్పగు వీర్యము; శస్త్రపాణియున్
ద్విజుఁడును నైన భార్గవుని పెంపణఁగించి రఘూద్వహుం డనిన్
విజయముఁ గాంచె నంచుఁ బృథివీపతి కేమి యశంబు దానిచేన్. 33.

చంద్ర— (ఉన్మత్తునివలె) ఆర్య ! ఆర్యా ! చాలు నుత్తరోత్తరంబుల;—

మ. భగవంతుం డగు భార్గవుండు నుతికిం బాత్రుండు గాఁ డేనికిన్?
జగతీ సప్తక నిర్భయాకలన దీక్షా దక్షిణాపూర్ణతం
దగు నైక్ష్వాక నరేంద్ర పావన చరిత్రంబుల్ వినం డెవ్వఁ ? డా
నుగుణాం డి ష్టితఁ డెవ్వఁడో ? నవ మహాశూరావతారంబొకో ? 34

లవు—రఘునరేంద్రుని చారిత్ర మహత్వంబు లెవ్వఁ డెఱుంగఁడు ? కాని యించుక వివరించ వలయునా ?

ఉ. చాలును; వారు వృద్ధు లవిచార్య చరిత్రు లటంచు వర్ణనం
బేల ? సుబాహు మాత్ర హనన నేద్ధ యశుల్ ధర నమ్మహామహుల్;
బాలిశు ఖరాజి మూఁడడుగులన్ మును ద్రొక్కుట, నేర్పుతోడుతన్
వాలిని ద్రుంగ జేయుటయు వారికి లోకమె ఱుంగ కున్నదే ? 35

చంద్ర—అఁ ! పితృదూషణాతిలంఘితమర్యాద ! మితిమీఱి ప్రగల్భంబు లాడుచుంటివి !

లవు—ఓహో !నాయెడలనే భ్రుకుటీధరుండయ్యె.

దమనుఁడు = జయించినవాఁడు, హనన = చంపుటయందు, ఇద్ధ=ప్రసిద్ధము యిన, యశుల్ = కీర్తికలవారు, ఖరుని తోయుద్ధము చేయునప్పుడు, శౌర్యపద్ధతికివిరుద్ధముగా రామభద్రుఁడు మూఁడడుగులు వెనుకకు జంకెను. దాని నేయచ్చట హేళనగా మునుద్రొక్కియని పలికినాడు. భ్రుకుటీధరుఁడు = కనుబొమలు ముడివయిచినవాఁడు,

సుమం—వీరికిఁ గ్రోధ ముద్భిన్న మైనది. అల్లదే !

చ. కరకరిఁ బుట్టు కంపము శిఖావలయంబు గదల్పుచుండెఁ; గ
ట్టెఱుపు వహించి కన్నుగొన లేర్పడెఁ జెందొవ రేకులట్టు; లు
త్తరళము లైన భ్రూకుటులఁ దాల్చి మొగంబు పరిఫుల్ల లాంఛన
స్ఫురిత హిమాంశునిన్ భ్రమర శోభిత సారసమున్ హసించెడిన్. 38.

లవు—చంద్ర—కాన నిందుండి సమర సమ్మర్దోచిత ప్రదేశంబుఁ జొత్తము.

(అందఱు నిష్క్రమింతురు.)

కుమార విక్రమ మను పంచమాంకము,

సంపూర్ణము.

కరకరిన్=క్రూరభావమున, శిఖావలయంబు=జుట్టుముడి, చెందొవ=ఎఱ్ఱకలువ, ఉత్తరళములయిన=మిక్కిలి చటులమయిన, పరిఫుల్ల=వృద్ధిబొందిన, లాంఛన=మచ్చచేతను, స్ఫురిత=తెలుపుచేయఁబడుచున్న, హిమాంశునిన్=చంద్రుని, భ్రమర=తుమ్మెదలతో, శోభిత=ప్రకాశింపఁజేయఁబడిన, సారసమున్=పద్మమును, హాసించెడిన్.

ఆంధ్రీకృతోత్తర రామచరితము.

షష్ఠాంకము.

(పిదప నుజ్జ్వల విమానముతో విద్యాధర మిథునము ప్రవేశించును.)

విద్యాధర—ఓహో! అకాండ కలహ ప్రచండులై, పరిమండిత క్షాత్ర లక్ష్మీకులగు మార్తాండ కుల కుమారుల విక్రమ చరిత్రంబులు దేవాసురాశ్చర్య ధుర్యంబులై వర్ధిల్లుచున్నవి ; అల్లదే! ప్రియా! చూడు చూడు!

చ. కలిత ఝణంఝణా రణిత కంకణ నిక్వణ కింకిణీ సమా
కుల గురు శింజినీ ముఖర కోటి కరాల విరావ చాప మ
గ్గలముగ వంచి, చంచల శిఖుల్ నిగుడన్ విశిఖంబు లేయువీ
రల భువనైక భీమ సమరంబు విచిత్రగతిం బ్రవర్ధిలెన్. 1.

క. ఉభయుల శుభమునకై దుం
దుభి నాదము దివిని మొరసె దుందుమ్మనుచున్
విభవమున నభ్రరవ స
న్నిభమై గాంభీర్య మాననీయం బగుచున్. 2.

కావున నిరంతర నిబిడ మంజుల వికసిత హేమారవింద భాసుర శ్రేణిరై, దేవతరు తరుణ మణి ముకుళ నికర మకరంద బిందు సుందరంబగు కుసుమ వర్షంబు వీరిపైఁ బఱగింపుము.

అకాండ=కారణములేని, రణిత = ధ్వని చేయుచున్న, నిక్వణ=ధ్వనితోఁ గూడిన, కింకిణీ=చిఱుగంటలచే, శింజినీ=ధనుస్సుయొక్క, ముఖర = ధ్వని చేయుచున్న, కోటి = ధనురగ్రములతో, కరాల= భయంకరముగ, విరావ = మిక్కిలి ధ్వని చేయుచున్న, విశిఖంబులు= బాణములు, సన్నిభము = సమానము, నిబిడ= దట్టమైన.

విద్యాధరి—హా! ఘటిత తటి చ్ఛటా పింగళంబై యంబరం బింతలో నిట్లయ్యె నేమి ?

విద్యాధర—ఇప్పు డేమోగదా యిది !

గీ. త్వష్టృ యంత్ర పరిభ్రమి భ్రమ దఖండ
చండ మార్తాండ మండలోద్దండ మైన
యంతకాంతక దుస్సహోదగ్ర విపుల
తీక్ష్ణ లాలాట వీక్షణోన్మేష మొక్కొ ? 3.

(యోజించి) ఆఁ! తెలిసినది ; చంద్రకేతు కుమార ప్రయుక్త మగు నాగ్నేయాస్త్రము. దానిదే యి మ్మహోజ్జ్వల జ్వాలా ప్రసారము. ఇప్పుడు—

గీ. జ్వలిత శబలిత చామర ధ్వజము లగుచుఁ
దొలఁగి పోయె విమాన మండలము లవిగొ !
కేతనాంకుర చేలాంత కీల లహహ !
నిమిష కుంకుమ లేప విభ్రమముఁ దాల్చె. 4.

దారు ణాశని శకల పరిస్ఫుటన పటుతర స్ఫులింగ రూపుండై, యుద్భటాకీర్ణ లేలిహాన కీలా సంఘాత భీకరుండును, భగవంతుండు నగు వైశ్వానరుండు ప్రజ్వలించు

తటిత్ = మెఱుపు యొక్క, ఛటా = పఙ్క్తి చేతను, పింగళంబై = పసిమివర్ణముకలదియై. త్వష్టృ=త్వష్టప్రజాపతి యొక్క, యంత్ర = చక్రయంత్రము యొక్క, పరిభ్రమి=తిరుగుటచేత, భ్రమత్=తిరుగుచున్న, అఖండ=విశేషమగు, చండ = తీక్ష్ణమగు, మార్తాండ = సూర్యుని యొక్క, మండల=గోళమువలె, ఉద్దండమైన= అతిశయమైన, అంతకాంతక = శివుని యొక్క, దుస్సహ = సహింపశక్యముగాని, ఉదగ్ర = అతిశయమయిన, విపుల=విశాలమయిన, తీక్ష్ణ = కరుకగు, లలాట=ఫాలమందుఁగల, వీక్షణ=దృష్టి యొక్క, ఉన్మేష మొక్కొ = తెరచుటయో- అనునట్లున్నది యాగ్నేయాస్త్రమని భావము.

జ్వలిత = మండుటచేత, శబలిత = పసపుగాఁ జేయంబడిన, కేతనాంకుర = జండాకొనలయందుఁగల్ల, చేలాంతకీలలు=గుడ్డలకొనలయందలి మంటలు, అశనిశకలము= పిడుగుముక్క, లేలిహానము = నాకుట, కీలాసంఘాతము = మంటల సముదాయము.

చుండె. వీని సంతాపము సర్వతోముఖంబై యుచ్చండమై యున్నయది. కానఁ జేరియసిని నెమ్మనఁ గప్పి దవ్వుగఁ దొలంగుదును. (అట్లు చేయుచున్నాఁడు)

విద్యాధరి—సంతోషము! విమల మౌక్తిక సర తుషార మసృణ మాంసలం బగు ప్రియగాత్ర స్పర్శంబున నానంద మీలితోద్భ్రాంత నేత్ర నగు నాసంతాప మంతరిత మైనది.

విద్యాధర—సుందరీ! నే నిం దే మొనర్చితిని?

క. ఇంచుకయుఁ జేయకున్నను
ద్రుంచున్ సౌఖ్యములచేత దుఃఖము లెల్లం
బ్రాంచత్ప్రియజన మనఁగా
నెంచఁగ రానట్టి ద్రవ్య మిల మనుజునకున్. 5.

విద్యాధరి—నిబిడ చంచలోద్భ్రాంత తటి ల్లతా విభ్రమాలంకృతంబులై, సమద నీలకంఠ కంఠ శ్యామలంబు లగు వలాహకంబులచే నంతరిక్ష మెల్ల వేల్లితం బయ్యె నేమి?

విద్యాధర—సుందరీ! ఇది లవకుమార ప్రయుక్త వారుణాస్త్ర ప్రభావము. ఏమి? అవిరళ ప్రవృత్త వారి ధారా సహస్ర సంప్రసారములచే నాగ్నేయాస్త్రంబు జల్లారి నట్లున్నది.

విద్యాధరి—నాకు సంతోషముగా నున్నది.

విద్యాధర—అన్నన్నా! అన్ని యెడల నతివృత్తి దోషాస్పదము. విపుల ఝంఝానిల క్షోభ గంభీర గుణగుణాయమాన ఘనాఘనాకీర్ణాంధకార నీరంధ్ర నిబద్ధమై యుగప జ్జగ ద్గ్రసన విస్తీర్ణ భీషణ కాలకంఠ కంఠ కందరాస్థితంబునుం బోలెఁ, గల్పాంత యోగ నిద్రావిరుద్ధ సర్వద్వార నారాయణోదర ప్రవిష్ట మైనదియు నుంబోలె, భూతజాత మెల్ల నుద్విగ్న మగుచున్నది. మంచిది వత్సా! చంద్రకేతూ! మంచిది. యుక్తమే వాయవ్యాస్త్రముం బ్రయోగించితివి కావున—

గీ. తత్త్వ విజ్ఞానమున వివర్తంబు లెల్ల
బ్రహ్మయందును బోలె, బ్రభంజనమున

సర్వతోముఖము = అంతట వ్యాపించినది, మసృణ=నునుపయినట్టియు, మాంసల=బలిసినట్టియు, మీలితోద్భ్రాంత = మూసికొనుటచే భ్రాంతిఁ బొందిన. నీలకంఠ=నెమలి, వలాహకంబు = మేఘము, వేల్లితము = ఆవరింపఁబడినది. నీరంధ్రము = దట్టము, నిబద్ధమై = కూడినదై, యుగపత్ = ఒక్కమారుగా, గ్రసనము=మ్రింగుట. అవరుద్ధము = అడ్డగింపఁబడినది, ఉద్విగ్నము = చలించుట, వివర్తము=భ్రాంతికల్పితమైన యాకారకల్పము.

నంబుధర సంఘ మెల్ల ననంత మయ్యె
వింతదోపఁగ నేడనో విలయ మొందె. 6.

విద్యాధరి—నాథా! సరభసోన్నమిత హస్త భ్రమిత చేలాంచలుండై, దూరంబు నుండియే మధుర వచనంబులచే సమరానురోధంబు నిరోధించుచు నిప్పుడీ కుమారకుల నడుమ విమానమ్ము నవతరింపఁ జేయుచుండె నీతఁ డెవ్వరో గదా?

విద్యాధర—(చూచి) ఇతఁడు శంబూక వధాగతుఁ డగు దేవుండు రఘుస్వామి.

గీ. అమ్మహాత్ముని వచనమ్ము నాలకించి
గౌరవమ్మున ఘోర సంగ్రామ మాపి
లవుఁడు శాంతించెఁ, జంద్రకేతువును మ్రొక్కెఁ,
బతికి సుతసంగమమున భవ్యమగుగాక! 7.

కాన నిటనుండి మరలి పోవుదము. (నిష్క్రమింతురు.)

విష్కంభము.

(పిదప రాముఁడు లవుఁడు ప్రణతుఁ డగు చంద్రకేతుఁడుం బ్రవేశింతురు.)

రామ—(పుష్పకమునుండి దిగుచు)

గీ. సవితృకుల వారినిధి చంద్ర! చంద్రకేతు!
గాఢపరిరంభ మిమ్ము వేగముగ రమ్ము
హిమశకల శీత భవదంగకములచేత
నాదు మానసతాప మణంగఁ గాత! 8

(లేవ నెత్తి స్నేహ బాష్పములతోఁ గౌఁగిలించుకొని) దివ్యాస్త్ర ధర శరీర వకు నీకుం గుశలమా?

చంద్ర—అత్యద్భుత ప్రియుండును, ప్రియదర్శనుండు నగు లవుని లాభాభ్యుదయంబు తోడం గుశలము. కాన విన్నవించెదను. మత్తుల్యముగఁ గాని, మద్విశేషముగఁ గాని యీ మహావీరాగ్రణిం జనకుండు కటాక్షించుఁగాక!

సవితృకులము=సూర్యవంశము.

రామ— (లవునిం బరికించి) సంతోషము! కుమారుని వయస్యుం డత్యుదాత్త స్వరూపుఁడు.

మ. మురువుగ లోకముల్ కనుప మూర్తి ధరించిన యస్త్ర వేదమో?
కరుణ నజాండ గుప్తమునకై మెయి దాల్చిన క్షాత్రధర్మమో?
స్థిరతర శక్తిసంచయమొ? ధీర గుణ ప్రకరంబొ? వ్యక్తతా
కర మయి గోచరించెడి జగద్ఘన పుణ్య విధానరాశియో? 9

లవు—(స్వగతము) ఓహో! పుణ్యప్రభావ దర్శనుం డీ మ్మహాపురుషుఁడు!

గీ. భక్తి సౌహార్ద నిస్తులాశ్వాసములకుఁ
దారతర మైన కేవలాధార మనఁగఁ
గాయము ధరించి సర్వాతిశాయి యైన
యనఘ ధర్మప్రసాదమో యనఁగ వెలసె. 10.

ఆశ్చర్యము!

ఉ. వైరమణంగె, సౌఖ్య విభవ ప్రభవం బగు రాగ మెచ్చె, దు
ర్వార సగర్వ భావ మెడబాసె, ననున్ వినయంబు వచ్చె, ని
ప్పౌరుష శేఖరుం గని ప్రమోదమున న్వివశుండ నైతొ? శే
ద్వా, రుచిర ప్రభావుల మహత్త్వ మనర్ఘము తీర్థశేఖరిన్. 11.

రామ— (ఆత్మగతము) ఏకపదంబుననే దుఃఖంబు నుపశమింపఁ జేసె; ఏమి నిమిత్తముననో యంతరాత్మను క్షోభింపఁ జేయుచుండె, ఏమోగదా యిది? స్నేహము నిమిత్తాశ్రయం బనుట విరుద్ధము. కావుననే—

ఉ. అంతరహేతు వొక్కటి పదార్థములన్ సమకూర్చు చుండు న
త్యంతము; స్నేహముల్ బహిరుపాధుల నెన్నఁడుఁ గోరఁబోవు; భా
స్వంతుఁడు దోఁచు వేళ జలజంబు వికాసము నొందు, శర్వరీ
కాంతుఁడు గోచరింప శశికాంతము లీలఁ జెమర్పఁగా దొకో? 12.

లవు—చంద్రకేతూ! వీ రెవ్వరు?

వయస్యుఁడు = మిత్రుఁడు, గుప్తము = రక్షణము, సౌహార్దము = స్నేహము, ఆశ్వాసము = ఓదార్పు, అనర్ఘము = వెలలేనిది, భాస్వంతుఁడు = సూర్యుఁడు, జలజంబు = పద్మము, శర్వరీకాంతుఁడు = చంద్రుఁడు, శశికాంతము = చంద్రకాంతశిల;

చంద్ర—ప్రియవయస్య ! తాతపాదులుగదా !

లవు—నన్ను "ప్రియవయస్యా" యని పిల్చితివి గాన ధర్మసరణిచే నాకును నట్లే; మఱియు మీకిట్టి సంజ్ఞాభాజనంబు లగు మాననీయులు రామాయణ కథా పూరుషులు నల్వురుగదా ! అందు వీరెవ్వరో తెల్పుము.

చంద్ర—జ్యేష్ఠ తాతపాదు లని యెఱుంగుము.

లవు—(ఉల్లాసముతో) రఘుస్వామియా యేమి ? సంతోషము ! దేవర దర్శనంబున నేడు సుప్రభాతము. (వినయ కౌతుకములతోఁ బరికించి) తండ్రీ ! ప్రాచేతసాంతేవాసియగు లవుఁడు నమస్కరించుచున్నాఁడు.

రామ—ఆయుష్మంతుఁడా ! రమ్ము రమ్ము. (స్నేహముతోఁ గౌఁగిలించుకొని) ఓవత్సా ! వినయముతోఁ బనిలేదు. పెక్కుసారులు బిగ్గ గౌఁగిలింపుము.

గీ. పరిణతాపూర్ణ పుష్కరాంతర పలాశ
మసృణ మాంసల తర సుకుమార మైన
నీ తనుస్పర్శ మానంద నిలయ మయ్యెఁ
జంద్రి చందన నిష్యంద సరసమగుచు. 13.

లవు—(తనలో) నాయెడల వీరి కిట్టి యకారణ స్నేహము. నేనన్నో తెలియక వీరికే యపచార మొనర్చితిని. ఆయుధ పరిగ్రహము వలనకుదుస్సాహమునఁబ్రవర్తించితిని. (ప్రకాశముగా) తాతపాదు లిపుడు లవుని యజ్ఞానమును సైరింతురుగాక !

రామ—వత్సా ! అపరాధమేమి ?

చంద్ర—అశ్వానుచరుల వలనఁ దాత బ్రతాప ప్రకటన మాలకించి యీతండు పరాక్రమించె.

రామ—ఓయీ ! క్షత్రియజాతి కిది యలంకారమే కదా !

చ. ఇతర పరాక్రమంబు సహింయింపఁడు శూరుఁ డదే స్వభావమా
నతనికి ; నారయం బ్రకృతియందలి దౌట్యనక్షత్రిమంబు ; సం

తాతపాదులు = తండ్రిగారు, సుప్రభాతము = తెచ్చిన వేళమంచిది. (good morning) పరిణతా = పండుటచే, ఆపూర్ణ = లెస్సగానిండిన పుష్కర = పద్మము లోని, అంతరపలాశ = లోనిరేకువలె, చంద్రి = కర్పూరముయొక్కయు, చందన = మంచిగంధముయొక్కయు, నిష్యంద = ద్రవమువలె—సరసమగుచు.

తత కిరణంబులం దపన దైవత ముగ్రగతిం దపింప ది
క్కృతమును బోలె భానుమణి యేలొకొ? తేజము గ్రక్కనొక్కటన్. 14.

చంద్ర—ఆగ్రహంబు సైత మీ వీరునియందే శోభిల్లును. ప్రియవయస్య ప్రయుక్త, జృంభకాస్త్ర నిశ్చల స్తంభితంబు లగు సైన్యంబులం జనకుండు పరికించుఁగాక!

రామ—వత్స! లవా! అస్త్రంబు నుపసంహరింపుము. చంద్రకేతూ! నీవును బారవశ్య వ్యాకులితంబు లగు బలంబుల నూరడింపుము.

లవ—జనకుఁ డాజ్ఞాపించి నట్లే (ధ్యానమును నటించుచున్నాఁడు)

చంద్ర—ఆజ్ఞాప్రకారము. (నిష్క్రమించును)

లవ—అస్త్ర ముపసంహృతం బైనది.

రామ—వత్సా! రహస్యోపయుక్త ప్రయోగ సంహారంబు లగు నస్త్రంబులు శ్రౌత మంత్ర సమన్వితంబులు.

గీ. నలువ మున్నగు తొంటి పెద్దలు జగద్ధి
తంబు కొఱకు సహస్రాధికంబు లబ్ద
ములు దపముఁ జేసి నిజ తపోమూర్త తేజ
ములుగ విలసిల్లు నీ యస్త్రములను గనిరి. 15.

పిదప నీ మంత్రపారాయణోపనిషత్తును భగవంతుఁ డగు భృశాశ్వుండు సహస్రాధిక వత్సరాంతేవాసియుం గుశిక వంశ్యుండు నగు విశ్వామిత్రున కనుగ్రహించె. ఆభగవంతుఁడు నాకే ప్రసాదించె. ఇదే సంప్రదాయము. కుమారుని సంప్రదాయ మెద్దియో యడుగుచుంటిని.

లవ—మా యిర్వురి యస్త్రంబులు స్వయంప్రకాశములు.

రామ—(యోజించి) అసంభావ్య మేది? ప్రకృష్ట సుకృత పరిపాక సంభవం బగు నెద్దియో మహిమ యై యుండును. ద్వివచనం బెట్లు?

లవ—సోదరుల మేము కవలము.

రామ—అట్లయిన ద్వితీయుఁ డెవ్వరు?

తపనదైవతము = సూర్యుఁడు, భానుమణి = సూర్యకాంతశిల, స్తంభితము = కట్టువడుట, ఉపసంహృతము = ఉపసంహారము చేయఁబడినది.

తెరలో "భాండాయన! భాండాయన"

చ. అవలఁ జిరాయువై లవునకా! నరపాలక సైనికాళితోఁ
బవరము? మిత్రుఁడా! యిపుడు పల్కిన దేమవు? నానటందువా?
భువనములం దధీశ్వర సమున్నత శబ్దము మాయుఁగాక! నేఁ
డవుర! నరేంద్రశస్త్ర దహనానలి మించు శమించుఁ గావుతన్. 16

రామ—

ఉ. ఈతఁ డెవాఁడో? బంధుర మహేంద్రమణి స్ఫుట నీల దీప్తితో
నాతత కంఠనాదమున నంగమునం బులకల్ ఘటించి, నన్
నూతన మేచకాంబుద మనోహర గర్జిత నిస్వనోత్సవ
స్ఫీత నిబద్ధ కుట్మల విభిన్న కదంబము నా నొనర్చెడిన్. 17

లవు—ఇదిగో! యితఁడు నా జ్యేష్ఠుఁ డగు నార్యుఁడు కుశుఁడు; భరతాశ్రమము నుండి మరలి వచ్చె.

రామ—వత్సా! ఈ యాయుష్మంతు నిటు బిల్వుము.

లవు—అటులనే (పరిక్రమించును)

కుశు—(అద్భుత హర్ష ధైర్యములతో ధనువు నాస్ఫాలించుచు)

చ. హరి కభయం బొసంగి, మిహిరాత్మజుఁడౌ మను చంద్రుఁ డాదిను
ష్కర జనులం దహింపఁ దమ క్షాత్ర మహానలమున్ గెరల్చె భా
స్కర కుల ధారుణీశ్వరుల సంగర మబ్బిన యేని, మత్పరి
స్ఫురిత శిఖాస్త్ర దీప్త గుణ శోభిత చాపము ధన్యమౌ నిఁకన్. 18

(వికటముగాఁ బరిక్రమించుచున్నాఁడు.)

రామ—ఏమి! యీ క్షత్రియ డింభకుని విక్రమాతిశయంబు!

మించు = అతిశయము, నిస్వన = ధ్వని యొక్క, ఉత్సవ = సంతోషముతో, స్ఫీత = అధికముగా, నిబద్ధ = కూర్పఁబడిన, కుట్మల = మొగ్గలచే, విభిన్న = విరిసిన కదంబము = కడిమిచెట్టు, మిహిరాత్మజుఁడౌ మను చంద్రుఁడు = వైవస్వతమనువు, పరిస్ఫురిత = ప్రకాశించుచున్న, శిఖాస్త్ర = శిఖలను బాణములచే, దీప్త = ప్రకాశింపఁ జేయబడుచున్న, గుణ = నారిచే, శోభిత = అలంకరింపఁబడిన, చాపము = విల్లు.

వ. కరకరి చూడ్కి ధిక్కృత జగత్త్రియ సారత నొప్పె ; ధీర ని
ర్భర వికట ప్రచారము ధరానమన క్రమదక్ష మయ్యెఁ ; గన్
దెరవని బాలుఁడయ్యు ధరణీధర గౌరవమున్ ధరించె ; వీ
రరసమొ ? లేక దర్పమొ ? కరాళగతిం జనుదెంచె మూర్తమై. 19

లవు— (సమీపించి) ఆర్యా ! జయము.

కుశు—ఆయుష్మంతుఁడా ! ఈ యుద్ధవార్త యేమి ?

లవు—ఏదో కొంచెము ; ఆర్యుఁడు దర్పమును వీడి వీని యెడల వినయమున వర్తింపవలయు.

కుశు—ఏల ?

లవు—ఇదే ! దేవుం డగు రఘుస్వామి సమీపించియుండె. అతఁడు మన యెడ మిగుల ననురక్తుఁడై మీ సన్నిధానమ్ము నపేక్షించుచుండె.

కుశు—(ఊహించుచు) అతఁడు రామాయణ కథానాయకుం డగు బ్రహ్మాండ రక్షకుఁడా ?

లవు—ఔను.

కుశు—అమ్మహాత్ముండు ప్రార్థనీయ పావన చర్యనుండు. మన మెట్లు సమీపింపవలయునో నిశ్చయింపఁ జాల.

లవు—గురునిం బోలె నుపచారమున ;

కుశు—ఓయీ ! యెట్లిది ?

లవు—అత్యుదార సౌమ్యుండు నూర్మిళానందనుండు నగు చంద్రకేతుండు ప్రియమిత్రుఁ డని చెల్మితో నన్నుసేవించుచుండె. కాన నయ్యనుబంధమున నీ రాజర్షి ధర్మజనకుండు.

కుశు—రాజన్యు సండయ్యును వినయ మిపుడు నిరపవాద మైనది.

లవు—ఆర్యా ! స్వరూప ప్రభావ గాంభీర్య సంభావ్యమాన నానావిధ లోకాతీత మహాపదానుండగు నిమ్మహాత్మునిం బరికింతువుగాక !

కుశు— (పరికించి)

కరకరి = క్రూరభావము, ప్రచారము = నడక, ధరానమన = భూమినిగ్రుంగఁ జేయు, క్రియము = పద్ధతియందు, దక్షమయ్యె = తగినదయ్యెను, కరాళగతిన్ = భయంకరముగా, మూర్తమై = శరీరమునుదాల్చి, మహాపదానుండు = పూర్వచారిత్రము గలవాఁడు.

ఆ. అహహా ! సుప్రసన్న మగు శుభాకారంబు
పరమ పావన ప్రభావ మహహా !
దివ్యపాత్ర మందె తివిరి రామాయణ
కవి స్వకీయ వాక్ప్రకటనఁ జేసె. 20.

(సమీపించి) జనకా ! వాల్మీకిచేత సాంతేవాసియగు కుశుఁడు నమస్కరించు చున్నాఁడు.

రామ—ఆయుష్మంతుఁడా ! రమ్ము రమ్ము.

గీ. అమృత పరిపూర్ణ వారివాహంబుఁ బోలె
మసృణ బంధుర మైన నీ మంజు లాంగ
మును నిరంతర వాత్సల్య మనుగమింప
బిగియఁ గౌఁగిటఁ జేర్ప నే వేడ్కఁ గొనెద. 21.

(కౌఁగిలించి తనలో) ఈ డింభకుం డెవని కుమారుఁడు ?

శా. ప్రత్యంగ సుస్రవ మదీయ తను నిర్య త్స్నేహ సారాంశమో ?
ప్రత్యక్షాకృతిమై బహిస్స్ఫురితమై భాసిల్లు చైతన్యమో ?
అత్యానంద విజృంభణ క్షుభిత చిత్తాసార నిర్మాణమో ?
సత్యం బీ పరిరంభ మంగము సుధా సారాపగన్ ముంచెడిన్. 22.

లవు—జనకా ! మయూఖమాలి ఘోలసంతాపి యయ్యెం గాన నీ సర్జ తరు చ్ఛాయ యం దొకింతసేపు జనకుం డుపవేశించుఁగాక !

రామ—వత్సా ! నీ యిచ్చవచ్చినట్లే. (అందఱుఁ బరిక్రమించి కూర్చుందురు)

వారివాహము = మేఘము, మసృణ = నునుపగు, అనుగమింప = చూపుటకు, ప్రత్యంగసుస్రుత = ప్రతి అవయవములనుండి జాఱిన, మదీయ = నాయొక్క తను = దేహమునుండి, నిర్యత్ = బయలువెడలిన, స్నేహ = తేజోధాతువుయొక్క, సారాంశమో = పరిణామవిశేషమో ? అత్యానంద = సంతోషాతిశయముయొక్క, విజృంభణ = వికాసముచేత, క్షుభిత = తరవఁబడిన, చిత్త = హృదయముయొక్క, ఆసార = ద్రవముయొక్క, నిర్మాణమో = సృష్టియో, సుధాసారాపగన్ = అమృత సముద్రమునందు.

మయూఖమాలి = సూర్యుఁడు, ఘోలసంతాపి = లలాటమును బరితపింపఁ జేయు వాఁడు. సర్జతరుచ్ఛాయ = మద్దిచెట్టునీడ, ఉపవేశించుఁగాక = కూర్చుండునుగాక.

రామ — (తనలో)

గీ. అహహా! వినయ ప్రవర్తనమాదిగా నైత
మాసన స్థితి సంచరణాదు లైన
కుశ లవుల భావములు జ్ఞాన గోచరించె
బహుళ సామ్రాజ్య లక్షణాస్పదము లగుచు. 23.

మఱియు —

చ. ప్రతిజన రంజనీయ రుచి భాసుర దేహము సప్రయత్న సం
గత కమలా విలాసములు గాఢగతిన్ విలసిల్లఁ జేసె; సం
చిత మగు నచ్ఛరత్నమును జిత్రమయూఖములో యనంగ, వి
స్తృత వికచారవిందమును దివ్యమరంద లవంబులో యనన్. 24.

వీరియందుఁ బరిపూర్ణ మగు రఘుకుల కుమార సాదృశ్యంబు గానవచ్చుచుండె.

చ. తరుణ కపోత కంఠ తులితం బగు చామనచాయ మేను, భా
స్వర వృష భాంసముల్, సమ విభాసిత గాత్రములుం, బ్రసన్న కే
సరి నిభ నిశ్చలేక్షణ విసారము, మంగళ మర్దళ ప్రతి
స్ఫురణ మనోజ్ఞ ధీర రవముం బరికింప ముదంబుఁగూర్చెడిన్. 25.

(సూక్ష్మముగా నిరూపించి) ఓహో! వీరి యాకారము మమ్ములనే పోలి యుండలేదు..

చ. అమరఁగ నీ శిశుద్వయమునందు ధరాతన యానురూప రూ
పమును బ్రవీణ దృష్టి నెఱపన్ విశదంబుగఁ దోఁచుచుండె, సం
భ్రమమున నూతనాంబుజ రమా విలస ద్దయితా ముఖంబు నే
త్రములకు నేటికి న్మరల దర్శన మిచ్చిన భంగిఁ దోఁచెడిన్. 26.

ఆసనము = కూర్చుండుట, స్థితి = ఉనికి, సంచరణము = ప్రవర్తనము, మయూఖము = కిరణము, విస్తృత = విశాలమైన, వికచారవిందము = వికసించిన పద్మము, మరందలవము = పూఁదేనె, కపోతము = పావురము, తులితము = సమానము, కేసరి = సింహముతో, నిభ = సమానమయిన, విసారము = వ్యాప్తి, మర్దళము = మద్దెలము, ప్రతిస్ఫురణ = జ్ఞప్తికిఁదెచ్చుచున్న, ధరాతనయ = సీతతో, అనురూప = పోల్పఁదగిన, రమా = శోభచేత, విలసత్ = ప్రకాశించు, దయితా = భార్యయగు సీతయొక్క.

గీ. మౌక్తిక స్వచ్ఛ దంత రుఙ్మధుర మైన
యధరమును గర్ణపాశంబు నవియె కావె?
నయనములు రక్త నీల వర్ణంబు లైన
నమల సౌభాగ్యసద్గుణం బదియె కాదె ? 27

ఇది ప్రాచేతసావాస మగు కాంతారము; ఇచటనే దేవి పరిత్యజింపఁ బడియె. ఈ కుమారుల యాకార మిది. అస్త్రములు స్వతఃప్రకాశము లనుటలో విమర్శింప వలసియున్నది. ఆ చిత్ర సందర్శన కాలమున నస్త్రాభ్యనుజ్ఞాన ముద్భిన్నంబు గాలేదు గదా! పురాతనుల కయినను సంప్రదాయ విరహితంబు లగు నస్త్రముల వినియుండలేదు. నా యీ హృదయానం దాతిశయము చంచలం బగు నంతరాత్మను విశ్వసింపఁ జేయుచున్నది. మఱియు దేవి గర్భభారము నాచే ద్విధా గృహీత మయ్యె. (కన్నీళ్ళతో)

మ. మును జన్మించిన ప్రేమ మించు ప్రణయోద్భేదంబుచే హెచ్చ మం
తనమందు స్మెరనమ్రయు, న్సహజ మందాక్షాతిమందాక్షియౌ
వనిత న్నేఁ గలఁ జేతితో నిమిరి గర్భద్వైతముం దొల్త నేఁ
గనుఁగొంటిన్, మఱి కొన్ని నాళ్ళ కెటఁగం గంజాక్షియుం బిమ్మటన్. 28.

(ఏడ్చి) ఏదేని యుపాయమున వీరి నడుగుదునా?

లవ—జనకా! యేమిది?

క. భువనత్రయ మంగళ మగు
భవదీయాస్యంబు బాష్ప వర్షము చేతన్
నవ నీహార నిషిక్త
పరివిమల రాజీవ సుభగ భావముఁ దాల్చెన్. 29.

కుశ—ఓవత్సా!

ఉ. ఏయది వంతగాదు మనుజేంద్రునకున్ నిజదేవిఁ బాసినం?
బ్రేయసి లేకయున్న వనమేకద! సర్వజగంబు; స్నేహము
ల్లాయత మైన, దీ విరహ మన్న ననంతము; చూడఁ జూడ రా
మాయణ గాథ నీ వెఱుఁగనట్లుగ నిట్లడుగంగ నేటికిన్. 30.

రుక్=కాంతి, ద్విధాగృహీతము=రెండుగా గ్రహింపఁబడినది, మందాక్ష=లజ్జచే, అతిమంద=మిక్కిలి జడమగు, అక్షి=చూపులుగలదై, కలన్=విద్యచే, గర్భద్వైతమున్=పిల్లలిద్దఱుగల గర్భముగా నుండుటను, ఆస్యము=ముఖము, నవ=నూతనమైన, నీహార=మంచుచేత, నిషిక్త=తడుపఁబడిన, పరివిమల=స్వచ్ఛమయిన, రాజీవ=పద్మమువంటి, సుభగ=సౌందర్యముయొక్క, భావమున్—తాల్చెన్.

రామ— (తనలో) అన్నా ! వీరి సంభాషణము తటస్థముగా నున్నది; ప్రశ్న మేల; దగ్ధ హృదయమా ! ఆకస్మికం బగు నీ వగచల వికార మేటికి ? ఇట్లు వ్యక్తీభూత మానసోద్వేగుండనయి శిశుజనంబుచే దయఁ జూడఁ బడితి. కాఁగాక ! కప్పిపుచ్చెదను. (ప్రకాశముగా) వత్సలారా ! వాల్మీకి భగవానుని వాణీ విలాసంబును, భాస్కరాన్వయ ప్రాశస్త్యంబు నగు రామాయణం బన వినవచ్చెడి. అందొకించుక వేడుకతో వినఁ గోరెదను.

కుశ—ఆ సందర్భ మెల్ల మాచేఁ బఠింపఁబడియె. బాలచరిత్రాంతి మాధ్యాయమున నీ రెండు శ్లోకములు మాత్రము స్మృతియం దున్నవి.

రామ—వత్సా ! పఠింపుము.

కుశ—

*శ్లో॥ "ప్రియాతు సీతారామస్య దారాః పితృకృతా ఇతి
గుణా ద్రూపగుణాచ్చాపి ప్రీతి ర్భూయోభ్యవర్ధత
తథైవ రామ స్సీతాయాః ప్రాణేభ్యోపి ప్రియోభవత్,
హృదయం త్వేవ జానాతి ప్రీతియోగం పరస్పరం॥

రామ—(తనలో) కష్టము ! హృదయ మర్మోద్ఘాత మతి దారుణంబయినది. హా ! దేవి ! అప్పుడిట్లయ్యె నఁట ! ఓహో ! సంసార వృత్తాంతములు నిరనుబంధ వ్యత్యాస నిరానంద భావంబులై విప్రలంభముగాఁ బరిణమించి పరితపింపఁ జేయుచున్నవి.

ఉ. ఎయ్యెడ మించు నమ్మికల నెంచ రహించెడి నట్టి సమ్మదం ?
బెయ్యెడఁ గూఢకౌతుకము ? లేఁడఁ బరస్పర యత్నసంచయం ?
బెయ్యెడ నిష్టకష్టముల నేకరతిం గను మానసైక్య ? మ
ట్లయ్యును భావ రూప మగు ప్రాణ మణంగక ప్రజ్వలించెడిన్. 81.

ఓహో! కష్టము !

---

* గీ. రామునకు సీత దశరథేంద్రకృత దార
యగుచు గుణరూపములఁ బ్రేమనలరె; నట్లె
సీతకును రఘురాముండు ప్రీతిఁ గూర్చె ;
వారి హృదయానురాగంబు వారికెఱుక.

క. ఏకం జేసియసి గుణాగ్ణ
మేకంబుగ నుల్లసిల్ల నౌతయు నిరహా
నేకాలము దుస్స్మర మగు
నా కాలం బే స్మరింప నయ్యెన్ మాకున్. 32.

చ. తొలుతన మోహరాగములతో ఘనతం గను మారుఁ డుల్లమం
దలర విదగ్ధ వర్తనము నందియు నెమ్మెయి ముగ్ధుఁ డయ్యె; న
య్యెలఁతి వయస్సునందు హరిణాక్షి వనుంగవ యించుకంతయై
మొలచి యొకింత పెంపుఁ గనె మోదమునన్ మఱి కొన్ని నాళ్లకున్. 33

కుశ—మందాకినీ చిత్రకూటాంతర కాంతార విహారంబున జానకీదేవింగూర్చి రఘునాథుని శ్లోకము.—

* శ్లో॥ "త్వదర్థ మివ విన్యస్త శ్శిలాపట్టో౽య మగ్రతః
యస్యాయ మభితః పుష్పైః ప్రవృష్ట ఇవ కేసరః॥

రామ—(తనలో లజ్జా స్మిత స్నేహ కరుణములతో) అర్భకులు మిగుల ముగ్ధులు; అందును వన సంచారులు; హా! దేవి! నాటి విస్రంభాతి ప్రసంగ సాక్షియగు నా ప్రదేశమును స్మరించు చుంటివా? కష్ట మోహో కష్టము!!!

మ. తరళ స్వేద హిమంబు, మంద విచల న్మందాకినీ మారుతో
త్కర లోలాలక కీలితాళిక శశాంకద్యోతముం, గుంకుమ

---

* క. నలుదెసలను వకుళము పూ
వులఁ దావర్షించునటులఁ బొలుచు నల శిలా
ఫలకము నీకై యిదె! ముం
గల విన్యస్తంబుగాఁ గనందగె నబలా!

తరళ=దట్టమైన, స్వేద = చెమటచేత, హిమ్మంబు=చల్లనయినదియు, మంద= సెమ్మదిగా, విచలత్ = కదలుచున్న, మందాకినీ = గంగానది నుండివీచు, మారుత = వాయువుచే, ఉత్కర = ఎగరఁగొట్టుటచే, లోల = చలించుచున్న, అలక = ముంగురులచేతను, కీలిత = కూర్పఁబడిన, అళిక = ఫాలభాగమును, శశాంకద్యోతమున్ = చంద్రకాంతిగలదియు, కుంకుమ = కుంకుమయొక్క,

స్ఫురణానంకిత దీప్త గండమును, నిర్వ్యాభ్రసాభిరామ శ్రవః
పరిముగ్ధంబును, నా భవన్ముఖము మద్భావంబునం దెంచెదన్. 34.

(నిశ్చేష్టుఁడై నిల్చి దైన్యముతో) ఓహోహో!!!

చ. తడవుగ నెంచి యెంచి యెడఁదన్ మును సృష్టి యొనర్చి నిల్పఁగాఁ
బడు ప్రియ బంధు వర్గము ప్రవాసమునందును నూరడించు; న
ట్లడరు ప్రియా వహాని జగమంతయు జీర్ణవనత్వమొందు; లో
నుడికెడి భంగిఁ దొట్రిపడు నుల్లము తీవ్ర తుషానలంబునన్. 35

(తెఱలో)

మ. "అల వాల్మీకి విదేహవల్లభ వసిష్ఠారుంధతీయుక్త కో
సలజాతాదులు తాము బాల సమరోద్యత్ప్రశ్రుతింద్రస్తులై
యలఁతన్, వార్ధక విశ్లథాంగముల, దవ్వై యాశ్రమం బుంట, ను
చ్చలి తావేగ మనస్కులై తడవునం జన్ దెంచుచున్నా రిటుల్." 36.

రామ—ఏమి? భగవంతులగు నరుంధతీ వసిష్ఠులు, జననులు, జనకుడుం గూడ నిచ్చటనేనా? వీరి నెట్లు చూడఁ గలను? (దైన్యముతోఁ జూచి) అహాహా! తండ్రియగు జనకుండుఁ గూడ నిచ్చటికి వచ్చుటం జేసి నిర్ఘాత నిహతుండనైతి. మందభాగ్యుఁడను.

చ. అనుగుణ బాంధవ ప్రవరులైన వసిష్ఠ ముఖర్షు లుండఁగం
దనయ వివాహ మంగళమునం దగు తండ్రిలఁ గాంచి, యీగతిం
బెను గడగండ్ల నిట్టి పితృమిత్రుని జూచిన నేయి వ్రక్కలై
తునుఁగనె?—కాని రామునకు దుష్కర మెద్ది? మదిం దలంచినన్. 37.

(తెఱలో) కష్టము కష్టము!

స్ఫురణ=స్ఫురణచేత, అనంకిత=చిహ్నములేకయే, దీప్త=ప్రకాశమానమైన, గండమును=చెక్కిళ్లుకలదియు, నిర్వ్యాభ్ర = అలంకారములులేకయే, అభిరామ = మనోహరమైన, శ్రవః=చెవులతో, పరిముగ్ధంబును=మిగులనందమైనదియు, అగునీముఖమును—నాభావంబున నెంచెదను. ప్రవాసము=పరస్థలవాసము, తుషానలంబు=ఊకకచ్చు, సమర = యుద్ధమునొక్కరి, ఉద్యత్=అతిశయమయిన, ప్రశ్రుతిన్ = వినికివలన, త్రస్తులై = భయపడినవారై, విశ్లథాంగములు=శిథిలములైన యవయవములు, నిర్ఘాత నిహతుండ = పిడుగు దాకినవాఁడ.

చ. వల దనుభావ మాత్ర సముపస్థిత దివ్య రమాంకుఁ డౌచు నీ
నలువున నున్నయట్టి రఘునాథుని గొబ్బునఁ గాంచినాఁడ దో
ర్లోలుతఁ బరిబుద్ధుఁడౌ జనకధూర్వహుఁ డప్పు డెఱుంగఁ బల్కె, వి
హ్వాలిత మనస్కులై జనను లక్కట! మూర్ఛిలుచుండి రొక్కటన్. 38.

రామ—హా! తండ్రి! జనకా! —హా! తల్లులారా!

క. జనక రఘువంశ సంభవ
మనుజేంద్రుల యఖిలగోత్ర మంగళ మగు పా
వనియెడఁ గృప లేని ఖలుం
డను నాపై మీకుఁ గరుణ నాటిన వ్యధయా. 39.

ఓదార్చెదను. (లేచును.)

కుశ—లవు—ఇట్టిటు.

(దైన్య వ్యాకులత్వములతోఁ బరిక్రమించి అందఱు నిష్క్రమింతురు.)

కుమార ప్రత్యభిజ్ఞాన మను

షష్ఠాంకము,

సంపూర్ణము.

వలత్ = ప్రకాశించుచున్న, అనుభావమాత్ర = ప్రభావముననుమాత్రమే, సముపస్థిత = నిలిచియున్న, దివ్య = దేవతాసంబంధమగు, రమా = శోభయే, అంకుఁడు = చిహ్నముగలవాఁడు, పరిబుద్ధుఁడు = తెలిసికొనినవాఁడు, ఒక్కటన్ = ఒక్కమారు.

ఆంధ్రీకృతోత్తర రామచరితము.

సప్తమాంకము.

సప్తమాంకము.

లక్ష్మ— (ప్రవేశించి) ఓహో! యిపుడు వాల్మీకిభగవానులు బ్రహ్మక్షత్రియ వైశ్యపౌర జానపదుల మాతోడఁ బిలిచి సకల దేవాసుర నర తిర్యఙ్నరగ జంగమ స్థావర సంఘమును స్వప్రభావంబుచే సమకూర్చె; మఱియు నార్యుండు "వత్సా! వాల్మీకి భగవానులు, స్వప్రణీతమై యప్సరఃప్రవర్తితం బగు ప్రబంధంబుం జూడ మన కానతిచ్చె. కాన భాగీరథీ తీర రమణీయ సీమ కరిగి సభా సన్నివేశ మేర్పఱచు" మని నియోగించె. మర్త్యామర్త్య భూత సంఘాతమున కుచిత స్థానముల నర్హాసనములం బొందుపఱచితిని. ఇదిగో!

గీ. మహిత రాజ్యాశ్రమంబున మసలు చుండి,
దుష్కర మునివ్రతంబునఁ దూలిరైన
శ్రమణ వాల్మీకి మౌని గౌరవము వలన
నరుగు దెంచుచు నుండె నియ్యార్యుఁ డిటుల. 1.

రామ— (ప్రవేశించి) వత్సా! లక్ష్మణా! ఉపవేశించిరా రంగదర్శకులు?

లక్ష్మ—చిత్తము.

రామ—వత్సలగు నీ కుశలవులు చంద్రకేతు తుల్యమగు స్థానగౌరవము నొంద నర్హులు.

లక్ష్మ—పరిభుక్తస్నేహ విస్రంభమున నట్లే యొనరింపఁబడియె. ఇదే! రాజాసనంబు నేర్పఱచితి. ఆర్యుం డుపవేశించుఁగాక!

ఉపవేశించిరా — కూర్చుండిరా!

రామ—(కూర్చుండును.)

లక్ష్మ—ఓయీ ! ప్రారంభింపుము.

సూత్రి—(ప్రవేశించి) భగవంతుండును భూతార్థవాదియు నగు ప్రాచేతసుండు చరాచర జగంబున కిట్లాజ్ఞాపించుచున్నాఁడు. "ఆర్ష దృష్టిచేఁ బరికించి పావనంబును గరుణాద్భుత రసంబు నగు నెద్దియో నిర్మింపఁబడియె. దానియెడలఁ గార్యగౌరవంబున జాగరూకులు గండు" అని.

రామ—"మహర్షులు ప్రత్యక్షీకృత సర్వధర్ములు. అమృత సారంబులై రజోగుణాతీతంబులగు వారి ప్రజ్ఞానంబు లెందును నవ్యాహతంబు లగుట సంశయాస్పదములు గావు" అని పలికినట్లయినది.

(తెరలో)

హా ! ఆర్యపుత్త్రా ! హా ! కుమారలక్ష్మణా ! మహారణ్యమున దిక్కులేక యేకాకినియైన మందభాగ్యురాలఁ బ్రసవవేదనాక్రాంత నగు నన్ను హాతాళంబు లగు శార్దూలంబు లపేక్షించుచున్నవి. నిర్భాగ్యురాల నాశరీరంబు నిప్పుడీ భాగీరథీ దేవి కర్పించుచుంటి."

లక్ష్మ—'తనలో' అన్నా ! కష్టము ! ఎద్దియో వేఱయ్యెనే ?

సూత్రి—గీ. దేవి సర్వంసహాపుత్త్రి దేవ్రఁ డయిన
నృపునిచే దీర్ఘ వన పరిత్యక్త యగుచుఁ
బ్రసవవేదనఁ గను శరీరమును వదల
నపుడు భాగీరథీ దేవియందుఁ దొరఁగె. 2.

(నిష్క్రమించెను.)

రామ—హా ! దేవి ! హా ! దేవి ! లక్ష్మణా ! చూడుము.

లక్ష్మ—ఆర్యా ! నాటక మిది.

రామ—హా ! దేవి ! దండకారణ్యవాస ప్రియసఖి ! నీకు రాముని వలనఁ గలుగు దురదృష్ట పరిపాక మిది.

హాతాళంబులు = దుష్టములు, సర్వంసహాపుత్త్రి = భూపుత్త్రి.

లక్ష్మ—ఆర్యా ! పరిబంధార్థముం గనుగొనుము.

రామ—ఇదిగో ! వజ్రమయుండనై సిద్ధపడితిని.

(ఒకొక్క డింభకు నొకముఖపై నిడికొనిన ధరణీభాగీరథులచే నవలంబింపఁబడి సీత ప్రవేశించును)

రామ—వత్స ! లక్ష్మణ ! అకారణమై యవిజ్ఞాత మగు నంధకారముం బ్రవేశించు నట్లుంటి న న్నాదుకొనుము.

ధర—భాగీ—

గీ. జనకనందని ! కల్యాణి ! సంతసంబు
ఊరడిలు మింక వర్ధిలుచుంటి వమ్మ !
రఘుకులాధారు లగు కుమారకుల నింపు
గడలుకొన మధ్యజలమునఁ గంటివమ్మ ! 3.

సీత—(ఊరడిల్లి) సంతోషము! డింభకులఁగంటిని. హా! ఆర్యపుత్ర! (మూర్ఛిల్లును)

లక్ష్మ—(పాదముల నొరఁగి) ఆర్యా ! సంతోషము ! వర్ధిల్లుచుంటిమి. రఘువంశంబు మంగళాంకురమైనది. (చూచి) హా ! హా ! యేమి ? దుర్నివార బాష్పోపరోధ పరవశుండై యార్యుండు మూర్ఛిల్లెనే ! (విసరుచున్నాఁడు)

ధర—ఊరడిల్లు మూరడిల్లుము.

సీత—(ఊరడిల్లి) భగవతీ ! నీ వెయ్యమవు ! ఈమె యెవ్వరిత ?

ధర—ఈమె నీ శ్వశురకుల దైవతము భాగీరథి.

సీత—భగవతీ ! నీకు వందనము.

భాగీ—సౌశీల్య వర్ధితం బగు కల్యాణ సంపదం గాంచుము.

లక్ష్మ—అనుగ్రహింపఁ బడితిమి.

భాగీ—ఈమె నీతల్లి విశ్వంభర.

సీత—హా ! తల్లీ ! యిట్టి నేను నీచే వీక్షింపఁబడితిని.

ధర—రమ్ము వత్సా ! రమ్ము పుత్త్రీ ! (సీతను గౌఁగిలించుకొని మూర్ఛిల్లును)

లక్ష్మ—(సంతోషముతో) ఆనందము ! ఆర్యురాలుధరణీ భాగీరథులచే ననుగ్రహింపఁ బడియె.

రామ—(చూచి) ఇది యతి దీనముగా నున్నది.

భాగీ—సర్వంసహ యంత్యము దుఃఖించుచున్న దని సంతాన వాత్సల్యము జయించినది. లేదా ? ప్రాణులకు సర్వసాధారణమై యంతరంగమునం గల్గు నీ మోహ

గ్రంథి యెడ తెగని సంసార బంధము. వత్సా! జానకీ! భూతధాత్రి! ఊరడిల్లు మూరడిల్లుము.

ధర—సీతను గాంచి యెట్లూరడిల్లఁ గలను?

గీ. తడవు రాక్షస మధ్య వర్తన మొకండు,
కడకు దుస్సహ మైన త్యాగంబు రెండు;
భాగీ— తివిరి ఫలియింప నగుదురదృష్టమునకు
ద్వారములు మూయ దక్షుఁ డెవ్వండు ధరణి. 4.

ధర—భాగీరథీ! లెస్సగాఁ బల్కితివి. ఇది తగునా రామభద్రునకు?

గీ. శైశవ గృహీత మైన హస్తమును, నేను,
జనకుఁడును, వహ్ని, నిత్యానుసరణ మహిమ,
సంతతియుఁ గూడ, నిష్ఠ డా శాబకునకు
నప్రమాణంబులుగ నెంచ నైతి మమ్మ! 5.

సీత—హా! ఆర్యపుత్త్రుని స్మరింపఁ జేయఁ బడితి.

ధర—ఆఁ! నీ కార్యపుత్త్రుఁ డెవ్వఁడు?

సీత—(లజ్జాబాష్పములతో) జనని పల్కినట్లే.

రామ—జననీ! ధరణీ! యిట్టివాఁడ నే.

భాగీ—అనుగ్రహింపుము భగవతీ! వసుంధరా! ప్రపంచమునకు దేహమవు. కానఁ దెలియనిదానివలె నల్లునియం దాగ్రహింతు వేమి?

మ. కలయం బ్రాకె నకీర్తి లోకమున, లంకాద్వీపమం దా మహా
నలశుద్ధిం జనుఁ డెందు నమ్మ నెటులన్? సర్వప్రజారాధనం
బల యిక్ష్వాకు నృపాళికిం గులధనంబౌ, దుర్ఘటం బల్లదే
తలపోయన్; మఱి వాని కెయ్యదియొ కర్తవ్యంబు భాషింపుమా! 6.

లక్ష్మ—అమరులు భూతములయెడల నిరాఘాతాంతరజ్యోతులు. అందును జాహ్నవీదేవి యుత్తమురాలు; కాన నిదే నీకు నమస్కారాంజలి.

రామ—తల్లీ! నీవు భగీరథ కులానుగ్రహంబు ననువర్తించితివి.

ధర—అమ్మ! నిరంతరంబు ననుగ్రహించుచుంటిని. కాని సంతతికయిన శోకావేగ ఘాపాత దుస్సహంబు రామభద్రునకు జానకియందలి గాఢానురాగ మెఱుంగని దానఁ గాను—

గీ. దైవశమున నతఁడు వత్స నెడబాసి
మనమున శోకానలంబుచే నుడుకుచుండ

నకట ! లోకోత్తరంపు ధైర్యంబు వలనఁ
బ్రజల పుణ్యంబు వలనను బ్రదుకుచుండె. 7.

రామ—గురువులు సంతానప్రాప్తియులాదు దయామయులుగదా !

సీత—ఏడ్చుచు నంజలి యొగ్గి తల్లీ ! నీయందు నాకు విలయంబొసంగుము.

రామ—వే అేమి వలుకును ?

భాగీ—శాంతము; వేయి వత్సరంబులు జీవించియుందువుగాక !

ధర—వత్సా ! యిపుడు నీ కుమారుల వీక్షింపుము.

సీత—అనాథురాల నయితి వీరితో నేమిఫలము ?

రామ—హృదయమా ! వజ్రమ వైతివి.

భాగీ—సనాథురాలవయ్యు ననాథురాల వెట్లగుదువు ?

సీత—మందభాగ్యనగు నా సనాథత్వ మెట్టిది ?

ధర—భాగీ—

గీ. సకల జగదేక మంగళస్థాన మైన
యాత్మ నవమతి సేయ భావ్యంబె నీకు ?
నీదు సాంగత్యవశమున నేముఁ గూడఁ
బరమ పావన భావంబుఁ బడసినాము. 8.

లక్ష్మ—ఆర్యా ! వినుము.

రామ—వినుగాక లోకము !

(తెరలోఁ గలకలము)

రామ—ఎద్దియో మహాశ్చర్యము !

సీత—అంతరిక్ష మెల్లం బ్రజ్వలించు చుండె నేమి ?

ధర—భాగీ—తెలిసినది.

గీ. అల భృశాశ్వుండుఁ గౌశికుం డవల రాముఁ
డన గురుక్రమ మలరు నే యస్త్రములకు
నవియె ! జృంభకములతోడ నబ్బురంబొ
వెలయఁ బటు దీప్తితోడ నావిర్భవించె. 9.

(తెరలో)

క. ఓదేవి ! జానకీ ! యభి
వాదన మిదె నీకు; రాఘవప్రభుఁ డాలే

ఖ్యాదర్శనమునఁ బల్కిన
మాదిరి, భవదీయ నుతులు మాకుం గతియా ! 10.

సీత—సంతోషము ! అస్త్ర దేవతలు ప్రజ్వలించుచున్నవి.

లక్ష్మ—"ఇయ్యవి సర్వవిధంబుల నీసంతతి నొందఁ గల" వనియార్యుండు వక్కాణించె.

ధర— గీ. ఘనతరాస్త్రంబులార ! వందనము మీకు
ధన్యులము మేము యుష్మ దాదాన మహిమ
నర్భకులు మిమ్ము ధ్యానించినంతమాత్ర
దరికి నరుదెండు మీకు భద్ర మగుఁగాక ! 11.

రామ— గీ. అధికతర విస్మయానంద శిథిలితంబు
లగుచు క్షోభించు కరుణోర్మ్ము లలవరించి
యిపుడు నా మద వచియుఁప నిరవుగాని
ఘనతరావస్థ నొకదానిఁ గలుగఁజేసె. 12.

ధర—భాగీ- ఆనందింపుము వత్సా ! నీ కుమారు లిపుడు రామభద్రతుల్యులై విల పిల్లుచుండిరి.

సీత—భగవతులారా ! వీరికి క్షత్రియకులోచితం బగు కృత్యంబు లెవరు నిర్వర్తింతురు ?

రామ— గీ. మానిత వసిష్ఠ రక్షితు లైన యట్టి
రఘునృపాలుర వంశవర్ధని యనంగ
నలరు జానకి కూడ నిజాత్మజులకు
వలయు సంస్కారఁ దెలియక వగచె నకట ! 18.

భాగీ—పుత్రీ ! నీకేల చింత యేల ? యీ బాలకుల స్తన్యత్యాగానంతరమున వాల్మీకి భగవానున కర్పింపఁగలను. అతఁడే వీరికి క్షత్రియోచిత కృత్యంబు నిర్వర్తింపఁ గలఁడు.

క. ఎటుల వసిష్ఠాంగిరసులా
యటులనె పాచేతసుండు నల జనకరఘూ
ద్భటుల కులంబులు రెంటికిఁ
బటుతర దేశికుఁ డనంగ వలయును గాదే ? 14.

రామ—భగవతి లెస్సగా యోచించినది.

లక్ష్మ—ఆర్యా ! నిక్కముగ విన్నవించుచుంటిని. ఆయా యభిజ్ఞానములచే నీ వత్స లిఁ గుశలవులఁగా నూహించుచుంటిని.

క. వీ రిర్వురుఁ జూడ మహా
వీరులు, జన్మప్రసిద్ధ విపులాస్త్రులు, సం
స్కారము వాల్మీకియె దై
వారన్ వదియించె వయసు పండ్రెండేండ్లే. 15.

రామ—వత్సలని రేు నేనును జపల చిత్తుండనై యిపుడు ముగ్ధుండ నైతి.

ధర—రమ్ము వత్సా ! రసాతలమును బావనంబు గావింపుము.

రామ—హా ! ప్రేయసీ ! లోకాంతరము నొందితివా ?

సీత—తల్లీ ! నీయవయవంబుల నాకు విలయం బొసంగుము. ఇట్టి సాంసారిక వ్యత్యయంబు ననుభవింపఁ జాల.

రామ—ఉత్తర మేమి వచ్చునో ?

ధర—వత్సా ! నా యాజ్ఞ వలన స్తన్యత్యాగము వఱకుఁ బుత్త్రుల నీక్షించుచుండుము. పిదప నీ యిచ్చ వచ్చిన ట్లొనర్పఁ గలవు.

భాగీ—అట్లే. (భాగీరథి, ధరణి, సీత నిష్క్రమింతురు.)

రామ—ఏమి వైదేహికి విలయమే సంభవించెనా ! హా ! దేవి ! దండకారణ్యవాస ప్రియసఖి ! హా ! చారిత్రదేవతా ! లోకాంతరము నొందితివా ?

(మూర్ఛిల్లును)

లక్ష్మ—మహాత్మా ! ప్రాచేతసా ! రక్షింపు రక్షింపు. నీ కావ్యార్థ మిదియేనా ?

(తెఱలో)

" వాదిత్రఘోష ముపశమించును గాక . ఓహో ! చరాచర మర్త్యామర్త్య భూత జాతంబులారా ! వాల్మీకి భగవానునిచే ననుజ్ఞాతం బగు పావనంబు నాశ్చర్యంబు నం గనుంగొనుఁడు. "

లక్ష్మ—(చూచి)

గీ. గాంగ జల మెల్ల ఘూర్ణిల్లెఁ గలఁచినట్లు
గగనతల మెల్ల సురముని స్థగిత మయ్యె
వహ్వారే ! యార్య జలముల వెల్వడె
నవని భాగీరథీదేవు లనుసరింప 16.

(మరలఁ తెఱలో

క. "భగణీనుగనదులను ద
గ్గఱ జేరు మరుంధతీ! జగత్త్రియ వంద్యా!
పరమ పతివ్రత సీతా
తరుణి వధూమణిని నీదు దరిఁజేర్చితివా!" 17

లక్ష్మ—ఆశ్చర్య మాశ్చర్యము! ఆర్యా! చూడుము చూడుము. (చూచి) అన్నా!
ఆర్యుఁ డిప్పటికి సూరడిల్లలేదు.

(అరుంధతి, సీత, ప్రవేశింతురు)

అరుం—గీ. వత్స! వైదేహి! తత్తరపడు మధీర
భావముఁ దొరఁగు మతిహిత స్పర్శ మైన
నీదు కరపల్లవమున మన్నించి సాదు
పుత్త్రకుని జీవితమ్ము నిల్పు మిటు రమ్ము. 18

సీత—(తొందరతోఁ జేరి రాముని స్పృశించుచు) ఆర్యపుత్త్రుఁ డూరడిల్లుఁగాక!

రామ—(ఊరడిల్లి యానందముతో) ఓహో! యేమిది? (చూచి హర్షాద్భుతములతో)
ఏమి? దేవియు, నరుంధతియు, సముల్లసిత ఋశ్యశృంగశాంతా సమేతు లగు
గురువు లందఱునా?

అరుం—వత్సా! ఇదే! భగవతియు, భగీరథ కులదేవతయు, సుప్రసన్నయు నగు
మందాకినిదేవి.

భాగీ—(తెఱలో) "జగద్విభూ! రామభద్రా!" జననీ అట్టి నీవు కోడ లగు
జానకియం దరుంధతియుంబోలె మంగళాశాసనంబుఁ గావించు చుండు" మని
సందర్శనంబున నన్నుఁగూర్చిన నీవచనంబు స్మృతికిఁ దెచ్చుకొనుము. అనృ
ణవిమ త్తురాల నైతి.

రామ—నేను మహాపరాధమును జేసినను భగవతిచే ననుగ్రహింపఁ బడితిని.

(ప్రణమిల్లును)

అరుం—ఇదే! నీ శ్వశ్రు వగు భగవతి విశ్వంభర.

ధర—(తెఱలో) "భగవతీ! విశ్వంభరా! పవిత్ర పుత్త్రిక యైన జాన
కిఁ బాలించు చుండు" మని పుత్త్రీ పరిత్యాగకాలమున నాయుష్మంతుఁడు వాత్స
ల్యాన నిప్పడు విభుం డగు వత్సుఁ డీ వాక్యంబు నిర్వర్తించితిని.

రామ—ఏమి? మహాపరాధి నైన నేను భగవతిచే ననుగ్రహింపఁబడితినా?

(నమస్కరించును)

—ఓహో! పౌర జానపదులారా! ఇదే యిపుడు భగవతు లగు ధరణీ భాగీరథులచే మెచ్చఁబడి యరుంధతి నగు నాకు సమర్పింపఁబడి, మున్ను భగవంతుఁడగు వీతిహోత్రునిచేఁ బుణ్యచారిత్రగా నిర్ణయింపఁబడి, బ్రహ్మాది బృందారకులచే నభినందింపఁబడిన భాస్కరాన్వయ వధూరత్న మగు యాజ్ఞభూనందని సీతం బరిగ్రహించుటలో మీ యనుమతం బేమి?

—ఇట్లార్య యగు నరుంధతిచే సంతర్జితం బగు ప్రజామండలంబును సకల భూత సంఘాతంబును నార్యారాలికి నమస్కరించుచున్నది. లోకపాలకులును, సప్తర్షులును, కుసుమ వర్షముల సేవించుచున్నారు.

—జగద్విభూ! రామభద్రా!

క. వితతాస్వరమునఁ గనక
ప్రతికృతికిం బావనంపు బ్రకృతియు నీకున్
హితసహధర్మిణి యగు నీ
సతిఁ గూర్పు ముదార ధర్మ సరణి యెలర్పన్. 19.

మ—భగవతి యాజ్ఞ చొప్పననే;

క్ష్మ—కృతార్థుఁడ నైతి.

త—బ్రతికితిని.

క్ష్మ—ఆర్యురాలా! తల్లిపాహీనుఁ డగు లక్ష్మణుం డిదే నమస్కరించు చున్నాఁడు.

త—వత్సా! ఈదృశుండవై దీర్ఘాయుష్మంతుఁడవుకమ్ము.

రుం—మహాత్మా! ప్రాచేతసా! జానకీ గర్భ సంభవులును, రామభద్రకుమారులు నగు కుశలవుల దరిఁజేర్పుము.

(నిష్క్రమించును)

—లక్ష్మ—సంతోషము! అదియాజ్ఞ.

త—(కన్నీళ్లతో సాకూతముగా) ఎక్కడ నాకుమారులు?

(పిదప వాల్మీకియుఁ గుశలవులుం బ్రవేశింతురు)

—వత్సలారా! కుశలవులారా! ఇదే! రఘునాథుఁడు మీ జనకుఁడు. లక్ష్మణుఁడు గనిష్ఠజనకుఁడు. సీతాంతి జనని. ఇదే! జనక రాజర్షి మాతామహుఁడు.

హర్షకరుణాద్భుతములతోఁ బరికించి ఏమి? తండ్రియా?

లవు—హా! తండ్రీ! హా! జననీ! హా! మాతామహ!

—(సంతోషముతోఁ గౌఁగిలించుకొని) ఓవత్సలారా! సుకృతములచే లభించితిరి,

సీత—రమ్ము కుశకుమార ! రమ్ము లవకుమార ! పునర్జీవిత యగు జననిని చిరకాలమునకుఁ గౌఁగిలించుకొనుఁడు.

కుశ—లవ—(అట్లు చేసి) ధన్యుల మైతిమి.

సీత—మహాత్మా ! నమస్కారము.

వాల్మీ—వత్సా ! యిట్లే చిరకాల ముండుము.

సీత—ఓహో ! తండ్రియుం గులగురుఁడు నార్యాజనంబును గాంతునితో నార్య యగు శాంతాదేవియు లక్ష్మణునితో సుప్రసన్నుఁ డగు మహనీయుఁ డార్యపుత్త్రుఁడుం గుశలవులు నొక్కమాఱు సాక్షాత్కరించుటం జేసి పరమానంద పరిపూర్ణ నైతిని.

(తెఱలోఁ గలకలము)

వాల్మీ—(లేచి చూచి) లవణాసురోన్మూలనుం డగు మథురేశ్వరుం డరుదెంచె.

లక్ష్మ—భద్రములు సానుబంధములు.

రామ—ఈ సర్వము ననుభవించుచున్నను నమ్మఁ జాల కుంటిని. లేదా ? అభ్యుదయముల కిదే స్వభావము.

వాల్మీ—నీ కింక నేమి ప్రియ మొనఁగుదును ?

రామ—ఇంతకన్నఁ బ్రియము గలదా ? ఐన నిట్లగుఁ గాక !

చ. సురనదినా, జగజ్జనని చొప్పున, భద్రమనోజ్ఞ మైన యీ
చరిత మఘాను శుద్ధి నిడి సర్వశుభంబు లొసంగుఁ గాక ! సు
స్వర బఠించుఁ గాక ! బుధవర్గము నాటక రూప మైన ని
ర్భర బహు శబ్దవేది రసభావనిధి యానిపించు భారతిన్. 20,

(అందఱు నిష్క్రమింతురు.)

సమ్మేళన మను సప్తమాంకము

సర్వము సంపూర్ణము.

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

ఏడంకముల నాటకము.

భవభూతి విరచితంబగు

సంస్కృతమునుండి,

రాజా మ. శ్రీ ప్రెగడ భుజంగరావు బహదూర్

జమీందారుగారిచే

తెనిఁగింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

వెల రూ. ౧.

ఇందువచ్చు పాత్రలు.

పురుషులు, స్త్రీలు.

1. సూత్రధారుఁడు.
2. నటుఁడు.
3. రామభద్రుఁడు.
4. కంచుకి.
5. అష్టావక్రుఁడు.
6. లక్ష్మణుఁడు.
7. ప్రతీహారి.
8. దుర్ముఖుఁడు.
9. దివ్యపురుషుఁడు.
10. శంబూకుఁడు.
11. సౌధాతకి.
12. భాండాయనుఁడు.
13. జనకుఁడు.
14. లవుఁడు.
15. బ్రహ్మచారులు.
16. వటులు.
17. పురుషుఁడు.
18. చంద్రకేతుఁడు.
19. సుమంత్రుఁడు.
20. విద్యాధరుఁడు.
21. కుశుఁడు.
22. వాల్మీకి.
23. సృష్టి.

1. సీత.
2. తాపసి.
3. వనదేవత.
4. ఆత్రేయి.
5. వాసంతి.
6. తమస.
7. మురళ.
8. అరుంధతి.
9. కౌసల్య.
10. విద్యాధరి.
11. ధరణి.
12. భాగీరథి.

రామా ముద్రాక్షరశాల, ఏలూరు.

విజ్ఞాపనము.

:0:

రసజ్ఞులారా! భవభూతిమహాకవి పదవాక్యప్రమాణజ్ఞుండనియు, బహుశబ్దవేదియనియు లోకంబున సుప్రసిద్ధమగు బిరుదంబుల నందియుండెను. కావుననే యుత్తరరామచరిత్రయం దేశ్లోకమును బట్టి చూచినను తేనెపట్టు నందలి గదులవలె శబ్దజాలము సాంద్రతరంబుగ నిమిడియుండును. ఇట్లనుటచే వాక్యాడంబరమే కాని భావగాంభీర్యోపమాది సౌష్ఠవంబులు లేవని తలంపఁజనదు. అవియు గ్రంథమునందంతటఁ బూర్తిగ నిండియున్నవి. కరుణరసము ప్రధానముగఁ గైకొనియు శృంగార రౌద్రాదిక రసంబుల నుచితస్థానంబులఁ బొందుపరచియుండె. ఇందు హృదయమును గరంచు భావము లనేకములు గలవు. ఉపమాసౌష్ఠవము నపూర్వము. ఇట్టి రసవత్తరంబులగు భావములను సహజ నిపుణతగలవాఁడగుటచే పదగుంభనంబునం బొందుపఱచె.

మహాకవి కాళిదాసునకును భవభూతిమహాకవికినిగల భేదమిచ్చట నేదెలిసికొనఁదగియున్నది. కాళిదాసుభావ గాంభీర్యంబునను, ఉపమా చమత్కృతియందును, మిన్నయని యెన్నఁబడుచుండియుఁ దత్తద్భావాదులఁ బ్రస్ఫుటముగా వెల్లడించుటయే ప్రధానముగా గమనించెను గాని పాండిత్య ప్రకర్షను వెల్లడిచేయుటకై శబ్దాడంబరమును దన నాటకములయందుఁ గనుపరచియుండలేదు. పాఠకులందఱికి నీవిషయముస్వానుభవమే.

ఉత్తరరామచరిత్రము నాంధ్రీకరించుటలో నీ విషయమునే గమనింపవలసి వచ్చినది. సౌష్ఠవపదభూయిష్ఠంబయిన భవభూతిశ్లోకసంతతి నాంధ్రంబునఁ గూడనట్లే పదగాంభీర్యమున నెలకొల్పిననే గాని భవభూతి యొక్క గౌరవాతిశయములను వెల్లడించుటకు వీలుండదు. తేలికపదములతో నాకూర్పు నాంధ్రీకరించుట కేవలమసంభవము. అట్లుచేయఁదలంచిన వ్యాఖ్యానతుల్యముగ గద్యరూపముననే యుంపవలయుం గాని ఛందోబద్ధము చేయవలనుపడదు. కావుననే నా యాంధ్రీకరణమునందీ ఫక్కి నవలంబించితిని. ఈయది కొందఱికిఁ గఠినముగా నున్నదని తోఁచవచ్చును. కాని భవభూతి రచనారహస్యము నెఱింగినవారెవ్వరు నట్లు తలంపరు.

ఈకవిద్వయమునందలి పూర్వోదాహృత తారతమ్యమును లోకమునకు వెల్లడించు తలంపు నాకుఁ గలుగుటచేత నీయుత్తరరామ చరిత్రాంధ్రీకరణము ముగిసిన వెనుక శాకుంతలమునుగూడ నిదివఱకే పెక్కండ్రు మహామహు లాంధ్రీకరించి యుండినను దానినే మరల స్పృశించి నావాక్కును బవిత్రపరచుకొని యీ కవిద్వయగ్రంథ రచనా చాకచక్యము నేకముఖమున వెల్లడింప నిశ్చయించితిని. శాకుంతలాంధ్రీకరణమును గొంతవఱకు సాగుచున్నది. మాసద్వయంబున గ్రంథము ముద్రింపఁబడి వెలువడఁగలదు. అందలి పద్యములు బహుమార్దవములై యెల్లరకు సమ్మోదంబులుగ నుండును. దీనిని జదివినవారలందఱును దానిఁగూడఁ జదివి చూచిన నా మనోరథము ఫలించును.

పెక్కండ్రు మహాకవులిదివఱకే జయప్రదముగ నాంధ్రీకరించిన శాకుంతలమును దిరిగి నే నాంధ్రీకరించుట వ్యర్థప్రయత్నమని తలంపఁజనదు. ఏలయన:—కాళి

దాసునంతటి మహాకవిచే రచియింపఁబడిన శాకుంతలమువంటి యుద్గ్రంథము, ఆంధ్రీకరణమునకు మతి యొకటి లభింపదుగదా! రామకథాసుధారసమును బెక్కండ్రు తనివి తీరఁగ్రోలినను యింకనెందఱికైనఁ దృప్తినీయఁగలదియై యుండునుగాని కొఱఁతపడదు గదా! కావున నో రసజ్ఞులారా! ఇదివఱకుఁ బెద్దలచేఁ జేయఁబడిన యాంధ్రీకరణములఁజూచి యుంటిమిగాన దీనినిగూడ నేల చదువవలెయునని విసుగుఁజెందక దయచేసి నా గ్రంథమునుగూడఁ గొంచెము శ్రద్ధతోఁ దిలకించి యితరాంధ్రీకరణములతోఁ బోల్చిచూచి యేకోశమునందయిన నించుకరసము గాన్పించిన మీరానందించి తన్మూలమున నన్నానంద పరుపఁగోరుచున్నాఁడను.

ఈయుత్తరరామచరిత్రమునందు నాయకుఁడగు శ్రీరాముని చర్య భవభూతిచే సరిగాసమర్థింపఁబడలేదని కొందఱాక్షేపించుచున్నారు. శ్రీరాముండు, అగ్నిపరిశుద్ధిం గావించియే సీతాపరిగ్రహణమును జేసియుండియును జారునిచేఁ దేఁబడిన కింవదంతిని పురస్కరించుకొని తనమనంబున సీతాపాతివ్రత్య విషయమున నించుకంతయు సంశయములేనివాఁడయ్యు సీతాపరిత్యాగమును జేయుట సత్పురుషలక్షణము కాదనియు, కింవదంతిని బ్రబలమగు హేతువుగ గ్రహించుటయు నసమంజసమనియు, శాకుంతలమున దుష్యంతుఁడు శకుంతలాపరిత్యాగమును జేసినను గాళిదాసు దుర్వాసశాపమను ప్రబలకారణము ననుసంధించి దుష్యంతుని యోగ్యతకు భంగము కలుగకుండఁ గాపాడెననియు నిందు భవభూతియట్టికారణమును గల్పింప నేరకుండుట యొకలోపమనియుఁ జెప్పెదరు.

ఉత్తరరామచరిత్రమున నట్టియుక్తియుక్తమగు హేతుకల్పనము లేకపోలేదు. నాటకమంతయుఁ జక్కఁగాఁ జదివిన యుక్తమగు హేతువు కలదని పాఠకులకే విశదము. ఈనాటకమునకంతకును సీతాపరిత్యాగమే ప్రధానాంగమైయున్నది. రామునియందిట్టినిందను మాపుటయు, అందులకు యుక్తియుక్తములగు సమాధానములను జెప్పి జయప్రదముగ రాముని యోగ్యతను నిలువఁబెట్టుటకై సప్తమాంకమున, "గీ. తనను రాక్షసమధ్యవర్తనమొకండు" అను నాల్గవపద్యము మొదలుకొని 7 వ పద్యాంతము వఱకును చక్కఁగ వ్రాయఁబడియున్నది. లోకారాధనవ్రతమే రామునకెవిన్నయమునఁ బట్టుకొమ్మయైయున్నది. వసిష్ఠుఁడుగూడ నట్లే రామున కాజ్ఞాపనముం జెప్పియుండెను. ప్రథమాంకమందు "గీ. మను నిరోధించ" అను సందేశపు పద్యముం జూడుఁడు. అట్టియాలోచనము కర్తవ్యమని రాముడప్పుడే స్థిరపఱచుకొనియుండెను. (1 అం 13 ప) అందు "జనకసుతనైన" అనియుంగూడఁ జెప్పియుండెను. ఈ విషయమునే (1 అం. 42 ప.) "శిష్టులకు నెట్టికష్టమ్మునైన, జనుల యిష్టానుసరణంబు సద్వ్రతంబు" అను పద్యమున స్పష్టపఱచుకొనియెను. ఆక్రిందిపద్యమునఁ దనవలన "కళ్మలంబౌవదంత" పలుకలుగవలయునని విశదీకరించు

(1 అం. 43 ప.) అగ్నిశుద్ధియందుఁ బ్రజలు నమ్మకముంచకపోవుట వారి

ఁ భావమును (1 అం. 45 పద్యమున) రాముఁడే సూచించియున్నాఁడు.

ున మహాత్ములుగా నెన్నఁబడు మహర్షులెవ్వరు నీసందర్భమున రాము

నిరంకుశ దోషారోపణ చేసియుండలేదు. అట్టి భావమును మనస్సునందిడికొనియే భవభూతి మహాకవి నాటకమునందెల్లెడల రామునిబోషించెను. ఇందు రాముఁడవలంబించిన నైతికాధిక్యతను జనసామాన్యము గ్రహింపకుండుట యొక యాశ్చర్యములో నిదికాదు. వనదేవతయగు వాసంతికకూడ మహాత్ముల చిత్తంబులఁ దెలియనశంబుగాదె ని (2 అం. 6 ప.) చెప్పియున్నది. వాసంతిక నీవు సీతనేలవిడిచితివని రాముని ప్రశ్నింప "లోకము సహింపని" దని రాముఁడు ప్రత్యుత్తరమొసంగె. ఈవిషయము నే పౌరజానపదులనుగూర్చి రాముఁడు (3 అం. 32 పద్యమున) జెప్పియుండెను. సీతకు జననీజనకులగు పృథ్వీజనకులకంటె రామునినిందింపఁదగినవారు తదితరులుగారు. జనకుఁడు పుత్రీవియోగ జనితమగు దుఃఖమున్మఖముగుటచే నిషద్విషాదమును వెల్లడించియుఁ బర్యాలోచనమున రాముఁడు తనకు విధివిహితమగు కర్మనే యాచరించెనని తెలిసికొని ప్రశాంతతనందెను. (4 అం. 24-25 ప.) పృథ్వియునట్లే ప్రశాంతయయ్యె. (7 అం. 7 ప.) ఏడవయంకమున నరుంధతీదేవి యంతర్నాటికయందు సమావేశమయిన చరాచరభూతకోటికి సీతాదేవి యొక్క సౌశీల్యత వెల్లడించి వారి యామోదమును వడయునంతదనుకఁ గౌసల్యాజనకుఁడు మున్నగు స్వజనముగాని, వసిష్ఠాదిమహర్షులుగాని, సీతను తిరిగి స్వీకరించవలసినదని రామునకుఁ బ్రబోధింపఁజాలరైరి. (108 పేజీ మొదలు 19 వ పద్యము చివరవరకు) "శ్లో॥ విశ్వేనన్వద్ధిరే వీరా బ్రహ్మక్ష్మేమాయదీక్షితాః । లోకానందముకుందస్య పత్యాగఇవబాహవః॥ " అని భోజచంపువునఁగూడ వ్రాయఁబడియున్నది. లోకమున మూఁడువిధములగు ధర్మములు గలవు.

1. నరుఁడు నరునివిషయమున గమనింపవలసిన ధర్మములు.
2. పరిపాలకుఁడు పరిపాల్యుల విషయమున గమనింపవలసిన ధర్మములు.
3. సృష్టికర్త సృష్టివిషయమున గమనింపవలసిన ధర్మములు.

ఇందు రాముఁడు తనయవతార జ్ఞానమును రామావతారమున గుర్తింపకున్నను నాతనిచర్యలు ఈమూఁడవ విధానమునఁగల ధర్మముపై పరిణమించెను. కావున సీతాపరిత్యాగమున రాముఁడకార్యకరణ మొనర్చెననిగాని భవభూతికాళిదాసువలెఁ దగు నుపపత్తిని గలిగింప లేకపోయెనని గాని తలంచుట యసమంజసమని విన్నవించుచున్నాఁడను. శకుంతలా పరిత్యాగమునకు దుర్వాసశాపమెట్టిబలవత్తర మయిన యుపపత్తియో, సీతాపరిత్యాగమున లోకారాధనయునట్టి యుపపత్తియేయనిగూడ విన్నవింప సాహసించుచుంటిని.

ఈయాంధ్రీకరణమును జేయుచుండిన కాలముననే మనదక్షిణదేశమునందెల్లెడల నుత్కృష్టపండిత శిఖామణులుగా భావింపఁబడుచున్న సుప్రసిద్ధానేకోద్గ్రంథరచనాధురీణులగు బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిలు వారినీవిషయమునకు బృచ్ఛచేయఁగా వారును నేను వయినవ్రాసినట్లే చెప్పియుండుటచే నీవిషయమున నిదమిద్ధమని నేనును నిశ్చయించుకొని నాయభిప్రాయమును వెల్లడింప సాహసించితిని.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

రాజా. యం. భుజంగరావు.

instructed to win her affections for him either by threats or persuasions. Rama in the meantime searched for Sita & rescued her from Ravana after killing him and his people. Thus the very purpose of Rama's incornation was accomplished. He then went to his kingdom & became king in his father's place.

Sometime afterwards Rama exiled his wife while she was pregnant on account of the serious doubts entertained by his subjects as to her chastity. The subject of the present work begins at this point. Sita gave birth to two male children, Kusa & Lava in the waters of the river Ganges into which she fell in order to put an end to her miserable existence as a discarded wife. She was taken care of by her mother Goddess Earth and her two children were placed under the tutorship of sage Valmiki, where they learnt all the sciences. Rama in the meantime with a view to perform the horse sacrifice left the sacrificial horse on the wide world by way of challenge that he who arrests its progress will be conquered by him. A big army commanded by Chendraketu, Lakshmana's son, followed the horse to guard it. Lava the second son of Sita, stopped the horse and defeated Rama's army and was having a single combat with Chendraketu, when Rama who happened to pass by that way compromised the matter between them. Rama & Lava began to love each other. At this stage Valmiki with other sages and Goddesses gathered a big meeting of Rama's subjects and declared before them that Sita was both innocent and chaste. They then united Sita with Rama and the people greeted them at their re-union. Thus ends the drama.

The play consists of 7 acts. The poet in the first act, briefly recalls the incidents in the previous life of the hero by a reference to the scenes from the sylvan life led by him with the heroine, exhibited in a picture gallery attached to the palace. He then sends Sita who is pregnant into exile under the pretext of ministering to her desire, to enjoy life in the hermitages once more.

The poet then shifts the scene to the Dandaka forest, where our hero spent nearly 12 years of his exile in Act 2. He had to go there to punish Sambuka, a Sudra by birth, performing penance, which a Brahmin alone is entitled to do.

The hero gives went to his pent up sorrow at the injustice done to his wife when he saw the old familiar places, where he enjoyed unbridled happiness with her. The sentiments here expressed are very beautiful and sacred. This forms the subject matter of the 3rd Act.

The scene then shifts to the hermitage of the Sage Valmiki in Acts 4, 5, 6 & 7 where Rama's mother and his father-in-law meet the boys Kusa and Lava. Then follows the fight between Lava & Chendraketu where the poet beautifully describes battles as they used to be then conducted.

The poet very skilfully introduces a drama within the drama, where the several phases in the life of Sita after her exile, are exhibited for the edification of Rama & others. This is a device adopted by Valmiki to bring about the re-union between Rama and Sita and the other bereaved parties.

Rajah M. Bhujunga Row.



రాజా యం. భుజంగరావు బహద్దరు జమీాందారు.

ఉపోద్ఘాతము.

:o:

శా. ఈసా యంచు మహమ్మదీయులును, సర్వేశా యటంచార్యులున్
యేసంచుం గ్రైస్తవుల్, గొలుతురో యేస్వామి నత్యంతమున్
దాసోహమ్మని వానికే నెరగెదం ద్రైగుణ్యాపూర్ణ న్నిధి
ధ్యాసం దచ్చరణారవిందములపైఁ దథ్యంబుగా నిల్పుచున్.

సీ. లలిత నాటక రసాలంకార సాహితీగ్రంథపాఠకు లయ్యగారివారు
నిత్యవైదికకృత్య నిష్ఠాగరిష్ఠతా ఖ్యాతవర్తను లయ్యగారివారు
సకలలౌకికకార్య సంధానచాతురీ కలితకోవిదు లయ్యగారివారు
జగపతిరాజ సంస్థానార్జితాఖండ ధారుణీవిభు లయ్యగారివారు

గీ. అనఘలక్షణ లక్షితు లైనయట్టి
వారి వంశంబు నందుసర్వప్రకార
ములను గూటస్థపురుషుల పోల్కెఁగనుచు
సలరితుఁడుమామహేశ్వర శాస్త్రివెలయు.

ఉ. ఆతనికిం బ్రియాత్మజుఁ డనంతగుణాంచితుఁ డాంధ్రహూణభా
షాతతసాహితీ పటురసజ్ఞుఁడు నాకునుదోడియల్లుఁడుం
బ్రీతిమెయిన్మనంబొసఁగు మిత్రుఁడు నైతగు వీరభద్రరా
వేతదుదార బంధుజన వీక్షణ తత్పర మానసంబునన్.

ఉ. మాపురికేగుదెంచి యొకమాసము మద్గృహమందు వేడుకల్
దోపవసించి మత్కృతకృతుల్ దిలకించుచు నొక్కనాడు వి
ద్యాపటిమంగురించి హృదయంబు కుతూహల వార్ధిఁదేలఁగాం
త్వాపరతంత్రతం బ్రియవచస్సరణి న్వచియించె నీగతిన్.

సీ. చారుమతీ, హరిశ్చంద్ర, కృష్ణ, జ్ఞాతవాసాది సరసరూపక చయంబు
శివపురాణము, సుశీల, వసంతకుసుమంబు, వారకాంతాది ప్రబంధములును
రాజహంసయు, మనోరమ, విజయాంకసాహస, నైషధాది గద్యాత్మకములు
మధుపవిహార, సర్వమంగళా, గోఖలేచరిత, మార్కండేయశతకములును.

గీ. ప్రహసనంబులు, స్తోత్రతారావళులును । చిత్రయుక్తులఁదెల్పు చరిత్రములును
అతుల గీతప్రబంధంబు లాదిగల్గు । కృతులు రచియించితీవు పండితులు పొగడ.

సీ. ఇలశుద్ధమా బెతిల్ హేము పట్టనమునఁ గన్యయౌ మరియాంబ గర్భమందు
జననంబునొంది పావనసువార్తలశిష్యవరులచే జగమునఁ బ్రబలఁజేసి
స్పర్శమాత్రమున సర్వవ్యాధు లణఁగించి జనులకారోగ్యంబు సంఘటించి
ఖలజనుల్పొనరించు కడగండ్లకు సహించి మదిలోన వారి క్షేమంబుఁ గోరి

గీ. ప్రజల దురితంబు లణఁగింప నిజశరీర । మును సిలువకర్పణముజేసి ఘనతతోడ
ఛాత్రులకు దివ్యరూప దర్శనమొసంగి । నట్టిదేవుని చారిత్ర మభిలషించి.

చ. సురుచిర గద్యపద్యమయ శోభిత సూక్తుల తోడఁ బండితో
త్కరములు జూచి మెచ్చ సముదార తరంబగు సత్యవేదముం
బరువడి నాంధ్రభాషను బ్రబంధముగా రచియించి తన్మతా
దరులకు శ్రోత్రపర్వము సదా ఘటియించితి వో సుధీమణీ!

చ. వివిధము లౌ ప్రబంధములు విస్తరిలం బొనరింప నర్యోఁ బా
ర్థివవర! సంస్కృతంబగుకృతిం దెనుఁగింపఁగ లేదొకండు నీ
కవితకు వన్నియల్ గలుగుకైవడి నుత్తరరామనాటకం
బవిరళ మాధురీ మహిమ నాంధ్రి మొనర్చి కొఱంతఁ దీర్చుమా!

చ. పురహరుఁగొల్చి సంపదలఁబొందుటచే భవభూతి నాఁగ ను
ర్వర బిరుదంబుఁ జెంది కవివర్గశిఖామణి కాళిదాసుచే
స్థిరతర కీర్తివైభవము చేకుర సన్నుతిఁ గాంచు నమ్మహా
త్తర వరనీలకంఠ కవితల్లజుఁ డాకృతికన్యకం గనెన్.

చ. అని ప్రియమిత్రుఁడై పలుకు నాతనివాక్యము లాలకించి మ
న్మనమున నట్టి సాహస మొనర్పఁగ సంశయమొందియైన నా
తని యభిలాషఁ దీర్పఁ బ్రమదంబున దీనికిఁ బూనినాఁడ, నం
దని ఫలమున్ గ్రహింపఁగ గణంగుచు నఱ్ఱులు సాచు పోలికన్.

సీ. పదగుంభనం బన్న పరిస్ఫురద్రత్నంబు లేర్చి మాలిక నొనగూర్చినట్లు
అమితార్థ సారస్య మన్న మల్లెలు మొల్ల లెల్లఁదావుల వెదజల్లినట్లు
అలభావగాంభీర్య మన సుధారసధార లంచితాబ్దములు వర్షించినట్లు
అతుల రసౌచిత్య మన హంసాద్ఘటిత విద్యుచ్ఛటాస్ఫుటదీప్తు లాలవినట్లు

గీ. మానితానూనవైభవోత్తాన మైన । యట్టి భవభూతి కృతిరత్న మాంధ్రశైలి
ననుగమింపఁగఁ గల్గుదునా యటంచు । సంశయం బయ్యె భార మీశ్వరుని దింక.

చ. చదువరులార! నాకుఁ గల శక్తికొలందె రచించినాఁడ ని
య్యది భవదీయ మానసములందు రుచించునొ? లేదొ? నాదు నె
మ్మది నెఱుఁగంగఁజాల ననుమానము లున్న నణంచి, యున్నదొ
ప్పిదములె గొప్పగాఁ దలఁచి ప్రీతి వహింపుఁ డనుగ్రహంబునన్.

ఇట్లు

కవిపండితవిధేయుఁడు,
రాజా మంత్రిప్రెగడ భుజంగరావు.

ఏలూరు.
1—5—1918.

శ్రీరస్తు.

జగదీశ్వరసహాయోస్తు.

ఆంధ్రీకృతోత్తరరామచరిత్రము.

ప్రథమాంకము.

నాంది—ప్రస్తావన.

క. మొదలిటి కవిరాజులకై
యిదియె నమోవాక మిచ్చ నెంచెద, నల శా
రద దివ్యామృతరూపన్
విదితాత్మ కలం దలంచి వినతి యొనర్తున్. 1.

(నాంద్యంతమున.)

సూత్రి—అతివిస్తరమేల? ఇపుడు భగవంతుఁ డగు కాళప్రియానాధుని మహోత్సవంబునందలి యార్యమిశ్రులం గూర్చి విన్నవించుచుంటిని. పూజ్యులగు మీరి ట్లెఱుంగుదురుగాక! కలఁడుగదా కశ్యపగోత్రసంభవుండును, శ్రీకంఠనామలాంఛితుండును, బద వాక్య ప్రమాణ సారజ్ఞుండును, జాతూకర్ణీ పుత్త్రుండు నగు భవభూతి యను మహాత్ముండు!

గీ. భారతీదేవి తనుదాన వశ్యయగుచు
మించి యేబ్రహ్మ ముఖ మాశ్రయించె నట్టి
ఘనుని కృతిరత్నమును బ్రదర్శన మొనర్తుఁ
బ్రీతి నుత్తరరామ చరిత్ర మిపుడు. 2.

[ఆకసమువంకఁ జెవి యొగ్గి వినుట నభినయించి]

ఈకాలంబున గీర్వాణభాషాప్రచార మత్యల్పం బగుటచేఁ బ్రేక్షకుల కగ్రాహ్యంబని పలుకుచుంటివా?

నమోవాకము = నమస్కారవాక్యము. విదితాత్మ = పరమాత్మాంశభూతమగు బ్రహ్మదేవుఁడు, బ్రాహ్మణుఁడు.

మ. వర మంత్రిప్రెగడాన్వయోద్భవుఁడు విద్వద్బృంద సంసేవనా
చరణాయత్తమనస్కుఁడున్, భుజగరాజఖ్యాతనామాంకుఁడుం
గరి ధాత్రీ నిధి చంద్ర సంఖ్యఁ (1918) దగు రంగత్క్రీస్తవాబ్దంబున
న్నిరతిన్ దీని రచించె నాంధ్రమున వర్ణింపంగ నేలూరునన్. 3.

ఏతదాంధ్రీకరణమునే ప్రదర్శింపఁ బూనితిని. నేను కార్యవశంబున నయోధ్యానగరమ్మందును రామసమకాలికుఁడను నైయుంటిని. (అంతటఁగలయఁజూచి) ఓహో! పౌలస్త్య కుల ధూమకేతుండును, మహాత్ముండునగు శ్రీరామసార్వభౌముని పట్టాభిషేక సమయంబు బహిర్నిశంబవిచ్ఛిన్న గీత వాదిత్రంబై ప్రవర్తిల్లుచుండ నిప్పు డేలొకో చత్వరసీమ లెల్లఁ గుశీలవ వ్యాపారములు లేక నిశ్శబ్దంబులై యున్నయవి!

నటుఁడు—(ప్రవేశించి) బావా! మహారాజు లంకాసంగ్రామ మిత్త్రులగు మహాత్ములఁ బ్లవంగ రాక్షసులను, నానాదిగంత సంశోభకులైన పూజార్హుల బ్రహ్మర్షి రాజర్షులను స్వగృహంబులం జేరఁ బనిచె. వారిసారాధించుటకుఁ గదా యిన్నిదినంబులు వేడుకయైనది! ఇప్పుడో?

గీ. అల వసిష్ఠుని యాజమాన్యంబునం ద
రుంధతీ పురస్కృత లౌచు బంధుర మగు
సవనమును జూడ శ్రీరామజనను లల్లు
నాశ్రమస్థానమున కిప్పు డరిగినారు. 4.

సూత్ర—విదేశీయుండఁ గాన నడుగుచుంటిని. అల్లుఁ డెవ్వరు?

నటు— క. శాంతయను కన్యకను భూ
కాంతుం డగు దశరథుండు గని యాబాలన్
సంతానంబుగ నోసఁగెను
సంతసమున రోమపాద జననాథునకున్. 5.

విభండకపుత్త్రుఁడైన ఋశ్యశృంగమౌని యాకన్నియం బరిణయంబయ్యె. ఆతఁడు ద్వాదశవర్షావసానంబైన సవనంబు నారంభింపఁ దత్కారణంబునం బరిపూర్ణగర్భ యగు కోడలిం జానకిని విడిచి గురుజనం బచ్చటికిఁ జనియె.

కరి=అష్టదిగ్గజములు 8. ధాత్రి=భూమి 1. నిధి=నవనిధులు, 9. చంద్రుడు=1 సింహావలోకనమున 1918, అగును. వర్ణింపంగ=స్తోత్రపాత్రము గ.

సూత్ర—మనకిదియేల ? స్వజాతిధర్మమున రాజద్వారమునే సేవింతమురమ్మ.
నటు—అట్లయిన బావా ! నిరవద్యంబైన రాజసేవాస్తవ క్రమంబు నిరూపింపుము.
సూత్ర—మారిషా !

గీ. ఎల్ల తెలుఁగుల వచియింపఁ జెల్లుఁ గాని
దోషరాహిత్య మనఁగ నెందులకు వలయు ?
కలుకులం దెట్టులో పలుకులనునట్టి
దుర్జనుఁడె యగు జనుఁడు సాధుత్వమందు. 6.

నటు—అతిదుర్జనుఁ డని చెప్ప నొప్పు.

గీ. జానకీదేవియెడలనే జనులు నింద
మోపిరింతకుఁ బరికింప మూల మెక్క—
దైత్యమందిరవాసంబు దానికగ్ని
శుద్ధి యైనను నిశ్చయ స్ఫూర్తి లేదు. 7.

సూత్ర—ఈ కింవదంతి మహారాజు వీనులం బడెనేని దానఁ దప్పక ముప్పు వాటిల్లు.
నటు—సర్వవిధంబులం దపోధనులును బృందారకులును శ్రేయం బొసంగఁ గలరు.
(పరిక్రమించి) ఓహో ! మహారాజెప్పు డెక్కడ? (విని) లోకు లిట్లనుచుండిరి.

వ. సెనరునఁ గాంచి మోదము జనింపఁగఁ జేయఁగ నేగుదెంచి యా
జనకనరేంద్రుఁ డిన్ని దివసంబులు వేడుకఁ బుచ్చి యిత్తఱిం
జనియె విదేహదేశ మని జానకి చింతిల నంతఁదీర్ప వా
సనిలయగామియయ్యె నృపచంద్రుఁడు గద్దియడిగ్గి దిగ్గునన్. 8.

(నిష్క్రమించిరి.)

ఇది,
ప్రస్తావన.

వాసనిలయగామి=అంతఃపురమునుగూర్చి వెళ్ళినవాఁడు.

ఆంధ్రీకృతోత్తరరామచరిత్రము.

ప్రథమాంకము.

(రామభద్రుఁడు, సీతయు నుపవిష్టులై ప్రవేశింతురు)

రామ—దేవి ! వైదేహీ ! ఊరడిల్లుము. ఆ గురువులు మనల విడువఁ జాలరు. ఐనను

గీ. నిత్యకర్మాద్యనుష్ఠాన నియతి స్వైర
పరత నపకర్షణ మొనర్చు ప్రత్యవాయ
ముల కతంబున నాహితాగ్నులకుఁ దలఁప
నధికకష్టంబుగాదె గార్హస్థ్య మనఁగ. 9.

సీత—ఎఱుంగుదును. ఆర్యపుత్త్రా ! యెఱుంగుదును. అయినను గురుబంధు వియోగం
బులు సంతాప జనకంబులై యుండును.

రామ—ఔను. ఈ సంసార భావములు హృదయ మర్మముల భేదించుచుండునుగదా!
వీని రోసి యెల్ల కోరికల నెడబాసి మనీషు లరణ్యమున విశ్రమించుచుందురు.

కంచుకి—(ప్రవేశించి) జయము రామభద్ర ! (అర్ధోక్తిలో సంశయించి) మహారాజ !

రామ—(చిఱునగవుతో) ఆర్యా ! జనకపరిజనము నన్ను "రామభద్రా" ! యని
పిలుచుటయె శోభాస్పదము. కాన నీ యభ్యాసానుసారమునఁ బిలువుము.

కంచు—ఋశ్యశృంగాశ్రమమునుండి యష్టావక్రముని విచ్చేసియుండె.

సీత—ఆర్యా ! యింకఁ దడవేల ?

రామ—త్వరితముగఁ బ్రవేశపెట్టుము. (కంచుకి నిష్క్రమించెను.)

అష్టా—(ప్రవేశించి) మీకు శుభ మగుఁ గాక !

రామ—అభివాదనము. ఇట గూర్చుండుఁడు.

సీత—నీకువందనము. మదీయసర్వగురుజనంబునకు నార్య యగు శాంతకుఁగుశలమా ?

రామ—మద్భావుకుండును మహాత్ముఁడునగు ఋశ్యశృంగమౌని యార్యయగు శాంత తో నిర్విఘ్నముగ సోమపానముఁగావించెనా !

సీత—మమ్ముఁ దలపోయుచుండెనా ?

అష్టా—(కూర్చుండి) ఔను దేవీ ! భగవానుఁ డగు వసిష్ఠుండు నిన్నుఁగూర్చి యిట్లు పలికెను.

> మ. "చతురాస్య ప్రతిరూపుఁడౌ జనకరాజన్యుండు నీతండ్రి, యా
> సతి విశ్వంభర నీదుతల్లి, యలభాస్వంతుండును స్నేము ను
> న్నతి నే రాజకుటుంబకంబున గురుత్వంబూని యున్నార మా
> క్షితిరాట్పుందుృల కీవు కోడలవు చర్చింపంగ నోనందనీ ! 10
>
> కాన నింకేమి కోరుదుము ? తప్పక వీరజననివి కమ్ము"

రామ—అనుగ్రహింపఁ బడితిమి.

> గీ. లోక సంబంధులైన సుశ్లోకజనుల
> భాషితం బర్థమై ఖరిఁ బట్టినడుచు
> నాది మౌనుల వచనంబు నర్థ శైలి
> యనుసరించుచు నుండు నుదారభంగి. 11.

అష్టా—భగవతి యరుంధతియు, దేవులు, శాంతయుఁ, బదెంబది నిదియే సందేశించిరి. "ఈమె కెద్ది యైన దౌహృదవాంఛ జనించెనేని దానిఁ జెచ్చెర నెఱవేర్ప వలయు" నని.

రామ—నెఱవేర్చెద నీమె తెల్పెనేని.

అష్టా—ననాంద్రుభర్త యగు ఋశ్యశృంగమౌని దేవికి సందేశించె. "వత్సా ! పరిపూర్ణగర్భ వని తోడితేలేదు బాలుఁ డగు రామభద్రుండును భవన్వినోదంబు

ననాంద=ఆఁడుబిడ్డ. అభివాదనము=గోత్రనామములు చెప్పి పాదములుసోఁక మ్రొక్కుట.

కొలఁకి నిల్పఁబడియె. కాన నందనాలంకృతాంక వగు నాయుష్మతిం జూడఁ
గలము.'' అని.

రామ—(హర్ష లజ్జాస్మితములతో) అట్లగుఁగాక ! భగవంతుఁ డగు వసిష్ఠమౌనిచే
నేమియు సందేశింపఁ బడ నైతినా ?

అష్టా—వినుము.

గీ. మము నిరోధించె నిచట జామాతృయజ్ఞ
మర్భకుండవు నీవు రాజ్యంబు క్రొత్త,
ప్రజల రంజింపఁ గడఁగు మేర్పడ, యశంబు
స్వాత్మకన్నను మీకు దివ్యార్థముగద !'' 12.

రామ—భగవానుఁ డగు మైత్రావరుణి యాజ్ఞ చొప్పననే—

క. కరుణన్ మైత్రిని సౌఖ్యము
సరగున జనకసుతనైన జనరంజనమున్
నెఱపఁగ విడిచెద నాకుం
దొరకొన దొక్కింతయైన దుఃఖము మదిలోన్. 13.

సీత—కావుననే, ఆర్యపుత్త్రుండు రఘురాజధురంధరుండు.

రామ—ఎవఁడురా అచ్చట ? అష్టావక్రమౌని విశ్రమింపఁ జేయఁబడుఁగాక !

అష్టా—(లేచిపరిక్రమించి) ఓయీ ! లక్ష్మణకుమారుఁ డరుదెంచె. (నిష్క్రా)

లక్ష్మ—(ప్రవేశించి) ఆర్యా ! జయమగుఁగాక ! ఆ చిత్రకారునిచే నస్మ న్నిదేశం
బున నీ వీథికయం దార్యచరిత్రము విలిఖింపఁబడియె. కావునఁ గనుంగొనుము.

రామ—వత్సా ! యెఱుంగుదువా ? వికలాత్మయైన జనకనందని నానందింపఁజేయు
నిమిత్తము. ఇందెంతదనుక వ్రాయఁబడినది ?

లక్ష్మ—ఆర్యురాలి పావకశుద్ధివఱకు.

రామ—పాపము శాంతించుఁగాక !

క. జనన పరిపూత యగు భూ
తనయకు నితర పావనములఁ దలఁపఁగ నేలా ?
ఘన తీర్థోదక మగ్నియు
ననువుగ వేఱొకట శుద్ధి కర్హములగునే ? 14.

జామాత=అల్లుఁడు. మైత్రావరుణి=వసిష్ఠుఁడు.

దేవీ ! సవనమహీనందని ! ప్రసన్నవు గమ్ము. ఈ యంజలి యావజ్జీవమైనది.

చ. అలలితమై చరించుజన మాత్మజనంబులచేత సాంత్వవా
క్కులను నను రంజనీయ మగుc, గోమలి ! నిన్ను నమంగళోక్తులం
దలcకcగc జేయ మా కనుచితంబు, సుగంధిల పుష్పరాజముం
దలనిడc జెల్లుc గాని చరణంబులc దన్న నిసర్గశైలియే ? 15.

సీత—పోcగాక ! ఆర్యపుత్రా ! రమ్ము నీ చరితంబు నభిలక్షింతము.
(లేచి పరిక్రమింతురు.)

లక్ష్మ—ఇదే ! తదాలేఖ్యము.

సీత—(చూచి) వీరెవ్వరు ? ఊర్ధ్వభాగమున నిరంతరస్థితులై యార్యపుత్త్రుని నుతియించుచున్నట్లున్నవారు.

లక్ష్మ—సరహస్యంబు లగు నాజృంభకాస్త్రంబు లివియే. ఇవి భగవంతుం డగు భృశాశ్వుని వలనc గుశికనందనుండును విశ్వామిత్రుండు నగు విశ్వామిత్రమునియం దుపసంక్రమించి వారిచేc దాటకావధంబున నార్యునికిc బ్రసాదింపc బడినవి.

రామ—దేవీ ! దివ్యాస్త్రములకుc బ్రణమిల్లుము.

గీ. నలువ మున్నగు తొంటి పెద్దలు జగద్ధి
తంబు కొఱకు సహస్రాధికంబు లబ్ద
ములు దపము cజేసి నిజతపోమూర్త తేజ
ములుగ విలసిల్లు నీయస్త్రములను గనిరి. 16.

సీత—నమస్కార మిదె దివ్యాస్త్రములకు.

రామ—ఇయ్యవి సర్వవిధంబుల నీసంతతి నొందcగలవు.

సీత—అనుగృహీత నైతిని.

లక్ష్మ—ఇది మిథిలావృత్తాంతము.

సీత—ఓహో ! నవవికచేందీవరశ్యామలంబై స్నిగ్ధాపీనకోమలంబైన దేహసౌభాగ్యంబున కక్కజంబునందు జనకభూపాలునిచే నిశ్చలంబుగాc జూడcబడు రమ్యసౌందర్యలక్ష్మితోడను, కాకపక్షావతంసితం బగు ముఖమండలంబుతోడను లీలాసమాక్రాంత పరమేశకార్ముకుం డగు నార్యపుత్త్రుండు లిఖియింపcబడినాడు.

అభిలక్షింతము = చూతము, మూర్త = శరీరమును ధరించిన, ఆలేఖ్యము = చిత్తరువు = వ్యాపము.

లక్ష్మ—ఆర్యారాలా ! చూడుము చూడుము.

క. బందుగులకు నీ జనకుఁడు
నందముగ వసిష్ఠముఖ్యు లంపఁ బికి శతా
నందుఁడు గౌతముఁ డను జన
కేంద్రపురోహితుఁడు బూజ లిడుచుండిరొగిన్. 17.

రామ—దర్శనీయ మిది—

క. జనక రఘురాజ కులముల
యనుబంధం బెవని కిష్టమై యుండదు ? దీ
నిని సమకూర్పఁగఁ గౌశికుఁ
డొనరఁగఁ దాతయు గ్రహీతయును దా నయ్యెన్. 18.

సీత—సద్యఃకృత గోదాన మంగళులై వివాహదీక్షితులైన మీ నల్వురు సోదరులును వీరే కదా ! ఓహో ! అదే ప్రదేశమున నదేసమయమున నుంటి నని తలంచుచుంటిని.

రామ— గీ. గౌతముఁడు నాకొసఁగ రమ్యకంకణమున
నొనరఁబట్టిన నీ కేల్ ; మహోత్సవంబు
మూర్తిఁదాల్చిన యట్లు న న్ముదితుఁ జేయు
నాటితటి నేటివలెనుండె నళినవదన ! 19.

లక్ష్మ—ఈమె యార్య, ఈమెయు నార్యమాండవి; ఇయ్యది వధువు శ్రుతకీర్తి.

సీత— నవ్వుచు వత్సా ! యింకొకతె యిదియెవ్వతె ?

లక్ష్మ—(లజ్జాస్మితములతోఁ దనలో) ఓహో ! ఆర్యయూర్మిళ నడుగుచున్నది. ఔఁగాక ! ముందు జరిగెదను. (ప్రకాశముగా) ఆర్యా ! చూడుము. దర్శనీయ మిది. ఇదే ! భగవానుఁ డగు భార్గవుండు—

సీత—చకితురాల నైతిని.

రామ—ఋషీంద్రా ! నీకు నమస్కారము.

లక్ష్మ—ఆర్యారాలా ! చూడుము. ఈతఁ డార్యుని చే—

రామ— సాక్షేపముగా ఓయీ ! దర్శనీయము పెక్కుగలదు. వేఱొకటిఁ జూపుము.

సద్యః=అప్పుడే, కృత=చేయఁబడిన, గోదాన= క్షౌరము చేత, చకితురాల= భయపడినదానను.

సీత—(సమ్మానముతోఁ జూచి) ఆర్యపుత్త్రుఁ డీ వినయ మహిమచే లెస్సగా దీపించుచుండె.

లక్ష్మ—ఇదే మన మయోధ్యం జేరితిమి.

రామ—(కన్నీళ్ళతో) స్మరించుచుంటిని అన్నా! స్మరించుచుంటిని.

క. జనకుఁడు జీవింపఁగ నా
తనదారపరిగ్రహంబు దనరిన వేళం
జననీ పోష్యుల మగు మన
ఘనదివసము లవి గతించెగాదే? తలఁపన్. 20

అప్పుడీ జానకియు—

చ. పసి యొడమా కెలంకులను బట్టి జనించెడి పల్లు మొగ్గలం,
బెడఁగగు దంతపుష్పముల, బిత్తరి చూపుల, నొవ్వ మోముతో
వెడలెడు కౌముదీ సహజ విభ్రమ రమ్య విలాస రేఖలం
దొడరిన యంగకంబులఁ గుతూహల మిచ్చె మదంగరాజికిన్. 21

లక్ష్మ—ఇది మంధర.

రామ—(నిరుత్తరముగా వేఱొకటఁ జేరి) దేవీ! విదేహరాజనందని!

ఆ. మున్ను శృంగిబేర పురమున సౌహార్ద
వంతుఁడౌ నిషాద భర్తతోడ
మనకు మోదమున సమావేశ దేశమై
యొసఁగు నింగుదీమహీజ మిదియె. 22

లక్ష్మ—(నవ్వితనలో) ఓహో! ఆర్యుండు మధ్యమాంబికా వృత్తాంతంబు నంతరింపఁ జేసె.

సీత—ఓహో! యిది జటాబంధ వృత్తాంతము.

లక్ష్మ— గీ. వార్ధకంబున రాజ్యసంపదల నెల్లఁ
బుత్త్రులం దుంచి యిక్ష్వాకు భూమిపతులు
గాంచు పుణ్యంపు టారణ్యక వ్రతంబు
నార్యుఁ డిష్టులఁ దాల్చె బాల్యంబునందె. 23

సీత—ఇదే! నిర్మలపుణ్యోదక యగు భగవతి భాగీరథి.

రామ—దేవీ! రఘువంశదేవతా! నీకు నమస్కారము,

కౌముది=వెన్నెల, ఇంగుదీమహీజము=గారచెట్టు.

చ. అల సగరాధ్వరంబునఁ దదాత్మజు లశ్వము రోయ ధారుణిం
దొలుచుచు రోషవత్కపిల దుస్సహ తేజమునం బ్రదగ్ధులై
పొలియ భగీరథుండు దనువు న్వెతఁ గూర్చి తపం బొనర్చి నీ
జలములఁ దృప్తిమై దడిపి సాధ్వి! తరింపఁగఁ జేసెఁ దాతలన్. 24.

జననీ! అట్టి నీవు కోడలగు జానకియుం దరుంధతి యుం బోలె మంగళాశాసనం
బు గావించు చుండుము.

లక్ష్మ—ఇది చిత్రకూట మార్గమందలి కాళిందీతటంబున భరద్వాజ ప్రదర్శితంబైన శ్యామ
మను వటవృక్షము.

సీత—ఆర్యపుత్త్రుఁ డీప్రదేశముం దలంచుచుండెడిని.

రామ—ఓహో! యెట్లు మఱపువచ్చును?

మ. గమనాయాసముచేత దుర్బలములై క్లాంతాతి తాంతంబులై
ప్రమదాలింగన దత్త సర్వతను సంవాహంబులై, పీడనా
ర్తమృణాళీమృదులంబులై, తగుభవద్గాత్రంబులన్ నాదు వ
త్సమునం జేరిచి నిద్రిపోయితివి గాదా! యీ ప్రదేశంబునన్? 25.

లక్ష్మ—ఇది వింధ్యారణ్య పురోభాగమున విరాధ నిరోధము.

సీత—ఇది చాలును. ఆర్యపుత్త్రుండు దాళవృంతంబు నాతపత్రంబుగాఁ గేలధరియించి
పోరిరంభించు దక్షిణారణ్య ప్రదేశముం జూచెదను.

లక్ష్మ-ఉ. మానిత శాంతులై యతిథి మానసులై నిజముష్టి సమ్మితం
బౌ నివరుల్ పచించెడి గృహస్థుల నొప్పు గృహాళితోడ, వై
ఖానస వాసయోగ్య తరుకాండముతోఁ దగి శైలవాహినీ
స్థాన తటంబులం జెలఁగు తాపస వాటిక లివ్వియే కదా! 26.

ఇది క్రిక్కిరిసిన వృక్షసంఘములచే నెడము లేక నున్నదై కాలుకొన్న
ప్రాంతారణ్యంబుచేఁ జుట్టుముట్టఁ బడిన గోదావరి వలన మొరయు కందరంబుల
నందగించి, తెఱపిలేక కురియు మొగిళ్ళచేఁ గుప్పకుప్పలైన కప్పున నొప్పు జనస్థాన
మధ్య మందలి ప్రస్రవణ శైలము.

వత్సము=వక్షము. క్లాంతము-తాంతము=బడలినది. సంవాహనము=పట్టుట, పిసుకుట.
మొగిళ్ళు=మేఘములు, తాళవృంతంబు= తాటియాకు విసనకఱ్ఱ, ఆతపత్రంబు =
గొడుగు, వైఖానసుఁడు=వానప్రస్థుఁడు.

రామ-ఉ. భావమునం దలంతువె సుభాంగిరో ! లక్ష్మణుఁ డా ధరంబునన్
సేవ యొనర్చు చుండ సుఖజీవనతం జను నా దినంబులన్ ?
భావనఁ జేయు దే సరస పావన నీరములం దనర్చు గో
దావరి ? నచ్చటన్ మన యుదార విహారములన్ స్మరింతువే ? 27.

మఱియు —

ఉ. మక్కువ పిక్కటిల్లఁగ సమంబుగఁ జెక్కులు సేర్చి తారుమా
రెక్కఁగ మెల్ల మెల్ల మన మెట్టిటో యక్రమభాష లాడు చో
క్కొక్క భుజంబుతోడి యొడమోర్వని కౌఁగిళులన్ సుఖింప నా
చక్కని రాత్రియే చనిన జాము లెఱుంగక యుండ బిట్టలెన్. 28.

లక్ష్మ—ఇదె పంచవటియందు శూర్పణఖ—

సీత—హా ! ఆర్యపుత్త్రా ! ఇంతవఱకే నీదర్శనము.

రామ—ఓ వియోగభీరురాలా ! చిత్తరు విది.

సీత—ఎట్లయిన నగుఁ గాక ! దుర్జనుఁడు దుఃఖంబు నుత్పాదించు.

రామ—అన్నా ! జనస్థాన వృత్తాంతము జరుగుచున్నట్లే తోఁచుచున్నది.

లక్ష్మ-మ. కనకాకార మృగంబు మాయవలనం గల్పించి పాపాత్ము లా
దనుజుల్ కీడొనరించి రట్లు లయ మొందం జేసినన్ లేశముం
జన దా వైరము, శూన్యమై తగు జనస్థానంబునం దార్తి జెం
దిన యార్యుంగని శైల మేడ్చు, హృదయోద్భిన్నం బగున్ వజ్రమున్. 29.

సీత—(కన్నీళ్ళతో. స్వ) ఓ దేవా ! రఘుకులనందనా ! నానిమిత్తమై యిట్లు వంతఁ జెందితివిగదా !

లక్ష్మ—(రాముని జూచి సాభిప్రాయముగా) ఆర్యా ! ఏమిది !

చ. తునిఁగిన ముత్తెపుం సరము తోయమునన్ భవ దశ్రుబిందువుల్
కనులను ధారలై విడి యిలం బడి పొర్లె నిదే ! యొడంద బొం
గి నిగుడు దుఃఖవేగ మడఁగింప నడంగక నాసికాధరం
బునుగదలించి యన్యజనబోధము దా నొనరించె నద్దిరా ! 30.

రామ—వత్సా !

సీ. నాడుప్రియజన విరహ జన్య మగు దుఃఖ
వహ్ని ఖరమయ్యుఁ బ్రతిక్రియావాంఛ నోర్వఁ

ధరంబునన్=పర్వతమున. తోయమునన్=రీతిని. ఖరము=తీక్ష్ణము.

బడి మనంబున, మరల విపక్వ మయిన
హృదయ మర్మవ్రణంబునా నెరియఁ జేసె. 31.

సీత—నేనును మితిమీఱిన విరహభావనచే న న్నార్యపుత్త్రి శూన్యురాలిఁగాఁ దలంచుచుంటిని.

లక్ష్మ—(తనలో) ఔనట్లే! వేఱొకటి చూపెదను. (చిత్రమును జూచి ప్రకాశముగా) ఇదిగో! యిదిమన్వంతర వృద్ధుఁ డగు గృధ్రరాజైన తాత జటాయుని విక్రమ చరిత్రన్యాసము.

సీత—హా! తండ్రీ! నీవు త్రివాత్సల్యము నిర్వహింపఁ బడినది.

రామ—తీర్థభూతుఁ డగు నంతటి సజ్జనుం డెచ్చట లభించును?

లక్ష్మ—ఇదిగో! యిది జనస్థానమునకుం బశ్చిమ తటంబున దను వను కబంధుండు నివసించు చిత్రకుంజ మను దండకారణ్యభాగము—ఋశ్యమూక మందలి యీ మతంగాశ్రమ మిది—ఇది శ్రమణ యను సిద్ధశబరి—ఇదే! పద్మపంపాసరంబు.

సీత—రోషగాంభీర్యములు విడిచి యార్యపుత్త్రుఁ డిచ్చటనేగదా పెద్ద యెలుంగుతో రోదన మొనర్చె.

రామ—దేవీ! ఈపద్మసరస్సు రమణీయమైనది.

చ. మదకలహంస పక్షముల మాటికిఁ గంపిలుచున్న దీర్ఘనా
ళ దళిత వారిజప్రజములం దగి కైరవప జ్త్రి నొప్పు త
త్పదమల నీరభాగములఁ జయ్యన బాష్పము రాలి వెండియుం
బొదిలెడు నంతరాళమునఁ బొందుగఁ జూచితి నా సరస్సునన్. 32.

లక్ష్మ—ఇతఁ డార్యుఁ డగు హనుమంతుఁడు.

సీత—ఇతఁడు చిరనిర్వేదమును బొందు జీవలోకము నుద్ధరించిన మహోపకారకుండును మహాభాగుండు నగు మరున్నందనుండు.

రామ— గీ. అంజనానంద వర్ధనుం డైన యట్టి
ఘనభుజుఁ డితండు కళ్యాణ కారణుండు
మనకు జగముల కీ మ్మహామహుని శౌర్య
సంపదలచేత ధన్యత సంభవిల్లె. 33.

దళిత=వికసించిన. వారిజము=పద్మము, కైరవము=కలువ. అంతరాళమున=మధ్యకాలమున.

సీత—వత్సా! కుసుమిత కదంబ నృత్యన్మయూరం బైన యి మ్మహీధరంబు పేరేమి? ఇచ్చటఁ బ్రభావ సౌందర్యమాత్ర పరిశేషమైన ధూసరిత లావణ్యముతో క్షణమాత్ర మూర్ఛితుం డగు నార్యపుత్త్రుండు దుఃఖాయమానుండ వగు నీచే ధరింపఁ బడిన వాఁ డై వృక్షమూలమున లిఖింపఁబడియె.

లక్ష్మ—శా. శ్యామ స్నిగ్ధ నవాంబుదాశ్రిత శిరస్స్థానంబు, సాలద్రుమ
వ్యామిాల త్సుమ సౌరభం బిదియె సుమ్మా మాల్యవ చ్ఛైల మా

రామ— సౌమిత్రీ! యిఁకఁ జాలు చాలును వినం జాలం బరార్ధంబు, నీ
తామాంగళ్యవతీ వియోగ మిదె! సిద్ధం బయ్యెడిన్ వెండియున్. 34.

లక్ష్మ—పిదప నార్యునియొక్కయుఁ బూజ్యులగు కపిదానవులయొక్కయు నగణ్యం బులగు నుత్తరోత్తర చిత్రకృత్యంబులుకలవు. ఈయార్యయుఁ బరిశ్రాంతయైనది కాన విశ్రమింపఁ జేయుఁడని విన్నవించుచుంటిని.

సీత—ఆర్యపుత్త్ర! యీ చిత్రదర్శనంబుచే సాభిలాషనగు నే నొకటి విన్నవించె దను.

రామ—ఆజ్ఞాపింపుము.

సీత—ప్రసన్న గంభీరంబు లగు గహన వీథులఁ జరింప వలయు ననియుఁ బావన విమల శీతలావగాహయు భగవతియు నగు భాగీరథియందు విహరింప వలయు ననియుం గోరుచుంటిని.

రామ—వత్స! లక్ష్మణ! "అభిలాష చెచ్చెర నెఱవేర్పవలయు" నని యిప్పుడే గురుజనాజ్ఞ యైనది. కాన నస్ఖలిత సుఖ సంప్రసారమైన శతాంగంబు దెప్పింపుము.

సీత—ఆర్యపుత్త్ర! మీరు నచ్చటికి రావలయును.

రామ—కఠినహృదయా! యిదియుం జెప్పవలయునా?

సీత—అట్లయిన నాకిష్టమే.—

అవగాహము=స్నానము. అస్ఖలిత=చలించని, సంప్రసారమైన=గమనముగల, శతాంగము=రథము. శ్యామ= నల్లనయిన, స్నిగ్ధ= నునుపగు, నవాంబుద=క్రొత్త మేఘముచే, ఆశ్రిత=ఆశ్రయింపఁబడిన, శిరస్స్థానంబు= శిఖరములుగలది, సాలద్రుమ=మద్దిచెట్లయొక్క, వ్యామిాలత్=వికసించిన, సుమసౌరభము = పుష్పపరిమళము గలదియు.

లక్ష్మ—ఆర్యాజ్ఞ నిర్వర్తింతును. (నిష్క్రమించును.)

రామ—ప్రేయసీ ! యీ గవాక్షమండలముం బొక్కింత తడవు శయనింతము.

సీత—ఔఁగాక ! ప్రయాస జనిత మగు నిద్రచే నపహరింపఁబడుచుంటిని.

రామ—ఇచట శయనింప నన్ను దృఢముగా నవలంబింపుము.

గీ. ఖేద సాధ్వస నిస్సృత స్వేదబిందు
సాంద్రమై చంద్రకరమిళ త్స్యందకాంత
సరము నుం బోని భుజము గంధరమునందుఁ
జేర్చెదవుగాక ! జీవంబుఁ గూర్చు ప్రోక. 35.

(అట్లు చేయించి సానందముగా) ప్రియా ! యేమిది ?

మ. అరయన్ సౌఖ్యమొ ? దుఃఖమో ? తెలియ శక్యం బింతయుంగాదు, దు
ర్భర సమ్మోహమొ ? నిద్రయో ? విషవిసర్పంబో ? మదంబో ? భవ
త్స్వరస స్పర్శములన్ మదిందియతతిన్ సమ్మూర్ఛ నొదించు బం
ధుర భావం బిది జీవము న్మెలిచి యమ్మూలంబు గావించెడున్. 36.

సీత—మీరు నిశ్చల ప్రసాదులు. ఇప్పుడింతకన్నఁ గావలసిన దేమి ?

రామ— గీ. క్లాంత జీవన కుసుమ వికాసనమ్ము,
లింద్రియ విమోహనములు, సంతృప్తిదములు,
పంకజాతాక్షి ! భవదీయ భాషణములు,
స్వాంత సురసాయనములు, గర్ణామృతములు. 37.

సీత—ప్రియంవదా ! శయనింతును. (శయ్యకై యంతటం బరికించును.)

రామ—ఓహో ! యేమి వెదకెదవు ?

గీ. పరిణయం బాది గృహమందు, వనమునందు,
బాల్యమందును, బిదప యౌవనమునందు,
శయన హేతు వనన్య సంశ్రయము నైన
రాముని భుజంబు సదుపబర్హంబు నీకు. 38.

సీత—(నిద్రనభినయించుచు) ఔను కలదిది, ఆర్యపుత్రా ! కలదిది. (నిద్రించును.)

రామ—ఏమి? ప్రియభాషిణి వక్షమున నిద్రించెనే ? (చూచి స్నేహముతో)

సాధ్వసనిస్సృత = భయముచే బయలువెడలిన. సమ్మోహము = మూర్ఛ, విష విసర్పంబో = విషవ్యాప్తియో, క్లాంత = వాడిన రసాయనము = ఔషధము. ఉపబర్హ ము = దిండు,

చ. ఇది గృహలక్ష్మి; నేత్రముల కిద్ది సుధారసవర్తి; యీ సుఖ
ప్రద మగు దీని స్పర్శ మెయి రాచిన చందనసారపూరగ; మీ
మృదుభుజ మీ గళంబున రహించెడు మౌక్తికముత్తెపుసరం;
బెడ దగు నేదియును రహింపదు దుస్సహమౌ వియోగమే. 39.

ప్రతీహారి—(ప్రవేశించి) దేవా! వచ్చెను.

రామ—ఓసీ! ఎవ్వరు?

ప్రతీ—దేవర సన్నిధాన సేవకుఁడగు దుర్ముఖుఁడు.

రామ—(తనలో) అంతఃపుర సంచారి దుర్ముఖుఁడా? పౌర జానపదుల భావసంవేదన మునకై పనిచియుంటిని. (ప్రకాశము) వచ్చుఁగాక!

ప్రతీ—(నిష్క్రమించును)

దుర్ము—(ప్రవేశించితనలో) హాహా! సీతాదేవిపై నసంభావ్యమైన యిట్టి జనాపవాదమును దేవర కెట్లు తెల్పుదును? మంచభాగ్యమగు నాని యోగమిట్టిదే కదా!

సీత—(కలవరించుచు) హా! ఆర్యపుత్ర! సౌమ్యా! యెచ్చటనుంటివి?

రామ—ఓహో! చిత్రదర్శనంబున సంక్షోభకారియైన విరహభావన దేవికి స్వప్నోద్వేగమును గల్గించుచున్నది. (అనురాగముతో మేను నిమురుచు)

ఉ. ఎయ్యది ఖేద [illegible]ముల నేకము; సర్వదశానుబద్ధమే;
దెయ్యెడ విశ్రమించు మన; మెండలిరక్తి జరానపాయమౌ;
* నెయ్యది యోలి లజ్జనశియింప ఘనప్రణయంబుఁ గాంచు; నా
నెయ్యపు జంటకున్ శుభము నిత్యము గోరఁబడుం గడంకతోన్. 40.

* "నెయ్యది ప్రేమ సాగమయి యింపగు నావరణాత్యయంబునన్", యనుపద్యము నందలి మూఁడవచరణమునకు మారుదీనినిగూడఁ జదువుకొనవచ్చును. మూలమునందుఁ గల "ఆవరణాత్యయాత్" అను పదమునకు రెండర్థములుగలవు. ఆవరణము = అడ్డు. దీని చేలజ్జస్ఫురించును. ఆవరణము యొక్క = అనఁగాలజ్జ యొక్క, అత్యయాత్ = నాశము వలన, ప్రేమ హెచ్చునని యొకయర్థము. రెండవది:—వరణమనఁగా వివాహము, ఆవరణమన వివాహము మొదలుకొని, అత్యయాత్ = అంతమువఱకు, అనఁగామరణపర్యంతమా విడువని ప్రేమగలదియని. ఈరెండిటియందును మొదటియర్థమే యెక్కువ రసవంతమైనదని పెద్దలమతము. కావునదాని నేపథ్యమునందు వ్యక్తీకరించితిమి. పద్యాంతరమున శేషకమవగు ఆవరణాత్యయము అనుమూలపాద భాగమునే ప్రయోగించితిమి.

దుర్ము—(సమీపించి) జయము దేవా !

రామ—తెల్పుము నీ వెఱింగినది.

దుర్ము—"రామభద్రునిచే మహారాజ దశరథుని మఱచితి" మని పౌరజానపదులు దేవరం గొనియాడుచుండిరి.

రామ—అర్థవాదమిది. దోషమేమైనం దెల్పుము. దాని నివర్తించెదను.

దుర్ము—(కన్నీరుతో) దేవా ! వినుము. (కర్ణమున నిట్లిటు)

రామ—అహహా ! వాగ్వజ్రము తీవ్రాఘాతము. (మూర్ఛిల్లును.)

దుర్ము—దేవా ! ఊరడిల్లుము.

రామ—(ఊరడిలి)

గీ. అకట జానకి కన్య గేహప్రవాస
దోష మణఁగింపఁ బడియె నద్భుతపు విధుల
నదియె వెండియు దుర్విధిప్రాప్తి వలన
విరిసె నెల్లెడ నాలర్క విషము వోలె. 41.

కాన నిందు మందభాగ్యుండ నగు నేనేమి సేయుదును ? (విమర్శించి దైన్యముతో) ఇంకేమిగలదు ?

గీ శిష్టులకు నెట్టి కృత్యంబు చేతనైన
జనుల యిష్టానుసరణంబు సద్వ్రతంబు
నన్నుఁ బ్రాణంబులను వీఁడు నాదుజనకు
చేత నీ సద్వ్రతంబె పూజింపఁబడియె. 42

భగవంతుఁ డగు వసిష్ఠమౌనియు నిట్లె వార్తనంపె మఱియు.

గీ. భువనవరులైన రవివంశ భూమిపతుల
సచ్చరిత్రంబు మిగుల నుజ్జ్వలిత మయ్యె
నందు నను బట్టి కళ్మలంబౌ వదంతి
దొరలె నేని ! వ్యర్థుఁడ వినింద్యుండ నకట ! 4

హా ! దేవి ! పవన ధాత్రీతనూజా ! హా ! స్వజన్మానుగ్రహ పావనీకృత విశ్వంభరా ! హా ! నిమిజనకకులానందదాయిని ! హా ! పావక వసిష్ఠారుంధతీ స్తూయమానవృత్త శాలినీ ! హా ! రామైకజీవితా ! హా ! దుర్గమారణ్య వాస ప్రియసఖి హా ! హిత మిత భాషిణీ ! యిట్టిదికా యీ దశాపరిణామము.

ఆలర్క=వెఱ్ఱికుక్కయొక్క, ఉజ్జ్వలితము=ప్రకాశమానము,

గీ. నీవలన విష్టపములెల్లఁ బావనములు
ప్రజల వాక్కులు నీయందపావనములు
నీవలన నాథవంతముల్ నిఖిలజగము
లీ వనాథురాల వయి వాపోవుదింక. 44.

దుర్ముఖ! లక్ష్మణునితో నీ నవీన రాజు రాముఁ డాజ్ఞాపించుచున్నాఁడని తెల్పుము. (కర్ణమున నిట్లు)

దుర్ము—పావక పరిపూతయు గర్భస్థిత పవిత్ర రఘుకుల సంతతియు నగు దేవియెడల దుర్జన వాక్యమున దేవరచే నీచందమున నేల నిర్ణయింపఁబడినది?

రామ—చాలు! పౌరజానపదు లెట్లు దుర్జనులు? చూడుము.

గీ. ప్రజల కభిమత మైన దిక్ష్వాకుకులము
విధివశంబున నపవాద బీజ మొదవె
నద్భుతపు శోధఁ జేసితి మంటి మేని
నమ్ము నెవ్వఁడు దూర వృత్తమ్ము మదిని? 45.

కావునం బొమ్ము—

దుర్ము—హా! దేవి! (నిష్క్రమించును)

రామ—హా! కష్టము! అతిఘోర మొనర్చు ఘాతుకుండ నైతిని. నేను—

ఉ. పిన్నటనాటఁగోలెఁ గడుఁ బ్రీతినిఁ బెంపుడు జెంది కూర్మిచే
భిన్నముగాని భావమునఁ జేర్మి వహించెడి దీనిఁ బన్నికం
బన్ని గృహంబునం బెనుచు పక్షిఁ బుళిందునకట్లు సౌహృదం
బెన్నక మృత్యువక్త్రమున కింక సమర్పణ మాచరించితిన్. 46.

కాన ముట్టరాని పాతకి నైన నేను దేవి నపవిత్రపఱతునా యేమి?

(సీతశిరంబు నించుక యెత్తి బాహువుం దివిచి)

ఆ. చను మపూర్వ కర్మ చండాలుఁడను నన్ను
ముట్టకింక విడుము ముగ్ధరాల!
సంశ్రయించితీవు చందన భ్రాంతిచే
విలయ హేతు వైన విషకుజంబు. 47.

విష్టపములు=జగములు, పుళిందుఁడు=కిరాతుఁడు, సౌహృదంబు=స్నేహము వక్త్రము=ముఖము, సంశ్రయించితి=ఆశ్రయించితివి. విలయ=ప్రాణాపాయమునకు.

అన్నా ! జీవలోక మిపుడు వ్యత్యస్త మయినది. రాముని జీవితఫలం బవసన్న మైనది. ఇప్పుడు జగంబు శూన్యంబై జీర్ణారణ్య మైనది. సంసారము నిస్సారము. కాయము కాష్ఠప్రాయము. అశరణుండ నైతిని. ఏమి చేయుదును ! ఏదిగతి ?

గీ. ఉమ్మలికము నెఱుంగఁ జేయుటకె రాము
నందుఁ జైతన్య మాగతం బయ్యె మరలఁ
బ్రాణములు మేన నిల్చి మర్మములఁ గలఁచి
వజ్రకీలంబు లటుల దుర్వహము లయ్యె. 48.

హా ! జననీ ! అరుంధతీ ! హా ! భగవంతులారా ! వసిష్ఠ విశ్వామిత్రులారా ! హా ! మహాత్మా ! పావక ! హా ! దేవీ ! భూతధాత్రి ! హా ! తండ్రీ ! జనక ! హా ! తండ్రీ ! హా ! మాతలారా ! హా ! మహోపకృతి ! లంకాపతీ ! విభీషణ ! హా ! ప్రియమిత్ర ! సుగ్రీవ ! హా ! సౌమ్య ! మరున్నందన ! హా ! సఖీ ! త్రిజటా ! హతప్రాయుఁడగు రామునిచే మీరెల్లరుఁ దిరస్కరింపఁ బడితిరి; ఇపుడు వారిఁ జీర నే నెవ్వండను ?

క. ఘను లమ్మహామహులు దు
ర్జనుఁడఁ గృతఘ్నుండ ననఁగఁ జను నాచే ని
య్యనువునఁ జీరంబడి యె
య్యనఁ గలుషీభూతు లౌదు రనుచుఁడలంతున్. 49.

చ. తను మదినమ్మి హ్వాత్తటమునం బడి నిద్రిలుచున్న గేహల
క్ష్మిని, భయభావనాస్ఫురిత మేదుర గర్భ భరాలసం, బ్రియాం
గన, నిటులం ద్యజించి యనుకంప యొకింతయు లేక మానవా
శనులకు నేబలింబలెనొసంగుచు నుంటిని క్రూరవృత్తితోన్. 50.

(సీత పాదముల శిరమును జేర్చి) దేవీ ! రాముని శిరంబు నీపాదపద్మముల ముట్టుట కిదియే కడసారి (ఏడ్చును-తెఱలో) అబ్రహ్మణ్య మబ్రహ్మణ్యము.
రామ—ఓహో ! తెల్పు మేమిది ? (మరలఁ దెఱలో

ఉమ్మలికము=దుఃఖము, కీలంబులు=మేకులు, చీరంబడి=పిలువంబడి, స్ఫురిత=చలించుచున్న, మేదుర=అతిశయమైన, అనుకంప=దయ, అబ్రహ్మణ్యము=అవధ్యుండను,

క. యమునా తీర నివాసులు
సమితోగ్ర తపఃప్రభావు లగు మౌనులు దు
ర్దమ లవణ త్రాసితు లై
శ్రమమునఁ జనుదెంచి రీనె శరణం బనుచున్. 51.

రామ—ఆహా! యిప్పటికిని రాక్షస త్రాసమా? అవుఁగాక! కుంభీనసీపుత్త్రుఁ డయిన యి దురాత్ము నున్మూలింప శత్రుఘ్ను నంపెదను. (కొన్ని పదము లరిగి మరలఁ దిరిగి) హా! దేవీ! ఇట్లు పోయి యెట్లుగాఁగలవు? భగవతీ! విశ్వంభరా!

క. జనక రఘువంశ సంభవ
మనుజేంద్రుల యఖిలగోత్ర మంగళ మగు పా
వనశీల యైన యే సా
ధ్వని బుణ్యాధ్వరమునందు వెలయించితివో? 52.

అట్టి పవిత్రపుత్త్రికయైన జానకిన వేక్షింపుము.

(నిష్క్రమించును.)

సీత—హా! సౌమ్య! ఆర్యపుత్త్ర! యెచ్చటనుంటివి? (వేగమున లేచి) కటకటా! దుస్స్వప్న వంచితనై యార్యపుత్త్ర శూన్యురాలినిగాఁ దలంచుచుంటిని. (పరికించి) అయ్యయో? నిద్రించుచున్న న న్నార్యపుత్త్రుఁ డొంటి విడిచి చనిగొ. ఇప్పు డిక నేమి? పోఁగాక! అతనిఁగాంచుచు నాయంత నేను సమర్థ కాదు నేని యతనిపై నాగ్రహింతును. సేవకుం డెవ్వఁడిచ్చట?

దుర్ము—(ప్రవేశించి) దేవీ! "అరథంబుసిద్ధమైనది. దేవియధిరోహించుఁగాక!" యని లక్ష్మణకుమారుండు విన్నవించుచున్నాఁడు.

సీత—ఇదిగో! అధిష్టించుచుంటిని, గర్భభారము స్ఫురింప నట్లున్నది. కాన మెల్లనఁ బోవుదము.

దుర్ము—దేవీ! యిట్టిటు.

సీత—రఘువంశదేవతలకు నమస్కారము, తపోధనులకు వందనము.

(అందఱు నిష్క్రమింతురు.)

చిత్రదర్శన మను ప్రథమాంకము.

సంపూర్ణము.

లవణత్రాసితులై=లవణాసురునిచే భయపెట్టఁబడినవారై, అవేక్షింపుము=కనిపెట్టుము. అధ్వరమునందు=యజ్ఞ (భూమియందు.)

ఆంధ్రీకృతోత్తరరామచరిత్రము.

ద్వితీయాంకము.

(తెఱలో) స్వాగతమా తపస్వినికి ?

తాపసి—(పథికవేషముతోఁ బ్రవేశించి) ఓహో ! ఈ వనదేవత ఫల కుసుమ పల్లవార్ఘ్యంబులతో నన్నుఁ జేరవచ్చుచున్నది.

వనదేవత—(ప్రవేశించి అర్ఘ్య మొసంగి).

ఉ. ఈవిపినంబు భోగ్యము యథేచ్ఛగ మీకు, శుభాహ మిద్ది, నా
కీవిధి సాధు సంగ మన నెంతయుఁ బుణ్యమునన్ లభించు, వృ
క్షావళి నీడయైన, జలమైన, దపోవరభోజ్యమౌ ఫలం
బే ? వనమూలమేని ? వశమేగద సర్వము మీకు నియ్యెడన్. 1.

తాప—ఇందేమి తెల్పవలయును ?

మ. ప్రియమౌ కాయికవృత్తియున్, వినయ దీప్తిం బొల్చు వాచాప్రవృ
త్తియు, భద్రపరిష్కృతిం దనరు మతియుం, దివ్యంపు సాంగత్య ర
క్తియుఁ, బ్రత్యక్షపరోక్షకాలముల నేకీభూత సారస్యముం
జయవెట్టన్ విలసిల్లు సజ్జన రహస్యం బచ్చు నిర్వ్యాజమై. 2.

(కూర్చుందురు)

వన—పూజ్యురాలి. నామధేయ మేమని తెలిసికొందును !

తాప—ఆర్యురాలా ! ఆత్రేయిని !

వన—ఆర్యా ! ఆత్రేయి ! యిచ్చటి కెచ్చటినుండి వచ్చుచుంటివి ? ఈ దండకారణ్యప్రచార మెందులకు ?

అహము = దినము. ఏకీభూతము = ఒకటిగాఁ జేయఁబడిన, నిర్వ్యాజమై = మిషలేనిదై.

ఆత్రే— గీ. వరలుదురు కుంభసంభవ ప్రముఖు లైన
పెక్కు రుద్గీథ వేత్త లే చక్కటులను
వీరి సన్నిధి నిగమాంత విద్య నేర్వఁ
దిరుగు చుంటిని వాల్మీకి సరసనుండి. 3.

వన—అన్యమునులు సైతముఁ బురాణ బ్రహ్మవాదు లగు నా ప్రాచేతస మునినె నిగమాంతాధ్యయనంబునకై యుపాసించు చుండ నార్యురాలి కీ దీర్ఘ ప్రవాస క్లేశ మేందులకు ?

ఆత్రే—అచ్చట విశేష మగు నధ్యయనాంతరాయ మని దీర్ఘప్రవాస మంగీకరించితిని.

వన—అది యెద్ది ?

ఆత్రే—అమ్మహాత్ముని కెద్దియో యొక దేవతా విశేషము సర్వవిధంబుల నద్భుతావహంబై స్తన్యత్యాగ వయస్సునం గలుగు నర్భక యుగ్మంబు నర్పించె. ఆయుగళ మొక్క మునులకే కాదు తిర్యగ్భూతములకు సైత మంతరంగంబుల ద్రవింపఁ జేయుచుండె.

వన—వారి యభిధానంబు లెఱుంగుదువా ?

ఆత్రే—"కుశ లవు" లని వారి యాహ్వయంబులును, తత్ప్రభావంబునుంగూడ, నా దేవతయే ప్రకాశించె.

వన—ప్రభావ మెట్టిది ?

ఆత్రే—వారికి సరహస్యంబు లయిన జృంభకాస్త్రంబు లాజన్మ సిద్ధము లఁట.

వన—ఓహో ! ఆశ్చర్యమిది.

ఆత్రే—భగవానుఁ డగు వాల్మీకిమౌనియు, వారి నుపమాతృ తుల్యముగాఁ బోషించుచు సంరక్షించుచుఁ జూడాకర్మ నాచరించి నిగమములు దక్కఁ దక్కిన విద్యల సావధానముగా నేర్పి పిమ్మట గర్భైకాదశ వత్సరంబున క్షాత్రకల్పముతో నుపనయనం బొనర్చి గురువులు త్రయీ విద్యంగఱపిరి. జాజ్వల్యమాన ప్రజ్ఞా మేధా విశేషులగు నా బాలకులతో సహాధ్యయనం బొనర్పనస్మదాదులకు యోగము లేదు. ఏమన ?

ఉద్గీథవేత్తలు=సామవేదము తెలిసినవారు, అర్భకయుగ్మము = ఇరువురుబిడ్డలు, ఉపమాతృ=పెంపుడు తల్లి. త్రయీ = వేదము.

చ. మొనసి గురుండు ప్రాజ్ఞునకు మూర్ఖునకున్ సరివిద్య నేర్పు చో
క్కానికిని జ్ఞానశక్తి గలుగన్, నశియింపను గాని చేయఁ డా
జనులకుఁ బాండితీ కలనఁ జాల విభేదము గల్గు, బింబముం
గొనునెడ స్వచ్ఛరత్నమునకుం దులఁ దూఁగునొకో మృదాదులున్. 4.

వన—ఇదే! అధ్యయనాంతరాయము.

ఆత్రే—ఇంకొకటిగూడఁ గలదు.

వన—అదేది?

ఆత్రే—పిదప నొకప్పు డా బ్రహ్మర్షి మధ్యాహ్న కాలమున దమసా తరంగిణిం జేరి యచ్చటం గవగూడి చరించు క్రౌంచంబులలో నొకటి కిరాతునిచే వధింపఁబడ నిరీక్షించి యాకస్మికావభాసరై యసంకీర్ణానుష్టుబ్రూప యగు వాగ్దేవిం బ్రకటించె.

* శ్లో॥ "మానిషాద! ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునా దేక మవధీః కామమోహితం" అని.

వన—చిత్రము. ఆమ్నాయంబు గాక నూతనంబుగా ఛందస్సు లవతరించినవి.

ఆత్రే—అయ్యెడ శబ్దబ్రహ్మావభాసకుం డగు భగవంతుని వల్మీకభవుని జేరి భగవంతుఁడగు భూతభావనుండు బద్మభవుం డిట్లనియె. "ఋషీంద్రా! వాగ్బ్రహ్మంబునం బ్రబుద్ధుండ వైతివి. కాన రామచరిత్రంబు నభివర్ణింపుము, నీ ప్రతిభాదృష్టియే యనుపహతంబైన దివ్యజ్యోతి యగును. ఆదికవి వైతివి." అని యంతర్హితుం డయ్యె. పిమ్మట భగవానుఁ డగు వల్మీకభవుఁడు మనుష్యలోకమున శబ్దబ్రహ్మమునకుఁ బ్రథమ పరిణామ మగు నట్టి రామాయణ మను నితిహాసమును రచించెను.

వన—ఆహా! బ్రహ్మాండ మలంకరింపఁబడినది.

ఆత్రే—కావుననే మహాంత మగు నధ్యయనాంతరాయ మని వచించితిని.

వన—అది యుక్తము.

ఆత్రే—విశ్రమించితిని. కల్యాణీ! యిప్పు డగస్త్యాశ్రమంబునకు మార్గంబుఁ దెల్పుము.

వన—ఇటు పంచవటి ననుసరించి యీ గోదావరీ తీరమున నరుగుదుఁ గాక!

అవభాసరై = ప్రకాశముకలదియై, అసంకీర్ణ = వాక్యదోషరహితమైన,
* గీ. కామమోహితమైనట్టి క్రౌంచమిథున । మందునొకదాని జంపితి వట్టులౌట । నో నిషాద! పెక్కేండ్లు నీవుర్వియందుఁ । బ్రాణములతోడ నుండఁగా వలదు సుమ్ము,
అనుపహతము = అడ్డులేని.

ఆత్రే—(కన్నీళ్లతో) ఇది తపోవనమా? ఇది పంచవటియా? ఇది ప్రస్రవణాద్రియా? జనస్థాన వనదేవతవు వాసంతివా నీవు?

వాసం—అట్లే.

ఆత్రే—వత్సా! జానకి:—

ఆ. ఇచటఁ గల్గు నీదు హితశాఖి వర్గంబు
లలిఁ గథాప్రసంగములఁ బ్రదృష్ట
మగుచు నామశేష వగు నిన్నుఁ బ్రత్యక్ష
సరణిఁ గాంచి నట్లె సలిపె మాకు.

వాసం—(భయమునఁ దనలో) నామశేష యని పల్కెనేమి? (ప్రకాశముగా) ఆర్యా జానకీదేవి కేమి యుపద్రవము?

ఆత్రే—ఉపద్రవమే కాదు. అపవాదము సైతము. (కర్ణమున నిట్టిటు)

వాసం—అహహా! దురదృష్ట నిర్ఘాత మతిదారుణము. (మూర్ఛిల్లును)

ఆత్రే—కల్యాణీ! ఊరడిల్లు మూరడిల్లుము.

వాసం—హా! ప్రియసఖీ! మహాభాగ్యవతీ! నీసృష్టిసౌభాగ్య మిట్లయ్యెనా? రామభద్రా! రామభద్ర! నీతోనేమి? ఆర్యా! ఆత్రేయి! పిదప నయ్యరణ్యమున విడిచి లక్ష్మణుఁడు మరలి పోవ జానకీ వృత్తాంతముం గూర్చి ప్రవృత్తి యేమైనఁ గల్గెనా?

ఆత్రే—లేదు లేదు.

వాసం—హా! కష్టము! రఘురాజమందిరం బరుంధతీ వసిష్ఠులచేఁ బరిపాలింపఁ బడుచుండ వృద్ధరాజ్ఞీజనంబు జీవించియుండ నిది యెట్లు జరిగెను?

ఆత్రే—అప్పుడు గురుజనము ఋశ్యశృంగాశ్రమంబున నుండెను. ఇప్పుడా ద్వాదశాబ్ద పరిమితంబైన యాగంబు సమాప్త మయ్యె. ఋశ్యశృంగమౌని పూజ గావించి గురుజనంబును సాగనంపె. పిదప భగవతి యరుంధతి “నేను వధూరహితమగు నయోధ్యకుం బోఁ జాల.” నని చెప్పె. కౌసల్యాదు లదియే సమ్మతించిరి. దానం జేసి భగవంతుఁ డగు వసిష్ఠమౌని “వాల్మీకి తపోవనంబుఁ జేరి యచ్చట నివసింత” మని నిశ్చయించి వక్కాణించె.

వాసం—పిదప నిప్పు డాన్నృపుఁ డే మొనర్చుచుండెను?

ప్రదృష్టము=అగపడినది, నిర్ఘాతము=పిడుగు.

ఆత్రే—అన్నపుడు డశ్వమేధ మారంభించెను.
వాసం—ఇస్సీ! వివాహము గూడనా ?
ఆత్రే—లేదు లేదు. పాపము శాంతించుఁగాక!
వాసం—అట్లయిన యాగమున ధర్మపత్ని యేది ?
ఆత్రే—హేమమయం బగు సీతాప్రతికృతి.
వాసం—అన్నా!

క. కులిశమునకన్నఁ దీక్ష్ణం
బులు, సుమమునకన్న మృదులములు, నగుచు నిలన్
వెలయు మహాత్ముల చిత్తం
బుల నెవ్వనికైనఁ దెలియఁ బోలునె తలఁపన్. 6.

ఆత్రే—వామదేవాభిమంత్రితం బైన యజ్ఞాశ్వంబు విసర్జింపఁ బడియె. దానికి విధి విహిత క్రమంబున రక్షక వర్గ మేర్పఱుపఁ బడియె. దాని కధీశుఁడై లక్ష్మణ కుమారుఁ డగు చంద్రకేతుఁడు దివ్యాస్త్ర సంప్రదాయము తోడను జతురంగ సేనతోడను బంపఁబడియె.

వాసం—(స్నేహానంద బాష్పములతో) కుమార లక్ష్మణానకుం గూడఁ బుత్త్రుఁడా? ఆహా! తల్లీ! బ్రదికితిని.

ఆత్రే—ఇంతలో నొక మహీసురుండు మృతుఁడైన పుత్త్రు నెత్తుకొని రాజద్వారమున గుండెలు మోదుకొనుచు "నబ్రహ్మణ్య" మని మొఱవెట్టెను. పిదప "రాజాపచారము లేక లోకుల కిట్టి యకాలమృత్యు వావేశింప" దని దయామయుం డగు రామభద్రుఁ డూహించుచుండ నశరీరవాణి గొబ్బున నిట్లావిర్భవించె

గీ. "భూతలంబున నిపుడు శంబూకుఁ డనఁగ
వృషలుఁ డొక్కఁడు తప మాచరించు చుండె
శిరము ఖండింప నర్హుఁ డన్నరుఁడు నీకు
రామ! వానిని ద్రుంచి విప్రసుతు మనుపు." 7.

ఇ య్యుపశ్రుతి నాలించి ఖడ్గహస్తుఁడై పుష్పక విమాన మధిష్ఠించి శూద్రతాపసాన్వేషణార్థమై జగద్విభుం డష్టదిక్కులం దిరుగఁ జొచ్చె.

కులిశము=వజ్రాయుధము, వృషలుఁడు=శూద్రుఁడు.

వాసం—శంబూకుఁ డనువాఁ డధోముఖుఁడై ధూమపాన మొనర్చుచు నీజనస్థానమున నే తపము సేయుచుండె. కాన మన రామభద్రుఁ డీకాననం బలంకరించుఁ గాఁబోలు !

ఆత్రే—కళ్యాణీ ! యింకఁ బోయెదను.

వాసం—పోఁగాక ! ఈదినము కఠోరముగా నున్నది. అల్లదే ;—

మ. పులుఁగుల్ పట్టలఁ గాలఁ గీలుచును బుర్వుల్ ముక్కుల న్మెక్కఁ బ్ర
కల్కలఁ బారావత కుక్కుటంబులు తృషం గ్రాసిల్లి ఘోషింప, నొ
ద్దుల నీడద్రుమముల్ తపోష్మమునఁ బట్టుల్ దప్పి మత్తద్విపం
బులు పెంజెక్కుల రాయ రాలు పువులం బూజించె గోదావరిన్. 8.

(నిష్క్రమించిరి.)

ఇది విష్కంభము.

(కరుణోద్యత ఖడ్గముతో రాముఁడు ప్రవేశించును.)

రామ—

చ. మగుడకు దక్షిణేద్ధకరమా ! మృతభూసుర నందనుండు హె
చ్చుగఁ జెలివొందు నిల్చుటకు శూద్రముని౦ గడతేర్పు మక్కటా !
వగ పొక యింత లేక కులభామిని గర్భవతిన్ వనావళిం
దిగిచిన రాము గాత్రమవు నీకు దయారస మేల కల్గునో ? 9.

(అతికష్టమున విసరి రామునకుఁ దగిన కృత్య మాచరింపఁ బడినది. జీవించునా విప్రకుమారుఁడు ?

దివ్యపురుషుఁడు—(ప్రవేశించి) దేవా ! జయము జయము !—

చ. యముని వశంబునుండి యభయంబు నొసంగిన నీవు శాసక
త్వము వహియించుటన్ మనియె బ్రాహ్మణ నందనుఁ, డిట్టి వైభవం
బమరెను నాకు, శంబుకుఁడ నోఁదల ద్రొక్కెద నీ పదాంబుజ
న్మములకు, సజ్జనాప్త నిధనంబులు గూడఁ దరింపఁ జేయవే ? 10

కఠోరము=తీక్ష్ణము. తృష=దప్పి, నీడ= గూళ్లతోనున్న, ద్రుమముల్=వృక్షములు, తపోష్మమున=ఎండవేఁడిమిచే, ద్విపములు =ఏనుఁగులు. దక్షిణేద్ధకరా=ప్రసిద్ధమైన యీకుడిచేయీ ! గాత్రమవు= అవయవరూపమైనదానవు. పదాంబుజన్మములు=పాదపద్మములు. నిధనంబులు=చావులు.

రామ — రెండును మాకు హితములే, కాన నుగ్రతపంబునకుఁ దగిన ఫలం బనుభవింపుము.

గీ. ఎచట సుకృతంబుచే జనియించి నట్టి
విపుల మోద ప్రమోదముల్ వెలయుచుండు
నట్టి వైరాజలోకంబు లతుల దీప్తి
భరితములు గల్గు నీకు శాశ్వతము లగుచు. 11

శంబు — ఈ వైభవము దేవర పాదానుగ్రహ ఫలంబుగాని నా తపఃఫలంబుగాదు. అయినను తపంబు మహోపకారమే కావించెను.

చ. పొరి జగ మారయం దగిన భూతవిభుండవు నీవు శూద్రు న
న్నరయుచు నూరు యోజనము లాస్తమెయిం జనుదెంచు టెల్ల న
క్కట తగు మత్తపః ఫలము గాదె? శ్రితావన! కాకయున్న ని
క్కరణి నయోధ్యనుండి నను గాంచుట యెక్కడ దండకాటవిన్? 12

రామ — దండకారణ్యమా యిది? (కలయఁ గాంచి) ఔను —

ఉ. ఒక్కెడ నీల కోమలము, లొక్కెడ భీషణ జాంగలంబు లిం
కొక్కెడ నిర్ఝరారవ మహోజ్జ్వల సర్వ దిశాముఖంబు, లీ
ప్రక్కలఁ దీర్థముల్, గిరులు, వాహిను, లాశ్రమ గర్భితాటవుల్,
చెక్కునఁ బూర్వదృష్ట సరణిం గనుపట్టెడి దండకాస్థలున్. 13

శంబు — దండకారణ్యమే యిది. తొల్లి యిట నివసించు దేవరచే —

గీ. దారు ణాచారు లగు చతుర్దశ సహస్ర
దితిజులును, ఖరదూషణ త్రిశిరు లనెడి
రాక్షస త్రయమును మహారణమునందుఁ
జంపఁ బడలేదె విక్రమోచ్ఛ్రయము మెఱయ? 14

కావుననే సిద్ధక్షేత్రమగు నీ జనస్థానమున మముబోటి భీరువులకుఁ గూడ నిర్భయ సంచారము లభించినది.

వైరాజలోకంబులు=ప్రకాశవంతములైనలోకములు. జాంగలంబులు=ఎడారులు, నిర్ఝరారవ= ప్రవాహధ్వనులు, పూర్వదృష్టసరణిన్=వెనుకఁజూచినరీతిని. చతుర్దశసహస్రదితిజులు=పదునాలుగువేలరక్కసులు. విక్రమోచ్ఛ్రయము=పరాక్రమాతిశయము. భీరువులకు=పిరికివారికి.

రామ—దండకారణ్యమే కాక జనస్థానముఁ గూడనా?

శంబు—ఔను. సర్వభూత భయకరంబులు, నున్మత్త చండ శార్దూల కరాళ శైల కందరంబులు, నగు నీ జనస్థాన ప్రాంత గంభీర కాంతారంబులు దక్షిణ దిగంతంబు నావరించి యున్నవి. అల్లదే !

మ. ఒకచో నీరవ నిశ్చలంబు, లొకచో నుద్ఘుష్ట సత్త్వంబు, లిం
కొకచో స్వైర సుషుప్త ధీర రవ నాగోచ్ఛ్వాస దీప్తాగ్ను, లిం
కొకచోటం బ్రదరాంతర ప్రసర దల్పోదంబు లౌ సీమలం
గృకలాసంబులు దృష్ణవాహన నిదాఘోరమ్ముల న్గ్రోలెడున్. 15.

రామ— గీ. తొల్లి ఖరదైత్య నిలయమై తురగలించు
నీ జనస్థాన వనసీమ లెల్లఁ గనుచుఁ
నొంటి వృత్తాంతముల మహాద్భుత మెసంగ
ననుభవించుచు నుంటిఁ బ్రత్యక్ష సరణి. 16.

(అంతటఁగలయంజూచి) సర్వవిధంబులను జానకి యుపవనామోదిని ; అవియే కదా యీ కాంతారంబులు ! ఇంతకన్న భయంకర మెయ్యది ? (కన్నీళ్లతో)

క. నిను గూడి మధుసుగంధిల
వనముల నివసింతు ననుచుఁ బర మామోదం
బున విహరించె సతీమణి
యను వగు దత్ప్రియ మహిమ మట్టిది గాదే ? 17.

క. ఇంచుకయుఁ జేయకున్నను
ద్రుంచున్ సౌఖ్యములచేత దుఃఖము లెల్లం
బ్రాంచత్ప్రియ జన మనఁగా
నెంచఁగ రా నట్టి ద్రవ్యమిల మనుజునకున్. 18.

కరాళ=భయంకరమైన, నీరవ=నిశ్శబ్దమగుటచే, ఉద్ఘుష్ట=ప్రచండమైన, సత్త్వంబులు = జంతువులు, స్వైరసుషుప్త = స్వేచ్ఛగా నిద్రించుచున్న, ధీరరవ = గంభీరధ్వనిగల, నాగ = పాములయొక్క— ఉచ్ఛ్వాసముచేత, దీప్తాగ్నులు=మండెడు అగ్నిహోత్రములు. ప్రదరాంతర = గుహలనుండి, ప్రసరత్ = పాఱుచున్న, అల్పోదంబులౌ = కొద్దినీరుగల, సీమలన్=ప్రదేశములందు, కృకలాసంబులు=తొండలు, తృష్ణన్=దాహముచే, వాహస=కొండచిలువలయొక్క, నిదాఘోరమ్ములన్ =చెమటనీటిని, గ్రోలెడున్. మధుసుగంధిల=పూఁదేనెచేఁబరిమళించు, ప్రణయ=ప్రేమయొక్క,

శంబు — కావున దురవగాహంబు లగు నీ గహనంబులం జూడవలయు. మఱియు, సదమల నీలకంఠ కంఠ మంజుల ప్రభా భాసురంబు లగు భూధరంబులచే వ్యాప్తంబులై, నిరంతర రసాల విస్తృత చ్ఛాయా బాలతరు బృంద సుందరంబులై, నిర్భయానేక మృగ సంకులంబులై ప్రశాంత తామిత పరిణాహంబు లగు నీమధ్యమారణ్యముల మహాత్మా! కనుంగొనుము.

గీ. సమద విహగ నిలయ వేతస ప్రసూన
గంధి శీతల విమలోదకముల నలరి,
మంజు ఫల నీల జంబూ నికుంజ రుద్ధ
రయ రవంబులఁ బాఱు నిర్ఝరిణు లిచట. 19.

మఱియు —

గీ. గుహల నంబూకృతము సేయు కూనయెలుఁగు
ల నినదంబు ప్రతిధ్వనుల మితిమీఱె,
గజ దళిత కీర్ణ సల్లకీ గ్రంథి సార
సౌరభము రేగె శిశిర కషాయ కటుత. 20.

రామ — (కన్నీళ్లు నరికట్టి) భద్రా! నీమార్గములు శుభప్రదములు గాక! పుణ్య లోక ప్రాప్తికై విమానంబు నధిరోహింపుము.

శంబు — పురాతన బ్రహ్మవాది యగు నగస్త్యమౌని కభివందించి శాశ్వత స్థానముం జేరెదను. (నిష్క్రమించెను.)

దురవగాహంబులు = ప్రవేశింపశక్యము గానివి, గహనంబులు = వనములు, విస్తృత = విరివియైన, నీలకంఠ = నెమళ్ల యొక్క, పరిణాహంబులు = గంభీరములు.

సమద = మదించిన, విహగ = పక్షుల యొక్క, నిలయ = గూళ్ళుకల, వేతస = ప్రబ్బచెట్ల యొక్క, ప్రసూన = పూవుల చేతను, గంధి = పరిమళించు, శీతల = చల్లనైన, విమల = స్వచ్ఛమయిన, మంజు = మృదువైన, ఫల = పండ్ల చేత, నీల = నల్లనయిన, జంబూనికుంజ = నేరేడుపొదల చేత, రుద్ధ = అరికట్టఁబడిన, రయ = వేగము వలనఁగలుగు, రవంబుల = ధ్వనులతో, పాఱు = ప్రవహించు, నిర్ఝరిణులు = ప్రవాహములు.

అంబూకృతము = ఉమ్మి వేయుటవలనఁగలుగు ధ్వని. గజ = ఏనుఁగుల చేత, దళిత = విఱువఁబడిన, కీర్ణ = దట్టమయిన, సల్లకీ = అందుగుచెట్ల యొక్క, గ్రంథి = గణుపులనుండి వెడలిన, సార = రసము యొక్క, సౌరభము = పరిమళము, శిశిర = చల్లనిదియు, కషాయ = చేదయినదియు, కటుత = కారముగలదియునై, రేగెన్.

రామ—— గీ. మున్ను జిరకాల మిందు గాపుర మొనర్చి
వన్య గృహమేధులము ధర్మపరుల మగుచు
నేము సంసార సుఖరసం బెఱిఁగినార
మట్టి వన మిప్పు డీక్షింప నయ్యె మరల. 21.

గీ. మొరయు నెమిళుల నొప్పు భూధరము లవియె!
పమద హరిణంబు లగు వనస్థలము లవియె!
మంజు వంజుల లతికా సమంచితములు
తరుణ నీప నిచుళ సరిత్తటము లవియె! 22.

క. జలధర మాలికవలె ద
వ్వులకుం బ్రస్రవణ దివ్య భూధర మదియే
తెలియంబడు; గోదావరి
యొలమిం బ్రవహించు నచటనే నిర్మలయై. 23.

చ. ఉరు వగు దీని శృంగమున నుండె జటాయువు; దాని క్రింద ను
స్థిరముగఁ బర్ణశాలల వసించితి మేమును; గౌతమీపయ
స్ఫురిత వినీల రుగ్వితత భూరుహ శోభఁ దనర్చి పక్షివ
ద్విరుతములన్ ధ్వనించు వనవీధుల బంధురమైన సీమలన్. 24.

ఇచ్చటనే పంచవటి. ఇందుఁ జిరకాల ముండుటం బట్టి యీ ప్రదేశంబు లన్నియు వివిధ విస్రంభ విహారములకు పాత్రములై యున్నయవి. ప్రియురాలి ప్రాణసఖి వాసంతియు నిచ్చటఁ గలదు. కాన నిప్పుడీ రామహతకున కేమి కానున్నదో? ఇప్పుడు——

గృహమేధులము=గృహస్థులము.

మంజు= మృదువైన, వంజుల లతికా= ప్రబ్బలితీగలచే, సమంచితము= ఒప్పినవియు, తరుణ=లేఁతవగు, నీప=కడిమిచెట్లును, నిచుళ=ఎఱ్ఱగన్నేరుచెట్లునుగలిగిన సరిత్తటములు=ప్రవాహపుటొడ్లు. అవియే.

జలధరము = మేఘము. గౌతమి=గోదావరియొక్క, పయః=నీటిచేత, స్ఫురిత=కప్పఁబడిన, వినీల=మిక్కిలినల్లనగు, రుక్=కాంతిగలిగిన, వితత=విశాలమగు, భూరుహ=వృక్షములయొక్క, శోభఁదనర్చి, పక్షివత్=పక్షులయొక్క, విరుతములన్=కూతలచే, విస్రంభ=ప్రణయసంబంధమగు.

మ. ఘన కాలంబునకుఁ మెయి న్వైరిసి తీక్ష్ణంబౌ విషం బట్లు, నూ
తన సంఘాతమునం జలించు వికటోద్య చ్ఛల్య ఖండంబు నా
గను, హృన్మర్మమునం బ్రభిన్న మగు నా గ్రంధివ్రణం బట్లు, ప్రా
క్తన శోకంబు నవీనమై మరల న న్గారించు నుద్వేలతన్. 25·

అట్లయినను బూర్వ పరిచితంబు లగు నీ భూభాగంబులం గనుంగొందును.
(పరికించి) ఓహో ! ధరణీసంస్థాన మెంత విపర్యస్తమైనది.

మ. తొలుతన్ వెల్లువయేడనో పులిన మందుం దోఁచె నివ్వాగులం,
దలవృక్షంబుల సాంద్రతా విరళతల్ వ్యత్యాసముం జెందె, నిం
దలి కానం జిరకాలమై కనుట నన్యం బట్లు గాన్పించె, ని
శ్చల శైలంబులచే నదే యిదని సాక్షా న్నిశ్చయం బయ్యెడిన్. 26.

అహ్హా ! పరిత్యజించు చున్నను న న్నీ పంచవటీ స్నేహము బలవంతముగా నాకర్షించు నట్లున్నది. (దైన్యముతో)

చ. అల సతిఁ గూడి యే నెచట నాదినముల్ సుఖియించినాఁడ, మ
న్నిలయమునం దజస్రము యదీయకథల్ వితతంబు లయ్యెఁ, దో
య్యాలి నెడఁబాసి యొంటియగు నా దురితాత్ముఁడు రాముఁ డిప్పుడ
గ్గల మగు నట్టి పంచవటిఁ గాంచు నెటుల్ ? గనకేగు నెట్టులన్. 27.

శంబు—(ప్రవేశించి) దేవర జయించుఁగాక ! దేవా ! భగవానుఁ డగు నగస్త్యమౌని నావలనఁ దమ సన్నిధానము ను విని, "వత్సల యగు లోపాముద్రయు నగస్త్యాశ్రమ వాసు లందఱును విమానావతరణ మంగళం బాయత్త పఱచి నీకై నిరీక్షించియుండిరి. కాన విచ్చేసి మమ్ము మన్నింపుము. పిమ్మట జవనపుష్పకంబున స్వదేశమున కరిగి యశ్వమేధమునకు సన్నద్ధుండ వగుదువు" అని యాజ్ఞాపించిరి.

రామ—భగవదాజ్ఞ నిర్వర్తింతును.

శంబు—అట్లయిన దేవర పుష్పకము నిట్లు మరలించుఁగాక !

సంఘాతమునన్=దెబ్బచేత, చలించు=కదలు, వికట=వ్యత్యస్తమయిన, ఉద్యత్=అతిశయమయిన, శల్యఖండంబు=బాణముయొక్క-తునుక. ప్రాక్తన=పురాతనమైన, ఉద్వేలతన్=అగ్గలమయి. గ్రంధివ్రణము=కంతివలెకఠినమైనవ్రణము.

వెల్లువ=ప్రవాహము, పులినము=ఇసుకతిన్నె. సాంద్రతావిరళతల్=దట్టము పలుచన. అజస్రము=ఎల్లప్పుడు, యదీయ=దేనిసంబంధమైన, వితతంబులు=వ్యాప్తములు

రామ—భగవతీ ! పంచవటీ ! శిష్టజనానుసరణంబున నిన్ను రాముఁడు క్షణమాత్ర మతిక్రమించుచుండె. సైరింపుము!

శంబు—దేవా ! చూడుము చూడుము !

మ. అల కుంజంబుల ఘూక ఘూత్కృతులు మెండౌ కీచకస్వానముల్
వోలయం గిమ్మనకుండు వాయసములం బొల్పారెఁ గ్రౌంచావతం;
బెలమిం గేరు నెమిళ్ల కేకలకు నెంతే జంకి వ్యాళంబు ల
గ్గలికం జుట్టెఁ బురాణ చందన తరు స్కంధంబులం దిగ్గిరిన్. 28

మ. అలవే ! దక్షిణ భూధరంబు లధిరూఢాంభోధరోద్యత్ప్రభా
కులశృంగంబులు; గందరోద్ధత నద ద్గోదావరీ తోయముల్,
కలితాన్యోన్య విఘాత సంకుల చల త్కల్లోల కోలాహలం
బు లివే ! భీమ గభీర వారి ఝురముల్; పుణ్యాపగా సంగముల్. 29

(అందఱు నిష్క్రమింతురు)

పంచవటీప్రవేశమను
ద్వితీయాంకము,
సంపూర్ణము.

కుంజంబులు = పొదరిండ్లు, ఘూక = గుడ్లగూబలయొక్క, ఘూత్కృతులు = ధ్వనులు, కీచకస్వానముల్ = బొంగువెదుళ్ళధ్వనులు. వాయసములు = కాకులు, కేరు = సంతోషించు, వ్యాళములు = పాములు, స్కంధము = మ్రాను.

అధిరూఢ = అధిష్ఠించిన, అంభోధర = మేఘములయొక్క, ఉద్యత్ = అతిశయమాన, ప్రభా = కాంతిచేతను, ఆకుల = కూడుకొనిన, శృంగంబులు = శిఖరములు. కందర = గుహలనుండి, ఉద్ధత = బయలువెడలిన, నదత్ = ధ్వనిచేయుచున్న, గోదావరియొక్క, తోయముల్ = ఉదకములు కలిత = కూడుకొనిన, అన్యోన్య = పరస్పరమగు, విఘాత = తాకుడులచేత, సంకుల = వ్యాప్తమై, చలత్ = కదలుచున్న, కల్లోల = తరంగములయొక్క, కోలాహలంబులు = కలకలధ్వనులు, భీమ = భయంకరమైన, గభీర = లోతయిన, వారి = ఉదకముయొక్క, ఝురముల్ = ప్రవాహములు; పుణ్య = పవిత్రమయిన, ఆపగా = నదులయొక్క, సంగముల్ = కలయికలు.

ఆంధ్రీకృతోత్తరరామచరిత్రము.

తృతీయాంకము.

(తమస, మురళ, అను నదీద్వయము ప్రవేశించును.)

తమ—సఖీ! మురళా! తొందర గలదానివలె నుంటివేమి?

ముర—భగవతీ! తమసా! తరంగిణీమణి యగు గోదావరి కెఱింగింప నగస్త్యభగవానుని సధర్మిణియగు లోపాముద్రచే నంపఁబడితిని. "ఎఱుఁగుదువుగదా! సతీపరిత్యాగము మొదలు."

క. వెలువడ నట్టి గభీరత
వలనన్ మది డాగియున్న బహుళ వ్యథచేఁ
గలఁగి పుటపాకగతి రా
జిలు రాముని కరుణ రసము జృంభిత మగుచున్. 1.

అట్టి యిష్టజనముం గష్టముల పాలుజేయుటం బట్టి ఘనీభవించిన దీర్ఘ శోకమున నిపుడు రామభద్రుండు మిగులఁ బరిక్షీణుఁ డయ్యె. వానిఁ గాంచి నా నెమ్మనం బురియాడు చున్నట్లున్నది. ఇప్పుడు మరలి పోవు రామభద్రుండు పంచవటీ వనంబునఁ బ్రియా సహ విహార సాక్షులగు రమ్యప్రదేశములం దప్పక చూడఁ గలఁడు. అందు స్వభావ ధీరుం డైనను రామభద్రున కిట్టి యవస్థ యం దతి విపుల శోకావేగ సంక్షోభంబున నడుగడుగున మహాప్రమాదంబు లూహింపఁ దగి యుండును. కావున భగవతీ! గోదావరీ! నీవు జాగరూకురాలవై యుండ వలయు.

జృంభితము=విస్తారము,

గీ. జలజ కేసర సురభులై జల లవముల
మలపు శీతల వీచికా మారుతములఁ
గొల్లలుగఁ జల్లి పెల్లు మూర్ఛిల్లు వేళ
రామభద్రుని జీవంబు నోము'' మనుచు. 2

తమ—యుక్తమే స్నేహమునకుఁ బ్రియజనానువర్తనము. జీవనోపాయమాత్రము ముఖ్యమయినదే యిపుడు తారసిల్లినది.

ముర—ఏమది ?

తమ—వినుము. తొల్లి వాల్మీకి తపోవన ప్రాంతమునఁ బరిత్యజించి లక్ష్మణుం డరుగ జానకీదేవి ప్రసవ వేదనాక్రాంత మగు దేహమును బ్రబల దుఃఖోద్వేగమున గంగాఝురంబునం దర్పించె. అం దప్పుడే డింభక యుగ్మంబునుం గని భగవతు లగు ధరణీ భాగీరథులచే ననుగృహీతయై రసాతలంబునం జేర్పఁబడియె. పిదప జాహ్నవీదేవి స్తన్యత్యాగ ప్రాయమున నా డింభక ద్వయమును వాల్మీకిమునికిఁ దనయంత నర్పించినది.

ముర—(ఆశ్చర్యముతో)

క. ఏయెడ నీదృశ జనము స
హాయం బొనరించు నట్టి యనఘాత్ముల కా
నాయత దుర్దశయైనం
జేయుం బరమాద్భుతంబు జింతింపంగన్. 3.

తమ—ఇప్పు డీ శంబూకవృత్తాంతంబున జనస్థాన సమాగతుం డగు రామభద్రుని సరయూముఖంబున విని భగవతి యగు భాగీరథియుఁ బ్రేమమున లోపాముద్ర తెలంగుననే యూహించి సీతాసమేతయై యెద్దియో గృహాచార మిషంబున గోదావరిం జూడ నరుగుదెంచె.

ముర—''రాజధానియం దుండి జగదభ్యుదయ బీజంబు లగు దత్త ప్రయోజనంబులం బ్రవర్తించు రామభద్రునకు వినోదంబు లేర్పడి యుండును. నిర్వ్యాపారుఁడై శోకమాత్ర సహాయుఁడైన వీనికిఁ బంచవటీ ప్రవేశము మహానర్థ'' మని భగవతి

జలజ=పద్మములయందలి, కేసర=కింజల్కములచే, సురభులై=పరిమళించునవియై, జలలవముల=నీటితుంపురులను, మలపు=మరలించు. డింభకయుగ్మము=ఇద్దరు పిల్లలు. రసాతలమున=పాతాళమున, సమాగతుండగు=వచ్చిన.

లెస్సగా యోజించినది. కాని యిపుడు జానకీదేవిచే రామభద్రుఁ డెట్లాదరింపఁబడును ?

తమ—ఇట్లు భగవతి భాగీరథి పల్కినది. "వత్సా ! యజ్ఞభూనందినీ ! సీతా ! ఇప్పుడాయుష్మంతు లగు కుశ లవులకు ద్వాదశ వర్ష సంఖ్యా బోధకం బగు మంగళ గ్రంధిని బంధింపఁబడును గాన నీపురాతన శ్వశురుండు, నిందనుకం గల మానవ రాజర్షి వంశమున కుత్పాదకుండును, కలుష సంహారకుండు నగు దేవుని భానుమంతుని స్వహస్తాపచితంబు లగు ప్రసూనంబుల నారాధింపుము. ధరణీతల చారిణి వగు నిన్ను మా ప్రభావంబున వనదేవతలు సయితముఁ గనుంగొనఁ జాలరు. మర్త్యులం బల్కనేల" ? అని మఱియు, "తమసా ! వధు వగు వత్స జానకి నీయెడలఁ బరమ ప్రేమ గలది. కాన నీవే దానికి సహచారిణివి గ" మ్మని నాకాన తిచ్చె. ఇప్పుడామె యాజ్ఞ ననుసరింతును.

ముర—నేనీ వృత్తాంతమును లోపాముద్రతో నివేదింతును. రామభద్రుండు నేతెంచె నని యే తలంతును.

తమ—ఇదే ! గోదావరీ హ్రదంబునం బయలుదేరి—

గీ. ఎల్లెడల వెల్లనై చిక్కి గల్లములును,
జెదరు కురులను బొదలాడు వదన మొదవఁ,
గరుణ మూర్తియొ ? మెయిదాల్చు విరహభరమొ ?
నాగ జనకేంద్ర పుత్త్రి కాననముఁ జేరె. 4.

ముర—ఇదిగో !

చ. హృదయ సుమంబు వాడునటు లేచెడు దారుణ దీర్ఘ శోక మిం
పొదవెడు వృంతముం దొలఁగి యున్న ప్రవాళముఁ బోలె నెండి వె
ల్లదనము నొందు దీని మెయి గ్లాని వహింపఁగఁ జేయుచుండె, భం
గద మగు శారదోష్మమిల కైతక గర్భ దళంబు పోలికన్. 5.

(పరిక్రమించి నిష్క్రమించిరి.)

విష్కంభము.

పురాతనశ్వశురుండు=వృద్ధుఁడగుమామ, ఉత్పాదకుఁడు=కారణభూతుఁడు. భానుమంతుని= సూర్యుని, అపచితంబులగు= కోయఁబడిన, వసువు=కోడలు, నివేదింతును=చెప్పెదను, గల్లములు=చెక్కిళ్లు, గ్లాని=కృశత్వము, శారదోష్మము= శరత్కాలపు వేఁడిమి, కైతకగర్భదళము=మొగలిపొత్తిలోనిరేకు. ప్రవాళము=చిగురు

(తెఱలో) "ప్రమాదము ప్రమాదము.

పుష్పములం గోయుచుం గరుణౌత్సుక్యములతో వినుచు సీత ప్రవేశించును.

సీత—ఓహో ! యెఱుంగుదును. నాప్రియసఖి వాసంతి పలుకుచున్నది.

(మరలం దెఱలో)

వ. "అవనిజ సల్లకీ కిసలయంబులం గేల నొసంగ లోలతం
జవిగొని ప్రోల నే ద్విరద శాబము మున్ను ప్రవృద్ధిం జెందెనో"?

సీత—దానికేమి?—

(మరలం దెఱలో)

"కవగొని కాంతతోడ జలకంబు లొనర్చుచు నుండ దాని బల్
జవమున నొక్క కుంజర లలామ మెదుర్కొనెం జెంత నుద్ధతిన్. 6

సీత—(తొందరతోం గొన్ని యడుగులు నడిచి) ఆర్యపుత్రా ! నాపుత్రకుని రక్షింపు రక్షింపు. (స్మృతినభినయించి దైన్యముతో) కటకటా ! చిరపరిచితంబు లగు నయ్యక్షరంబులే పంచవటీ దర్శనంబుచే . మరల మందభాగ్యురాల నగు నన్ననుసరించుచున్నవి.—హా ! ఆర్యపుత్రా ! —(మూర్ఛిల్లును.)

తమస—(ప్రవేశించి) వత్సా ! ఊరడిల్లు మూరడిల్లుము.

(తెఱలో) "విమాన రాజమా ! యిచ్చటనే నిల్వుము."

సీత—(ఊరడిల్లి భయోల్లాసములతో) ఓహో! జలభర వలాహక రణిత గంభీర పీవరం బైన యీ భారతీ నినాద మెచ్చటిది ! (శ్రవణ వివరంబులం జొచ్చి) మందభాగ్యురాల నగు నన్ను గూడ గొబ్బున నూరడించుచున్నది.

తమ—(స్నేహ బాష్పములతో) ఓవత్సా !

క. ఎచ్చటి నుండియొ కలరూ
పచ్చుసడక వచ్చు నినద మందున నిట్టే
వెచ్చగు గర్జకు నెమ్మిలి
మచ్చున నౌత్సుక్య భీతి మరగెద వేమే ?

ఔత్సుక్యము = సంతోషము, సల్లకీకిసలయంబుల = అందుగుచిగుళ్ళను, లోలతన్ = ఆసచే, ద్విరదశాబము = పిల్లయేనుంగు, కుంజరలలామము = శ్రేష్ఠమైనయేనుంగు. జలభర = నీటితోనిండిన, వలాహక = మేఘమువలె, రణిత = ధ్వని చేయుచున్న గంభీరమైన—పీవరంబైన = బలిసిన, భారతీనినాదము = వాగ్ధ్వని, గర్జకు నెమ్మిలి మచ్చున = ఉఱుము వినిన నెమలివలె,

సీత—భగవతీ ! అస్ఫుటం బనెద వేమి ? ఈ స్వరశైలి నే నెఱుంగుదును. ఆర్యపుత్త్రుఁడె పలుకుచున్నాఁడు.

తమ—"తపస్వి యగు శూద్రుని దండింప నైక్ష్వాకభూపతి జనస్థానమున కేతెంచె" నని వింటిని.

సీత—సంతోషము ! ఆరాజు రాజధర్మముం బరిత్యజింప లేదుగదా !

(తెఱలో)

ఉ. "ఏ వలనన్ మృగద్రుమము లెల్లను నాహిత బంధు వర్గమా ?
నే వలనం బ్రియం గలిసి యేండ్లకొలంది వసించినాఁడ ? నా
నావిధ నిర్ఝరంబులఁ గనంబడఁగి, కందర రాజి నొప్పి, గో
దావరిపొంత నున్న వసుధాధర రమ్య తటంబు లివ్వియే ! 3

సీత—హా ! యిట్లు ప్రత్యూష చందు మండ లాపాండురంబై పరిక్షీణ దుర్బలం బగు నాకారంబు గల్గి గంభీర ప్రభావ మాత్రింబుచేఁ బ్రత్యభిజ్ఞాతుఁ డగు నార్యపుత్త్రుఁడే; కాన నన్నాదుకొనుము. (తమసం గౌఁగిలించి మూర్ఛిల్లును)

తమ—(పట్టుకొనుచు) వత్సా ! ఊరడిల్లు మూరడిల్లుము.

(తెఱలో) "ఈ పంచవటీ దర్శనంబున—

గీ. హృత్తలంబున లీనమై యిపుడు పిలల
మగుచు జ్వలియింపఁ బోవు దుఃఖాగ్ని నొదుపు
ధూమ విసరంబు వోలె నుద్దామభంగి
నావరించుచు నుండె మోహంబు నన్ను. 9

హా ! ప్రేయసీ ! జానకీ !

తమ—(తనలో) ఇదియే గురుజనం బూహించినది.

సీత—(ఊరడిల్లి) హా ! యిట్టిది

(తెఱలో) "హా ! దేవి ! దండకారణ్య వాస ప్రియసఖి! విదేహరాజపుత్త్రి!"

(మూర్ఛిల్లును.)

ఏవలనన్ = ఎచ్చట, మృగద్రుమములు = మృగములు, చెట్లు, ఆహితబంధువర్గమా = బంధుసముదాయముగాఁ జేయఁబడెనో ? నిర్ఝరంబులన్ = ప్రవాహములను, కందరరాజిన్ = గుహాసముదాయముచే, ప్రత్యూష = ప్రాతఃకాలమందయిన, ఇందుమండలము = చంద్రబింబము, ఆపాండురంబయి = తెల్లబడి, ఒదుపు = కప్పు.

సీత—ఇస్సీ! మందభాగ్య నగు నన్నుచ్చరించి నిమీలిత నేత్రోత్పలుండై యార్యపుత్త్రుండు మూర్ఛిల్లెె. హా! యెట్టులు! భూతలంబున నుత్సాహంబు దక్కి దుస్సహంబుగా నొరగి పడియె. భగవతీ! తమసా! రక్షింపు రక్షింపు. ఆర్యపుత్త్రుని బ్రదికింపుము.

(పాదముల నొరఁగును.)

తమ— క. బ్రతికింపుము నీవె జగ
త్పతి నో కల్యాణి! నీదుపాణితలంబే
హితసంస్పర్శం బగు; జీ
విత లాభము గల్గు దాన వినియత భంగిన్. 10

సీత—ఏమయిన నగుఁ గాక! భగవతి పల్కినట్లే చేయుదును.

(తొందరతో నిష్క్రమించును.)

(పిదప భూపతితుఁడై సబాష్పయగు సీతచే స్పృశింపఁబడి సంతోషధైర్యములతో, రాముఁడు ప్రవేశించును)

సీత—(సంతోషముతోఁ దనలో) త్రైలోక్య నాథుని జీవితము మరల వచ్చినది.

రామ—ఓహో! యేమిది?

చ. వర హరిచందనాభినవ పల్లవ జాత రస ప్రలేపమో?
సురుచిర పీడితేందుకర సుందర కందల సారసేకమో?
ఖరతర తప్త జీవిత నగంబునకుం బరితృప్తి గల్గ భా
స్వర పరజీవ నౌషధి రసంబు మదాత్మ నిషిక్త మయ్యెనో? 11

గీ. సత్య మా పూర్వపరిచిత స్పర్శ మిదియె,
చిత్త పరిమోహణంబు, సంజీవనంబు,
ప్రబల సంతాప జనిత మూర్ఛ నిపు డడఁచి,
మరల నానంద వివశత్వ మురువడించె. 12.

సీత—భయ దైన్యములతో నించుక వెనుక తగ్గి ఇప్పుడు నా కింత మాత్రమే మహాతరము.

నిమీలిత=మూసికొనిన, పీడిత=పిండఁబడిన, కందల=మొలక, సేకము=వల్లుట, ఖరతర=మిక్కిలి తీవ్రముగా, నగంబు=చెట్టు, నిషిక్తమయ్యెనో=వల్లఁబడెనో.

రామ—(కూర్చుండి) వత్సల యగు జానకీదేవిచే ననుగ్రహింపఁ బడుచుంటిఁగదా?—
సీత—కటకటా! ఆర్యపుత్రుఁ డిందు నన్నుఁ వెదకుచుండెను?
రామ—ఔఁగాక! పరికింతును.
సీత—భగవతీ! తమసా! మరలిపోవుదము. నన్నుఁ జూచెనేని యసమ్మతిసాన్నిధ్యంబున మహారాజు నాయందు మిగుల నాగ్రహింపఁ గలఁడు.
తమ—ఓవత్సా! భాగీరథీప్రభావంబున వనదేవతలకు (సైతము) నదృశ్యురాల వైతివి.
సీత—ఔను, కలదిది.
రామ—ప్రేయసీ! జానకీ!
సీత—(దైన్య గద్గదస్వరములతో) ఆర్యపుత్రా! యీ వృత్తాంతమున కీవచన మసమంజసము గదా! (కన్నీళ్లతో) మందభాగ్యురాల నగు నన్నిట్లు వాత్సల్యంబుతోఁ బిలుచు జన్మాంతర సంభావిత దుర్లభదర్శనుం డగు నార్యపుత్రునియందు దయలేక వజ్రమయురాల నెట్లగుదును? నా హృదయ మెంతయు నెఱిఁగిన హృదయమేను నెఱుంగుదుము.
రామ—(కలయఁ జూచి నిర్వేదముతో) హా! యిట్లిచ్చట నెవ్వరును లేరు.
సీత—భగవతీ! తమసా! అట్లు నిర్హేతుకంబుగాఁ బరిత్యజించినను నీతఁ డిట్టి సందర్శనంబున నాహృదయానుబంధ మెట్టిదో నెఱుంగఁ జాలనుంటివి.
తమ—ఎఱుంగుదును వత్సా! యెఱుంగుదును.

శా. ఆనల్పొ జానీ తటస్థమై, యుపక్రాంతి ప్రాప్తిన్ రుషా బద్ధమై,
గ్లానిన్ దీర్ఘ వియోగ మొందియు, హఠాత్ కార్యైక్య సంతుష్టమై,
ధీసౌమ్యత్వమునం బ్రసన్న మయి, భర్తృక్లాంతి విక్లాంతమై, 13.
వాసిర ప్రేమ తరంగిత ప్లుతిఁగ నీ స్వాంతంబు దా నెంతలో.

రామ—దేవి!

గీ. స్నేహ రస శీతలం బగు నీదు స్పర్శ
తనువు దాల్చిన సుప్రసాదంబు వోలె
మించి నన్నిప్పటికిని జొక్కించు చుండె
ముదితరో యెందు నీవు కన్మొరగినావు? 14.

యషా=రోషము. భర్తృక్లాంతివిక్లాంతమై = భర్తయొక్క విచారమువలన ఖేదము నందుచున్నదై.

సీత—సాకల్యసందర్శిత ప్రేమానుబంధంబులై యానందంబుఁ జెందు నీ యార్యపుత్త్ర సల్లాపములు వినుచుంటిని. ఇందలి విశ్వాసంబున నిర్హేతుక పరిత్యాగ పీడితంబై నను నా జననంబు బహూకృతం బైనది.

రామ—ఎక్కడి ప్రేయసి? ఇది నిక్కముగ రామభద్రునకు వృత్తిపరంపరా సంపాదితం బగు కేవల భ్రాంతి.

(తెఱలో) "ప్రమాదము. ప్రమాదము."

చ. అవనిజ సల్లకీ కిసలయంబుల—(పూర్వార్థము వినఁబడును.)

రామ—(కరుణౌత్సుక్యములతో) ఆ శాబమున కేమి?

(మరలఁదెఱలో) "కవగొని కాంతతోడ—(ఉత్తరార్థము వినఁబడును)

సీత—దాని నెవ్వ రెదుర్కొందురు?

రామ—ఏడ నా దుష్టమృగము? వధూ సహచారి యగు ప్రియాపుత్త్రికుని బరాభవించు న దెయ్యది? (లేచును)

వాసం—(తొందరతోఁ బ్రవేశించి) ఏమీ? రఘుస్వామియా?

సీత—ఏమీ? నా ప్రియ సఖి వాసంతియా?

వాసం—దేవా! జయము.

రామ—(నిరూపించి) ఏమీ? దేవీ ప్రియసఖి వాసంతియా?

వాసం—దేవా! త్వరపడుము త్వరపడుము. ఇటు జటాయు శిఖరంబునకు దక్షిణం బగు సీతాతీర్థంబున గోదావరి నవతరించి దేవీపుత్త్రికుని బరిరక్షింపుము.

సీత—హా! తండ్రీ! జటాయూ! ఇప్పుడు నీవు లేమి జనస్థాన మెల్ల శూన్యమయినది.

రామ—అహహా! ఈ కథా ప్రసంగములు హృదయ మర్మముల భేదించుచున్నవి గదా!.

వాసం—దేవా! యిట్టిటు.

సీత—భగవతీ! నిక్కముగ వనదేవతలు సైతము నన్ను గాంచుట లేదు.

తమ—ఓవత్సా! జాహ్నవీదేవి ప్రభావము సర్వ దేవతల కన్న నుత్కృష్ట మైనది. నీ కీ సంశయం బేల?

వృత్తిపరంపర=సంకల్పపరంపర, వధూసహచారి=ఆఁడు ఏనుఁగుతోఁ గూడి యుండెడు, ప్రియాపుత్త్రికుని = సీతకు సంతానతుల్యమగు నేనుఁగును.

సీత—అట్లయిన ననుసరింతము. (పరిక్రమింతురు.)
రామ—(పరిక్రమించి) భగవతీ ! గోదావరీ ! నీకు నమస్కారము.
వాసం—(చూచి) దేవా ! విజయ శాలియు వధూసహాయుడు నగు దేవీ పుత్త్రికుని గాంచి యానందింపుము.
రామ—ఆయుష్మంతుడు జయించుం గాక!
సీత—ఓహో ! యిది యింతటి దైనది.
రామ—దేవీ ! వర్ధిల్లుచుంటివి. సంతోషము !
 చ. లలిత మృణాళి పల్లవ విలాస రదాంకురుం డౌచు నీదు వీ
  నుల లవలీ ప్రవాళము వినోదమునం గొను నీ సుతుండు బల్
  చెలువున మత్తవారణ విజేతయు యౌవన రాజ్య పూజ్య మం
  గళ విధికిన్ శుభాంగిరో ! ఘనంబుగ భాజనమయ్యె నేటికిన్. 15.
సీత—ప్రసన్న దర్శన యగు నికాంతతో నిప్పుడీ దీర్ఘాయు వెడ బాయకుండుం గాత !
రామ—సఖీ ! వాసంతీ ! చూడుము. చూడుము. ఈ వత్సచే గాంతానుసరణ నైపుణ్య మభ్యసింపం బడిన ట్లున్నది.
 చ. లలిత మృణాళి నాళ కబళంబులం గైకొన విచ్చు పుష్కరం
  బుల గల గంధతోయములం బుక్కిలులం గొని మేనం దుంపురుల్
  జిలుకుచుం జల్లు లాడి, కడుం జెల్మి దలిర్ప నవక్ర దండని
  శ్చల మగు నబ్జినీదళము ఛత్త్రము బట్టె విరామ వేళలన్. 16.
సీత—భగవతీ ! తమసా ! యిది యింతటి దైనది. ఇంతలో నా కుశలవు లెట్లుండిరో యెఱుంగను?
తమ—ఇది యెంతటిదో వారు నంతటివారే.
సీత—నేను మిగుల మందభాగ్యరాలను. ఆర్యపుత్త్ర విరహమే కాక పుత్త్ర విరహము గూడ నాకు సంభవమైనది.
తమ—భవితవ్య మిట్టిది.

రదాంకురుండౌచు = మొలకదంతములు కలవాడై, లవలీప్రవాళము=లవలీలత యొక్క పల్లవము, పుష్కరంబులు = తెల్లతామరయనియు, గజతుండాగ్రమనియు, రెండర్థములుంగూడసగును. తోయములు = ఉదకములు, అవక్రదండ = తిన్ననికాడగల, అబ్జినీదళము = తామరాకు, విరామవేళలన్ = విశ్రాంతియందు,

సీత—నా కుసంతానము కలిగిన ప్రథమ దినమున ఈషద్విరళ కోమలంబులగు దశనంబుల వెలుంగు కపోలంబులను, నిరంతర మధుర కలహాసంబులను, నిబద్ధ కాకపక్షంబులను, రాజిల్లు కుసుమాకరముల నిర్మల ముఖాబ్జముల నార్యపుత్త్రుండు ముద్దుఁ గొనఁడయ్యె.

తమ—కానుఁగాక ! దేవతానుగ్రహంబున.

సీత—భగవతీ ! తమసా ! యీ పుత్త్ర స్మరణంబున ప్రస్నుతస్తనినై తత్పిత్రు సాన్నిధ్యమున క్షణమాత్ర గేహినినైయుంటిని.

తమ—ఇందేమి పల్కఁ నగును? సంతానము స్నేహంబున కుత్కృష్ట ప్రేమము, జననీ జనకులకు విశేషమ్ముగ నిత్యరేతర సంబంధాయత్తంబు నుండదా !

గీ. నను చ్చువన్న ద్రావక స ప్నేహ శనంబు వలన
ద్రవరూపుల యంతరంగ తత్త్వంబునందు
గల్గు నొండొరుల ప్రేమ గ్రంథి గాఁగ
దవిలి నిర్మింపఁ బడియె సంతతి యనంగ. 17.

వాసన్తి—దేవా ! యిట్టిదఁ దూడ్కుఁ జూడుము.

గీ. అభినవోజ్జ్వల లోల బర్హంబు తోడ్త
ద్రాత్త మధత్వోద్ధ శోభి వా ల్లత్తంబువల్లదాం
మణికిరీటంబులవలె నెగ్గదంబమున
గూడి యాడ నెమ్మి చొప్పులతో వాకాకా. 18.

సీత—(ఆనంద బాష్పములతో) అదియిదియే.

రామ—ఆనందింపుము వత్సా ! ఆనందింపుము.

సీత—ఔఁగాక !

రామ—

నిరభ్రమణ మ్ములం బుట్టాంతర న్వి వ్రతిత నృప్తికి దూరోభద్రానుశాలచే
బొమల మనోజ్ఞ నృత్యముల భూషణమున్ ...

దశనంబులు=దంతములు, కపోలములు=చెక్కిళ్లు, కాకపక్షములు=జుంపాలు, నిబద్ధ=వ్యర్థ బొరిదిరిడిరి, ప్రస్నుత స్తని=ఆనంద మొనుముడి, ఉచ్ఛ్వసిత=చలించుచున్న భ్రమణములన=మండలాకార నృత్యములయందు, పుటాంతర=ఱెప్పలలోపల, నివర్తిత=త్రిప్పఁబడుచున్న.

దమి మృదు హస్తతాళములఁ దాండవితం బవు నిన్ను వత్సల
త్వమునఁ గుమారునిం బలె నెదం దలపోయుచు నుంటి నెంతయున్. 19.

ఆహా! తిర్యగ్జంతువులు సైతము పరిచయంబును స్మరించుచున్నవి.

గీ. పరిమిత సుమోద్గమంబునఁ బరిఢవిల్లి
యీ కదంబంబు దయితచే వృద్ధిఁ గనెనో?

సీత—(కన్నీటితో) ఆర్యపుత్త్రుండు లెస్సగా గుర్తించె.

రామ— దాని స్వజనంబుఁ బోలె మోదమ్మునఁ గ్రమ్ముచు
జానకిఁ దలంచుచున్న దీ శైలబర్హి. 20.

వాసం—దేవా! యిటుఁ గూర్చుండుము.

గీ. కదళికా వనాంతరమునఁ గాంతతో వె
లంగు నిదగు శయ్యా శిలాతల మిదే!
భూమి సుత యిందుఁ బవళించి గ్రాసమిడుటఁ
బాసి పోవయ్యె హరిణ శాబములగములు. 21.

రామ—దీనిని మాత్రము గనుఁగొనఁ జాలను. ఏడ్చుచు మఱియొకచోటఁ గూర్చుండును.

సీత—సఖీ! వాసంతీ! ఆర్యపుత్త్రునకు నాకు నీ ప్రదేశముఁ జూపి యేమి గావించితివి! కటకటా! అతఁడే యార్యపుత్త్రుఁడు; అలదే పంచవటీవనము; అదే ప్రియసఖి వాసంతి; అవియే వివిధ విస్రంభ సాక్షులగు గోదావరీ వన ప్రాంతములు; అల్లవే పుత్త్ర ప్రాయమ్ములగు మృగ పక్షి పాదపమ్ములు; దురదృష్టవతి నగు నాకు మాత్ర మీ సమస్తము దృశ్యమగుచున్నను లేనివే. కావున జీవలోక ప్రకృతివ్యత్యయ మిట్టిదే గదా!

వాసం—సఖీ! జానకీ! రాముని దురవస్థం గనుంగొనవేమి?

చ. కువలయ పత్ర రాజి మెఱుఁగులఁ గల గాత్రములన్ విలోచనో
త్సవము సతంబొసంగియు లసన్నవ మాధురి గొల్పుచుండు నీ

తాండవితంబవు = నృత్యము చేయింపఁబడినదానవగు, ఉద్గమము = బయలుదేరుట, దయిత = ప్రియురాలు (సీత), శైలబర్హి = కొండనెమలి, శయ్యాశిలాతలము = పడకఱాయి, గ్రాసము = గడ్డి, శాబములు = పిల్లలు, పాదపములు = వృక్షములు, ప్రకృతివ్యత్యయము = స్వభావవైపరీత్యము.

ధవుఁడు వెతం గృశించి, యవదాత రుచిం గని, విక్లబాంగుఁడై,
యవియుట నెట్టకేనిఁ దెలియంబడియున్ నయ నాభిరాముఁడౌ. 22.

సీత—చూచుచుంటిని సఖీ ! చూచుచుంటిని.

తమ—దయితుని సదా కాంచు చుందువుగాక !

సీత—హా ! దైవమా ! ఇతఁడు నన్నును నే నితనిని విడుతు మని యెవ్వరెఱుంగుదురు? కానజన్మాంతరంబునుండియుం బోలె సందర్శించుచున్న నేనువత్సలుండగు నార్యపుత్త్రుని బాష్పాంతరకాలముల ముహూర్తమాత్ర మైనం బరికింతును. (అత్యాదరముతోఁ జూచుచుండును)

తమ—(స్నేహబాష్పములతోఁ గౌఁగిలించి)

గీ. మోద ఖేదంబులను వెల్లి బూను బాష్ప
ధారఁ గొల్పుచు బ్రేమ నుత్తాన దీర్ఘ
మైన నీచూడ్కి ప్రాణేశు నర్థిఁ దడిపె
బహుళ సిత ముగ్ధ దుగ్ధస్రవంతి వోలె. 23.

వాసం—

చ. ఫల కుసుమార్ఘ్యమున్ విటపి వర్గ మొసంగెడుగాత ! విస్ఫుర
జ్జలజ మరంద గంధములఁ జల్లి మరుత్తతి వీచుఁగాత ! బ
క్షులు సతతోత్సుకత్వ మొనగూడఁ గలధ్వను లిచ్చుఁగాత ! బెం
పలరఁగ రాముఁడివ్వనిఁ దనంతనె చేరఁగ వచ్చెఁగ్రమ్మఱన్. 24.

రామ—సఖీ ! వాసంతీ ! యిటఁ గూర్చుండుము.

వాసం—(కూర్చుండి కన్నీళ్లతో) మహారాజా ! లక్ష్మణ కుమారునకుఁ గుశలమా ?

రామ—(వినమి నభినయించి)

గీ. పాణితల దత్త నీర నీవార కుశలఁ
దరుణి పెంచిన తరు పక్షి హరిణకములఁ
గాంచఁబ్రస్తరోద్భేదయోగ్యరసమువలె
హృదయము గరంచు విక్కృతి యొండొదవె నాకు. 25.

అవదాతరుచి=తెలుపుకాంతి, విక్లబాంగుఁడై=చిక్కినయవయవములు కలవాఁడై, ఉత్తానదీర్ఘము=దీర్ఘముగాఁ బ్రసరింపఁజేయఁబడిన, దుగ్ధస్రవంతి=పాలకాలువ, విటపివర్గము=వృక్షసమూహము, మరుత్తతి=గాలియొక్క సముదాయము, ప్రస్తరోద్భేదయోగ్యరసము=ఱాళ్లనుబగులఁగొట్టుట కర్హమగు రసమనియు, ఱాళ్లయొక్కయుత్పత్తి కర్హమగురసమనియుఁ జెప్పఁదగినదొప్పును, విక్కృతి=వికారము.

వాసం—మహారాజా ! అడుగుచుంటిని, లక్ష్మణ కుమారునకుఁ గుశలమా?
రామ—(తనలో) అన్నా ! "మహారాజా!" యని ప్రేమ లేని సంబోధనము; సౌమిత్రి యెడలనే బాష్ప గద్గదంబులతోఁ గుశలప్రశ్నము;—కాన నీమె సీతావృత్తాంతంబు నెఱింగిన దని తలంతును. (ప్రకాశముగా) ఆఁ! నేమమే కుమారునకు ! (ఏడ్చును)
వాసం—ఓదేవా ! మఱేమి కలదు? దారుణుండ వైతివి గదా !
సీత—సఖీ ! వాసంతీ ! యిట్లు పలుక నేమైతివి ? ఆర్యపుత్త్రుఁడెల్లరకుం బూజార్హుండు గదా !—మఱియు నా ప్రియసఖికి;
వాసం—

ఉ. ఈవె మదీయ జీవితము; నీవె ద్వితీయ మనోంబుజంబవౌ;
దీవె మదక్షి చంద్రికవు; నీవె శరీర సుధారసంబు; వం
చీవిధిఁ బెక్కు-ప్రియ్యములనింతిని గూడి మెలంగి దానినే—(నిట్టూర్చి)
ఆవలివార్త యేల యిఁక నక్కట ! పాపము శాంతిఁబొందుతన్. 26.

(మూర్ఛిల్లును.)

రామ—యుక్తము గదా ! వాఙ్నివృత్తియు మోహంబును ! సఖీ ! ఊరడిల్లుము.
వాసం—(ఊరడిల్లి) దేవా ! యిట్టి యకార్య మాచరించితి వేమి?
సీత—సఖీ ! వాసంతీ ! చాలింపుము చాలింపుము.
రామ—లోకము సహింపనిది.
వాసం—అది యేల ?
రామ—ఏదో లోకమే యెఱుంగును.
తమ—ఉచితమే లోకదూషణము.
వాసం—

ఉ. ఓ కఠినాత్మ ! నీకు రహి నొప్పు యశంబె కదా ! మనఃప్రియం!
బీ క్రియ కన్న ఘోర మగు నే యపకీర్తి మహిం జెలంగు ? నా
భీకర కాననంబున విభీత మృగేక్షణ కేమి యయ్యె ? ని
న్నే ! కుతలాధినాథ ! మది నేమి తలంచుచు నుంటి ? చెప్పుమా ! 27.

చంద్రిక=వెన్నెల, ప్రియ్యము=ప్రియము, వాఙ్నివృత్తి=మాటను నిలిపివేయుట, మోహము=మూర్ఛ, విభీతమృగేక్షణ=మిక్కిలి భయపడిన లేడివంటి చూపులు గలది, కుతలాధినాథ=భూభర్త.

సీత—సఖీ! వాసంతీ! నీవే దారుణురాలవు. కఠినురాలవు. ఇటు ప్రజ్వలించు నార్యపుత్రునే ప్రజ్వలింపఁ జేయుచుంటివి.

తమ—ప్రణయ శోకము లిటు పలుకుచున్నవి.

రామ—సఖీ! యిందేమి యూహింప నగును?

గీ. ప్రస్ఫురిత గర్భభార విహ్వలయును, బిభ్య
దేకహాయన మృగ చలితాలోక యైన
చాన, మృదు బాహ, బిసకల్ప, చంద్రికాభ!
యగు తనూవల్లి సత్వంబు లణఁప నోపు. 28.

సీత—ఆర్యపుత్రా! ఇదిగో! జీవించి యుంటిని.

రామ—హా! ప్రియసీతా! జానకీ! యెచ్చట నుంటివి?

సీత—(కటకటా)! ఆర్యపుత్రుఁడు సయితము నెలుగెత్తి యేడ్చుచుండెను.

తమ—వత్సా! యిప్పటి కిదియే యుక్తము. దుఃఖితాత్ములకు దుఃఖ నిర్వాపణ మొనర్పవలయునుగదా!

గీ. వఱద పైపై కెక్కి తటముల నొరయు వేళఁ
జెఱువునకు గండి వెట్టుటే నెఱ తెఱంగు:
హృదయమున శోక సంక్షోభ మొదవు వేళఁ
దార రవమున నేడ్చుటే తగిన వెరవు. 29.

మఱియును రామభద్రుని సంసార మెల్ల విఘ్నమ్ముల గ్రస్తతర మైనది.

వ. నయసరణిన్ సమాహిత మనంబున నీ జగమేలఁగా వలెం,
బ్రియసతిఁ బాసి జీవితము గ్రీష్మమునన్ విరివోలె వాడె, ని
ర్దయుత్న నన్గతి పీడి యలఁతన్ గలపించుట లేని యుమ్మగా,
ధ్వయిన శవిత్రాంచ్ఛ చిత్త మిపుడ్డైనను దోచన మల్పలాభమో? 30.

ప్రస్ఫురిత=కదలుచున్న, విహ్వల=భయముచే నవయవస్వాధీనము లేనిది. బిభ్యత్ = భయపడుచున్న, ఏకహాయన=ఒక సంవత్సరము వయస్సుగల, మృగ=లేడి వలె, చలిత=చలించుచున్న, ఆలోక=చూపులుగలది. బిసకల్ప=తామరతూఁడువంటి బాహువుల, సత్వంబులు=జంతువులు, పిశాచములు. తారరవమున=ఎలుగెత్తి, సమాహిత= లెస్సఁగా నొప్పిన.

రామ—హా! కష్టము కష్టము!

మ. ఘన సంవేగమునన్ మనం బగలు, బ్రకటించిల్ రెండుగాఁ గాదు; మఱిం
దని పీడం జెడి మేను మూర్ఛఁ గను, జైతన్యంబు వీడ్కోలదు; వె
ల్లిన నంతర్జ్వలనంబు దేహము రగుల్చున్, భస్మముం జేయ; దె
చ్చిన మర్మంబులఁ జెండి దైవము గలంచుం, ద్రెంప దీ జీవమున్. 31.

సీత—ఇట్లే యిది—

రామ—తేజస్వులారా! పౌర జానపదులారా!—

చ. సతి భవనంబున న్నిలువ సైపక పోతిరిగాదె మీర, ల
క్కఱితనఁ దృణంబుఁ బోలె నడుకాననఁ బోరంగితిఁ; గుందనైన మా
నితిఁ; జిరమైత్రి వాటిలు వనీవిషయంబులు నన్ గరంచె; నే
గతియును లేక యేడ్చెదను; గాన ననున్ క్షమియింపుఁ డిత్తఱిన్. 32

తమ—శోకవారాశి నాక్రమింప నతి దుష్కరము.

వాసం—దేవా! కడచినదానికై ధైర్య మవలంబింపుము.

రామ—సఖీ! ధైర్య మవలంబింపు మందు వేల?

గీ. భూమిజా శూన్య మయిన యీ భువనమునకు
వర్తమానంబు ద్వాదశ వత్సరంబు,
సీతయను పేరుఁ గూడ నశించెఁ గాని
రాము జీవితమున కింక లేమి లేదు. 33.

సీత—ఈ యార్యపుత్త్రి వచనంబులచే మూర్ఛితురాల నైతిని.

తమ—వత్సా! అవును.

గీ. పూరిత స్నేహములు శోకదారుణములు
నగుటనివి ప్రీతి నింపు వాక్యములు గావు,
గరళ మిళితంబు లగుచు నిక్కము మరంద
ధార లియ్యవి నీమీఁదఁ బాఱుచుండె. 34.

రామ—వాసంతీ! నేను—

అంతర్జ్వలనంబు=లోపలి యుడుకు.

గీ. లోన నాటి తిరశ్చీనమా నలాత
శల్యమట్లు, విషాగ్రదంశంబు వోలె,
వాడి యగు శోకకీలంబు స్వాంతమర్మ
తతిని ఖండించు చున్న నోర్చితిని గాదె! 35.

సీత—మందభాగ్య నగు నే నిట్టు లార్యపుత్త్రునకు మరల నాయాస కారిణి నైతిని.

రామ—ఇట్టు లతి నిశ్చల స్తంభి తాంతరంగుండ నైనను నా క్షిప్త డీ యావేగ మా యా పరిచిత ప్రియ వస్తు సందర్శనంబున—

మ. అమిత క్షోభ విజృంభి తేంద్రియ గణవ్యామోహమున్ మాన్ప, నేఁ
దమి నే యే యతనం బొనర్చినను దత్ప్రయత్నముం బల్ రయం
బు మెయిం బాఱు ఝరంబు సైకత తటంబుం బోలె లో భిన్నభి
న్నము గావించి వికార మెద్దియొ యెడందం బర్వ నొక్కుమ్మడిన్. 36.

సీత—దుర్నివార భీషణారంభ మగు నీ యార్యపుత్త్రుని దుఃఖ సంరంభంబున నా హృదయంబు నిజశోకోద్భేదంబునం బోలెఁ గంపించు చున్నది.

వాసం—(తనలో) కష్టము! విభుఁ డాపన్నుఁడై యుండెఁ గాన వినోదింపఁ జేసెదను. (ప్రకాశము) దేవా! చిరపరిచితంబు లగు నీ జనస్థాన భూభాగంబుల నవలోకింపుము.

రామ—ఔఁగాక! (లేచిపరీక్షించును.)

సీత—దుఃఖోద్దీపకంబులనే ప్రియసఖి వినోదోపాయ మని తలంచు చున్నది.

వాసం—(కరుణతో) దేవా! దేవా!

మ. తన జాడం గనుగొంచు నీవు తమి నేత తుంజమం దుండ, నో
య్యన గోదావరి సైకతస్థలిని హంసాలోక కౌతూహలం
బున జాగై యరుదెంచుచుం దహతహం బొల్పారు ని న్గాంచి, జ
వ్వని గీలింపదె భీతిఁ బద్మముకుళ పాణించ త్ర్పణామాంజలిన్. 37

తిరశ్చీనమా = అడ్డముగాఁదిరిగిన, అలాత = కొఱవివంటి, శల్యమట్లు = బాణాగ్రమువలె, దంశంబు = కోఱ, శోకకీలము = దుఃఖాగ్ని, అమిత = మిక్కుటమగు, క్షోభ = దుఃఖము చేత, విజృంభిత = వృద్ధిపఱుపఁబడిన, ఇంద్రియగణ = ఇంద్రియ సమూహముయొక్క, సమ్మోహమున్ = మూర్ఛను, ఝరంబు = ప్రవాహము, సైకత తటంబు = ఇసుకగట్టు, ఉద్భేదము = పగులఁగొట్టుట. కుంజము = పొద, పాణించత్ = ప్రకాశించుచున్న.

సీత—దారుణురాల వైతివి. వాసంతీ! దారుణురాల వైతివి. హృదయ మర్మంబులం గల గూఢ శల్యంబులం బెకలించు నీ కథోద్ఘాతములచే మందభాగ్యురాల నగు నన్ను నార్యపుత్త్రునిం గూడ మరల మరలఁ బరితపింపఁ జేయు చుంటివి.

రామ—చండీ! జానకీ! యిటు నటుఁ గనఁబడు నట్లుండియు ననుగ్రహింప కుంటివి.

శా. హా! దేవీ! హృదయంబు వ్రల్లగలెఁ, దూగాడెం దనూబంధముల్,
భేదంచుం దలఁతున్ జగంబు, దరికొల్పెన్ లోని కీలల్ ననున్,
ఖేదోద్విగ్నత నంతరాత్మయుఁ దమోంధీభూతమా నట్లు పై
పైఁ గోరంబుగఁ బర్వె మోహ మిఁక నిర్భాగ్యుండ నెట్లాగెదన్. 38.

(మూర్ఛిల్లును.)

సీత—కటకటా! ఆర్యపుత్త్రుండు మరల మూర్ఛిల్లె. హా! ఆర్యపుత్త్ర! మందభాగ్యనగు నన్ను గూర్చి సకల జీవలోక మంగళాధారుండ వగు నీకు మాటిమాటికి జీవిత సంశయంబుఁ గొలుపు దారుణం బగు దశాపరిణామము తటస్థించుచున్నది. హా! హతురాల నైతిని—(మూర్ఛిల్లును)

తమ—వత్సా! ఊరడిల్లు మూరడిల్లుము. మరల నీహస్త స్పర్శమే రామభద్రునకు జీవనోపాయము.

వాసం—ఏమి? ఇప్పటికిని మేల్కొనలేదు. హా! ప్రియసఖి! సీతా! నీప్రాణనాథుని మన్నింపుము.

సీత—(తొందరతోఁ జేరి హృదయమునను లలాటమునను స్పృశించుచున్నది.)

వాసం—సంతోసము! రామభద్రుఁడు తెల్విఁ జెందెను.

రామ—.

చ. అమరఁగ దేహధాతు బహిరంతర సీమల నక్కజంబుగా
నమృతమయ ప్రలేపముల యట్టు లలందుచు నొక్కస్పర్శ జీ
వమునకు నొక్కపెట్టఁ బ్రతిభం గలిగించుచు వెండియుం బ్రమో
దము విరియించి యొండొక విధంబగు మోహము బర్వఁ జేసెడిన్. 39.

(ఆనందమునఁ గన్నులు మూసియే) సఖీ! వాసంతీ! మోదమున వర్ధిల్లుచుంటివి.

వాసం—ఎట్లు?—

కథోద్ఘాతములచే=కథలనుజ్ఞప్తికిఁ దెచ్చుటచే, ఉద్విగ్నతన్=అతిశయముచే. ప్రలేపములు=పూతలు.

రామ—సఖీ! మతేమి? జానకి మరల వచ్చినది.

వాసం—ఓదేవా! రామభద్రా! అది యెచ్చట?

రామ—(స్పర్శసుఖము నభినయించి) ఇదిగో! యెదుటనే!

వాసం—ఓయీ! మర్మములఁ జెండు నీ దారుణ ప్రలాపములచేఁ బ్రియసఖీ దుఃఖదగ్ధ నగు మందభాగ్యురాల నన్ను మరల దహించు చుంటివేమి?

సీత—తొలఁగి పోఁగోరుచుంటిని. కాని చిర సౌహార్ద ప్రసన్న శీతలంబై, దీర్ఘదారుణం బగు సంతాపంబు సైతము దోడ్తోడఁ దొలంగించు నార్యపుత్త్ర సంస్పర్శంబున వజ్రలేప లిప్త మైనట్లు చెమర్చుచు నిస్సహ విపర్యస్తమై నా హస్తము పరవశంబై నట్లు కంపించుచున్నది.

రామ—(హస్తము గ్రహించి) సఖీ! ప్రలాపము లెట్లు?

ఉ. ఎయ్యది పెండ్లివేళ గ్రహియింపఁబడెన్ శుభకంకణంబుతో?
నెయ్యది దీర్ఘమైత్రి వహియించె నో స్వైర సుధార్ద్రసంగతిన్?

సీత—ఆర్యపుత్త్రా! నీవిప్పుడా పురుషుఁడవే యైతివి.

రాము—ఒయ్యన నత్తుషార కరకోపమ సుందరమైన తత్కరం
బియ్యెడ నాకుఁ బట్టువడియెన్ లవలీ మృదు కందళాకృతిన్. 40.

సీత—అయ్యయో! ఆర్యపుత్త్ర స్పర్శ మోహితురాల నగు నాకుఁ బ్రమాద మయ్యెను.

రామ—సఖీ! వాసంతీ! ఆనంద మందీకృతేంద్రియుండనై సాధ్వసంబునఁ బరవశుఁడనై యుంటిని. దీని నీవుఁగూడఁ బట్టుకొనుము.

వాసం—కష్టము! ఉన్మాదమే.

సీత—(తొందరతో విడిపించుకొని తొలఁగి పోవును.)

రామ—హా! హా! ప్రమాదము,

గీ. జడము స్వేదాంచితంబుఁ జంచలము నైన
దాని కరపల్లవంబు సత్వరత మీఱ

సౌహార్దము=స్నేహము, వజ్రలేప=సరేసుఅను పూఁతవస్తువుచే, లిప్త=పూయఁబడిన, విపర్యస్తము=వ్యత్యాసము, స్వైర=స్వేచ్ఛగలట్టియు, సుధా=అమృతమువలె, ఆర్ద్ర=చల్లనైనట్టియు, సంగతిన్=స్పర్శచేత, తుషారము=మంచు, కరకము=వడగల్లు, లవలీ=లవలీలతయొక్క, మృదువైన, కందళము=మొలక, సాధ్వసము=భయము, జడము=చల్లనిది.

జడము స్వేదాంచితంబుఁ జంచలము నైన
మత్కరంబున నుండి సంభ్రష్ట మయ్యె. 41.

సీత—అయ్యయ్యో ! స్వభావమును బొందక నిశ్చలములై విషయగ్రహణమునం దసమర్థములై తత్ప్రియత్నంబున బలాత్కారముగ భ్రమించు నేత్రములతో నార్యపుత్త్రుం డిప్పటికిని దన్నుఁ దాఁ దెలిసికొన నేరఁ డయ్యెను.

తమ—(స్నేహ హాస కౌతుకములతోఁ జూచి)

గీ. వల్లభస్పర్శ సౌఖ్యంబు వలన సీత
స్వేద రోమాంచ కంపనాన్విత యగుచు
గాలిఁ గదలి, నవీనోదకములఁ దడిసి
కలికల నెసంగు నీపశాఖ యనఁ దనరె. 42.

సీత—(తనలో) ఓహో ! పరవశురాల నై భగవతియగు తమసచే లజ్జింపఁ జేయఁబడితిని. "ఇట్టిది పరిత్యాగము, ఇట్టిది హృదయాసంగ" మని యీమె యేమనుకొనునో గదా !

రామ—(కలయఁ జూచి) హా ! యేమిలేనేలేదా? ఓనిర్దయా ! వైదేహీ !

సీత-నిక్కముగ నిర్దయురాలను. ఇట్టి నిన్నుఁ జూచుచుఁ బ్రాణములఁ దాల్చియుంటిని.

రామ—ఎచ్చటనుంటివి ? అనుగ్రహింపుము. ఇట్టి నన్నెడఁబాయ నర్హంబుగాదు.

సీత—ఆర్యపుత్త్ర ! యిదివిపరీతము.

వాసం—దేవా ! ప్రసన్నుఁడవు గమ్ము. ప్రసన్నుఁడవు గమ్ము. అతిశయిత విరహంబగు నాత్మను నీ లోకోత్తర ధైర్యమున నరికట్టుము. నాప్రియసఖి యిచ్చట నెట్లుండును ?

రామ—లేదు. నిశ్చయము. ఉన్నచో దాని వాసంతి గూడ నెట్లు చూడకుండును ? స్వప్నమా యిది !—నేను నిద్రింపలేదు.—కాక రామునకు స్వప్నమెట్లు ? సర్వవిధంబుల మహామహిమ గల బహువార కల్పనా నిర్మితం బగు నావిప్రలంభమే నన్ను మాటిమాటికి వెంబడించుచున్నది.

సంభ్రష్టమయ్యె = జారిపోయెను, రోమాంచము = గగుర్పాటు, అన్విత = కూడుకొనినది, కలికలు = మొగ్గలు, నీపశాఖ = కడిమికొమ్మ, బహువార = అనేకపర్యాయములు, కల్పనా = సంకల్పించుకొనుటచేత, నిర్మితంబగు = కలిగించుకొనిన, విప్రలంభము = వియోగము,

సీత—ఆర్యపుత్రుఁడు దారుణురాల నగు నాచేత నే వంచింపఁ బడియె.

వాసం—దేవా! చూడుము చూడుము.—

మ. అల పౌలస్త్య జటాయు నిర్దళిత కృష్ణాయోరథం బిద్ది, ముం
గల నాభీల పిశాచ వక్త్రయుత కంకాళాత్మలౌ రాసభం
బులివే! హేతి జటాయు పక్షతుల నిర్మూలించి నీశత్రుఁ డు
జ్జ్వల సీతం గొని మింటి కేగెఁ జలితాంతర్విద్యుదబ్దంబనన్. 43.

సీత—(భయముతో) ఆర్యపుత్రా! తండ్రి హతుఁ డగుచుండె, నేనపహరింపఁ బడుచుంటిని, రక్షింపు రక్షింపు.

రామ—ఆ! పాపిష్ఠ! తాత ప్రాణ సీతాపహారీ! ఎందుబోయెదవు?

వాసం—ఓదేవా! రాక్షసాన్వయ ప్రళయ ధూమకేతూ! నీకోప విషయ మిప్పటికినా?

సీత—ఓహో! ఉన్మత్తురాల నైతిని.

రామ—ఇప్పుడీ ప్రలాపము సార్థకమే యైయున్నది.

చ. సతత వినోదముం గొలుపఁ జాలు నుపాయములం దనర్చియు
ద్ధత రిపు వీర సంహృతుల ఖ్యాతి మహాద్భుతమున్ ఘటించు నా
సతి తొలి విప్రలంభ మది శత్రువధావధి యయ్యెఁ గాని ప్రి
స్తుత విరహం బనంత గతిఁ జొప్పడె నూరక యెట్టులోర్చెదన్? 44.

సీత—అనంతమైన దనియా హా! హతురాలనైతి మందభాగ్యురాలను. (ఏడ్చును)

అల=ఆ, పౌలస్త్య=రావణునియొక్క, జటాయు=జటాయువుచే, నిర్దళిత=విఱుగఁగొట్టఁబడిన, కృష్ణ=నల్లనగు, అయోరథంబు=ఇనుముచేఁజేయఁబడిన రథము, ఆభీల=భయంకరమగు, పిశాచముల యొక్క, వక్త్రయుత=ముఖములతోఁ గూడుకొనిన, కంకాళాత్మలౌ=అస్థిపంజరాకృతములయిన, రాసభంబులు=గాడిదలు, హేతి=ఖడ్గముచే, జటాయువు యొక్క, పక్షతులన్=ఱెక్కలమూలములను, నిర్మూలించి=తెగనఱికి, నీశత్రుఁడు, చలిత=చలించుచున్న, అంతః=లోన, విద్యుత్=మెఱుపుగలిగిన, అబ్దంబనన్=మేఘమాయనునట్లు, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, సీతంగొని—మింటికి=ఆకాశమునకు, ఏగె. ధూమకేతువు=తోఁకచుక్క, సంహృతుల=చంపుటచే.

రామ—హా! కష్టము!—

చ. అలకపిరాజు చెల్మి, కపులందఱి బీరము, భల్లుకేంద్రు ధీ
బలమును, నెందు నిష్ఫలము? పావని యెందుఁ జొరంగ నేరఁ? డా
నలుఁ డను విశ్వకర్మ హిత నందనుఁ డెందుఁ బథం బొనర్పలే?
డలుగుల నెందు లక్ష్మణున కందదొ? యాయెట నుంటివో? ప్రియా? 45.

సీత—పూర్వ విరహమును గూర్చి మన్నింపఁ బడితిని.

రామ—సఖీ! వాసంతీ! సఖులకు దుఃఖముకొఱకే రామ సందర్శనము. ఎంతవఱకు నిన్నేడ్పింతును? కానఁ బ్రయాణంబునకై నాకు సెల వొసంగుము.

సీత—(భయ మోహములతోఁ దమసం బట్టుకొని) భగవతీ! తమసా! ఆర్యపుత్త్రుం డరుగుచుండె నేమిగతి?

తమ—వత్సా! ఊరడిల్లు మూరడిల్లుము. ఆయుష్మంతులగు కుశ లవులకు వర్షగ్రంధి మంగళము నాపాదింప భాగీరథీ పదసన్నిధికి మనమునుం బోవుదము.

సీత—భగవతీ! అనుగ్రహింపుము. దుర్లభ జనుని క్షణమాత్ర మవలోకింతును.

రామ—కల దిప్పు డశ్వమేధమునకై నాకు సహధర్మచారిణి.

సీత—(కంపముతో) ఆర్యపుత్త్ర! అది యెవతె?

రామ—హేమమయం బగు సీతాప్రతిమ.

సీత—(ఊరడిల్లి కన్నీళ్ళతో) ఇప్పుడు నీ వార్యపుత్త్రుండ వైతివి. ఓహో! ఇప్పు డార్యపుత్త్రుండు నా పరిత్యాగ శల్యంబు నున్మూలించె.

రామ—దానియందైనను బాష్పపూర్ణమగు దృష్టికి సంతుష్టిఁ గల్గించెదను.

సీత—ఆర్యపుత్త్రునిచే మన్నింపఁ బడుచు నాతని నానంద పఱచుచు జీవలోకమున కాశానిబంధనం బయ్యెఁ గాన నది ధన్యురాలు.

తమ—(స్మిత స్నేహబాష్పములతోఁ గౌఁగిలించి) ఓవత్సా! ఆత్మస్తవముం జేసికొనుచుంటివి.

విప్రలంభము = వియోగము, శత్రు = విరోధులయొక్క— వధ=చంపుటయే అవధి=హద్దు, కపిరాజు=సుగ్రీవుఁడు, కపులు=కోఁతులు, భల్లుకేంద్రుఁడు = జాంబవంతుఁడు, పావని = ఆంజనేయుండు, పథము = మార్గము, ఉన్మూలించె=ఊడఁబెరికె.

సీత— (లజ్జతోఁ దలవంచి తనలో) భగవతి పరిహసించు చున్నది.

వాసం— ఈ సమావేశము మాకు మహానుగ్రహము. ప్రయాణ విషయమున నెట్టి కార్యభంగము గల్గదో. అట్లు కావింపఁ దగును.

సీత—ఇప్పుడు వాసంతి నాకుఁ బ్రతికూల యైనది.

తమ—రమ్ము పోవుదము.

సీత— (కష్టముతో) అట్లే చేయుదము.

తమ—ఎట్లు రాఁ గలవు?

గీ. వల్లభునియందు నెఱి నాటఁ బడిన యట్టి
వేడ్కచే స్రోఁగబాఱు నీ వీక్షణంబు
మర్మములఁ ద్రుంచు యత్న సంపదలనైనఁ
దివియఁ బడఁ జాల దయ్యె నుదీర్ణభంగి. 46

సీత—అపూర్వ సుకృత జనిత దర్శనంబు లగు నార్యపుత్త్రి పాదపద్మములకు నమస్కారము. (మూర్ఛిల్లును)

తమ—వత్సా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

సీత— (ఊఱడిల్లి) మేఘాంతరాళమునఁ బూర్ణిమా చంద్రు నెంతకాల మవలోకింపఁ గలము?

తమ—ఓహో! ఘటనా విశేషము.

చ. కరుణరసంబు పన్నుగ నొకం డయి యుండి నిమిత్తభేదత
త్వరత విభిన్నమై వివిధవైఖరులం బలె మార్పులొందు, వి
స్ఫురిత తరంగ సంభ్రమణ బుద్బుద రూప వికార సంతతిం
బొరసియుఁ గన్గొనం జలము బొందుగ సర్వము దానయౌ గతిన్. 47.

రామ—విమానరాజమా! యిట్టిటు. (అందఱు లేచుచున్నారు.)

ఉదీర్ణభంగి=విశేషముగా, విస్ఫురిత=చలించుచున్న, తరంగ=అలలయొక్కయు, సంభ్రమణ=సుడులయొక్కయు, బుద్బుద=బుడగలయొక్కయు, రూప=ఆకృతులచే, వికార=మార్పుయొక్క, సంతతిన్=పరంపరను, పొరసియు=పొందియు.

తమ—వాసం— (సీతారాములం గూర్చి)

గీ. పుడమి మిన్నేఱుఁగూడ మా బోంట్లతోడఁ
దొలుత ఛందఃప్రయోక్తయౌ కులవిభుండు
ననుగతారుంధతీకుఁడౌ ముని వసిష్ఠుఁ
డొసఁగు భద్రంబు బహుభవ్య మెసఁగ మీకు. 48

(అందఱు నిష్క్రమింతురు.)

ఛాయ యను తృతీయాంకము,

సంపూర్ణము.

ఛందః=వేదములను, ప్రయోక్తయౌ=చెప్పినవాఁడగు, కులవిభుండు=సూర్య వంశ స్థాపకుఁడగుసూర్యుఁడు, అనుగతారుంధతీకుఁడు=అనుసరింపఁబడిన అరుంధతిగలవాఁడు, భవ్యమెసఁగ=మంగళ మగునట్లు.

ఆంధ్రీకృతోత్తరరామచరిత్రము.

చతుర్థాంకము.

(ఇర్వురు తాపసులు ప్రవేశింతురు)

ఒకఁడు—సౌధాతకీ! యిపుడు విశిష్టాతిథి జనాలంకృతం బగు వాల్మీకిభగవాను నాశ్రమ స్థానమందలి విపులకార్యోపక్రమరమణీయకంబుం గనుంగొనుము.

మ. నవసూతప్రియ గోత్రిల నున్న మధురోష్ణం బైన నీవార భ
క్త వరస్రావము దృప్తి నాశ్రమ కురంగం బానుచుండెన్, ఘృతా
ప్లవ రుచ్యాన్న లసత్సుగంధ లవ సంప న్మిశ్రమై చాల నిం
పవు కర్కంధుఫలాఢ్య శాక పచనోత్థామోద మేపారెడిన్. 1.

సౌధాతకి—ఇప్పుడీ నెఱసిన పెద్ద గడ్డముల వారికి మహత్తర మయిన యనధ్యయన కారణము సంభవించినది.

ప్రథముఁడు—(నవ్వి) సౌధాతకీ! గురువులయందు బహుమాన కారణ మపూర్వముగా నున్నదే?

సౌధా—ఓభాండాయనా! యిప్పుడీ మిక్కుట మగు వృద్ధసంఘమునకు మొనగాఁడై నారలు గట్టి వచ్చినయీయతిథి పేరేమి?

నవసూత=క్రొత్తగానీనిన, నీవార=నివ్వరి, భక్త=అన్నసంబంధమయిన, స్రావము=గంజి, ఘృత=నేతితో, ఆప్లవ=లెస్సగాఁదడుపఁబడిన, రుచ్యాన్నము=రుచిగలయన్నము నుండిబయలువెడలిన, లసత్సుగంధలవ=సువాసనయొక్క లేశము యొక్క, సంపన్మిశ్రమై=సంపత్తుతోఁగూడినదై, కర్కంధుఫల=రేఁగుపండ్లతో, ఆఢ్య=ఎక్కువగాఁజేయఁబడిన, శాక=కూరయొక్క, పచన=వండుటయందు, ఉత్థ=బయలువెడలిన, ఆమోదము=పరిమళము.

భాండా—ఛీ ! పరిహసించెదవు ? ఋశ్యశృంగాశ్రమము నుండి యరుంధతిని మును కొనిన దశరథేంద్రుని భార్యలకు నియామకుఁడై వసిష్ఠమౌని విచ్చేసె. ఇట్లు ప్రేలెద వేల ?

సౌధా—ఆఁ ? వసిష్ఠుఁడా ! నేను తోఁడేలో ? బెబ్బులియో ? యనుకొంటిని.

భాండా—ఆఁ ! యేమనుచుంటివి ?

సౌధా—ఆతఁ డరుదెంచినంతనే దిక్కులేని యాఁబెయ్య డమ్మని చంపఁబడినది.

భాండా—"సమాంసో మధుపర్కః" యను నామ్నాయమును మన్నించుచు గృహస్థులు శ్రోత్రియాతిథి కొఱకు వత్సతరిని గాని మహోక్షమును గాని మహాచ్ఛాగమును గాని యిచ్చుచుందు రని ధర్మసూత్రకారులు పలుకుచున్నారు.

సౌధా—ఓహో ! ఓడిపోయితివి.

భాండా—ఎట్లు ?

సౌధా—వసిష్ఠమిశ్రు లరుదేర వత్సతరిని హింసించె. సద్య స్స్వాగతుఁ డగు జనక రాజర్షికి వాల్మీకి భగవానులు దధి మధువుల చేతనే మధుపర్కము నెఱవేర్చె. వత్సతరిని విడిచె.

భాండా—ఋషులు మాంసాహారమును మానని వారికీ కల్పము ననుమతించుచున్నారు. పూజ్యుఁడగు జనకుఁడో మాంస పరిత్యాగి.

సౌధా—ఏల ?

భాండా—ఆతఁ డప్పుడే సీతాదేవి కిట్టి దైవప్రాతికూల్యమును విని వానప్రస్థుఁడయ్యె. అట్లు చంద్రద్వీప తపోవనంబునఁ దపం బొనర్చుచుండు నితనికిఁ గొన్ని వత్సరంబులు గతించె.

సౌధా—పిదప నిచ్చటికేల వచ్చె ?

భాండా—పురాతన హిత మిత్రుఁ డగు వాల్మీకిమౌనిని సందర్శింప.

సౌధా—ఇప్పు డితనికి బంధు సందర్శనం బయ్యెనా ?

భాండా—ఇప్పుడే వసిష్ఠ భగవానులు కౌసల్యాదేవి చెంతకు భగవతి నరుంధతిం బంపి విదేహనాధుని స్వయముగా నరిగి చూడ నియమించె.

ఆమ్నాయము=వేదము, వత్సతరి=ఆఁబెయ్య, మహోక్షము=పెద్దయెద్దు, ఛాగము=మేక, సద్యస్స్వాగతుఁడగు=అప్పుడేవచ్చిన, దధి=పెరుగు, మధువు=తేనె

సౌధా — ఈవృద్ధులందఱుఁ, నొండొరులు గలిసికొనినట్లు, బ్రహ్మచారులం గూడి మన మును అనధ్యాయ మహోత్సవంబు నాటలతో బహూకరింతము.

భాండా — బ్రహ్మవేత్తయుఁ బురాతన రాజర్షియు నగు నీజనకుండు వసిష్ఠ వాల్మీకుల సేవించి యిప్పు డాశ్రమ ప్రాంత వృక్షమూలమున నున్నవాఁడు.

క. ఈతఁడు మది నిత్యోజ్జ్వల
సీతాశోకంబు వలనఁ జేట్పడి యంత
స్స్యూతానల మగు జరఠీ
భూత వనస్పతియుఁ బోలెఁ బొగులుచు నుండెన్. 2.

(నిష్క్రమించిరి.)

విష్కంభము.

పిమ్మట జనకుఁడు ప్రవేశించుచున్నాఁడు.

జన —

ఉ. నందనియందుఁ దాదృశ ఘనవ్యతిరేకము గల్గి తీవ్రమై
డెందము వ్రచ్చి వేదన గడిందిగఁ జేసి పురాతనత్వముం
జెందియుఁ గ్రొత్తవోలె నెడసేయక యేచు దురంత శోకముం
గ్రందుగఁ గూర్చి మర్మముల రంపమునం బలెఁ గోసె దానిచేన్. 3.

కష్టము ! ఇట్లు వార్ధకంబునను, దుస్సహం బగు దుఃఖంబునను, మఱియుఁ బరాక సాంతపనాది తపంబులను, రసధాతువులు శుష్కింప దుర్బలం బైన నా దగ్ధదేహ మిప్పటికిం గూల దయ్యె. — " ఆత్మఘాతుకుల కంధతమసావృతంబు లగు నసుర్య లోకంబులు విధింపఁబడు " నని మహర్షులు తలంచుచున్నారు. పెక్కేండ్లు గడచి నను బ్రతిక్షణోద్భేదంబుచే స్పష్టనిర్భాసమై నూత్నమైనదియుం బోలె దారుణం బైన నాదుఃఖోద్వేగ ముపశమింప దయ్యె. ఓ తల్లీ ! దేవయజన సంభవా ! సీతా ! నీని

ఉజ్జ్వల = మండుచున్న, అంత స్స్యూతానలము = లోపలిలో నిప్పుగల, జరఠీభూత = ముదిసిన, వనస్పతి = వృక్షము, తాదృశ = అట్టి, ఉద్భేదము = బాధించునది, నిర్భాసమై = ప్రకాశించునదియై.

ర్మాణభాగ మిట్లు పరిణమించెనా ? ఈ లజ్జచే నిచ్చకోలంది విలపింపనైన వలను లేదుగదా ! హా ! హా ! కుమారి !—

గీ. అనియత స్మిత రుదితంబు, నమల విరళ
మంజుతర దంత కలికాగ్ర రంజితంబు,
స్ఖల దసంబద్ధ ముగ్ధ వాక్యంబు నగుచుఁ
దనరు నీ చిన్ని మోము దమ్మిని దలంతు. 4.

భగవతీ ! సర్వంసహా ! నీవు నిక్కముగ మిక్కిలి కఠినురాలవు.—

చ. అనలుఁడు, నీ, వరుంధతి, మహర్షులు, గంగయు, రాఘవాన్వయం
బెనయు గురుండు దేవుఁ డినుఁ, డేసతిశీల మెఱుంగువారు ? వి
ద్యను బ్రయివోలె నేయమ నుదారతఁ గాంచితి ? వట్టి దైవతం
బనఁ దగు నట్టి నీ తనయకా విషమం బెటు లోర్తు నిష్కృపా ! 5.

(తెఱలో) భగవతి ! మహాదేవీ ! యిట్టిటు.

జనకుఁడు—(చూచి) ఓహో ! గృష్టి ప్రదర్శిత మార్గ యగు భగవతి యరుంధతి. (లేచి) మహాదేవి ! యనె నేమెను ? (నిరూపించి) హా ! యెట్లు ! మహారాజ దశరథుని ధర్మపత్ని నా ప్రియసోదరీమణి కౌసల్యయా ? ఆమెయే యీమె యని యెవ్వఁడు గుర్తింప నేర్చును ?—

గీ. ఈమె సిరివోలె దశరథు నింటఁ దనరె;
నట్టి యుపమానపద మేల ? యతివ సిరియె;
అకట ! సాకార శోకమ ట్లోకవిధంబుఁ
బడసె విధిచేత నీమె ; విపాక మహాహా ! 6.

అనియత = కారణములేని, స్మిత = నవ్వును, రుదితంబు = దుఃఖమును గలదియు, అమల = స్వచ్ఛమగునట్టియు, విరళ = విశాలమగునట్టియు, మంజుతర = మిక్కిలి మృదువైనట్టియు, దంత = దంతములను, కలిక = మొలకలమొక్క, అగ్ర = కొనలచే, రంజితంబు = మనోహరమయినట్టియు, స్ఖలత్ = తొట్రుపడునట్టియు, అసంబద్ధ = సందర్భ శూన్యమైనట్టియు, ముగ్ధ = సుందరమైనట్టియు, వాక్యంబు = పలుకులు గలిగినట్టియు, త్రయి = వేదము, విద్యను = తత్త్వజ్ఞానమునువలె, గృష్టి = కంచుకి పేరు. సాకార = రూపముఁదాల్చిన.

ఇది ఘోర మగు విపాక దశాపరిణామము;

క. మును నా కేజనము మెయిం
గనిన మహోత్సవము భంగిఁ గనఁబడెఁ దద్ద
ర్శన మిపుడు మండు గాయం
బున లవణముగతి *ననిష్టముగఁ దోఁచెఁ గడున్. 7

(పిదప నరుంధతి, కౌసల్య, కంచుకి ప్రవేశింతురు)

అరుంధతి—చెప్పుచుంటిని, "తనంతఁదాఁజని విదేహనాథునిం జూడఁదగు" నని మీ కులగురుం డానతిచ్చె. అందులకే నన్ను బంపె. కాన నడుగడుగున నీ యెడతెగని సంకోచ మేటికి?

కంచు—దేవీ! హృదయంబు నెలకొల్పుము. వసిష్ఠ భగవాను నానతి ననుసరింపు మని విన్నవించుచుంటిని.

కౌస—ఇట్టి కాలమున మిథిలేశ్వరుని జూడ వలసి వచ్చె నని సర్వదుఃఖము లొక్క పెట్టున నావిర్భవించుచున్నవి. సమూలంబుగా నున్మూలింపఁబడు హృదయమును నిలువరింప నసమర్థురాల నై యుంటిని.

అరుం—ఇందేమి సందియము?

గీ. ప్రజల కుత్తమ బాంధవాపాయ దుఃఖ
భారములు నిత్యసంతాన వాహులయ్యెఁ
స్వజనుల సమాగమమున దుస్సహములగుచు
సాఁగబాఱు ఝురీ సహస్రములఁ బోలె. 8.

కౌస—వత్సయగు జానకి కిట్లు సంభవించియుండ, నా రాజర్షి నెట్లు చూడఁగలను?

అరుం—గీ. యాజ్ఞ్యవల్క్య మునీంద్రుని యంతికమున
బ్రహ్మ పారాయణ మొనర్చి పరిఢవిల్లి
జనకవంశ్యుల కెల్ల భూషణ మనంగ
వరలు మీ శ్లాఘనీయ సంబంధి యితఁడె. 9.

విపాకము = విరుద్ధపరిణామము. పాఠాంతరము:—*ననసహ్యముగ: అంతికమున=సన్నిధి, బ్రహ్మపారాయణము = వేదాధ్యయనము.

కౌస — ఇతఁడు మహారాజునకు హృదయానందుండును వత్సయగు జానకికిఁ దండ్రియు నగు రాజర్షి ; హా యిట్టి కష్టకాలమున మన్నింపఁ బడితిని. హా ! దేవా ! ఆ సర్వ మిప్పుడు శూన్యము.

జన — (సమీపించి) భగవతీ ! అరుంధతీ ! వైదేహుఁ డగు సీరధ్వజుఁడు నమస్కరించు చున్నాఁడు.

చ. గురుతుగఁ బూర్వపుం గురులకుం గురువర్యుఁడు, శుద్ధ సన్మహో
భరుఁడును, నీదు భర్త నిను బట్టి తనున్ శుచిగాఁ దలంచె ; నా
గరితవు లోకవంద్యవు, జగచ్ఛుభమూర్తివి, నీకు భూతల
స్థిరశిర మొప్ప నో భగవతీ ! తొలిసంజకుఁ బోలె మ్రొక్కెడిన్. 10.

అరుం — పరంజ్యోతి నీకావిర్భవించుఁగాక ! జాజ్వల్యమానుఁడై రజోగుణాతీతుఁడగు దేవుండు నిన్ను బవిత్రీకరించుఁగాక !

జన — ఆర్య ! గృష్టి ! సేమమా యీనరపాలజననికి ?

కంచు — (తనలో) అతినైష్ఠుర్యమున నిశ్శేషముగా గర్హింపఁ బడితిమి. (ప్రకాశముగా) రాజర్షిచంద్రా ! ఈకోపముననే చిరకాలమునుండి రామభద్ర వదనేందు దర్శనంబు నీడి మిగుల దుఃఖించు దేవిని నీయాగ్రహముచే దుఃఖింపఁ జేయఁ జనదు. రామభద్రుఁడైనను దుస్సహం బగు కింవదంతి నెల్లెడల ఘూర్ణిల్లఁ జేయు నత్యల్పు లగు పౌరజానపదులు పావకశుద్ధిని విశ్వసింప లేదని యిట్టి దారుణం బాచరించె.

జన — అఁ ! మా యపత్యంబు శోధింపఁ బావకుం డన నెవ్వఁడు ? కష్టము ! ఇట్లు పలుక మానవునిచే మేము రామతిరస్కృతుల మయ్యును మరలఁ దిరస్కరింపఁ బడుచుంటిమి.

అరుం — (నిట్టూర్చి) ఇదియిట్లే; వత్సయెడల నగ్నియను నక్షరంబు లతిలఘువులు, సీత యనియే చాలును. హా ! వత్సా !

చ. ఒనరఁగ శిష్యవో ? తనయవో ? యగు దయ్యది యుంచు మట్లు; నీ
ఘనతర శుద్ధి నీయెడల గాటపు భక్తి జనింపఁ జేసె ; నం
గనవును బాల వయ్యును జగత్త్రియ వంద్యవు గావె ? పూజనం
బెనయ గుణాఢ్యులందు గుణమే తగు ; లింగముఁ బ్రాయమున్ వృథా. 11.

సీరధ్వజుఁడు = నాగలిజెండాఁగలవాఁడు, మహోభరుఁడు = తేజశ్శాలి.

కౌస—అక్కటా! వేదన లుపొంగుచున్నవి. (మూర్ఛిల్లును)

జన—హా! కష్టము! ఏమిది?—

అరుం—రాజర్షీ! వేఱేమి?—

చ. అల ధరణీశుఁడా సుఖము, నా శిశువర్గము, నా దినంబులుం,
దెలివగు నిన్ గనం దలఁపు జెందె సమస్తము; గాన నిమ్మహా
జ్వల మగు దారుణంబున భవత్సఖి మూర్ఛిత యయ్యె; నారిజా
క్షుల హృదయం బనం గుసుమ కోమల భంగిఁ జెలంగుఁ గాదొకో? 12.

జన—అన్నన్నా! అన్ని విధంబుల ఘాతకుండ నయితి. చిరకాలమునను దర్శించిన ప్రియమిత్రుని ప్రియకాంతం జెల్మితోఁ జూడ నయితి.

చ. అతఁ డతి సఖ్యుఁడున్, ఘనత నందిన బంధుగుఁడున్, మనంబు, నా
కృతిగను సమ్మదంబు, నిచయీకృత జీవిత సత్ఫలంబు, నిం
డు తనువో? జీవుఁడో? యధికుఁడో? ప్రియమిత్రుఁడు, శ్రీకళాసమ
న్వితుఁడు, మహాత్ముఁడౌ దశరథేశ్వరుఁ డెయ్యది నాకుఁగాదొకో? 13.

కష్టము! ఆకౌసల్య యీమెయే గదా!—

మ. సతికైనం బతికైన వైరము రహస్యంబందుఁ బెంపైన, దం
పతు లన్యోన్య మొనర్చు నిందలకు నేఁ బాత్రుండ నైయుంటి, నా
హిత కోపంబుననే? యనుగ్రహమునందే? కార్యభారంబు మ
ద్గత మయ్యెం, దలపోయ నేల? మది నంతన్ ముట్టి బిట్టేర్చెడిన్. 14.

అరుం—హా! కష్టము! ఈమె హృదయము చిర నిశ్వాస నిరోధంబుచే దుస్సహంబై యున్నది.

జన—హా! ప్రియసోదరీ! (కమండలు జలముఁ జల్లుచున్నాఁడు)

కంచు—గీ. వర సఖుఁడు వోలెఁ దొల్త నేక రసమైన
యానుకూల్యంబు సుఖదమై యలవరించి
పున రకాండ దారుణ వివర్తనముఁ జెంది
దైవ మకట! మనోవ్యాధి దవులఁజేసె. 15.

నిచయీకృత = పోగుగాఁజేయఁబడిన, ఆహిత = పొందఁబడిన, పునః = తిరిగి, అకాండ = నిష్కారణముగా, దారుణ = భయంకరమైన, వివర్తనమున్ = మార్పును, ఏకరసము = ఇతరముచే భిన్నముగాని రసము.

కౌస—(తెల్వినొంది) హా! వత్సా! జానకీ! యెచ్చట నుంటివి? వివాహ లక్ష్మీ పరిగ్రహాలంకృతంబై సముజ్జ్వల ధవళ మధురహాసం బయిన నీ సుందర ముఖారవిందంబుఁ దలపోయుచుంటిని. విస్ఫుర చ్చంద్ర చంద్రికాభిరామంబు లగు నీ యంగములచే మరల నో పుత్త్రీ! నాయంకతలంబు నలంకరింపుము. ఇయ్యది 'రఘుకుల కూటస్థులకుం గోడ లయ్యును జనకానుబంధంబున మనకు మాత్రము బుత్త్రిక యే' యని నిరంతరంబు మహారాజు పలుకుచుండును.

కంచు—దేవి పల్కినట్లే.—

> గీ. బిడ్డ లయిదుగు రయిన భూవిభున కరయ
> బహుళ సమ్మోదకారి సుబాహువైరి
> నలువురైనను గోడండ్రు వెలయ నతని
> కాంత యగు సీత హితురాలు శాంతవోలె. 16.

జన—హా! ప్రియసఖ! మహారాజ దశరథ! సర్వవిధంబుల మనోరముఁడ వగు నిన్నెట్లు మరతును?

> మ. ధరణిం గన్నియ తండ్రు లల్లుని నిజాప్తశ్రేణి నర్చింతు రా
> సరణిల్ మారె మనందు; నీవె నను వాంఛ ల్మీఱఁ బూజించి తా
> స్థిరశీలుండవు పోతి కాలమున, మా సెన్ బంధుతా బీజ మున్,
> నరకాభీల జగంబునం దఘునిధిన్ నాజీవితం బేటికిన్. 17.

కౌస—పుత్త్రీ! జానకీ! దృఢ వజ్రలేపంబుచే నుప నిబద్ధ మైనట్లు సుస్థిరంబగు నా దుష్టజీవితంబు నిర్భాగ్యురాల నగు నన్ను విడిచి పోవుట లేదు.

అరుం—ఊరడిల్లుము రాజపుత్త్రీ! ఎడనెడ నశ్రు విశ్రామంబు నాచరింపనగు. మఱియు ఋశ్యశృంగాశ్రమంబున మీ కులగురుండు "తగని దుఃఖము సంభవించినను శుభోదర్కంబు గాఁగల" దని పల్కిన వాక్య మేల స్మరింపవు?

కౌస—భగవతీ! అడియాస మించినది.

అరుం—రాజపుత్త్రీ! దాని మృషావాక్యమని యే తలంచెదవా? సుక్షత్రియా! అన్యథా తలంపరాదు. నిక్కముగా జరిగి తీరఁ గలదు.

చంద్రిక = వెన్నెల. అశ్రువిశ్రామంబు=కన్నీళ్ళనరికట్టుట, శుభోదర్కము = శుభము యొక్క రాఁగలకాలము, మృష=అబద్ధము.

గీ. విస్ఫురద్బ్రహ్మతత్త్వలౌ విప్రవర్యు
లాడు సూక్తుల సందియ మంద వలదు ;
భద్రయగు లక్ష్మి వీరల వాణి నిల్చు ;
వ్యర్థవాక్యంబు వీరలు బల్క రెపుడు. 18.

(తెఱలోఁ గలకలము—అందఱు నాకర్ణింతురు.)

జన—ఈనాఁడు శిష్టానధ్యాయ మని మిక్కుటముగాఁ గ్రీడించు బ్రహ్మచారుల కలకల మిది.

కౌస—బాల్యంబు మాత్రము సులభ సౌఖ్యమైనది. (నిరూపించి) వీరిలో రామభద్ర కౌమార లక్ష్మీ పరిశోభితంబులై మంజులోదార సుందరంబు లగు నంగములచే మన నేత్రములఁ జల్లఁజేయు నీ బాలకుం డెవ్వఁడు ?

అరుం—(స్వగతము ఆనంద బాష్పములతో) ఇదే!! భాగీరథీ నివేదిత రహస్య కర్ణామృతము. కాని యాయుష్మంతు లగు కుశలవులలో వీఁ డెవ్వఁడో యెఱుంగను.

జన—

మ. అసితేందీవర పత్ర కాంతుఁడు, శిఖండాలంకృతుండు, న్విభూ
తి సమగ్రుండు, దనూరుచిన్ వటుసభన్ దీపింపఁగాఁ జేయుచుం
బసమై వత్స రఘూద్వహుండు మరలం బాలత్వముం దాల్చెనా
వెసఁ గానంబడు వీఁ డెవండొ ? కనులన్ వే వే సుధం బూసెడిన్. 19.

కంచు—ఈ డింభకుఁడు క్షత్రియ బ్రహ్మచారి యని తలంచెదను.

జన—ఇట్లే యిది. కాననే—

మ. వెనుకం జుంచు దగుల్ గఱుల్ వెలయ నిల్పెం దూణముల్ క్రేవలం,
బ్రణుతోరస్థ్సలిఁ దాల్చె భస్మ రురు చర్మంబుల్ బవిత్రంబు, బా

నివేదిత = చెప్పఁబడిన, అసితేందీవరపత్రము = నల్లకలువరేకు, శిఖాండము = జుట్టు, చుంచు = జుట్టు, గఱుల్ = బాణముయొక్క ఱెక్క, తూణములు = బాణములు, క్రేవలన్ = ప్రక్కలను, ప్రణుత = స్తోత్రపాత్రమగు, ఉరస్థ్సలిన్ = వక్షస్థ్సలమందు, భస్మ = విభూతియు, రురుచర్మంబు = లేడితోలు, పవిత్రంబు = యజ్ఞోపవీతమును, దాల్చెను.

వన మాంజిష్ఠ మయాంతరీయమును మూర్వా మేఖలం గట్టెఁ, గే
లను గోదండముఁ బ్లక్షదండ జపమాలా కంకణంబుల్ గొనెన్. 20.

భగవతీ! అరుంధతీ! వీఁ డెచ్చటివాఁడో యూహింతువా?

అరుం—మే మిప్పుడే గదా వచ్చితిమి!

జన—ఆర్య! గృష్టి! నాకు మిగుల వేడుక పొడముచున్నది. కాన వాల్మీకి భగవానునే చేరి యడుగుము. "ఎవ్వరో వృద్ధులు నిన్నుఁ జూడఁ గోరుచుండి" రని యీ బాలకున కెఱింగింపుము.

కంచు—మీ రాన తిచ్చినట్లే. (నిష్క్రమించును.)

కౌస—ఇట్లాహూతుఁడై యరుదెంచు నందువా?

అరుం—ఇట్టి నిర్మాణంబునకు సౌశీల్యంబు భేదించునా?

కౌస—ఎట్లు? వినయాకర్ణిత గృష్టి వచనుండై మునికుమారుల విడిచి యా డింభకుం డిట్లెదురు వచ్చుచుండెనే?

జన—(చాలతడవు పరికించి) ఓహో! యేమిది?

చ. వినయ శిశుత్వ నూత్న్య పరివేష్టిత పేశల మైన వీని యీ
నున మహిమంబు నేర్పరులు గాని గొఱుంగరు మూర్ఖులేని, నా
మనము ప్రమూఢ మైన బలమండితుఁడై హరియించె వీఁడు, హె
చ్చున నినుమున్ గ్రహించు లఘుచుంబక ఖండము పోల్కి నెంతయున్. 21.

లవుఁడు—(ప్రవేశించి తనలో) పూజ్యులైనను నామ క్రమాన్వయంబులం దెలియక నాయంత నెట్లు నమస్కరింపఁ గలను? (యోజించి) ఇదిమాత్రి మవిరుద్ధ పద్ధతి యని వృద్ధుల వలన వినంబడెడి. (వినయముతోఁ జేరి ప్రకాశముగా) ఇదే! మీకు లవుని శిరఃప్రణామమ్మౌలి.

అరుం—జన—కల్యాణనిధీ! ఆయుష్మంతుఁడవు గమ్ము.

కౌస—వత్సా! దీర్ఘాయువవు గమ్ము.

మాంజిష్ఠమయ=పసుపు రంగుతోఁ గూడిన, అంతరీయమును=ఉత్తరీయమును, మూర్వా మేఖల = మూర్వయను గడ్డితోఁ జేనఁబడిన మొలనూలు, ప్లక్షదండము = రావిపుల్ల, ఆహూతుఁడై = పిలువఁబడినవాఁడై, పరివేష్టిత = ఆవరింపఁబడుటచేత, పేశల=మృదువయిన. ప్రమూఢ మైనన్=ఎక్కుడు మూర్ఛలో నున్నను, లఘుచుంబక ఖండము=తేలికయగు సూదంటురాయి.

అరుం—తనయా ! రమ్ము. (లవుని దొడపై నిడుకొని స్వగతము) సంతోషము ! చిర కాలమునకు నా యుత్సంగమే కాదు మనోరథంబుఁ గూడ సంపూర్ణమైనది.

కౌస—పుత్రా! యిటుగూడరమ్ము. (కౌఁగిలించుకొని స్వగతము) ఓహో! దరవికస్వరేందీవర మాలికా శ్యామలోజ్జ్వలంబైన దేహబంధంబుననే కాక, కబళిత కమల కింజల్క కాదంబ మధుర గళ రవోదార దీర్ఘస్వరంబునను రామభద్రు ననుకరించి యుండెఁ. వికచారవింద గర్భ మంజులంబైన యీ కుమారుని తనుస్పర్శంబు నట్టిదియే. (ప్రకాశము) వత్సా ! ఆయుష్మంతుఁడా ! నీ ముఖచంద్రు నాలోకింతును. (చుబుకము నెత్తి కన్నీళ్లతో సాభిప్రాయముగా నపవారించి) రాజర్షీ ! చూడవేమి ? నిపుణముగఁ బరికింప నితని ముఖము వత్స యగు జానకి ముఖచంద్రునితో సరిపోలుచున్నదే ?

జన—చూచుచుంటి నమ్మా చూచుచుంటిని.

కౌస—ఓహో ! నా చిత్త మున్మత్తమైనదియుం బోలె నెద్దియో చింతించుచు మిగులఁ జంచలించుచున్నది.

జన—(స్వగతం)

చ. ధరణిజ రూపమున్ రఘువతంసుని కాంతియు నిక్కుమారు నన్
విరివిగఁ బూర్ణభంగిఁ బ్రతిబింబిత మైనటులం దరర్చె, వా
జ్ఞిరతి, నిసర్గ నమ్రతయు, నిర్మల సత్త్వము సైత మల్లదే !
యరిముఱి నాదు చిత్త మడియాసలఁ బ్రాఱుచు నుండె హా ! విధీ ! 22

కౌస—వత్సా ! కలదా నీకుఁ దల్లి ? తలఁపోయుదువా తండ్రిని ?

లవు—లేదు.—

కౌస—అట్లయిన నీ వెవ్వరివాఁడవు ?

లవు—భగవానుఁడగు వాల్మీకి సంబంధుఁడను.

కౌస—ఓవత్సా ! వక్తవ్యముఁ జెప్పుము.

లవు—ఇంతవఱకే యెఱుంగుదును.

(తెఱలో) ఓహో ! సైనికులారా ! "ఆశ్రమప్రాంత భూమి నెవ్వండు నాక్రమింపరా" దని యీ కుమార చంద్రకేతుఁ డాన వెట్టుచున్నాఁడు.

దర=యించుక, వికస్వర=వికసించిన, ఇందీవర=నల్లకలువవలె, శ్యామల=నలుపుచేత, ఉజ్జ్వలంబై=ప్రకాశించునదియై, కబళిత=తినఁబడిన, పద్మకేసరములుగల, కాదంబ=కలహంసలయొక్క, మధురమైన-చుబుకము=గడ్డము.

అరుం—జన—ఓహో ! యజ్ఞాశ్వరక్షణార్థమై యరుదెంచిన చంద్రకేతు కుమారుఁ డిపుడు చూడఁదగినవాఁడు. ఆహా ! సుదినము.

కౌస—వత్సయగు లక్ష్మణుని పుత్త్రుఁ డాజ్ఞాపించు చుండె నని సుధాబిందు సుందరంబు లగు నక్షరంబులు వినవచ్చుచున్నవి.

లవు—ఆర్యా ! ఈ చంద్రకేతుఁ డన నెవ్వరు ?

జన—దశరథ పుత్త్రు లగు రామ లక్ష్మణుల నెఱుంగుదువా ?

లవు—వారే రామాయణ కథానాయకులు.

జన—అట్లయిన నెట్లెఱుంగవు ? ఆలక్ష్మణుని కుమారుఁడే యీ చంద్రకేతుఁడు.

లవు—ఊర్మిళానందనుఁడా ! అట్లయిన జనకరాజర్షి దౌహిత్రుఁడు.

అరుం—'నవ్వి' కుమారుండు కథా ప్రపంచంబు వెల్లడించె.

జన—నీ విట్టి కథా కోవిదుండ వేనిఁ జెప్ప మడుగుచుంటిమి. ఆదశరథాత్మజుల కే పేరిటి నందను లేభార్యలందు జన్మించిరి ?

లవు—ఈ కథా విభాగము మేముగాని యొరులుగాని వినియుండలేదు.

జన—ఏమి ? కవి రచింపలేదా ?

లవు—రచించె. వెల్లడించలేదు. అందలిదే యేకదేశమును సందర్భాంతరమున సరస రూపకంబుగా నిర్మించి స్వహస్త లిఖిత మగు నాగ్రంథమును వాల్మీకిభగవానుఁడు తౌర్యత్రిక సూత్రకర్త యగు భరతమునికిఁ బంపె.

జన—ఎందులకు ?

లవు—ఆ మ్మహాత్ముఁడు దాని నచ్చరలచే నభినయింపఁ జేయు నని.

జన—ఇది యెల్ల మాకు సాకూతముగాఁ గానఁబడుచున్నది.

లవు—వాల్మీకి భగవానునకు దీనియందు మిగుల నాదరము. కొందఱి శిష్యులచే నీ పొత్తమును భరతాశ్రమంబున కనిపె. వారికి సహాయుఁడై ప్రమాద నివారణార్థముగా ధనుర్ధారి యగు మా సోదరుం డంపఁ బడియె.

కౌస—నీకు సోదరుఁడుఁ గూడఁ గలఁడా ?

లవు—కలఁడు, ఆర్యుఁడగు కుశుఁడు.

కౌస—పెద్దవాఁడనుచుంటివే ?

తౌర్యత్రికము = నృత్తము, వాద్యము, గీతము, సాకూతము = అభిప్రాయగర్భితమయిన.

లవు—ఔను ప్రసవ క్రమంబున నతఁడు జ్యేష్ఠుఁడు.

జన—కవలా దీర్ఘాయువులు ?

లవు—ఔను.

జన—చెప్పుము. ప్రబంధ కథా నిర్మాణమున కవసాన మేది ?

లవు—అనృత పౌరాపవాద విత్రస్తుఁ డగు భూపాలుని చేఁ బరిహరింపఁబడి సన్నిహిత ప్రసవ వేదన యగు యజ్ఞభూనందనియగు సీతాదేవిని లక్ష్మణుఁ డొంటిగా నరణ్యమున విడిచి మరలి చనె. ఇది.

కౌస—హా ! వత్సా ! సుందరేందుముఖి ! ఏకాకిని వగు నీ తనూ కుసుమమున కిప్పు డెక్కడి దైవ దుర్విపాక పరిణామ మాపతిల్లెను ?

జన—హా ! వత్సా ! —

గీ. అభినవాభీల పరిభవం బంది నాఁటి
ప్రసవ కాలిక వేదన బడలి నీవు
ఘాతుక మృగంబు లెల్లెడఁ గవియ నడలి
పలుమరును నన్నుఁ శరణని తలఁతు నిజము. 23.

లవు—(అరుంధతితో) ఆర్యురాలా ! వీ రెవ్వరు ?

అరుం—ఈమె కౌసల్య, ఇతఁడు జనకుఁడు.

లవు—(బహుమాన ఖేద కౌతుకములతోఁ జూచుచున్నాఁడు.)

జన—ఓహో ! పురజనుల దౌరాత్మ్యము ! ఓహో ! రామభూపతి సాహస కృత్యము?

ఉ. ఏపున వజ్రఘోర మగు నీవ్యసనంబును సారె జూచు నా
కోపము చాప శాపముల గుప్పన మండఁగఁ గాల మిద్దియే !

కౌస—భగవతీ ! రక్షింపు రక్షింపు. కుపితుఁ డగు రాజర్షి నుపశమింపఁ జేయుము.

అరుం— గీ. మహిఁ బరాభవ మందిన మానధనుల
హృదయ మెల్లవిధంబుల నిట్టు లుండు
భూపతీ ! పుత్రపచుఁడు రాముండు నీకుఁ
బాలనీయులు దీనులౌ ప్రజలు తలఁప. 24.

విత్రస్తుఁడు = మిక్కిలి భయపడినవాఁడు, దౌరాత్మ్యము = దుర్మార్గము,

జన— చాపము శాప మేల నుతపన్న భయుండౌ రఘురామునం, దయో
ధ్యాపురి బాల వృద్ధ వికలావనిదేవ సతీ మయింబొగిన్. 25.

బ్రహ్మచారులు— (తొందరతోఁ బ్రవేశించి) కుమారా! అశ్వ మశ్వమని యేదో యొక భూతము దేశంబుల విన వచ్చుచున్నది. అది మా కిపుడు ప్రత్యక్ష మైనది.

లవు— అశ్వ మని పశు శాస్త్రమందును, సమర విద్యయందును బఠింపఁబడును. ఇది యెట్టిదియో చెప్పుఁడు.

బ్రహ్మ— వినుము—

మ. అలరుం దుంటికి జల్లితోఁక; యది యల్లల్లార్చు నెల్లప్పుడుం;
గలుగుం దానికి దీర్ఘకంధరము; డెక్కల్ నాలుగే నుమ్మ; చా
యలఁ బోచల్ దిను; మావికాయలకు నీడౌ లద్దులల్ వెల్చు; వ్యా
ఖ్యలి వేలా? కడు వేఁగ బోవుదను రమ్మా! రమ్మ దత్వాగెడిన్. 26.

(సమీపించి అజినమును హస్తములను లాగుచున్నారు.)

లవు— (కౌతుక కోపరోధ వినయములతో) ఆర్యులారా! చూడుఁడు, చూడుఁడు. వీరిచే నాకర్షింపఁబడుచుంటిని. (తొందరతోఁ బరిక్రమించుచున్నాఁడు.)

అరుం— జన— వత్సా! వేడుకనిండింపుము.

కౌస— భగవతీ! వీనినవలోకింపక జీవింప నని తలంతును. కాన నింకొక మేర కరిగి మరలి పోవు నాయుష్మంతునిం జూతము.

అరుం— దన్వ్వ చనిన చంచలుం డెట్లు కానవచ్చును?

కంచుకి— (ప్రవేశించి) "దీని మీరు సమయమున నెఱుంగఁ దగు" నని వాల్మీకి భగవానుఁ డానతిచ్చె.

జన— ఇది యేదో మహాగంభీరముగానున్నది. భగవతీ! అరుంధతీ! సఖీ! కౌసల్యా! ఆర్య! గృష్టీ! మనయంత నరిగి వాల్మీకి భగవానునిం గనుంగొందము.

(వృద్ధవర్గము నిష్క్రమించెను.)

బ్రహ్మ— కుమారా! అవిచిత్రమును జూడుము.

లవు— చూచితిని. తెలిసినది. నిక్కముగా నీ యశ్వ మశ్వమేధీయము.

వికల=అంగవైకల్యము కలవారు, అవనిదేవ=బ్రాహ్మణులు. కంధరము=కంఠము. అశ్వమేధీయము = అశ్వమేధసంబంధమయినది.

బ్రహ్మ—ఎట్లైతింగితివి?

లవు—ఓమూర్ఖులారా! శ్రౌత్రాశ్వమేధ కాండమునఁ బఠింపఁబడినదే! చూడరేమి! వేర్వేఱుగా శతసంఖ్య గల్గుకవచవాతులు, దండహస్తులు, తూణధారులు, రక్షింపఁ గలరు. ఈసైన్యంబు నట్లనే కానవచ్చుచున్నది. ఇందు నమ్మకము లేదేనిఁ బోయి యడుగుఁడు.

బ్రహ్మ—ఓహో! ఈ యశ్వము సేనాపరివృతంబై యెందులకై తిరుగుచున్నది?

లవు—(అపేక్షతోఁ దనలో) ఆహా! అశ్వమేధ మని విశ్వవిజేతలగు క్షత్రియులకు బలవత్తరంబును, సర్వభూపాల పరిభావకంబును, నగు మహామహిమ. నిశ్చయము.

(తెఱలో) క. "తురగ మిది సప్తలోకో
త్తర వీరుం డైన పశవదన కుల మూలో
ద్ధరణుని పతాక యొ? భయం
కరమై తగు వీరఘోషణంబో యనగా." 27.

లవు—(వ్యథతో) ఓహో! అక్షరంబు లుద్దీపనంబులుగా నున్నవి.

బ్రహ్మ—ఏమందుము? ప్రాజ్ఞుఁడుగదా కుమారుఁడు!

లవు—ఏ మట్లు పలుకుచుంటివి? క్షత్రియ శూన్యమా పృథివి?

(తెరలో) "అరే! మహారాజుముందు క్షత్రియు లెక్కడ?"

లవు—ఛీ! మూర్ఖులారా!

గీ. ఉండిరే నటు వారల నుండనీయుఁ
డీ విభీషిక జూపుట యెందుకొఱకుఁ?
బలు పలుకులేల? దగ్గరి బలిమిఁ బట్టి
కడఁగి హరియింతు మీ పతాక నిదె! నేను. 28.

ఓహో! వటువులారా! లోష్ఠములఁ గొట్టి యీ తురంగమును మరలింపుఁడు. ఇది యెక్కడ లేక రోహిత మృగంబులతోఁ జరించుఁగాత!

పురుషుఁడు—(క్రోధ దర్పములతోఁ బ్రవేశించి) ఏమీ చపలత్వము?—ఏమి చెప్పితివి? తీవ్ర నిర్దయంబు లగు నాయుధీయ పఙ్క్తులు డింభకుఁడు పల్కువను దృప్త వాక్యమును సైరింపవు. ప్రసన్నాపూర్వారణ్యావీక్షణానంద పరాయత్త చిత్తుఁడై యుండు వైరిమర్దనుం డగు రాజపుత్త్రుఁడు చంద్రకేతుఁడు చనుదెంచు నంతలో వేవేగ నీ నిబిడారణ్యమునఁ దొలఁగిపొండు.

విభీషిక = బెదరింపు, దృప్త = గర్వముతోఁగూడుకొనిన.

బ్రహ్మ—కుమారా ! చాలు నీ తురగముతో; సముజ్జ్వల శస్త్రంబు లగు నాయుధీయ పరంపరలు కుమారుని దర్శించు చున్నవి. ఇప్పటి కాశ్రమస్థానము దూరము కాన రమ్ము లేడిగంతులతోఁ బరుగెత్తుకొని పోవుదము.

లవు—(నవ్వి) శస్త్రము లేమి ప్రజ్వలించుచున్నవి ? (ధనువెక్కిడి)

మ. స్థిర దంష్ట్రోత్కట కోటి మధ్య విచల జ్జిహ్వోజ్జ్వల చ్ఛింజినీ
స్ఫురి తోద్గారి ఘనాళి ఘర్ఘర రవ స్తోమాస్పదంబై, చరా
చర భూత గ్రసనోద్య దంతక హాస చ్చండాస్య యంత్రప్రభా
స్వర జృంభా విపులోదరం బగుచు నీ చాపంబు దీపించుతన్. 29.

(వికటముగాఁ బరిక్రమించి అందఱు నిష్క్రమింతురు.)

కౌసల్యా జనక యోగ మను

చ తు ర్థాం క ము,

సంపూర్ణము.

స్థిర=దృఢమైన, దంష్ట్ర=కోరలవలె, ఉత్కట=భయంకరమగు, కోటి = చాపాగ్రముల యొక్క, మధ్య=మధ్యమందు, విచలత్=చలించుచున్న, జిహ్వా = నాలుకవలె, ఉజ్జ్వలత్=ప్రకాశించుచున్న, శింజినీ=నారివలన, స్ఫురిత =వెడలుచున్న, ఉద్గారి = తేఁనుపువంటి, ఘనాళి=మేఘసముదాయము యొక్క, ఘర్ఘరరవ=ఘర్ఘర ధ్వనుల యొక్క, స్తోమ = సముదాయమునకు, ఆస్పదంబై = స్థానమై, చరాచరభూత గ్రసన = ప్రపంచభక్షణమందు, ఉద్యత్ = ప్రయత్నించుచున్న, అంతక = యముని యొక్క, హసత్ = అట్టహాసము చేయు, చండ = భీకరమగు, ఆస్యయంత్ర = యంత్రమువంటి ముఖము యొక్క, ప్రభాస్వర=మిక్కిలి వికసించిన, జృంభా=ఆవులింతవలె, విపుల = విశాలమయిన, ఉదరంబగుచు = మధ్యభాగము గలదై, ఈచాపంబు—దీపించుతన్ =ప్రకాశించుఁగాక !

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

పంచమాంకము.

(తెఱలో) ఓహో! సైనికులారా! కల్గినది మన కాధారము గల్గినది.

గీ. సరభస సుమంత్రి చోదనోత్తరళ జవన
హయ రథముతోడ మన కయ్య మాలకించి
చంద్రకేతుండు విషమ భూచలిత కోవి
దార తరు కేతుఁడై యిదే! తరలి వచ్చె. 1.

(అద్భుత హర్ష సంభ్రమములతో ధనుర్ధరుండగు చంద్రకేతుండు సుమంత్రి సారథికం బగు రథంబునం బ్రవేశించును.)

చంద్ర—ఆర్య! సుమంత్రా! చూడు చూడు!—

మ. సముదంచ న్మృదు పంచచూడుఁ డగు నోజశ్శాలి యీ బాలుఁ, డీ
సమరక్షోణి సుపాత్త రోష లవ రజ్య ద్వక్త్ర లక్ష్మీకుఁడై,
నమితోద్దామ శరాసనాగ్రములు సాంతత్యంబునం మ్రోయ సై
న్యముపై బాణ తుషారముం బరపె నుద్యత్ప్రౌఢి వీఁ డెవ్వఁడో? 2.

చోదన = తోలుటవలన, ఉత్తరళ=పరుగెత్తుచున్న, జవన = బలిష్ఠమయిన, విషమభూచలిత=ఎచ్చుతగ్గు భూములయందు చలించుచున్న, సముదంచత్ = ఒప్పుచున్న, పంచచూడుఁడు = పంచశిఖలుకలవాఁడు, ఓజశ్శాలి = తేజోవంతుఁడు, ఉపాత్త = పొందఁబడిన రోషముయొక్క, లవ=లేశమువలన -ఎఱ్ఱఁబారిన- ముఖ- శోభగలవాఁడై, నమిత=వంచఁబడిన.. విల్లుయొక్క - కొనలు - ఎడతెగక - ధ్వనిచేయఁగా, తుషారము = మంచు.

చ. ముని జన బాలుఁ డొక్కఁడు చమూ తనుభాగము లెల్ల నుల్లస
ద్ఘన గజ గండ పిండ గురు ఘాతజ టంకృతి భీకరార్భటిన్
మునుకొని బాణసంఘముల ముంచుచు మున్ విదితంబుగాని నూ
తన రఘురా ట్కులాంకుర విధంబున నాకు ముదంబు గూర్చెడున్. 3.

సుమం—ఆయుష్మంతుఁడా! —

గీ. క్షితి సురాసుర మహిమల నతిశయించి
నీకు సమరూపుఁ డైన వీని దిలకించి
కాశి కాధ్వర వైరి సంగ్రామ మందు
ధనువుఁ దాల్చిన రఘునందనుని స్మరింతు. 4.

చంద్ర—వీని నొక్కని గూర్చి పలువురికిఁ గార్యారంభ మని డెందము లజ్జించు
చున్నది.

చ. సమర విధాన నిర్వహణ శక్త కరాంచల దీప్త శస్త్రసం
ఘములును, నిక్వణ ద్బహుళ కాంచన కింకిణికా ఝణంఝణ
త్తుముల రథంబు, లిద్ధ మద దుర్దిన కుంజర వారిదంబు లౌ,
సమిత బలంబులం బిహితుఁ డయ్యెడి నీ సుకుమారుఁ డెక్కటిన్. 5.

సుమం—కుమారా! వీర లంద ఱేకీభవించిన వీని కేమి? —విచ్చెరేని మనుపే
లేదు.

చంద్ర—ఆర్యా! త్వరపడుము త్వరపడుము. ఇతఁడు మన సైనికుల హింసింపఁ
జొచ్చె. అల్లదే!

చమూతను భాగములు=సేనాంగములు, ఉల్లసత్=ప్రకాశమానమగు, గొప్పవ
యిన - ఏనుఁగులయొక్క - చెక్కిళ్ళయందలి- ఉండలయొక్క - గొప్పదగు - దెబ్బ
వలన - పుట్టిన - టంకారధ్వనియొక్క - భయంకరమగు - చప్పుడులతో, ఎదిరించి.

కరాంచల = చేతికొనలయందు, నిక్వణత్ = ధ్వనిచేయుచున్న, కింకిణికా =
చిఱుగంటలయొక్క, తుముల=విస్తారములగు, ఇద్ధ=ప్రశస్తమైన, మద =మదముచే
త, దుర్దిన=మునురుగాఁజేయఁబడిన, కుంజర = ఏనుఁగులనెడు, వారిదంబులౌ = మే
ఘములుగల, పిహితుఁడు = ఆవరింపఁబడినవాఁడు, ఎక్కటిన్ = అసహాయుఁడై.

చ. గురుతర దుందుభి ధ్వని విఘూర్ణితమై, గిరికుంజ గుంజ దు
ద్ధుర మద కుంజర శ్రవణ దుస్సహమౌ గుణఘోష మెల్లెడం
బలుపుచు, లోల భీషణ కబంధ శిరంబులఁ దృప్త కాల భీ
కర ముఖ భుక్తశేషముల కైవడి నింపె నితండు భూములన్. 6.

సుమం—(తనలో) ఇట్టి వానితో నర్భకుం డగు చంద్రకేతునకు ద్వంద్వయుద్ధ మె ట్లుసమ్మతింతును? (యోజించి) లేదా? ఇక్ష్వాకు గృహవృద్ధులముగదా మేము! సంభవించి నప్పు డేది గతి?

చంద్రి—(విస్మయ లజ్జా సంభ్రమములతో) ఛీ! నాసైన్యంబు లెల్ల మరలి పోయినవి.

సుమం—(రథవేగము నభినయించుచు) ఆయుష్మంతుఁడా! ఇదే! ఆ వీరుండు నీకు వాగ్గోచరుఁడయ్యె.

చంద్ర—(విస్మృతి నభినయించి) ఆర్యా! ఆఖ్యాయకులు వీనినామధేయము నేమని తెల్పిరి?

సుమం—లవుఁ డని.

చంద్రి—గీ. అద్దిరా! లవ! శూర! మహాభుజాంక!
నీకు ఫలమేమి యిట్టి సైనికులతోడ?
ఇదిగో! నే వచ్చినాఁడ న న్నెదురు మిపుడు
తేజము శమించుఁగాక! మా తేజమందు. 7.

సుమం—కుమారా! చూడు చూడు.

గురుతర = మిక్కుటమగు, దుందుభిధ్వని చేత, ఘూర్ణితమై = ప్రతిధ్వని చేయుచున్నదై, గిరి=పర్వతములయందలి, కుంజ = పొదలయందు, గుంజత్ = ధ్వని చేయుచున్న, ఉద్ధుర = విశేషమైన, మదకుంజర = మదపుటేనుఁగులయొక్క, శ్రవణ = చెవులకు, దుస్సహమౌ = సహింప శక్యముగాని, గుణఘోషము = నారియొక్క ధ్వని ఎల్లెడంబలుపుచు, లోల = చలించుచున్న, భీషణ = భయంకరమగు, కబంధ = మొండెములచేతను, శిరంబులన్ = తలలచేతను, తృప్త = సంతృప్తిజెందిన, కాల = యముని యొక్క, భీకర = భయంకరమగు, ముఖ = నోటిచే, భుక్తశేషములకైవడిన్ = తిని విడువఁబడిన వానివలె, వాగ్గోచరుఁడు = కేకకందునట్టి దూరమున నున్నవాఁడు, ఆఖ్యాయకులు = చెప్పువారు.

గీ. నీవు జీరిన తోడ సైనిక వనంబు
మాని యీ బాలవీరుండు మరలి వచ్చె;
ఘన నినాదంబు విని గజాఘాత ముడిగి
వడి నెదురు దృప్త సింహ శాబకము వోలె. 8.

(పిదప వేగోద్ధత క్రముండై లవుండు ప్రవేశించును.)

లవు—మంచిది కుమారా! మంచిది. నిక్కముగా నైక్ష్వాకుండ వైతివి. కాన నిదిగో! యెదుర వచ్చితిని. (తెఱలో గొప్ప కలకలము) (రోషముతో వెనుక మరలి) ఆఁ! ఇపుడు పరాజితు లయ్యును సమర వర్తు లగు సేనాధినాథు లందఱును మరలి వచ్చి చుట్టువారి చెండుచుండిరేమి? ఛీ! మూర్ఖులారా!

చ. ప్రళయ మరు ద్విభగ్న జలరాశి ఘురంబును బోలె నెల్లెడం
గొలగొలఁ జుట్టుముట్టుకొని ఘూర్ణిలు సైనిక ఘోష ముచ్చలా
చల పరిఘాత సంక్షుభిత సంకుల బాడబ వక్త్ర పావకో
జ్జ్వలిత మదీయ రోష సముదార శిఖాహుతి నొందు గావుతన్. 9.

(పరిక్రమించును.)

చంద్ర—ఓహో! కుమారా!

చ. అతివిపులాద్భుతంబు నిడునట్టి గుణాతిశయంబుఁ బట్టి స
మ్మతుఁడవు గాన మిత్రుఁడవు మాయెడ నీయది గాదె! కాన నీ
గతి నిజభృత్యులందు రణకాంక్ష లివేటికి? నీపరాక్రమా
యతి కిదె చంద్రకేతుఁ డరయన్ నికషంబుగ వచ్చె నేడ్తెరన్. 10

జీరిన=పిలిచిన, ఘనని నాదంబు=మేఘధ్వని, గజాఘాతము=ఏనుగునుచంపుట, దృప్త=గర్వించిన, శాబకము=పిల్ల, ప్రళయకాలమందగు వాయువుచేఁదునుఁగఁగొట్టఁబడిన సముద్రప్రవాహమువలె, అంతటనావరించి ధ్వనిచేయు సేనాధ్వని, ఉన్నత=ఎత్తయిన, అచల=కొండయొక్క, పరిఘాత=తాకుడువలన, సంక్షుభిత=కలఁతపెట్టఁబడుటచేత, సంకుల=వ్యాపించిన, బాడబవక్త్రపావక=బడబాగ్నివలె, ఉజ్జ్వలిత=మిక్కిలిమండుచున్న, మదీయ=నాయొక్క, రోష=కోపమనెడు, సముదార=విశేషమయిన. శిఖా=జ్వాలకు.

ఈపద్యమున, లవకుమారుని పర్వతముగాను, చంద్రకేతు సైన్యమును సముద్రముగాను, వీరి సంఘర్షణమువలన వెలువడు లవుని రోషాగ్నిని బడబానలముగాఁ బోల్చి సైన్యజలములను హరించుచుండెనని వర్ణింపఁబడినది, ఆయతికి=అతిశయమునకు, నికషము=ఒరపిడిరాయి.

లవు— (హర్ష సంభ్రమములతో మరలి) ఓహో! మహానుభావుఁ డగు భాస్కర కుల కుమారుని సౌమ్య నిష్ఠురం బగు వీరవాగ్విప్రయోగము! కాన వీరితో నేమి? వీని నే బహూకరించెదను. (మరలఁ దెఱలోఁ గలకలము) (క్రోధనిర్వేదములతో) అరే! వీరసంవాదమున కంతరాయము గల్గించు నీ పాపాత్ములచే నిరర్థకుండ నయితిని. (సేనవైపునకుఁ బరిక్రమించుచున్నాఁడు)

చంద్ర—ఆర్యా! యీ దర్శనీయముం గనుంగొనుము.

చ. మును ఘనమోద దర్పములు బొందఁగ నాయెడ బద్ధ లక్ష్యుఁడై,
వెనుక మనీయ సైన్య పరివేష్టితుఁడై విలునెక్కువెట్టు ని
య్యనఘుఁడు, మారుతద్వయ సమాహ్వతమై యురియాడు గోత్ర భి
ద్ధను రభిదీప్తమైనజలదంపు సిరిన్ ధరియించె మించుగన్. 11.

సుమం—కుమారుఁడే వీనిఁ దేరి చూచుటకైనఁ బరిజ్ఞాత; మేమో కేవల విస్మయ పరవశులము.

చంద్రి—ఓహో! రాజులారా!

చ. అగణిత, వాహ కుంజర శతాంగ నివిష్టులు, వర్మితాంగులుం
బ్రిగుణ వయోతిరిక్తు లగు వారలుమీ, రితఁ డొక్కరుండు, బా
లగుఁడుఁ బవిత్రచర్మ పటధారి, కిశోర తనుండు, వీనితో
మొగకొనఁజేయు సన్నహనముం గన మీకును మాకు సిగ్గగున్. 12.

లవు— (కష్టముతో) ఁయఁ దలఁచెనా యేమి? (చింతించి) ఔఁగాక! కాలహరణ నివారణార్థమై జృంభకాస్త్రంబుచే నిపుడు సైన్యముల మూర్ఛిల్లఁ జేసెదను. (ధ్యానము నటించును.)

మారుతద్వయ = రెండుగాలులచే, గోత్రభిద్ధనుః = ఇంద్రధనుస్సుచేత, అభిదీప్తమైన = ప్రకాశించుచున్న, జలదంపు సిరిన్ = మేఘముయొక్క శోభను.

అగణిత = లెక్కలేని, వాహ = గుఱ్ఱములను, కుంజర = ఏనుఁగులను, శతాంగ = రథములను, నివిష్టులు = ఎక్కినవారు, వర్మితాంగులు = కవచములు ధరించినవారు, ప్రిగుణ = మంచిగుణములచేతను, వయః = వయస్సుచేతను, అతిరిక్తులు = మించినవారు. చర్మపటధారి = చర్మమేవస్త్రముగాఁ గలవాఁడు, కిశోరతనుఁడు = చిన్న మేనువాఁడు.

సుమం—అదేమి ? సైన్యఘోష మాకస్మికముగాఁ జల్లారినది ?
లవు—ఈ దర్పనాతు నిపుడు చూచెదను.
సుమం—వత్సా ! యీ కుమారకుఁడు జృంభకాస్త్ర మామంత్రించె నని తలంతును.
చంద్రి—ఇందు సందియంబేమి ?

గీ. ఇరులు మెఱపులు వెఱపార బెరసినట్లు
గాంచు కను మిఱ్ఱింగి విడిచిన గతిఁ గలంచెఁ
జిత్తరువు పోల్కి బలముల చేష్ట లుడిపె
నా ! మహాతేజ మగు జృంభకాస్త్ర మొలసె. 13.

సుమం—ఆశ్చర్య మాశ్చర్యము ?

మ. బలి సద్మాంతర కుంజ పుంజిత తమః పరిస్ఫారముల్, తప్త పి
త్తల పింగద్యుతి దీపితంబు లగు నుద్యజ్జృంభకాస్త్రంబులం
బ్రబల యాభీల మహా మరు చ్చలములో వార్వాహ విద్యు త్పిశం
గ లసత్కందర వింధ్యకూటముల జోకన్ మిన్ను గప్పంబడెన్. 14.

వీనికీ జృంభకాస్త్రంబు లెందుండి వచ్చినవి ?
చంద్ర—భగవంతుఁ డగు ప్రాచేతసుని నుండి యని యూహింతును.
సుమం—వత్సా ! ఈతని కస్త్రవ్యవహారము లేదు. జృంభక సాంప్రదాయము
మును పే లేదు. ఏమన ?

గీ. ఇవి భృశాశ్వ నపత్యంబు లీభృశాశ్వ
నుండి కుశికతనూభవు నొద్దఁ జేరి

ఇరులు=చీఁకట్లు, ఒలసె=ప్రకాశించెను, బలిసద్మాంతర=పాతాళమునందలి, కుంజ=పొదరిండ్లయందు, పుంజిత=కూడుకొనిన, తమః=చీఁకట్ల యొక్క, పరిస్ఫార ముల్=ఎక్కువలు, తప్త=కరిగిన, పిత్తల=ఇత్తడియొక్క, పింగ=పసిమివర్ణము యొక్క, ద్యుతి=కాంతిచేత, దీపితంబులు=ప్రకాశించునవియునగు, ఉద్యత్=ప్రకాశమానములయిన, జృంభకాస్త్రంబులచేతను, ప్రళయ=ప్రళయకాలమందయిన, ఆభీల=భయంకరమగు, మహా=గొప్పవయిన, మరుత్=వాయువులచేత, చలములో= చలించుచున్నట్టినగు, వార్వాహ=మేఘములయొక్క, విద్యుత్=మెఱుపులచేత, పిశంగ=పచ్చనైన, లసత్=ఒప్పుచున్న, కందర=గుహలుగల, వింధ్య=వింధ్య పర్వతముయొక్క, కూటము=శిఖరముల యొక్క, జోకన్=రీతిని, మిన్ను=ఆకాశము, కప్పంబడెన్=ఆవరింపఁబడెను. అపత్యంబులు=సంతానములు.

సంతటఁ దదీయ సంప్రదాయంబు వలన
రామభద్రుని యందుఁ దిరంబులయ్యె. 15.

చంద్ర—నిరతిశయోజ్జ్వల సత్త్వ ప్రకాశ లగు మఱికొందఱు మాత్ర దర్శనులుఁ గూడఁ దమ దామ చూచుచుందురు.

సుమం—వత్సా! జాగరూకుఁడవు గమ్ము. వీరశేఖరుండు మరలివచ్చె.

లవు—చంద్రు—(పరస్పరము దమలో) ఓహో! సౌమ్యదర్శనుం డీ కుమారుఁడు!

(స్నేహానురాగములతోఁ జూచి)

మ. ఇది యాదృచ్ఛికమో? గుణాతిశయ సాహిత్యంబో? జన్మాంతరా
భ్యుదిత ప్రాక్తన సాంద్ర సౌహృద రసంబో? దైవతంత్రంబునన్
మదిలో వేద్యముగాక యున్న నిజబాంధవ్యానుబంధంబో? నా
హృదయం బీతని గాంచి నంతనె సమాకృష్టం బగున్ వ్రేల్మిడిన్. 16.

సుమం—ఒకొక్కని కొక్కొక్కనియెడల సరసానురక్తి గల్గుట తఱచుగాఁ బ్రాణిధర్మము. దీనినే తారామైత్ర మనియుఁ జక్షూరాగ మనియు లౌకికులు వ్యవహరింతురు. అట్టి ప్రేమ నవిజ్ఞేయమనియు నిర్హేతుకం బనియుఁ బలుకుచున్నారు.

గీ. వీతహేతుక మగు పక్షపాతమునకుఁ
దగు ప్రతిక్రియ యెందును దారసిల్ల
దదియె స్నేహాత్మకపు సూత్ర మగుచు జనుల
హృదయ మర్మప్రదేశంబు లెల్లఁ గూర్చు. 17.

చంద్ర—లవు—(అన్యోన్యము స్వగతము.)

గీ. ఉల్లిఖిత రాజపట్ట విద్యోతులు గమ్మ
నితని నెమ్మేన బాణంబు లెట్లువిడుతు?

యాదృచ్ఛికమో=స్వేచ్ఛాసంభవమో, సాహిత్యంబో=తృప్తియో, జన్మాంతరమునుండి, అభ్యుదిత=పుట్టిన, ప్రాక్తన=పురాతనమైన, సాంద్ర=దట్టమైన, సౌహృదరసంబో=ప్రేమసారమో, వేద్యముకాక యున్న=తెలియని, సమాకృష్టంబు=ఆకర్షింపఁబడినది, వ్రేల్మిడి=చిటికెలో, వీతహేతుకము=కారణరహితము, రాజపట్టము=ఆభరణవిశేషము.

దీని డాసిన పరిరంభ తృష్ణవలన
నాదు తనువెల్లఁ బులక సంతతులఁ బెరసె. 18.

చ. అనుగత ఘోర వీర్యమెడ నస్త్రముగాక మఱేది దిక్కు? పెం
పెనసిన యస్త్ర మేటికిఁ గీఁక నిట్టి శరవ్యము నాటదేని? యే
మను నితఁడే శరంబుఁగొన నాజి దొరంగిన నన్ను? స్నేహ వ
ర్తనము దొలంచు దారుణతరం బగు వీర విహార మెన్నఁడున్. 19.

సుమం—(లవునిఁ జూచి కన్నీళ్ళతోఁ దనలో) హృదయమా! వేఱు తలంతువేమి?

క. తొలుత మనోరథ బీజము
పొలిసెన్ విధివశము వలనఁ; బూర్వంబె విని
ర్దళితం బగు లతకూనకుఁ
గలుగునె కుసుమోదయంబు కడుఁ జింతింపన్. 20.

చంద్ర—ఆర్య! సుమంత్రా! రథమునుండి దిగుచుంటిని.

సుమం—కారణంబేమి?

చంద్ర—ఈ వీరపురుషుండు పూజితుండగును. మఱియు నార్యా! క్షాత్రధర్మ మనుగ్రహింపఁ బడిన దగును. "పాదచారునితో రథికు లాయోధనం బొనర్ప" రని శాస్త్రవేత్తలు పలుకుచున్నారు.

సుమం—(తనలో) కట్టా! కష్టదశను బొందినవాఁడ నైతి.

క. ననుబోటి పురుషుఁ డేగతిఁ
బనివడి ధర్మక్రమంబు వలదని మాన్పున్;
ఘన సాహసైక రస మనఁ
జను కృత్య మొనర్ప నెట్లు సమ్మతిగాంచున్. 21.

చంద్ర—తాతమిత్త్రులు సయితమ్ముఁ దండ్రికిఁ బ్రియసఖుండ వగు నార్యునే ధర్మసంశయంబులం దడుగుచుందురు. అట్టి యార్యుఁడే విమర్శించుచుండెనేమి?

దీని=ఈశరీరమును, బెరసె=వ్యాపించెను, శరవ్యము=బాణము నాటుట కర్హమైనస్థానము, వినిర్దళితంబగు=తుంపఁబడిన, ఆయోధనము=యుద్ధము.

సుమం—ఆయుష్మంతుఁడా ! ధర్మ్యమే తలంచితివి.

క. ఇదియే సమరన్యాయం
బిదియె సనాతన మనంగ నెసఁగిన ధర్మం
బిదియే రఘుసింహంబుల
సదమల శౌర్యాపదాన సరణియు సుమ్మా. 22.

చంద్ర—ఆర్యవచన మనురూప మైనది.

క. ఇతిహాసములుఁ బురాణ
ప్రతతియు విఖ్యాత ధర్మవచనంబులు వి
శ్రుత రఘురాజ కుటుంబ
స్థితియును మీ హృదయమునకు తెలియునుగాదే ? 23.

సుమం—(స్నేహ బాష్పములతోఁ గౌఁగిలించుకొని)

ఉ. నందన ! యింద్రజిజ్జయసనాథుఁడు బాలుఁడు నీదు తండ్రి పెం
పొందఁగ జన్మమంది యిపు డొయ్యన నెన్ని దినంబు లయ్యెఁ ? ద
న్నందనుఁడుం బ్రవీర చరితంబు గ్రహల్చుచు నుండెనా ! దశ
స్యందను నన్వయంబు మునుమారఁ బ్రతిష్ఠ వహించె నయ్యరో ! 24.

చంద్ర—(కష్టముతో)

గీ. క్షితి రఘుజ్యేష్ఠుఁ డప్రతిష్ఠత వహింప
మొనయునె ప్రతిష్ఠ మాకులంబున కటంచుఁ
దక్షు మువ్వురు మాతండ్రు లాకెఱిభంగి
నుల్లమునఁ బెల్లు దురపిల్లుచుందు రెపుడు. 25.

సుమం—ఆహాహా ! ఈ చంద్రకేతు వచనంబులు హృదయ మర్మముల భేదించు చున్నవి.

లవు—ఆహా ! రసవర్తనము సంకీర్ణముగా నున్నది.

చ. అలతు సుధాంశునందు మదమందు కుముద్వతి వోలె వీనియం
దలరు ముదీయ తృప్తి, కలహప్రియఘోరకఠోరధాటి ను

అపదానము=చారిత్రము, అప్రతిష్ఠత=సంతానము లేకపోవుట, సంకీర్ణము=కలఁగఁబడ్డ, సుధాంశుఁడు = చంద్రుఁడు, కుముద్వతి=కలువ, కలహప్రియ = యుద్ధమం దిష్టముగల, ఘోర = భయంకరమగు, కఠోర=తీక్ష్ణమైన, ధాటిన్=శౌర్యముచేత.

చ్చలిత ఝుణంఝుణ క్వణిత దారుణ సార గుణోరుచాపమై
జ్వలిత విభీషణోల్బణ రసంబగు నా భుజ మాజిఁ గోరెడిన్. 26.

చంద్ర—(దిగుచు) ఆర్యా! సవిత్రువంశ్యుఁ డగు చంద్రకేతుఁడు నమస్కరించుచున్నాఁడు.

సుమం—గీ. గమన శాశ్వత దివ్య వరాహమూర్తి
దుర్జయంబుఁ బవిత్రంబు నూర్జితంబు
నైన తేజంబు నీకు శ్రేయంబు కొఱకుఁ
గొడరఁ జేయుత నల కకుత్స్థునకుఁబోలె. 27.

మఱియు—

వ. పరముఁడు గోత్రకర్త యగు భానుఁ డనిన్ నిను హెచ్చరించు, నీ
గురువులకుం గురుండు సనఘుండు వసిష్ఠుఁడు నిన్ను మెచ్చు, శ్రీ
హరి సురపాగ్ని మారుత ఖగాధిప తేజముఁ జెందు నిన్ను, బం
ధురతర రామ లక్ష్మణ ధనూరవ మంత్రము జిష్ణుఁ జేయుతన్. 28.

లవు—కుమారా! తేరుననుండియే మిగుల శోభిల్లుచుంటివి. చాలు చాలు నత్యాదరము.

చంద్ర—అట్లయిన మహాత్ముండు గూడ వేఱొక రథంబు నలంకరించుఁగాక!

లవు—ఆర్యా! రథముపై రాజపుత్త్రు నధిష్ఠింపఁ జేయుము.

సుమం—చంద్రకేతు వచనమును నీవుఁ గూడ ననుసరింపుము.

లవు—నా యుపకరణంబుల యెడల నభ్యంతరం బేమి? మా కేమన? మే మరణ్యవాసులము గాన రథచర్య నెఱుంగము.

సుమం—వత్సా! దర్ప సౌజన్యముల యథోచితంబుగా నిర్వహింప నభిజ్ఞుండవు; ఇట్టి నిన్ను నైక్ష్వాక నృపాలుం డగు రామభద్రుండు విలోకించెనేని వాని హృదయంబు సౌహార్దంబుచేఁ గరఁగి యుండెడిది.

ఉచ్చలిత = మిక్కిలి కదలుచున్న, ఝుణంఝుణక్వణిత=ఝుణఝుణయనిధ్వని చేయుచున్న, దారుణ=భీకరమగు, సార=సత్త్వముగల, గుణ = నారిగల, ఉరు = గొప్పదియగు, చాపమై = ధనుస్సుగలదై, జ్వలిత = ప్రజ్వలించుచున్న, విభీషణ = మిక్కిలి భయంకరముయొక్క, ఉల్బణ = అతిశయముతోఁ గూడిన, ఊర్జితంబు = బలవత్తరమైనది.

(శ్రీ)హరి = వైష్ణవాస్త్రము, సురప = ఐంద్రాస్త్రము, అగ్ని = ఆగ్నేయాస్త్రము, మారుత = వాయువ్యాస్త్రము, ఖగాధిప = గారుడాస్త్రము.

లవు—ఆర్యా! ఆరాజర్షి సుజనుం డని వినవచ్చెడి (లజ్జతో)

ఉ. అరయఁగ మేము నిట్టి క్రతుహంతల మేనియుఁ గాము ; ధాత్రి న
న్నరపతి నే నరుఁడు సుగుణంబుల మన్నన సేయకుండు ? నా
నరుసఁ దురంగ రక్షకుల వాక్య మశేష నృపావళీ తిర
స్కరణ కఠోరమై నను వికారము నొందఁగఁ జేసె నేఁడిఁకన్. 29.

చంద్ర— (చిఱునవ్వుతో) ఏమీ నీకుఁ బిత్రు విక్రమోత్కర్షంబునం గూడ నమర్షమా?

లవు—ఇం దాగ్రహం బుండనీ, లేకపోనీ, ఇది ని న్నడుగుచుంటిని. రఘుకులేశ్వరుండు దాంతుఁడని విందుము. అతఁడు దను దాన గర్వింపఁడు. వాని ప్రజలయందును దర్పంబు సంభవింపదు. అట్లుండఁ దత్సేవకులు రాక్షస వచన మేల పల్కిరి?

గీ. తపసు లున్మత్త దృప్తుల దారుణంపు
భాషితము రాక్షస మటంచుఁ బలుకుచుంద్రు,
సర్వ విద్వేషములకు బీజ మగు నదియె,
యెల్ల భువనంబునకు నదియే యలక్ష్మి. 30.

ఇట్లు వీనిని నిందించుచుఁ దదితరముల స్తోత్రము చేసిరి.

గీ. కోరిక లొసంగు, నవలక్ష్మిఁ బాఱఁద్రోలు,
యశముఁ గను, దుష్కృతంబు రూపఱఁగఁ జేయు
నట్టికల్యాణజనని, సత్యంపు వాణి
ధీరులు వచించెదరు కామధేనువనుచు. 31.

సుమం—పావన స్వభావుండును, బాల్యమునుండియు వాల్మీకి శిష్యుండుగ నగు నీ కుమారకుండార్ష సంస్కారంబునం బరిపూర్ణంబుగాఁ బలుకుచున్నాఁడు.

లవు—చంద్రకేతూ! "నీకుఁ బిత్రు విక్రమోత్కర్షంబునం గూడ నమర్షమా" యని పలికినదానిం గూర్చి ప్రశ్నించు చుంటిని. క్షత్రధర్మములు నియమిత విషయంబులా యేమి?

సుమం—ఐక్ష్వాక సార్వభౌము నించుకేని యెఱుంగవు గాన జాలింపు మతిప్రసంగము జాలింపుము.

దాంతుఁడు = అంతరింద్రియనిగ్రహముగలవాఁడు, ఉన్మత్తులు = పిచ్చివారు, దృప్తులు = గర్వితులు, అలక్ష్మి = పెద్దమ్మ, అంతేవాసి = శిష్యుఁడు.

క. నిక్కము సైనిక వీరుల
నుక్కణఁచి పరాక్రమంబు నొలయించితి వీ
వక్కట ! భార్గవ దమనుని
చక్కటి మితిమీఱి పల్కసరశంబగునే ? 32.

లవు— (నవ్వుచు) ఆర్యా ! ఆభూపాలుఁడు భార్గవ దమనుఁడని యీశ్లాఘనం బేటికి ?

చ. ద్విజులకు భాషణంబున నె వీర్యము గల్గు నిసర్గశైలి; భూ
భుజుల కుదార బాహువులఁ బొల్పగు వీర్యము; శస్త్రపాణియౌన్
ద్విజుఁడును నైన భార్గవుని పెంపణఁగించి రఘూద్వహుం డనిన్
విజయముఁ గాంచె నంచుఁ బ్రథివీపతి కేమి యశంబు దానిచేన్. 33.

చంద్ర— (ఉన్మత్తునివలె) ఆర్య ! ఆర్యా ! చాలు నుత్తరోత్తరంబుల;—

మ. భగవంతుం డగు భార్గవుండు నుతికిం బాత్రుండు గా డేనికిన్?
జగతీ సప్తక నిర్భయాకలన దీక్షా దక్షిణాపూర్ణతం
దగు నైక్ష్వాక నరేంద్ర పావన చరిత్రంబుల్ వినం డెవ్వఁ? డా
నుగుణుం డిట్టిదఁ డెవ్వఁడో ? నవ మహాశూరావతారంబొకో ? 34

లవు—రఘునరేంద్రుని చారిత్ర మహత్వంబు లెవ్వఁ డెఱుంగఁడు ? కాని యించుక వివరించ వలయునా ?

ఉ. చాలును; వారు వృద్ధు లవిచార్య చరిత్రు లటంచు వర్ణనం
బేల ? సుబాహు మాత్ర హనన సేద్ధ యశుల్ ధర నమ్మహామహుల్;
బాలిశు ఖరాజి మాఁడడుగులన్ మును ద్రొక్కుట, నేర్పుతోడుతన్
వాలిని ద్రుంగ నేయుటయు వారిది లోక మెఱుంగ కున్న దే ? 35

చంద్ర—ఆఁ ! పితృదూషణాతిలంఘితమర్యాద ! మితిమీఱి ప్రగల్భంబు లాడుచుం టివి !

లవు—ఓహో !నాయెడలనే భ్రుకుటీధరుండయ్యె.

దమనుఁడు = జయించినవాఁడు, హనన = చంపుటయందు, ఇద్ధ=ప్రసిద్ధము యిన, యశుల్ = కీర్తికలవారు, ఖరుని తో యుద్ధము చేయునప్పుడు, శౌర్యపద్ధతికివిరుద్ధముగా రామభద్రుఁడు మూఁడడుగులు వెనుకకు జంకెను. దాని నేయచ్చటహేళనగా మునుద్రొక్కియని పలికినాడు. భ్రుకుటీధరుఁడు = కనుబొమలు ముడివయిచినవాఁడు,

సుమం—వీరికిఁ గ్రోధ ముద్భిన్న మైనది. అల్లదే !

చ. కరకరిఁ బుట్టు కంపము శిఖావలయంబు గదల్చుచుండెఁ; గ
ట్టెఱుపు వహించి కన్నుగొన లేర్పడెఁ జెందొవ రేకులట్లు; లు
త్తరళము లైన భ్రూకుటులఁ దాల్చి మొగంబు ప్రఫుల్ల లాంఛన
స్ఫురిత హిమాంశునిన్ భ్రమర శోభిత సారసమున్ హసించెడిన్. 38.

లవు—చంద్ర—కాన నిందుండి సమర సమ్మర్దోచిత ప్రదేశంబుఁ జొత్తము.

(అందఱు నిష్క్రమింతురు.)

కుమార విక్రమ మను పంచమాంకము,

సంపూర్ణము.

కరకరిన్=క్రూరభావమున, శిఖావలయంబు=జుట్టుముడి, చెందొవ=ఎఱ్ఱకలువ. ఉత్తరళములయిన=మిక్కిలి చటులమయిన, ప్రఫుల్ల=వృద్ధిబొందిన, లాంఛన=మచ్చచేత, స్ఫురిత=తెలుపుచేయఁబడుచున్న, హిమాంశునిన్=చంద్రుని, భ్రమర=తుమ్మెదలతో, శోభిత=ప్రకాశింపఁజేయఁబడిన, సారసమున్=పద్మమును, హసించెడిన్.

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

షష్ఠాంకము.

(పిదప నుజ్జ్వల విమానముతో విద్యాధర మిథునము ప్రవేశించును.)

విద్యాధర—ఓహో! అకాండ కలహ ప్రచండులై, పరిమండిత క్షాత్ర లక్ష్మీకులగు మార్తాండ కుల కుమారుల విక్రమ చరిత్రంబులు దేవాసురాశ్చర్య ధుర్యంబులై వర్ధిల్లుచున్నవి; అల్లదే! ప్రియా! చూడు చూడు!

చ. కలిత ఝణంఝణా రణిత కంకణ నిక్వణ కింకిణీ సమా
కుల గురు శింజినీ ముఖర కోటి కరాల విరావ చాప మ
గ్గలముగ వంచి, చంచల శిఖల్ నిగుడన్ విశిఖంబు లేయుచీ
రల భువనైక భీమ సమరంబు విచిత్రగతిం బ్రవర్ధిలెన్. 1.

క. ఉభయుల శుభమునకై దుం
దుభి నాదము దివిని మొరసె దుందు మ్మనుచున్
విభవమున నభ్రరవ స
న్నిభమై గాంభీర్య మాననీయం బగుచున్. 2.

కావున నిరంతర నిబిడ మంజుల వికసిత హేమారవింద భాసుర శ్రేణిఁదై, దేవ తరు తరుణ మణి ముకుళ నికర మకరంద బిందు సుందరంబగు కుసుమ వర్షంబు వీరిపైఁ బఱగింపుము.

అకాండ=కారణములేని, రణిత = ధ్వని చేయుచున్న, నిక్వణ=ధ్వనితోఁ గూడిన, కింకిణీ=చిఱుగంటలచే, శింజినీ=ధనుస్సుయొక్క, ముఖర = ధ్వని చేయుచున్న, కోటి = ధనురగ్రములతో, కరాల= భయంకరముగ, విరావ = మిక్కిలి ధ్వని చేయుచున్న, విశిఖంబులు= బాణములు, సన్నిభము = సమానము, నిబిడ= దట్టమైన.

విద్యాధరి—హా! ఘటిత తటి చ్ఛటా పింగళంబై యంబరం బింతలో నిట్లయ్యె నేమి ?

విద్యాధర—ఇప్పుడే మోగదా యిది !

గీ. త్వష్టృ యంత్ర పరిభ్రమి భ్రమ దఖండ
చండ మార్తాండ మండలోద్దండ మైన
యంతకాంతక దుస్సహోదగ్ర విపుల
తీక్ష్ణ లాలాట వీక్షణోన్మేష మొకొ ? 3.

(యోజించి) ఆఁ ! తెలిసినది ; చంద్రకేతు కుమార ప్రయుక్త మగు నాగ్నేయాస్త్రము. దానిదే యి మ్మహోజ్జ్వల జ్వాలా ప్రసారము. ఇప్పుడు—

గీ. జ్వలిత శబలిత చామర వ్యజము లగుచుఁ
దొలఁగి పోయె విమాన మండలము లవిగో !
కేతనాంకుర చేలాంత కీల లహహ !
నిమిష కుంకుమ లేప విభ్రమముఁ దాల్చె. 4.

దారు ణాశని శకల పరిస్ఫుటన పటుతర స్ఫులింగ రూపుండై, యుద్భటాకీర్ణ లేలిహాన కీలా సంఘాత భీకరుండును, భగవంతుండు నగు వైశ్వానరుండు ప్రజ్వలించు

తటిత్ = మెఱుపు యొక్క, ఛటా = పఙ్క్తి చేతను, పింగళంబై = పసిమివర్ణముకలదియై. త్వష్టృ=త్వష్టప్రజాపతి యొక్క, యంత్ర = చక్రయంత్రము యొక్క, పరిభ్రమి=తిరుగుటచేత, భ్రమత్=తిరుగుచున్న, అఖండ=విశేషమగు, చండ = తీక్ష్ణమగు, మార్తాండ = సూర్యుని యొక్క, మండల=గోళము వలె, ఉద్దండమైన=అతిశయమైన, అంతకాంతక = శివుని యొక్క, దుస్సహ = సహింపశక్యముగాని, ఉదగ్ర = అతిశయమయిన, విపుల=విశాలమయిన, తీక్ష్ణ = కరుకగు, లలాట=ఫాలమందుఁగల, వీక్షణ=దృష్టి యొక్క, ఉన్మేష మొకొ = తెరచుటయో— అనునట్లున్నది యాగ్నేయాస్త్రమని భావము.

జ్వలిత = మండుటచేత, శబలిత = పసపుగాఁ జేయంబడిన, కేతనాంకుర = జండాకొనలయందుఁగల, చేలాంతకీలలు=గుడ్డలకొనలయందలి మంటలు, అశనిశకలము= పిడుగుముక్క, లేలిహానము = నాకుట, కీలాసంఘాతము = మంటల సముదాయము.

చుండె. వీని సంతాపము సర్వతోముఖంబై యుచ్చండమై యున్నయది. కానఁ జేరియసిని నెమ్మేనఁ గప్పి దవ్వుగఁ దొలంగుదును. (అట్లు చేయుచున్నాఁడు)

విద్యాధరి—సంతోషము! విమల మౌక్తిక సర తుషార మసృణ మాంసలం బగు ప్రియగాత్ర స్పర్శంబున నానంద మీలితోద్భ్రాంత నేత్ర నగు నాసంతాప మంతరిత మైనది.

విద్యాధర—సుందరీ! నే నిం దే మొనర్చితిని?

> క. ఇంచుకయుఁ జేయకున్నను
> దుంచున్ సౌఖ్యములచేత దుఃఖము లెల్లం
> బ్రాంచత్ప్రియజన మనఁగా
> నెంచఁగ రానట్టి ద్రవ్య మిల మనుజునకున్. 5.

విద్యాధరి—నిబిడ చంచలోద్భ్రాంత తటి ల్లతా విభ్రమాలంకృతంబులై, సమద నీలకంఠ కంఠ శ్యామలంబు లగు వలాహకంబులచే నంతరిక్ష మెల్ల వేల్లితం బయ్యె నేమి?

విద్యాధర—సుందరీ! ఇది లవకుమార ప్రయుక్త వారుణాస్త్ర ప్రభావము. ఏమి? అవిరళ ప్రవృత్త వారి ధారా సహస్ర సంప్రసారములచే నాగ్నేయాస్త్రంబు జల్లారి నట్లున్నది.

విద్యాధరి—నాకు సంతోషముగా నున్నది.

విద్యాధర—అన్నన్నా! అన్ని యెడల నతివృత్తి దోషాస్పదము. విపుల ఝంఝా నిల క్షోభ గంభీర గుణగుణాయమాన ఘనాఘనాకీర్ణాంధకార నీరంధ్ర నిబద్ధమై యుగప జ్జగ ద్గ్రసన విస్తీర్ణ భీషణ కాలకంఠ కంఠ కందరాస్థితంబునుం బోలెఁ, గల్పాంత యోగ నిద్రావిరుద్ధ సర్వద్వార నారాయణోదర ప్రవిష్ట మైనదియు నుం బోలె, భూతజాత మెల్ల నుద్విగ్న మగుచున్నది. మంచిది వత్సా! చంద్ర కేతూ! మంచిది. యుక్తమే వాయవ్యాస్త్రముం బ్రయోగించితివి కావున—

> గీ. తత్త్వ విజ్ఞానమున వివర్తంబు లెల్ల
> బ్రహ్మ్రయందును బోలె, బ్రభంజనమున

సర్వతోముఖము = అంతట వ్యాపించినది, మసృణ = నునుపయినట్టియు, మాంసల = బలిసినట్టియు, మీలితోద్భ్రాంత = మూసికొనుటచే భ్రాంతిఁ బొందిన. నీలకంఠ = నెమలి, వలాహకంబు = మేఘము, వేల్లితము = ఆవరింపఁబడినది. నీరంధ్రము = దట్టము, నిబద్ధమై = కూడినదై, యుగపత్ = ఒక్కమారుగా, గ్రసనము = మ్రింగుట. అవరుద్ధము = అడ్డగింపఁబడినది, ఉద్విగ్నము = చలించుట, వివర్తము = భ్రాంతికల్పిత మైన యాకారకల్పము.

నంబుధర సంఘ మెల్ల ననంత మయ్యె
వింతదోఁపఁగ నేడనో విలయ మొందె. 6.

విద్యాధరి — నాథా ! సరభసోన్నమిత హస్త భ్రమిత చేలాంచలుండై, దూరంబు నుండియే మధుర వచనంబులచే సమరానురోధంబు నిరోధించుచు నిప్పుడీ కుమారకుల నడుమ విమానమ్ము నవతరింపఁ జేయుచుండె నీతఁ డెవ్వరో కదా ?

విద్యాధర — (చూచి) ఇతఁడు శంబూక వధాగతుఁ డగు దేవుండు రఘుస్వామి.

గీ. అమ్మహాత్ముని వచనమ్ము నాలకించి
గౌరవమ్మున ఘోర సంగ్రామ మాపి
లవుఁడు శాంతించెఁ, జంద్రకేతువును మ్రొక్కెఁ,
బతికి సుతసంగమమున భవ్యమగుగాక ! 7.

కాన నిటనుండి మరలి పోవుదము. (నిష్క్రమింతురు.)

విష్కంభము.

(పిదప రాముఁడు లవుఁడు ప్రణతుఁ డగు చంద్రకేతుఁడుం బ్రవేశింతురు.)

రామ — (పుష్పకమునుండి దిగుచు)

గీ. సవితృకుల వారినిధి చంద్ర ! చంద్రకేతు !
గాఢపరిరంభ మిమ్ము వేగముగ రమ్ము
హిమశకల శీత భవదంగకములచేత
నాదు మానసతాప మణంగుఁ గాత ! 8

(లేవ నెత్తి స్నేహ బాష్పములతోఁ గౌఁగిలించుకొని) దివ్యాస్త్ర ధర శరీరు నకు నీకుం గుశలమా ?

చంద్ర — అత్యద్భుత ప్రియుండును, ప్రియదర్శనుండు నగు లవుని లాభాభ్యుదయంబు తోడం గుశలము. కాన విన్నవించెదను. మత్తుల్యముగఁ గాని, మద్విశేషముగఁ గాని యీ మహావీరాగ్రణిం జనకుండు కటాక్షించుఁగాక !

సవితృకులము = సూర్యవంశము.

రామ—(లవునిం బరికించి) సంతోషము ! కుమారుని వయస్యుం డత్యుదాత్త స్వరూపుఁడు.

చ. మురువుగ లోకము ల్మనుప మూర్తి ధరించిన యస్త్రవేదమో ?
కరుణ నజాండ గుప్తమునకై మెయి దాల్చిన క్షాత్రధర్మమో ?
స్థిరతర శక్తిసంచయమొ ? ధీర గుణ ప్రకరంబొ ? వ్యక్తతా
కర మయి గోచరించెడి జగద్ఘన పుణ్య విధానరాశియో ? 9

లవ—(స్వగతము) ఓహో ! పుణ్యప్రభావ దర్శనుం డీ మహాపురుషుఁడు !

గీ. భక్తి సౌహార్ద నిస్తు లాశ్వాసములకుఁ
దారతర మైన కేవలాధార మనఁగఁ
గాయము ధరించి సర్వాతిశాయి యైన
యనఘ ధర్మప్రసాదమో యనఁగ వెలసె. 10.

ఆశ్చర్యము !

ఉ. వైరమణంగె, సౌఖ్య విభవ ప్రభవం బగు రాగ మెచ్చె, దు
ర్వార సగర్వ భావ మెడబాసె, ననున్ వినయంబు వంచె, ని
ప్పూరుష శేఖరుం గని ప్రమోదమున న్వివశుండ నైతొ ? శే
ద్ధా, రుచిర ప్రభావుల మహత్త్వ మనర్ఘము తీర్థవైఖరిన్. 11.

రామ—(ఆత్మగతము) ఏకపదంబుననే దుఃఖంబు నుపశమింపఁ జేసె ; ఏమి నిమిత్తము ననో యంతరాత్మను బ్రేమింపఁ జేయుచుండె, ఏమోగదా యిది ? స్నేహము నిమిత్తాశ్రయం బనుట విరుద్ధము. కావుననే—

ఉ. అంతరహేతు వొక్కటి పదార్థములన్ సమకూర్చుచుండు న
త్యంతము ; స్నేహముల్ బహిరుపాధుల నెన్నఁడుఁ గోరఁబోవు ; భా
స్వంతుఁడు దోఁచు వేళ జలజంబు వికాసము నొందు, శర్వరీ
కాంతుఁడు గోచరింప శశికాంతము లీలఁ జెమర్చుఁ గా దొకో ? 12.

లవ—చంద్రకేతూ ! వీ రెవ్వరు ?

వయస్యుఁడు = మిత్రుఁడు, గుప్తము = రక్షణము, సౌహార్దము = స్నేహము, ఆశ్వాసము = ఓదార్పు, అనర్ఘము = వెలలేనిది, భాస్వంతుఁడు = సూర్యుఁడు, జలజంబు = పద్మము, శర్వరీకాంతుఁడు = చంద్రుఁడు, శశికాంతము = చంద్రకాంతశిల;

చంద్ర—ప్రియవయస్య ! తాతపాదులుగదా !

లవు—నన్ను "ప్రియవయస్యా" యని పిల్చితివి గాన ధర్మసరణిచే నాకును నట్లే; మఱియు మీకిట్టి సంజ్ఞాభాజనంబు లగు మాననీయులు రామాయణ కథా పూరుషులు నల్వురుగదా ! అందు వీరెవ్వరో తెల్పుము.

చంద్ర—జ్యేష్ఠ తాతపాదు లని యెఱుంగుము.

లవు—(ఉల్లాసముతో) రఘుస్వామియా యేమి ? సంతోషము ! దేవర దర్శనంబున నేడు సుప్రభాతము. (వినయ కౌతుకములతోఁ బరికించి) తండ్రీ ! ప్రాచేతసాంతేవాసియగు లవుఁడు నమస్కరించుచున్నాఁడు.

రామ—ఆయుష్మంతుఁడా ! రమ్ము రమ్ము. (స్నేహముతోఁ గౌఁగిలించుకొని) ఓవత్సా ! వినయముతోఁ బని లేదు. పెక్కుసారులు బిగ్గ గౌఁగిలింపుము.

గీ. పరిణతాపూర్ణ పుష్కరాంతర పలాశ
మసృణ మాంసల తర సుకుమార మైన
నీ తనుస్పర్శ మానంద నిలయ మయ్యెఁ
జంద్ర చందన నిష్యంద సరసమగుచు. 13.

లవు—(తనలో) నాయెడల వీరి కిట్టి యకారణ స్నేహము. నేనన్నో తెలియక వీరికే యపచార మొనర్చితిని. ఆయుధ పరిగ్రహము వఱకు దుస్సాహమునఁ బ్రవర్తించితిని. (ప్రకాశముగా) తాతపాదు లిప్పుడు లవుని యజ్ఞానమును సైరింతురు గాక !

రామ—వత్సా ! అపరాధమేమి ?

చంద్ర—అశ్వానుచరుల వలనఁ దాత ప్రతాప ప్రకటన మాలకించి యీతండు పరాక్రమించె.

రామ—ఓయీ ! క్షత్రియజాతి కిది యలంకారమే కదా !

చ. ఇతర పరాక్రమంబు సహింపఁడు శూరుఁ డదే స్వభావమౌ
నతనికి ; నారయం బ్రకృతియందలి దౌష్ట్య మకృత్రిమంబు ; సం

తాతపాదులు = తండ్రిగారు, సుప్రభాతము = మంచివేళమంచిది. (good morning) పరిణత = పండుటచే, ఆపూర్ణ = లెస్సగానిండిన పుష్కర = పద్మము లోని, అంతరపలాశ = లోనిరేకువలె, చంద్ర = కప్పురముయొక్కయు, చందన = మంచిగంధముయొక్కయు, నిష్యంద = ద్రవమువలె—సరసమగుచు.

తత కిరణంబులం దపన దైవత ముగ్రగతిం దపింప ధి
క్కృతమును బోలె భానుమణి యే గాక; తేజము గ్రక్కు నొక్కటన్. 14.

చంద్ర—ఆగ్రహంబు సైత మీ వీరునియందే శోభిల్లును. ప్రియవయస్య ప్రయుక్త జృంభకాస్త్ర నిశ్చల స్తంభితంబు లగు సైన్యంబులం జనకుండు పరికించుఁగాక !

రామ—వత్స ! లవా ! అస్త్రంబు నుపసంహరింపుము. చంద్రకేతూ ! నీవును బారవశ్య వ్యాకులితంబు లగు బలంబుల నూరడింపుము.

లవ—జనకుఁ డాజ్ఞాపించి నట్లే (ధ్యానమును నటించుచున్నాఁడు)

చంద్ర—ఆజ్ఞాప్రకారము. (నిష్క్రమించును)

లవ—అస్త్ర ముపసంహృతం బైనది.

రామ—వత్సా ! రహస్యోపయుక్త ప్రయోగ సంహారంబు లగు సస్త్రంబులు శ్రౌత మంత్ర సమన్వితంబులు.

గీ. నలువ మున్నగు తొంటి పెద్దలు జగద్ధి
తంబు కొఱకు సహస్రాధికంబు లబ్ద
ములు దపముఁ జేసి నిజ తపోమూర్తి తేజ
ములుగ విలసిల్లు నీ యస్త్రములను గనిరి. 15.

పిదప నీ మంత్రపారాయణోపనిషత్తును భగవంతుఁ డగు భృశాశ్వుండు సహస్రాధిక వత్సరాంతేవాసియుం గుశిక వంశ్యుండు నగు విశ్వామిత్రున కనుగ్రహించె. ఆభగవంతుఁడు నాకే ప్రసాదించె. ఇదే సంప్రదాయము. కుమారుని సంప్రదాయ మెద్దియో యడుగు చుంటిని.

లవ—మా యిర్వురి యస్త్రంబులు స్వయంప్రకాశములు.

రామ—(యోజించి) అసంభావ్య మేది ? ప్రకృష్ట సుకృత పరిపాక సంభవం బగు నెద్దియో మహిమ యై యుండును. ద్వివచనం బెట్లు ?

లవ—సోదరుల మేము కవలము.

రామ—అట్లయిన ద్వితీయుఁ డెవ్వరు ?

తపనదైవతము = సూర్యుఁడు, భానుమణి = సూర్యకాంతశిల, స్తంభితము = కట్టువడుట, ఉపసంహృతము = ఉపసంహారము చేయఁబడినది.

తెఱలో "భాండాయన! భాండాయన"

చ. అవలఁజిరాయుషా లవునకా! నరపాలక సైనికాళితోఁ
బవరము? మిత్రుఁడా! యిపుడు పల్కిన దే మను? నా నటందువా?
భువనములం దధీశ్వర సమున్నత శబ్దము మాయుఁగాక! నేఁ
డవుర! నరేంద్ర శస్త్ర దహనావళి మించు శమించుఁ గావుతన్. 16

రామ—

ఉ. ఈతఁ డెవాఁడొ? బంధుర మహేంద్ర మణి స్ఫుట నీల దీప్తితో
నాతత కంఠనాదమున నంగమునం బులకల్ ఘటించి, నన్
నూతన మేచకాంబుద మనోహర గర్జిత నిస్వనోత్సవ
స్ఫీత నిబద్ధ కుట్మల విభిన్న కదంబము నా నొనర్చెడిన్. 17

లవు—ఇదిగో! యితఁడు నా జ్యేష్ఠుఁ డగు నార్యుఁడు కుశుఁడు; భరతాశ్రమము నుండి మరలి వచ్చె.

రామ—వత్సా! ఈ యాయుష్మంతు నిటు బిల్వుము.

లవు—అటులనే (పరిక్రమించును)

కుశు—(అద్భుత హర్ష ధైర్యములతో ధనువు నాస్ఫాలించుచు)

చ. హరి కభయం బొసంగి, మిహితాత్మజుఁడౌ మను చంద్రుఁ డాదిను
ష్కర జనులం దహింపఁ దమ క్షాత్ర మహానలమున్ గెరల్చు భా
స్కర కుల ధారుణీశ్వరుల సంగర మబ్బెన యేని, మత్పరి
స్ఫురిత శిఖాస్త్ర దీప్త గుణ శోభిత చాపము ధన్యమౌ నిఁకన్. 18

(వికటముగాఁ బరిక్రమించుచున్నాఁడు.)

రామ—ఏమి! యీ క్షత్రియ డింభకుని విక్రమాతిశయంబు!

మించు = అతిశయము, నిస్వన = ధ్వని యొక్క, ఉత్సవ = సంతోషముతో, స్ఫీత = అధికముగా, నిబద్ధ = కూర్పఁబడిన, కుట్మల = మొగ్గలచే, విభిన్న = విరిసిన కదంబము = కడిమిచెట్టు, మిహిరాత్మజుఁడౌ మను చంద్రుఁడు = వైవస్వతమనువు, పరిస్ఫురిత = ప్రకాశించుచున్న, శిఖాస్త్ర = శిఖలను బాణములచే, దీప్త = ప్రకాశింపఁజేయఁబడుచున్న, గుణ = నారిచే, శోభిత = అలంకరింపఁబడిన, చాపము = విల్లు.

చ. కరకరి చూడ్కి ధిక్కృత జగత్త్రియ సారత నొప్పె ; ధీర ని
ర్భర వికట ప్రచారము ధరానమన క్రమదక్ష మయ్యెఁ ; గన్
దెరవని బాలుఁడయ్యు ధరణీధర గౌరవమున్ ధరించె ; వీ
రరసమొ ? లేక దర్పమొ ? కరాళగతిం జనుదెంచె మూర్తమై. 19

లవు— (సమీపించి) ఆర్యా ! జయము.

కుశు—ఆయుష్మంతుఁడా ! ఈ యుద్ధవార్త యేమి ?

లవు—ఏదో కొంచెము ; ఆర్యుఁడు దర్పమును వీడి వీని యెడల వినయమున వర్తింపవలయు.

కుశు—ఏల ?

లవు—ఇదే ! దేవుం డగు రఘుస్వామి సమీపించి యుండె. అతఁడు మన యెడ మిగుల ననురక్తుఁడై మీ సన్నిధానమ్ము నపేక్షించు చుండె.

కుశు—(ఊహించుచు) అతఁడు రామాయణ కథా నాయకుం డగు బ్రహ్మాండ రక్షకుఁడా ?

లవు—ఔను.

కుశు—అమ్మహాత్ముండు ప్రార్థనీయ పావన చర్యుండు. మన మెట్లు సమీపింప వలయునో నిశ్చయింపఁ జాల.

లవు—గురునిం బోలె నుపచారమున ;

కుశు—ఓయీ ! యెట్లిది ?

లవు—అత్యుదార సౌమ్యుండు నూర్మిళానందనుండు నగు చంద్రకేతుండు ప్రియమిత్రుఁ డని చెల్మితో నన్ను సేవించుచుండె. కాన నయ్యనుబంధమున నీ రాజర్షి ధర్మజనకుండు.

కుశు—రాజన్యు నందయ్యును వినయ మిపుడు నిరపవాద మైనది.

లవు—ఆర్యా ! స్వరూప ప్రభావ గాంభీర్య సంభావ్యమాన నానావిధ లోకాతీత మహాపదానుండగు నిమ్మహాత్మునిం బరికింతువుగాక !

కుశు—(పరికించి)

కరకరి = క్రూరభావము, ప్రచారము = నడక, ధరానమన = భూమిని గ్రుంగఁ జేయు, క్రమ = పద్ధతియందు, దక్షమయ్యె = తగినదయ్యెను, కరాళగతిన్ = భయంకరముగా, మూర్తమై = శరీరమును దాల్చి, మహాపదానుండు = పూర్వచారిత్రము గలవాఁడు.

ఆ. అహాహా ! సుప్రసన్న మగు శుభాకారంబు
పరమ పావన ప్రభావ మహహా !
దివ్యపాత్ర మందె తివిరి రామాయణ
కవి స్వకీయ వాక్ప్రకటనఁ జేసె. 20.

(సమీపించి) జనకా ! ప్రాచేత సాంతేవాసియగు కుశుఁడు నమస్కరించుచున్నాఁడు.

రామ—ఆయుష్మంతుఁడా ! రమ్ము రమ్ము.

గీ. అమృత పరిపూర్ణ వారివాహంబుఁ బోలె
మసృణ బంధుర మైన నీ మంజు లాంగ,
మును నిరంతర వాత్సల్య మనుగమింప
బిగియఁ గౌఁగిటఁ జేర్ప నే వేడ్కఁ గొనెద. 21.

(కౌఁగిలించి తనలో) ఈ డింభకుం డెవని కుమారుఁడు ?

శా. ప్రత్యంగ స్రుత మదీయ తను నిర్యత్స్నేహ సారాంశమో ?
ప్రత్యక్షాకృతిమై బహిస్స్ఫురితమై భాసిల్లు చైతన్యమో ?
అత్యానంద విజృంభణ క్షుభిత చిత్తాస్రావ నిర్మాణమో ?
సత్యం బీ పరిరంభ మంగము సుధా సారాపగన్ ముంచెడిన్. 22.

లవు—జనకా ! మయూఖమాలి ఫాలసంతాపి యయ్యె[illegible] కాన నీ సర్జ తరు చ్ఛాయ యం దొకింత సేపు జనకుం డుపవేశించుఁగాక !

రామ—వత్సా ! నీ యిచ్చవచ్చినట్లే. (అందఱుఁ బరిక్రమించి కూర్చుందురు

వారివాహము = మేఘము, మసృణ = నునుపగు, అనుగమింప = చూపుటకు, ప్రత్యంగస్రుత = ప్రతి అవయవములనుండి జాఱిన, మదీయ = నాయొక్క తను = దేహమునుండి, నిర్యత్ = బయలువెడలిన, స్నేహ = తేజోధాతువుయొక్క, సారాంశమో = పరిణామవిశేషమో ? అత్యానంద = సంతోషాతిశయముయొక్క, విజృంభణ = వికాసముచేత, క్షుభిత = తరవఁబడిన, చిత్త = హృదయముయొక్క, ఆస్రావ = ద్రవముయొక్క, నిర్మాణమో = సృష్టియో, సుధాసారాపగన్ = అమృత సముద్రమునందు.

మయూఖమాలి = సూర్యుఁడు, ఫాలసంతాపి = లలాటమును బరితపింపఁ జేయువాఁడు, సర్జతరుచ్ఛాయ = మద్దిచెట్టునీడ, ఉపవేశించుఁగాక = కూర్చుండునుగాక.

రామ—(తనలో)

గీ. అహహా! వినయ ప్రవర్తనమాదిగా సైత
మాసన స్థితి సంచరణాదులైన
కుశలవుల భావములు జూడ గోచరించె
బహుళ సామ్రాజ్య లక్షణాస్పదము లగుచు. 23.

మఱియు—

చ. ప్రతిజన రంజనీయ రుచి భాసుర దేహము నప్రయత్న సం
గత కమలా విలాసములు గాఢగతిన్ విలసిల్లఁ జేసె; సం
చిత మగు నచ్ఛరత్నమును జిత్రమయూఖములో యనంగ, వి
స్తృత వికచారవిందమును దివ్యమరంద లవంబులో యనన్. 24.

వీరియందుఁ బరిపూర్ణ మగు రఘుకుల కుమార సాదృశ్యంబు గాన వచ్చు చుండె.

చ. తరుణ కపోత కంఠ తులితం బగు చామనచాయ మేను, భా
స్వర వృష భాంసముల్, సమ విభాసిత గాత్రములు, ప్రసన్న కే
సరి నిభ నిశ్చలేక్షణ విసారము, మంగళ మర్దళ ప్రతి
స్ఫురణ మనోజ్ఞ ధీర రవముం బరికింప ముదంబుఁగూర్చెడిన్. 25.

(సూక్ష్మముగా నిరూపించి) ఓహో! వీరి యాకారము మమ్ములనే పోలి యుండలేదు..

చ. అమరఁగ నీ శిశుద్వయమునందు ధరాతన యానురూప రూ
పమును బ్రవీణ దృష్టి నెఱపన్ విశదంబుగఁ దోఁచు చుండె, సం
భ్రమమున నూతనాంబుజ రమా విలస ద్దయితా ముఖంబు నే
త్రములకు నేటికి న్మరల దర్శన మిచ్చిన భంగిఁ దోఁచెడిన్. 26.

ఆసనము = కూర్చుండుట, స్థితి = ఉనికి, సంచరణము = వర్తనము, మయూఖము = కిరణము, విస్తృత = విశాలమైన, వికచారవిందము = వికసించిన పద్మము, మరందలవము = పూఁదేనె, కపోతము = పావురము, తులితము = సమానము, కేసరి = సింహముతో, నిభ = సమానమయిన, విసారము = వ్యాప్తి, మర్దళము = మద్దెలను, ప్రతిస్ఫురణ = జ్ఞప్తికిఁ దెచ్చుచున్న, ధరాతనయ = సీతతో, అనురూప = పోల్పఁదగిన, రమా = శోభచేత, విలసత్ = ప్రకాశించు, దయితా = భార్యయగు సీతయొక్క.

గీ. మౌక్తిక స్వచ్ఛ దంత రుఙ్మధుర మైన
యధరమును గర్భపాకంబు నవియె కావె?
నయనములు రక్త నీల వర్ణంబులైన
నమల సౌభాగ్యసద్గుణం బదియె కాదె? 27

ఇది ప్రాచేతసావాస మగు కాంతారము; ఇచటనే దేవి పరిత్యజింపఁబడియె. ఈ కుమారుల యాకార మిది. అస్త్రములు స్వతఃప్రకాశము లనుటలో విమర్శింప వలసియున్నది. ఆ చిత్ర సందర్శన కాలమున నస్త్రాభ్యనుజ్ఞాన ముద్భిన్నంబు గాలేదు గదా! పురాతనుల కయినను సంప్రదాయ విరహితంబు లగు నస్త్రముల వినియుండలేదు. నా యీ హృదయానం దాతిశయము చంచలం బగు నంతరాత్మను విశ్వసింపఁ జేయుచున్నది. మఱియు దేవి గర్భభారము నాచే ద్విధా గృహీత మయ్యె. (కన్నీళ్ళతో)

మ. మును జన్మించిన ప్రేమ మించు ప్రణయోద్భేదంబుచే హెచ్చ మం
తనమందు న్నొరనమ్మియు, న్సహజ మందాక్షాతిమందాక్షియా
వనిత న్నేఁ గలఁ జేతితో నిమిరి గర్భద్వైతమున్ దొల్త నేఁ
గనుఁగొంటిన్, మఱి కొన్ని నాళ్ళ కెటఁ గెం గంజాక్షి యుం బిమ్మటన్. 28.

(ఏడ్చి) ఏదేని యుపాయమున వీరి నడుగుదునా?

లవు—జనకా! యేమిది?

క. భువనత్రయ మంగళ మగు
భవదీయాస్యంబు బాష్ప వర్షము చేతన్
నవ నీహార నిషిక్త
ప్రవిమల రాజీవ సుభగ భావముఁ దాల్చెన్. 29.

కుశు—ఓవత్సా!

ఉ. ఏయది వంతగాదు మనుజేంద్రునకున్ నిజదేవిఁ బాసినం?
బ్రేయసి లేకయున్న వనమేకద! సర్వజగంబు; స్నేహము
ట్లాయత మైన, దీ విరహ మన్న ననంతము; చూడఁ జూడ రా
మాయణ గాథ నీ వెఱుఁగనట్లుగ ని ట్లడుగంగ నేటికిన్. 30.

రుక్=కాంతి, ద్విధాగృహీతము=రెండుగా గ్రహింపఁబడినది, మందాక్ష=లజ్జచే, అతిమంద=మిక్కిలి జడమగు, అక్షి=చూపులుగలది, కలన్=విద్యచే, గర్భద్వైతమున్=పిల్లలిద్దఱుగల గర్భముగా నుండుటను, ఆస్యము=ముఖము, నవ=నూతనమైన, నీహార=మంచుచేత, నిషిక్త=తడుపఁబడిన, ప్రవిమల=స్వచ్ఛమయిన, రాజీవ=పద్మమువంటి, సుభగ=సౌందర్యముయొక్క, భావమున్—తాల్చెన్.

రామ— (తనలో) అన్నా! వీరి సంభాషణము తటస్థముగా నున్నది; ప్రశ్న మేల; దగ్ధ హృదయమా! ఆకస్మికం బగు నీ వగచల వికార మేటికి? ఇట్లు వ్యక్తీభూత మానసోద్వేగుండనయి. శిశుజనంబుచే దయం జూడం బడితి. పోంగాక! కప్పిపుచ్చెదను. (ప్రకాశముగా) వత్సలారా! వాల్మీకి భగవానుని వాణీవిలాసంబును, భాస్కరాన్వయ ప్రాశస్త్యంబు నగు రామాయణం బన వినవచ్చెడి. అందొకించుక వేడుకతో వినం గోరెదను.

కుశు—ఆ సందర్భ మెల్ల మాచేం బఠింపంబడియె. బాలచరిత్రాంతి మాధ్యాయమున నీ రెండు శ్లోకములు మాత్రము స్మృతియం దున్నవి.

రామ—వత్సా! పఠింపుము.

కుశు—

*శ్లో॥ "ప్రియాతు సీతారామస్య దారాః పితృకృతా ఇతి
గుణా ద్రూపగుణాచ్చాపి ప్రీతి ర్భూయోప్యవర్ధత
తథైవ రామ స్సీతాయాః ప్రాణేభ్యోపి ప్రియోభవత్,
హృదయం త్వేవ జానాతి ప్రీతియోగం పరస్పరం॥

రామ—(తనలో) కష్టము! హృదయ మర్మోద్ఘాత మతి దారుణంబయినది. హా! దేవి! అప్పుడిట్లయ్యె నట! ఓహో! సంసార వృత్తాంతములు నిరనుబాధ వ్యత్యాస నిరానంద భావంబులై విప్రలంభముగాం బరిణమించి పరితపింపం జేయుచున్నవి.

ఉ. ఎయ్యెడ మించు నమ్మికల నెంచ రహించెడి నట్టి సమ్మదం?
బెయ్యెడం గూఢకౌతుకము? తేడం బరస్పర యత్నసంచయం?
బెయ్యెడ నిష్టకష్టముల నేకరతిం గను మానసైక్య? మ
ట్లయ్యెను భావ రూప మగు ప్రాణ మణంగక ప్రజ్వలించెడిన్. 81.

ఓహో! కష్టము!

---

* గీ. రామునకు సీత దశరథేంద్రకృతదార
యగుచు గుణరూపములం బ్రేమనలరె; నట్లె
సీతకును రఘురాముండు ప్రీతిం గూర్చె;
వారి హృదయానురాగంబు వారికెఱుక.

క. ఏకం జేసియసి గుణాగ్ర
మేకంబుగ నుల్లసిల్ల నెంతయు నిరసా
నేకాలము దుస్స్మర మగు
నా కాలంజే స్మరింప నయ్యెన్ మాకున్. 32.

చ. తొలుతనమోనురాగములతో ఘనతం గను మారుఁ డుల్లమం
దలర విదగ్ధ వర్తనము నందియు నెమ్మెయి ముగ్ధఁ డయ్యెఁ; న
య్యాలఁతి వయస్సునందు హరిణాక్షి దనుంగవ యించుకంతయై
మొలచి యొకింత పెంపుఁ గనె మోదమునన్ మఱి కొన్ని నాళ్లకున్. 33

కుశ—మందాకినీ చిత్రకూటాంతర కాంతార విహారంబున జానకీదేవింగూర్చి రఘునాధుని శ్లోకము.—

* శ్లో॥ "త్వదర్థ మివ విన్యస్త శ్శిలాపట్టోయ మగ్రతః
యస్యాయ మభితః పుష్పైః ప్రవృష్ట ఇవ కేసరః॥

రామ—(తనలో లజ్జా స్మిత స్నేహ కరుణాములతో) అర్భకులు మిగుల ముగ్ధులు; అందును వన సంచారులు; హా ! దేవి ! నాటి విస్రంభాతి ప్రసంగ సాక్షియగు నా ప్రదేశమును స్మరించు చుంటివా ? కష్ట మోహో కష్టము!!!

మ. తరళ స్వేద హిమంబు, మంద విచల న్మందాకినీ మారుతో
త్కర లోలాలక కీలితాళిక శశాంకద్యోతముం, గుంకుమ

---

* క. నలుదెసలను వకుళము పూ
వులఁ దావర్షించునటులఁ బొలుచు నల శిలా
ఫలకము నీకై యిదె ! ముం
గల విన్యస్తంబుగాఁ గనందగె నబలా !

తరళ=దట్టమైన, స్వేద = చెమటచేత, హిమ్మంబు = చల్లనయినదియు, మంద = సొమ్మదిగా, విచలత్ = కదలుచున్న, మాందాకినీ = గంగానది నుండివీచు, మారుత = వాయువుచే, ఉత్కర = ఎగరఁగొట్టుటచే, లోల = చలించుచున్న, అలక = ముంగురులచేతను, కీలిత = కూర్పఁబడిన, అళిక = ఫాలభాగమును, శశాంకద్యోతమున్ = చంద్రకాంతిగలదియు, కుంకుమ = కుంకుమమొక్క,

స్ఫురణానంకిత దీప్త గండమును, నిర్వ్యాభాసాభిరామ శ్రవః
పరిముగ్ధంబును, నా భవన్ముఖము మద్భావంబునం దెంచెదన్. 34.

(నిశ్చేష్టుఁడై నిల్చి దైన్యముతో, ఓహోహో ! ! !

చ. తడవుగ నెంచి యెంచి యెడఁదన్ మును సృష్టి యొనర్చి నిల్పఁగాఁ
బడు ప్రియ బంధు వర్గము ప్రవాసమునందును నూరడించు ; న
ట్లడరు ప్రియా ప్రహాణి జగమంతయు జీర్ణవనత్వ మొందు ; లో
నుడికెడి భంగిఁ దొట్రిపడు నుల్లము తీవ్ర తుషానలంబునన్. 35

(తెరలో)

మ. " అల వాల్మీకి విదేహవల్లభ వసిష్ఠారుంధతీయుక్త కౌ
సలజాతాదులు తాము బాల సమరోద్వృత్తప్రశుతిం ద్రస్తులై
యలఁతన్, వార్ధక విశ్లథాంగముల, దవ్వై యాశ్రమం బుంట, ను
చ్చలి తా వేగ మనస్కులై తడవునం జన్ దెంచుచున్నా రిటుల్." 36.

రామ—ఏమి ? భగవంతులగు నరుంధతీ వసిష్ఠులు, జననులు, జనకుడుం గూడ నిచ్చ టనేనా ? వీరి నెట్లు చూడఁ గలను ? (దైన్యముతోఁ జూచి, అహాహా ! తండ్రి యగు జనకుండుఁ గూడ నిచ్చటికి వచ్చుటం జేసి నిర్ఘాత నిహతుండనైతి. మంద భాగ్యుఁడను.

చ. అనుగుణ బాంధవ ప్రవరు లైన వసిష్ఠ ముఖర్షు లుండఁగం
దనయ వివాహ మంగళమునం దగు తండ్రిలఁ గాంచి, యీగతిం
బెను గడగండ్ల నిట్టి పితృమిత్రుని జూచిన వేయి వ్రక్కలై
తునుఁగనె ?—కాని రామునకు దుష్కర మెద్ది ? మదిం దలంచినన్. 37.

తెరలో కష్టము కష్టము !

స్ఫురణ=స్ఫురణచేత, అనంకిత=చిహ్నములేకయే, దీప్త=ప్రకాశమానమైన, గండమును=చెక్కిళ్లుకలదియు, నిర్వ్యాభాస = అలంకారములు లేకయే, అభిరామ = మనోహరమైన, శ్రవః=చెవులతో, పరిముగ్ధంబును=మిగులనందమైనదియు, అగునీముఖమును—నాభావంబున నెంచెదను. ప్రవాసము=పరస్థలవాసము, తుషానలంబు=ఊక కసువు, సమర = యుద్ధముయొక్క, ఉద్వృత్త=అతిశయముయిన, ప్రశుతిన్ =వినికినలన, త్రస్తులై = భయపడినవారై, విశ్లథాంగములు = శిథిలములైన యవయవములు, నిర్ఘాత నిహతుఁడ = పిడుగుదాఁకినవాఁడ.

చ. వల దనుభావ మాత్ర సముపస్థిత దివ్య రమాంకుఁడౌచు నీ
నలువున నున్నయట్టి రఘునాథుని గొబ్బునఁ గాంచినంతఁ, దో
ర్లోలుతఁ బ్రబుద్ధుఁడౌ జనకభూర్వహుఁ డప్డు డెఱుంగఁ బల్కె, వి
హ్వలిత మనస్కులై జనను లక్కట ! మూర్ఛలు చెంది రొక్కొటన్. 38.

రామ—హా ! తండ్రి ! జనకా ! —హా ! తల్లులారా !

క. జనక రఘువంశ సంభవ
మనుజేంద్రుల యఖిలగోత్ర మంగళ మగు పా
వని యెడఁ గృప లేని ఖలుం
డను నాపై మీకుఁ గరుణ నాటిన వ్యథయా. 39.

ఓదార్చెదను. (లేచును.)

కుశ—లవు—ఇట్టిటు,

(దైన్య వ్యాకులత్వములతోఁ బరిక్రమించి అందఱు నిష్క్రమింతురు.)

కుమార ప్రత్యభిజ్ఞాన మను

ష ష్ఠాం క ము,

సంపూర్ణము.

వలత్ = ప్రకాశించుచున్న, అనుభావమాత్ర = ప్రభావమ్మునమాత్రమే, సముపస్థిత = నిలిచియున్న, దివ్య = దేవతాసంబంధమగు, రమా = శోభయే, అంకుఁడు = చిహ్నముగలవాఁడు, ప్రబుద్ధుఁడు = తెలిసికొనినవాఁడు, ఒక్కొటన్ = ఒక్కమారు.

ఆంధ్రీకృతోత్తర రామచరిత్రము.

సప్తమాంకము.

సప్తమాంకము.

లక్ష్మ — (ప్రవేశించి) ఓహో ! యిపుడు వాల్మీకిభగవానులు బ్రహ్మక్షత్రియ వైశ్యశూద్ర జానపదుల మాత్రోడఁ బిలిచి సకల దేవాసుర నర తిర్యగురగ జంగమ స్థావర సంఘమును స్వప్రభావంబుచే సమకూర్చె; మఱియు నార్యుండు "వత్సా ! వాల్మీకి భగవానులు, స్వప్రణీతమై యప్సరఃప్రవర్తితం బగు ప్రబంధంబుం జూడ మన కానతిచ్చె. కాన భాగీరథీ తీర రమణీయ సీమ కరిగి సభా సన్నివేశ మేర్పఱుచు" మని నియోగించె. మర్త్యామర్త్య భూత సంఘాతమున కుచిత స్థానముల వర్ణాసనములం బొందుపఱిచితిని. ఇదిగో !

గీ. మహిత రాజ్యాశ్రమంబున మసలు చుండి,
దుష్కర మునివ్రతంబునఁ దూలిరైన
శ్రమణ వాల్మీకి మౌని గౌరవము వలన
సరుగుదెంచుచు నుండె నియ్యార్యుఁ డిటుల. 1.

రామ— (ప్రవేశించి) వత్సా ! లక్ష్మణా ! ఉపవేశించిరా రంగదర్శకులు ?

లక్ష్మ—చిత్తము.

రామ—వత్సలగు నీ కుశలవులు చంద్రకేతు తుల్య మగు స్థానగౌరవము నొంద వర్తులు.

లక్ష్మ—పరిభుక్తస్నేహ విస్రంభమున నట్లే నొనరింపఁబడియె. ఇదే ! రాజాసనంబు నేర్పఱిచితి. ఆర్యుం డుపవేశించుఁగాక !

ఉపవేశించిరా — కూర్చుండిరా !

రామ—(కూర్చుండును.)

లక్ష్మ—ఓయీ! ప్రారంభింపుము.

సూత్రి—(ప్రవేశించి) భగవంతుండును భూతార్థవాదియు నగు ప్రాచేతసుండు చరాచర జగంబున కిట్లాజ్ఞాపించుచున్నాఁడు. "ఆర్ష దృష్టిచేఁ బరిశీలించి పావనంబును గరుణాద్భుత రసంబు నగు నెద్దియో నిర్మింపఁబడియె. దానియెడలఁ గార్యగౌరవంబున జాగరూకులు గండు" అని.

రామ—"మహర్షులు ప్రత్యక్షీకృత సర్వధర్ములు. అమృత సారంబులై రజోగుణాతీతంబులగు వారి ప్రజ్ఞానంబు లెందును నవ్యాహతంబు లగుట సంశయాస్పదములు గావు" అని పలికినట్లయినది.

(తెరలో)

హా! ఆర్యపుత్త్రా! హా! కుమారలక్ష్మణా! మహారణ్యమున దిక్కులేక యేకాకినినైన మందభాగ్యురాలఁ బ్రసవ వేదనాక్రాంత నగు నన్ను హంతాళంబు లగు శార్దూలంబు లపేక్షించుచుండె. నిర్భాగ్యురాల నాశరీరంబు నిప్పుడీ భాగీరథీ దేవి కర్పించుచుంటి."

లక్ష్మ—(తనలో) అన్నా! కష్టము! ఎద్దియో వేఱయ్యెనే?

సూత్రి—గీ. దేవి సర్వంసహాపుత్త్రి దేవ్రఁ జేయిన
ధవునిచే దీర్ఘ వన పరిత్యక్త యగుచుఁ
బ్రసవవేదనఁ గను శరీరమును వదల
నపుడు భాగీరథీ దేవియందుఁ దొరఁగె. 2.

(నిష్క్రమించెను.)

రామ—హా! దేవి! హా! దేవి! లక్ష్మణా! చూడుము.

లక్ష్మ—ఆర్యా! నాటక మిది.

రామ—హా! దేవి! దండకారణ్యవాస ప్రియసఖి! నీకు రాముని వలనఁ గలుగు దురదృష్ట పరిపాక మిది.

హంతాళంబులు = దుష్టములు, సర్వంసహాపుత్త్రి = భూపుత్త్రి.

లక్ష్మ—ఆర్యా! పరిబంధార్థముం గనుగొనుము.
రామ—ఇదిగో! వజ్రమయుండనై సిద్ధపడితిని.

(ఒకొక్క డింభకు నొకరు పై నిడికొనిన ధరణీభాగీరథులచే నవలంబింపఁబడి సీత ప్రవేశించును)

రామ—వత్స! లక్ష్మణ! అకారణమై యవిజ్ఞాత మగు నంధకారముం బ్రవేశించు నట్లుంటి న న్నాదుకొనుము.
ధర—భాగీ—

గీ. జనకనందని! కల్యాణి! సంతసంబు
ఊరడిలు మింక వర్ధిలుచుంటి వమ్మ!
రఘుకులాధారు లగు కుమారకుల నింపు
గడలుకొన మధ్యజలమునఁ గంటివమ్మ! 3.

సీత—(ఊరడిల్లి) సంతోషము! డింభకులఁగంటిని. హా! ఆర్యపుత్ర! (మూర్ఛిల్లును)
లక్ష్మ—(పాదముల నొరఁగి) ఆర్యా! సంతోషము! వర్ధిల్లుచుంటిమి. రఘువంశంబు మంగళాంకురమైనది. (చూచి) హా! హా! యేమి? దుర్నివార బాష్పోపరోధ పరవశుండై యార్యుండు మూర్ఛిల్లెనే! (విసరుచున్నాఁడు)
ధర—ఊరడిల్లు మూరడిల్లుము.
సీత—(ఊరడిల్లి) భగవతీ! నీ వేయమవు! ఈమె యెవ్వరితె?
ధర—ఈమె నీ శ్వశురకుల దైవతము భాగీరథి.
సీత—భగవతీ! నీకు వందనము.
భాగీ—సౌశీల్య వర్ధితం బగు కల్యాణ సంపదం గాంచుము.
లక్ష్మ—అనుగ్రహింపఁ బడితిమి.
భాగీ—ఈమె నీతల్లి విశ్వంభర.
సీత—హా! తల్లీ! యిట్టి నేను నీచే వీక్షింపఁబడితిని.
ధర—రమ్ము వత్సా! రమ్ము పుత్త్రీ! (సీతను గౌఁగిలించుకొని మూర్ఛిల్లును)
లక్ష్మ—(సంతోషముతో) ఆనందము! ఆర్యారాలు ధరణీ భాగీరథులచే ననుగ్రహింపఁ బడిరి.
రామ—(చూచి) ఇది యతి దీనముగా నున్నది.
భాగీ—సర్వంసహా యాయువు దుఃఖించుచున్న దని సంతాన వాత్సల్యము జయించినది. లేదా? ప్రాణులకు సర్వసాధారణమై యంతరంగమునం గల్గు నీ మోహ

గ్రంథి యెడ తెగని సంసార బంధము. వత్సా! జానకీ! భూతధాత్రి! ఊరడిల్లు మూరడిల్లుము.

ధర—సీతను గాంచి యెట్లూరడిల్లఁ గలను?

గీ. తడవు రాక్షస మధ్య వర్తన మొకండు,
కడకు దుస్సహ మైన త్యాగంబు రెండు;
భాగీ— తివిరి ఫలియింప నగుదురదృష్టమునకు
ద్వారములు మూయ దక్షుఁ డెవ్వండు ధరణి. 4.

ధర—భాగీరథీ! లెస్సగాఁ బల్కితివి. ఇది తగునా రామభద్రునకు?

గీ. శైశవ గృహీత మైన హస్తమును, నేను,
జనకుఁడును, వహ్ని, నిత్యానుసరణ మహిమ,
సంతతియుఁ గూడ, నివ్వి డా శాబకునకు
నప్రమాణంబులుగ నెంచ నైతి మమ్మ! 5.

సీత—హా! ఆర్యపుత్త్రుని స్మరింపఁ జేయఁ బడితి.

ధర—ఆ! నీ కార్యపుత్త్రుఁ డెవ్వఁడు?

సీత—(లజ్జాబాష్పములతో) జనని పల్కినట్లే.

రామ—జననీ! ధరణీ! యిట్టివాఁడ నే.

భాగీ—అనుగ్రహింపుము భగవతీ! వసుంధరా! ప్రపంచమునకు దేహమవు. కానఁ దెలియనిదానివలె నల్లునియం దాగ్రహింతు వేమి?

మ. కలయం బ్రాకె నకీర్తి లోకమున, లంకాద్వీపమందా మహా
నలశుద్ధిం జనుఁ డెందు నమ్మ నెటులన్? సర్వప్రజారాధనం
బల యిక్ష్వాకు నృపాళికిం గులధనంబౌ, దుర్ఘటం బల్లదే
తలపోయన్; మఱి వాని కెయ్యదియొ కర్తవ్యంబు భాషింపుమా! 6.

లక్ష్మ—అమరులు భూతములయెడల నిరాఘాతాంతరజ్యోతులు. అందును జాహ్నవీదేవి యుత్తమురాలు; కాన నిదే నీకు నమస్కారాంజలి.

రామ—తల్లీ! నీవు భగీరథ కులానుగ్రహంబు ననువర్తించితివి.

ధర—మిమ్మ నిరంతరంబు ననుగ్రహించు చుంటిని. కాని సంతతికయిన శోకావేశ ఘూపాత దుస్సహంబు రామభద్రునకు జానకియందలి గాఢానురాగ మెఱుంగని దానఁ గాను—

గీ. శైశవమున నతఁడు వత్స నెడబాసి
యవనమున శోకానలంబుచే నుడుగుచుండ

నకట ! లోకోత్తరంపు ధైర్యంబు వలనఁ
బ్రజల పుణ్యంబు వలనను బ్రదుకుచుండె. 7.

రామ—గురువులు సంతానపాత్రియులాదు దయామయులుగదా !
సీత—ఏడుచు నంజలి యొగ్గి తల్లీ ! నీయందు నాకు విలయం బొసంగుము.
రామ—వే ఉమి పల్కెను ?
భాగీ—శాంతము; వేయి వత్సరంబులు జీవించియుందువుగాక !
ధర—వత్సా ! యిపుడు నీ కుమారుల వీక్షింపుము.
సీత—అనాథురాల నయితి వీరితో నేమిఫలము ?
రామ—హృదయమా ! వజ్రము వైతివి.
భాగీ—సనాథురాలవయ్యు ననాథురాల వెట్లగుదువు ?
సీత—మందభాగ్యనగు నా సనాథత్వ మెట్టిది ?
ధర—భాగీ—

గీ. సకల జగదేక మంగళస్థాన మైన
యాత్మ ననమతి సేయ భావ్యంబె నీకు ?
నదు సాంగత్యవశమున నేముఁ గూడఁ
బరమ పావన భావంబుఁ బడసినాము. 8.

లక్ష్మ—ఆర్యా ! వినుము.
రామ—వినుగాక లోకము !

(తెఱలోఁ గలకలము)

రామ—ఎద్దియో మహాశ్చర్యము !
సీత—అంతరిక్ష మెల్లం బ్రజ్వలించుచుండె నేమి ?
ధర—భాగీ—తెలిసినది.

గీ. అల భృశాశ్వుండుఁ గౌశికుం డవల రాముఁ
డన గురుక్రమ మలరు నే యస్త్రములకు
నవియె ! జృంభకములతోడ నబ్బురంబు
వెలయఁ బటు దీప్తితోడ నావిర్భవించె. 9.

(తెఱలో)

క. ఓదేవి ! జానకీ ! యభి
వాదన మిదె నీకు; రాఘవప్రభుఁ డాలే

ధ్యాదర్శనమునఁ బల్కిన
మాదిరి, భవదీయ నుతులు మాకుం గతియా ! 10.

సీత—సంతోషము ! అస్త్ర దేవతలు ప్రజ్వలించుచున్నవి.

లక్ష్మ—"ఇయ్యవి సర్వవిఘ్నంబుల నీసంతతి నొందఁ గల" వనియార్యుండు వక్కాణించె.

ధర— గీ. ఘనతరాస్త్రంబులార ! వందనము మీకు
ధన్యులము మేము యుష్మ దాదాన మహిమ
నర్భకులు మిమ్ము ధ్యానించినంతమాత్ర
దరికి నరుదెందు మీకు భద్ర మగుఁగాక ! 11.

రామ— గీ. అధికతర విస్మయానంద శిథిలితంబు
లగుచు క్షోభించు కరుణోర్మ లలవరించి
యిపుడు నా మద వచియిూప నిరవుగాని
ఘనతరావస్థ నొకదానిఁ గలుఁగఁజేసె. 12.

ధర—భాగీ- ఆనందింపుము వత్సా ! నీ కుమారు లిపుడు రామభద్రతుల్యులై విలసిల్లుచుండిరి.

సీత—భగవతులారా ! వీరికి క్షత్రియకులోచితం బగు కృత్యంబు లెవరు నిర్వర్తింతురు ?

రామ— గీ. మానిత వసిష్ఠ రక్షితు లైన యట్టి
రఘునృపాలుర వంశవర్ధని యనంగ
నలరు జానకి కూడ నిజాత్మజులకు
వలయు సంస్కారఁ దెలియక వగచె నకట ! 13.

భాగీ—పుత్త్రి ! నీకీ చింత యేల ? యీ బాలకుల స్తన్యత్యాగానంతరమున వాల్మీకి భగవానున కర్పింపఁగలను. అతఁడే వీరికి క్షత్రియోచిత కృత్యంబు నిర్వర్తింపఁ గలఁడు.

క. ఎటుల వసిష్ఠాంగిరసులా
యటులనె ప్రాచేతసుండు నల జనకరఘూ
ద్భటుల కులంబులు రెంటికిఁ
బటుతర దేశికుఁ డనంగ వలయున్ గాదే ? 14.

రామ—భగవతి లెస్సగా యోజించితివి.